
సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 6.50
సంపుటి: 16
సంచిక: 18
సోమవారం 2-10-2023
SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL


'మహిళల ముఖాలు కళకళలాడుతూ ఉంటేనే కుటుంబమూ, సమాజమూ బాగుంటాయి'



క్వాలిఫయింగ్‌లో టాప్
ఆసియా క్రీడల్లో 704 పాయింట్లతో టాప్ ర్యాంక్‌లో జ్యోతి సురేఖ - 12లో



పెట్టుబడికి 'సోషల్' రూట్..?
సోషల్ ఇన్వెస్టింగ్ తీరుతెన్నులపై ప్రత్యేక కథనం - 13లో



మన బంధాలకు హద్దుల్లేవ్
అమెరికా, భారత్ మధ్య ద్వైపాక్షిక బంధాలకు హద్దుల్లేవని విదేశాంగ మంత్రి జైశంకర్ అన్నారు.
వివరాలు 6లో ▸



నటుడు నాగభూషణ్ అరెస్ట్
కారును నిర్లక్ష్యంగా నడిపి మహిళ మృతికి కారణమైన కన్నడ నటుడు నాగభూషణ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు.
వివరాలు 6లో ▸



తప్పిన షట్‌డౌన్ ముప్పు
వార్షిక ద్రవ్య వినమయ బిల్లును రిపబ్లికన్లు ఆమోదించడంతో అమెరికాకు షట్‌డౌన్ ముప్పు తాత్కాలికంగా తప్పింది.
వివరాలు 6లో ▸



తుర్కియేలో ఆత్మాహుతి దాడి
తుర్కియే రాజధాని అంకారా నడిబొడ్డులో జరిగిన ఆత్మాహుతి దాడిలో ఇద్దరు మిలిటెంట్లు దుర్మరణం చెందారు.
వివరాలు 6లో ▸



కాకినాడ జిల్లా సామర్లకోటలో నిర్మించిన వైఎస్సార్ జగనన్న కాలనీ

కళ్లెదుటే ఖరీదైన లోగిళ్లు!

30 లక్షల మంది పేదలకు రూ.76 వేల కోట్ల విలువైన స్థలాలు

- కనీస సదుపాయాల కోసం దశలవారీగా రూ.30 వేల కోట్లు వ్యయం
- ఇళ్ల నిర్మాణాలకు లబ్ధిదారుల ఖాతాల్లోకి ఇప్పటికే రూ.12,296 కోట్లు
- ఒక్కో అక్క చెల్లెమ్మ చేతికి దాదాపు రూ.15 లక్షల విలువైన స్థిరాస్తి
- 'నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు' పథకంతో దశాబ్దాల కష్టాలకు విముక్తి
- కాకినాడ జిల్లా సామర్లకోటలో రెండు కాలనీల్లో 2,412 మందికి ఇళ్లు
- 5వ తేదీన లే అవుట్‌ను స్వయంగా సందర్శించి పేదల గృహ ప్రవేశాల్లో పాల్గొననున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్

(వడ్డే బాలశేఖర్ - సామర్లకోట నుంచి సాక్షి ప్రతినిధి)

ఒకేసారి 30 లక్షల మందికిపైగా ఇళ్ల స్థలాలు.. అది కూడా ఖరీదైన ప్రాంతాల్లోనే.. ఆపై గృహ నిర్మాణాలను కూడా చేపట్టడం దేశ చరిత్రలోనే ఒక సంచలనం. అక్క చెల్లెమ్మల సొంతింటి స్వప్నాన్ని సాకారం చేసేందుకు భూ సేకరణ కోసమే రాష్ట్ర ప్రభుత్వం ఏకంగా రూ.75,670 కోట్లను వ్యయం చేసింది. అంత విలువైన స్థిరాస్తిని మహిళల చేతుల్లో పెట్టింది. పేదల పక్కా ఇళ్ల కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 68,677 ఎకరాలను
మిగతా 2వ పేజీలో ▶

ఫ్యాక్ట్ చెక్



'ఆరోగ్య సురక్ష'పైనా
అక్కసే..

- గతంలో ఎన్నడూలేని విధంగా ప్రజలకు వైద్యం చేరువ కావడాన్ని చూసి ఓర్వేలేకపోతున్న రామోజీ
- వంకర రాతలతో కార్యక్రమంపై విషం
- 'ఆరోగ్య సురక్ష' కార్యక్రమం తొలిరోజే రాష్ట్రవ్యాప్తంగా 620 వైద్య శిబిరాలు.. 1.54 లక్షల మందికి ఉచిత వైద్య సేవలు
- రూపాయి ఖర్చులేకుండా స్పెషలిస్టులు అందుబాటులో..
- కావాలనే ఈ విషయాన్ని దాచిపెట్టిన రామోజీ
- టీడీపీ హయాంలో మొక్కుబడిగా నడిపించిన 104 సేవలతో ఫ్యామిలీ డాక్టర్‌ను పోలుస్తూ దిగజారుడు రాతలు

3లో

15 పతకాలు
ఒకే రోజు

ఆసియా క్రీడల్లో మెరిసిన భారత క్రీడాకారులు
చైనా గడ్డపై తెలుగు వెలుగులు

చైనా గడ్డపై ఆదివారం భారత క్రీడాకారులు పతకాల మోత మోగించారు. ఒకే రోజు ఏకంగా 15 పతకాలతో మెరిశారు. అథ్లెటిక్స్‌లో రెండు స్వర్ణాలు, నాలుగు రజతాలు, మూడు కాంస్యాలతో కలిపి తొమ్మిది పతకాలు రాగా... షూటింగ్‌లో ఒక స్వర్ణం, ఒక రజతం, ఒక కాంస్యంతో కలిపి మూడు పతకాలు వచ్చాయి. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కిడాంబి శ్రీకాంత్, సాత్విక్ సాయిరాజ్ సభ్యులుగా ఉన్న భారత పురుషుల బ్యాడ్మింటన్ జట్టు రజత పతకం గెల్చుకోగా... మహిళల గోల్ఫ్‌లో అదితి అశోక్ కూడా రజతం సాధించింది.

12లో


తజీందర్ - గోల్డ్


అవినాశ్ సాబ్లే - గోల్డ్


నందిని-కాంస్యం


చెనాయ్-స్వర్ణం, కాంస్యం



జ్యోతి యర్రాజీ-రజతం



భారత్‌లో అఫ్గాన్ దౌత్య కార్యాలయం మూసివేత

భారత్‌లో రాయబార కార్యాలయాన్ని అఫ్గానిస్థాన్ మూసివేసింది. ఆదివారం నుంచి కార్యకలాపాలన్నీ నిలిపివేస్తున్నట్టు ప్రకటించింది. అఫ్గానిస్థాన్‌లో అష్రాఫ్ ఘనీ ప్రభుత్వాన్ని కూల్చివేసి తాలిబన్లు అధికారంలోకి వచ్చిన రెండేళ్ల తర్వాత భారత్‌లో దౌత్యపరమైన కార్యకలాపాలన్నీ నిలిపివేయాలని నిర్ణయించింది. ఈ మేరకు ఢిల్లీలోని అఫ్గాన్ రాయబార కార్యాలయం ప్రకటించింది.

6లో

సెలవైనా ఠంఛన్‌గా పింఛన్

ఆదివారం రోజునా అవ్వాతాతల చేతికి రూ.1,415.64 కోట్లు

78.09 శాతం మంది లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ పూర్తి

2లో


గుంటూరు పశ్చిమ నియోజకవర్గం కొరిటిపాడుకు చెందిన మురారమ్మకు వృద్ధాప్య పింఛన్ అందజేస్తున్న వలంటీర్ శ్రీదేవి

'హృదయాలయం'.. నిరుపేదల గుండె గుడి

- చిన్నారులకు పునర్జన్మనిస్తున్న సీఎం జగన్ మానసపుత్రిక
- చిన్నపిల్లలకు ప్రాణాలు పోస్తున్న వైద్యులు.. తాజాగా నెల్లూరుకు చెందిన చిన్నారికి గుండె మార్పిడి
- ఉత్తమ పీడియాట్రిక్ కార్డియాక్ సెంటర్‌గా తిరుపతి 'హృదయాలయం'కు గుర్తింపు
- తెలంగాణ గవర్నర్ చేతుల మీదుగా అవార్డు ప్రదానం

10లో



కృష్ణపట్నం-హైదరాబాద్ మధ్య
మల్టీ ప్రొడక్ట్ పైప్‌లైన్

దీని వల్ల వేలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు

- నాగ్‌పూర్-విజయవాడ కారిడార్‌తో మూడు రాష్ట్రాల మధ్య రాకపోకలు మరింత సులభతరం
- తెలంగాణకు జాతీయ పసుపు బోర్డు మంజూరు చేస్తున్నాం
- ములుగులో రూ.900 కోట్లతో సమ్మక్క-సారలమ్మ పేరిట ట్రైబల్ యూనివర్సిటీ కూడా..
- పాలమూరు పర్యటనలో ప్రధాని నరేంద్ర మోదీ



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణపట్నం-హైదరాబాద్ మధ్య రూ.1,932 కోట్లతో చేపట్టే మల్టీ ప్రొడక్ట్ పైప్‌లైన్ వల్ల తెలంగాణలోని వివిధ జిల్లాల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మందికి ఉపాధి లభిస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. అలాగే, నాగ్‌పూర్-విజయవాడ కారిడార్‌వల్ల తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రలకు రాకపోకలు మరింత సులభతరం అవుతాయన్నారు. ఈ మూడు రాష్ట్రాల్లో వాణిజ్యం, పర్యాటకం, పారిశ్రామిక రంగాలకు ప్రయోజనం చేకూరుతుందని.. ఈ కారిడార్‌లో కొన్ని ముఖ్యమైన ఆర్థిక కేంద్రాలను కూడా గుర్తించామని ఆయన చెప్పారు. ఇందులో ఎనిమిది ప్రత్యేక ఆర్థిక మండళ్లు, ఐదు మెగా ఫుడ్ పార్కులు, నాలుగు ఫిషింగ్ సీ ఫుడ్ క్లస్టర్లు, మూడు ఫార్మా అండ్ మెడికల్ క్లస్టర్లు..
మిగతా 14వ పేజీలో ▶

జగనన్న ఇళ్లలో విద్యుత్ పొదుపు పథకం భేష్

- గృహ నిర్మాణ లబ్ధిదారుల జీవన ప్రమాణాల మెరుగుదలకు ఏపీ ప్రయత్నం
- స్విట్జర్లాండ్ ఎంబసీ ఎనర్జీ హెడ్ జోనాథన్ డెమెంగే ప్రశంసలు



సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక పథకం 'నవరత్నాలు'లో భాగంగా చేపట్టిన పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో విద్యుత్ ఆదా చర్యలు అంతర్జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకుంటున్నాయి. భారీ గృహ నిర్మాణ పథకంలో లబ్ధిదారులకు విద్యుత్ పొదుపు చేయగల ఉపకరణాలను అందించే ప్రాజెక్టును చేపట్టడాన్ని ఢిల్లీలోని స్విట్జర్లాండ్ రాయబార కార్యాలయంలో ఎనర్జీ హెడ్ ఆఫ్ కో ఆపరేషన్ అండ్ కౌన్సెలర్ డాక్టర్ జోనాథన్ డెమెంగే ప్రశంసించారు. దక్షిణ భారతదేశంలో చేపడుతున్న ఇంధన సామర్థ్య కార్యక్రమాలను డెమెంగేకు ఈఈఎస్ఎల్ సీనియర్ సలహాదారు ఎ.చంద్రశేఖరరెడ్డి
మిగతా 2వ పేజీలో ▶





'చేతి'తో పిడకలు చేసుకుంటారేమో సార్!!

'అంతరిక్ష విత్తనాలు'
ఆదుకుంటాయా?

వాతావరణ ఎమర్జెన్సీ గడ్డుకాలంలో 'స్పేస్ బ్రీడింగే' దిక్కా?



- స్పేస్ బ్రీడింగ్‌తో జీవ భద్రతకు ముప్పేనంటున్న స్వతంత్ర శాస్త్రవేత్తలు
- అంతరిక్షంలోకి పంపి తెచ్చిన వంగడాలతో లబ్ధి పొందుతున్నామంటున్న చైనా
- స్పేస్ బ్రీడింగ్‌కు మరో రెండు, మూడేళ్లు పట్టవచ్చంటున్న నిపుణులు
- ప్రపంచ అంతరిక్ష వారోత్సవాల సందర్భంగా ప్రత్యేక కథనం..

- వివరాలు 14లో

యూజీసీ నెట్‌కు దరఖాస్తుల ఆహ్వానం



- అసిస్టెంట్ ప్రొఫెసర్, జేఆర్ఎఫ్‌కు 83 సబ్జెక్టుల్లో అర్హత పరీక్ష
- ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు గడువు ఈ నెల 28.. ఫీజు చెల్లింపు గడువు 29వ తేదీ
- డిసెంబర్ 6 నుంచి 22వ తేదీ వరకు సబ్జెక్టుల వారీ పరీక్ష

సాక్షి, అమరావతి: అసిస్టెంట్ ప్రొఫెసర్, జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ (జేఆర్ఎఫ్) కోసం 83 సబ్జెక్టుల్లో యూజీసీ డిసెంబర్‌లో నిర్వహించనున్న జాతీయ అర్హత పరీక్ష (నెట్)కు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నెల 28వ తేదీలోగా **ugcnet.nta.ac.in** వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవడంతోపాటు 29లోగా పరీక్ష రుసుము చెల్లించాలని సూచించింది. యూజీసీ గుర్తించిన యూనివర్సిటీ నుంచి పీజీ 55 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన జనరల్ విద్యార్థులు, 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన ఇతరులు ఈ పరీక్షకు అర్హులు. పీహెచ్‌డీ కలిగిన వారికి మార్కుల్లో 5 శాతం సడలింపు ఉంటుంది.

ఏటా రెండుసార్లు యూజీసీ నెట్
దేశవ్యాప్తంగా ఏటా జూన్, డిసెంబర్‌ల్లో నిర్వహిస్తున్న యూజీసీ నెట్‌కు ఏడాదికి 8 లక్షల నుంచి 10 లక్షల మంది
మిగతా 14వ పేజీలో ▶


తిరుపతి జిల్లా కంచనపుత్తూరులో తుపాకుల ముత్యాలమ్మకు పింఛను అందిస్తున్న వలంటీర్ పద్మావతి, సచివాలయ సిబ్బంది


విజయవాడ రాణిగారి తోటలో మారంరెడ్డి వెంకటేశ్వరరావుకు పింఛను అందజేస్తున్న వార్డు వలంటీర్ అరుణకుమారి


శ్రీకాకుళం 13వ డివిజన్‌లో బండి పాపకు పింఛను అందజేస్తున్న వలంటీర్ జగన్నాథరావు


గ్రేటర్ విశాఖ 27వ వార్డు రామాటాకీసు వద్ద బోని లక్ష్మికి పింఛను అందజేస్తున్న వలంటీర్ మానస


ఏలూరులో మజ్జి పర్వతయ్యరెడ్డికి వృద్ధాప్య పింఛను అందజేస్తున్న వలంటీర్ వి.ఈశ్వరి


విజయనగరం పల్లవీధిలో కళావతికి కొత్తగా మంజూరైన పింఛను అందజేస్తున్న వలంటీర్ కీర్తి

సెలవైనా ఠంఛన్‌గా పింఛన్

- ఆదివారం రోజునా అవ్వాతాతల చేతికి రూ.1,415.64 కోట్లు
- 78.09 శాతం మంది లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ పూర్తి

సాక్షి, అమరావతి: సెలవు రోజైనా ప్రభుత్వం ఠంఛన్‌గా అవ్వాతాతలకు పింఛన్లు పంపిణీ చేసింది. ఆదివారం తెల్లవారుజాము నుంచే వలంటీర్లు లబ్ధిదారుల ఇంటింటికి వెళ్లి రాష్ట్రవ్యాప్తంగా 51,37,566 మంది అవ్వాతాతలు, వితంతు, దివ్యాంగ, ఒంటరి మహిళ, వివిధ రకాల చేతివృత్తిదారులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు రూ.1,415.64 కోట్ల మొత్తాన్ని అందజేశారు. అక్టోబరు ఒకటో తేదీ నుంచి పంపిణీకిగాను 65,78,854 మంది లబ్ధిదారుల కోసం ప్రభుత్వం మొత్తం రూ.1,813.60 కోట్ల విడుదల చేసింది. ఒకటో తేదీ ఆదివారం సెలవు అయినా.. సాయంత్రానికి 78.09 శాతం మంది లబ్ధిదారులకు పంపిణీ పూర్తయినట్టు ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు చెప్పారు. మిగిలిన వారి కోసం ఐదోతేదీ వరకు వలంటీర్ల ఆధ్వర్యంలో పింఛన్ల పంపిణీ కొనసాగుతుందని తెలిపారు.


వైఎస్సార్ జిల్లా చెన్నూరు మండలం శివాలపల్లెలో రమణమ్మకు వృద్ధాప్య పింఛను అందజేస్తున్న వలంటీర్ హరిత


శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా దీసీపల్లిలో గంధం పెంచలయ్యకు పింఛను అందజేస్తున్న వలంటీర్ కండె రాజశేఖర్


కర్నూలు జిల్లా మద్దికెర మండలం అగ్రహారంలో పక్కీరమ్మకు పింఛను ఇస్తున్న వలంటీర్ విజయలక్ష్మి


ఒంగోలు విజయనగర్ కాలనీలో వృద్ధురాలు ఐదుపోగుల సుబ్బులమ్మకు పింఛను అందజేస్తున్న వలంటీర్ సాయిశ్రీ


కాకినాడ జిల్లా కరప మండలం పెదకొత్తూరులో ఎర్రంశెట్టి మంగయమ్మకు పింఛను అందజేస్తున్న వలంటీర్ బళ్ల నాగమణి


అనంతపురం 4వ డివిజన్‌లో వి.మాధవికి దివ్యాంగ పింఛను అందజేస్తున్న వార్డు వలంటీర్ షేక్షావలి

స్వచ్ఛ భారత్‌లో అందరూ భాగస్వాములు కావాలి


రైల్వే శాఖ సహాయ మంత్రి దర్శనా జర్దోష్ పిలుపు


విశాఖ రైల్వేస్టేషన్‌లో శ్రమదానంలో కేంద్ర సహాయ మంత్రి దర్శనా జర్దోష్

తాటిచెట్లపాలెం (విశాఖ ఉత్తర): స్వచ్ఛ భారత్ ప్రతి ఒక్కరి పని అని.. ఇందులో అందరూ భాగస్వాములు కావాలని కేంద్ర రైల్వే, జౌళి శాఖ సహాయ మంత్రి దర్శనా జర్దోష్ పిలుపునిచ్చారు. విశాఖ రైల్వేస్టేషన్‌లో ఆదివారం 'స్వచ్ఛతా హి సేవా' కార్యక్రమంలో భాగంగా ఆమె ఒక గంట శ్రమదానం చేశారు. ప్రయాణికులకు క్లాత్ బ్యాగులను అందించి ప్లాస్టిక్ నిషేధానికి సహకరించాలని కోరారు. ఆ తర్వాత సఫాయిమిత్రలతో దర్శనా జర్దోష్ ముఖాముఖి మాట్లాడి వారిని అభినందించారు.

ఐటీ హబ్‌గా విశాఖ

- వచ్చే ఐదేళ్లలో 5 లక్షల ఉద్యోగాల కల్పనకు అవకాశం
- ఒక్క ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లోనే 50,000 ఉద్యోగాలు వైజాగ్‌లో..
- రాష్ట్రవ్యాప్తంగా వచ్చే ఐదేళ్లలో 10 లక్షల ఉద్యోగాలు
- ఏటా 3.5 లక్షల మంది తాజా గ్రాడ్యుయేట్స్ వస్తుండటమే రాష్ట్ర బలం
- పల్సస్ గ్రూపు అధ్యయన నివేదికలో వెల్లడి



సాక్షి, అమరావతి: రానున్న కాలంలో విశాఖ నగరం ఐటీ ఉద్యోగాలకు కేంద్రంగా మారనుంది. ఈ రంగంలో కొత్తగా కెరీర్ ప్రారంభించే వారికి అది అవకాశాల గని కానుంది. ముఖ్యంగా ఐటీ, ఐటీ ఆధారిత రంగంలో ఉపాధి అవకాశాలు గణనీయంగా పెరగనున్నాయి. వచ్చే ఐదేళ్ల కాలంలో ఐటీ రంగంలో ఒక్క విశాఖపట్నంలోనే ఐదులక్షలకు పైగా ఉపాధి అవకాశాలు వస్తాయని పల్సస్ గ్రూపు తన అధ్యయన నివేదికలో వెల్లడించింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విశాఖపట్టణాన్ని పరిపాలన రాజధానిగా ప్రకటించడంతో పాటు ఇక్కడ ఉపాధి అవకాశాలపై అంతర్జాతీయంగా ప్రాచుర్యం కల్పించడంతో ఐటీ హబ్‌గా విశాఖ వేగంగా ఎదుగుతోందని పల్సస్ గ్రూపు సీఈఓ శ్రీనుబాబు గేదెల తెలిపారు. ఇప్పటికే ఇన్ఫోసిస్, రాండ్‌స్టాండ్, అమెజాన్, అదానీ డేటాసెంటర్ వంటివి రావడంతో పాటు ఆంధ్రయూనివర్సిటీలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ, పారిశ్రామిక రంగంలో నాలుగో తరం టెక్నాలజీని ప్రోత్సహించేందుకు కల్పతరువు పేరుతో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీలు ఇక్కడ ఏర్పాటుకావడంతో అంతులేని ఉపాధి అవకాశాల నిధిగా విశాఖ ఎదుగుతోందన్నారు. ఈ ఏడాది భారతదేశం జీ20 సమావేశాలకు వేదికగా ఎంపిక కావడంతో ఆ అవకాశాన్ని చక్కగా వినియోగించుకుని ఫార్మాస్యూటికల్, హెల్త్‌కేర్, ఐటీ, ఐటీ ఆధారిత సేవల్లో విశాఖపట్నానికి ఉన్న అవకాశాలు, అందుబాటులో ఉన్న మానవ వనరులను ప్రపంచ దేశాలకు వివరించినట్లు తెలిపారు. రాష్ట్రం నుంచి ఏటా మూడు లక్షలకు పైగా విద్యార్థులు డిగ్రీ పట్టాలను అందుకుంటుంటే అందులో ఒక్క విశాఖ చుట్టుపక్కల నుంచే 1.5 లక్షల మంది వస్తున్నారు. ఉపాధి అవకాశాలు కల్పించడంలో విశాఖకు ఇది కలిసొచ్చే అతిపెద్ద అంశమని ఆ నివేదికలో పేర్కొన్నారు.

వచ్చే ఐదేళ్లలో కొలువుల పండగ..

ఇక రాష్ట్రవ్యాప్తంగా వచ్చే ఐదేళ్లలో 10 లక్షల ఉద్యోగాలు రానుండగా అందులో ఒక్క విశాఖలోనే 5 లక్షల ఉద్యోగాలు రానున్నట్లు పల్సస్ గ్రూపు అంచనా వేసింది. ఇందులో ఒక్క ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలోనే విశాఖలో 50,000 ఉద్యోగాలు వస్తాయని ఆ నివేదిక పేర్కొంది. ప్రస్తుతం విశాఖలోని ఐటీ రంగం 25,000 మందికి ఉపాధి కల్పిస్తుంటే హెల్త్‌కేర్, ఫార్మా, మెరైన్ ఇండస్ట్రీస్, పర్యాటకం, రక్షణ, విద్య వంటి రంగాలు లక్ష మందికి పైగా ఉపాధి కల్పిస్తున్నాయి. ఈ సంఖ్య ఐదేళ్లలో ఐదు లక్షలకు చేరుతుందని శ్రీనుబాబు వివరించారు.



జగనన్న ఇళ్లలో విద్యుత్ పొదుపు పథకం భేష్

▶ మొదటి పేజీ తరువాయి
ఆదివారం వివరించారు. గృహ నిర్మాణ లబ్ధిదారులకు మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించడంతో పాటు విద్యుత్ పొదుపే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ 'ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్ (ఈఈఎస్ఎల్)'తో కలిసి రాష్ట్ర ప్రభుత్వం స్టార్ రేటెడ్ విద్యుత్ ఉపకరణాలను అందించే ప్రయత్నాన్ని డెమెంగే ఈ సందర్భంగా కొనియాడారు. ప్రతి లబ్ధిదారునికి నాలుగు ఎల్ఈడీ బల్బులు, రెండు ట్యూబ్ లైట్లు, రెండు ఎనర్జీ ఎఫిషియెన్సీ ఫ్యాన్‌లను అందజేయడం వల్ల, ప్రతి ఇంటికీ ఏడాదికి 734 యూనిట్ల విద్యుత్ ఆదా అవుతుందని చంద్రశేఖరరెడ్డి ఆయనకు తెలిపారు. ఫలితంగా ఫేజ్–1లోని 15.6 లక్షల ఇళ్లలో ఏటా రూ.352 కోట్లు మిగులుతాయన్నారు. విద్యుత్ పొదుపుతో పాటు గ్రీన్ హౌస్ వాయు ఉద్గారాల తగ్గింపుపై ప్రజల్లో అవగాహన పెంపొందించాలని డెమెంగే సూచించారు. గోవాలో జరిగిన జీ20 సదస్సులో గృహ నిర్మాణ పథకంలో ఇంధన సామర్థ్య కార్యక్రమాలను చేపట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మద్దతుతో ఒప్పందం కుదుర్చుకున్నందుకు ఏపీ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్, ఈఈఎస్ఎల్ సీఈవో విశాల్ కపూర్‌లను డెమెంగే అభినందించారు. ఇలాంటి పథకాలను ఇతర రాష్ట్రాలు కూడా అనుసరించాలని డెమెంగే కోరారు. ఇంధన సామర్థ్య గృహ నిర్మాణ పథకాల వల్ల సామాన్య ప్రజలతో పాటు పర్యావరణానికీ లబ్ధి చేకూరుతుందన్నారు. రాష్ట్రం మార్గనిర్దేశం చేస్తున్న ఈ కార్యక్రమం ప్రపంచవ్యాప్తంగా స్ఫూర్తిదాయకమని కొనియాడారు.

కళ్లెదుటే ఖరీదైన లోగిళ్లు!



■ కాకినాడ జిల్లా సామర్లకోటకు చెందిన అప్పారావు దినసరి కూలి. ఆర్నెల్ల క్రితం వరకూ నెలకు రూ.2,500 అద్దె చెల్లించాల్సి రావడంతో కుటుంబ పోషణ చాలా కష్టంగా ఉండేది. ఆయన భార్య రత్నం సొంత ఇంటి కలను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నవరత్నాలు–పేదలందరికీ ఇళ్ల పథకం ద్వారా నెరవేర్చింది. సామర్లకోట నుంచి ప్రత్తిపాడుకు వెళ్లే రోడ్డులో అత్యంత ఖరీదైన ప్రాంతంలో ఆమె కుటుంబానికి ప్రభుత్వం ఉచితంగా స్థలాన్ని ఇవ్వడంతోపాటు గృహ నిర్మాణానికి ఆర్థికంగా చేదోడుగా నిలిచింది. ఏమ్మా ఈ ఇల్లు మీదేనా? చాలా బాగుందంటూ ఎవరైనా పలకరిస్తే చాలు.. 'అవునండీ సీఎం జగన్ మాకిచ్చిన కానుక ఈ ఇల్లు. ఇన్నాళ్లూ అద్దెలు కట్టలేక, పిల్లల చదువులు, కుటుంబ పోషణకు చాలా ఇబ్బందులు పడ్డాం. కొత్త ఇంటిలోకి వచ్చాక చిన్న టిఫిన్ సెంటర్ నడుపుతున్నా. వేడినీళ్లకు చన్నీళ్లలా మా సంపాదన ఉంది' అని ఆనందంగా చెబుతోంది. సామర్లకోట లేఔట్‌లో ఇల్లు నిర్మించుకుని నివాసం ఉంటున్న కృష్ణకుమారి అనే మహిళను ఇక్కడికి వచ్చి ఎన్నిరోజులు అయింది? అని పలుకరించగా 'నా భర్త చిరు వ్యాపారి. వివాహం అయిన రోజు నుంచి అద్దె ఇంటిలోనే ఉంటున్నాం. సంపాదన ఖర్చులకే సరిపోయేది కాదు. స్థలం కొనడానికే రూ.10 లక్షలు దాకా ఉండాలి. దీంతో ఇక ఇంటి కల నెరవేరదని ఆశ వదులుకున్న తరుణంలో ప్రభుత్వం పేదలకు స్థలాలు ఇచ్చి ఇంటిని కూడా మంజూరు చేస్తోందని తెలియడంతో దరఖాస్తు చేసుకున్నాం. ఎనిమిది నెలల క్రితం గృహ ప్రవేశం కూడా చేశాం. నా బిడ్డ చదువులకు కూడా ప్రభుత్వం సాయం చేస్తోంది. ఇప్పటివరకు మూడుసార్లు అమ్మఒడి వచ్చింది. రూ.75 వేలు పొదుపు సంఘం రుణం వచ్చింది' అని సంతోషం వ్యక్తం చేస్తోంది.

ఇళ్ల లబ్ధిదారులకు ఆగస్టు వరకు బిల్లుల చెల్లింపు ఇలా

వర్గాలు	లబ్ధిదారులు	డీబీటీతో బిల్లుల చెల్లింపులు రూ.కోట్లలో
బీసీలు	10,35,360	5,972.50
ఎస్సీలు	4,13,557	2,385.61
ఎస్టీలు	1,03,839	599.00
మైనారిటీలు	1,29,787	748.68
కాపులు	1,35,236	780.11
ఇతర పేదలు	3,13,785	1,810.07
మొత్తం	21,31,564	12,295.97



5న సామర్లకోట లే అవుట్‌లో ఇళ్లకు సీఎం జగన్ ప్రారంభోత్సవాలు

పేదలందరికీ ఇళ్లు–నవరత్నాల్లో భాగంగా పూర్తయిన ఐదు లక్షల గృహాల ప్రారంభోత్సవ కార్యక్రమం ఈ నెల 5వ తేదీన సామర్లకోటలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా జరుగుతుందని గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక సీఎస్ అజయ్ జైన్ తెలిపారు. అదే రోజు జిల్లాలు, నియోజకవర్గాల వారీగా ఎంపిక చేసిన లే అవుట్లలో ఇళ్లను మంత్రులు, ప్రజా ప్రతినిధులు ప్రారంభిస్తారని, సామూహిక గృహ ప్రవేశాలు ఉంటాయని అజయ్ జైన్ 'సాక్షి'కి వెల్లడించారు. ఐదు లక్షల గృహాల లే అవుట్లలో నూటికి నూరు శాతం మంచినీటి, విద్యుత్ సదుపాయాలను కల్పించినట్లు చెప్పారు. రహదారులు, అంతర్గత రహదారులు, స్వాగత తోరణాలు కూడా పూర్తైనట్లు తెలిపారు. ఇప్పటి వరకు 5.24 లక్షల ఇళ్ల నిర్మాణాలు పూర్తి అయ్యాయని చెప్పారు.

▶ మొదటి పేజీ తరువాయి
పంపిణీ చేసిందని కేంద్ర గృహ నిర్మాణ శాఖ సైతం ప్రశంసించింది. 17,005 జగనన్న కాలనీల్లో సకల సామాజిక, కనీస సదుపాయాలను కల్పిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఇందుకోసం దశలవారీగా దాదాపు రూ.30 వేల కోట్లను వ్యయం చేస్తోంది. ఇక ఆగస్టు నెలాఖరు వరకు 21.31 లక్షల ఇళ్ల నిర్మాణాల కోసం మరో రూ.12,295.97 కోట్లను అక్క చెల్లెమ్మల ఖాతాలకు పారదర్శకంగా జమ చేసింది. ఉచితంగా ఇచ్చే ఇసుకతోపాటు రాయితీపై సామగ్రిని సమకూరుస్తోంది. తద్వారా మరో రూ.40 వేల మేరకు లబ్ధిదారులకు ప్రయోజనాన్ని చేకూరుస్తోంది. ఇళ్ల నిర్మాణాలు పూర్తయిన ప్రాంతాన్ని బట్టి స్థలం, ఇంటి విలువ రూ.15 లక్షలు, ఆపైన పలుకుతుండటం విశేషం. ఇళ్ల లబ్ధిదారుల్లో బీసీ మహిళలే అత్యధికంగా ఉన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల ఇళ్ల నిర్మాణాలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అధికార యంత్రాంగానికి మార్గ నిర్దేశం చేస్తున్నారు. పూర్తైన ఇళ్లకు మంచినీరు, విద్యుత్ సరఫరాపై క్షేత్రస్థాయిలో ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్ల ద్వారా తనిఖీలు జరిపి నిర్ధారించేలా చర్యలు తీసుకున్నారు. రోజు వారీ లక్ష్యాలను నిర్ధారించి ఎప్పటికప్పుడు పురోగతిని సమీక్షిస్తుండటంతో ఐదు లక్షలకుపైగా పేదల ఇళ్ల నిర్మాణాలు శరవేగంగా పూర్తయ్యాయి.

వైఎస్సార్ - జగనన్న కాలనీల్లో సదుపాయాల కల్పన వ్యయం రూ.కోట్లలో..

నీటి సరఫరా	4,128
విద్యుత్, ఇంటర్నెట్	7,989
డ్రైనేజీ, సీవరేజ్	7,227
రోడ్లు, ఆర్చ్‌లు	10,251
పట్టణ ప్రాంత లేఔట్‌ల్లో వసతుల కల్పన	3,314

రాష్ట్రవ్యాప్తంగా ఇళ్ల నిర్మాణ పురోగతి ఇలా

బీబీఎల్	710,228 (బేస్‌మెంట్ లెవల్ లోపు)
బీఎల్	399,085 (బేస్‌మెంట్ లెవల్)
రూఫ్ లెవెల్	100,404
రూఫ్ కాస్ట్	50,657
నిర్మాణం పూర్తి	524,850

ఖరీదైన ప్రాంతంలో పేదలకు ఇళ్లు

కాకినాడ జిల్లా సామర్లకోట - ప్రత్తిపాడు రోడ్డులో 2,412 నిరుపేద కుటుంబాల సొంతింటి కలను సాకారం చేస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం 54 ఎకరాల్లో ఇళ్ల స్థలాలను పంపిణీ చేసింది. రెండు కాలనీలుగా పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించారు. ఇప్పటివరకు 800 వరకూ ఇళ్ల నిర్మాణం పూర్తయ్యింది. మరో 1,408 ఇళ్లు పునాదిపై దశల్లో నిర్మాణంలో ఉన్నాయి. ఈ నెల 5వ తేదీన సామర్లకోట వైఎస్సార్ జగనన్న కాలనీని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సందర్శించి పేదల గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఈ క్రమంలో సామర్లకోట మునిసిపాలిటీలోని జగనన్న కాలనీల్లో 'సాక్షి' క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టింది. సామర్లకోట నుంచి ప్రత్తిపాడు వెళ్లే ప్రధాన రహదారికి పక్కనే ఇళ్ల స్థలాలు పంపిణీ చేశారు. ఇక్కడ సెంటు స్థలం మార్కెట్ విలువ రూ.10 లక్షలపైన పలుకుతోందని చెబుతున్నారు. విద్యుత్, నీటి సరఫరాతో పాటు, ఇతర సదుపాయాలను కూడా ప్రభుత్వం సమకూరుస్తోంది. స్థలం, ఇంటి రూపంలో ఒక్కో పేద మహిళకు రూ.15 లక్షలకుపైగా విలువైన ఆస్తిని సీఎం జగన్ సమకూర్చారు.

అత్యంత నాణ్యత ప్రమాణాలతో..

పేదలకు ప్రభుత్వం పంపిణీ చేసిన స్థలాలను స్మశానాలతో పోల్చుతూ టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు, ఆ పార్టీ నాయకులు విషం కక్కారు. నిత్యం పేదల ఇళ్ల పథకంపై ఎల్లో మీడియా విష ప్రచారం చేస్తోంది. ఈ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టేలా కాలనీల్లో అత్యంత నాణ్యత ప్రమాణాలతో పేదల ఇళ్ల నిర్మాణాలున్నాయి. ప్రతి ఇంటికీ హాల్, కిచెన్, బెడ్‌రూమ్, వరండా, స్టేర్ కేస్ లాంటి వసతులు ఉండటం విశేషం. సామర్లకోటలో మెజారిటీ లబ్ధిదారులు తామే ఇళ్లు నిర్మించుకునే ఆప్షన్ ఎంచుకున్నారు. ఆప్షన్–3 లబ్ధిదారుల ఇళ్లను షేర్‌వాల్ టెక్నాలజీలో అజయ వెంచర్స్ లేబర్ ఏజెన్సీ నిర్మిస్తోంది.

ఉచితంగా ఇసుక.. సబ్సిడీపై సామగ్రి

నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా పేదల సొంతింటి కలను సాకారం చేస్తూ రెండు విడతల్లో 21.25 (టిడ్కోతో కలిపి) లక్షలకు పైగా ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టారు. ఇంటి నిర్మాణానికి యూనిట్‌కు రూ.1.80 లక్షలు చొప్పున ప్రభుత్వం అందిస్తోంది. పావలా వడ్డీకే రూ.35 వేలు బ్యాంక్ రుణం, రూ.15 వేలు విలువైన ఉచిత ఇసుక, సబ్సిడీపై సిమెంట్, స్టీల్, మెటల్ ఫ్రేమ్స్, ఇతర నిర్మాణ సామాగ్రిని అందించడం ద్వారా మరో రూ.40 వేల మేర లబ్ధిదారులకు ప్రయోజనాన్ని చేకూరుస్తోంది.

చిత్తూరు జిల్లాలో అత్యధికంగా..

ఈ ఏడాది ఆగస్టు నాటికి ఐదు లక్షల ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఈ నేపథ్యంలో ఇప్పటివరకు నిర్మాణం పూర్తయిన ఇళ్లు 5,24,850కి చేరుకున్నాయి. మిగిలినవి శరవేగంగా కొనసాగుతున్నాయి. చిత్తూరు జిల్లాలో అత్యధికంగా 43,602 ఇళ్లు పూర్తయ్యాయి. విజయనగరం జిల్లాలో 37,141 ఏలూరు జిల్లాలో 26,815 ఇళ్లు పూర్తయ్యాయి.

తిరగకుండానే మంజూరైంది..



టీడీపీ హయాంలో ఇంటి స్థలం కోసం దరఖాస్తు చేసుకుంటే పట్టించుకోలేదు. ఆ పార్టీ సానుభూతిపరులం కాదని సంక్షేమ పథకాల నుంచి తొలగించారు. తమ పార్టీ జెండా పట్టుకుంటే అన్నీ వస్తాయని ఆ పార్టీ నాయకులు చాలాసార్లు ఆశ పెట్టారు. ఇప్పుడు ఏ నాయకుడు, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండానే మాకు ఇంటి స్థలం మంజూరైంది. త్వరలో గృహప్రవేశం కూడా చేయనున్నాం. ప్రభుత్వం మాకిచ్చింది సెంటు స్థలమేనని హేళనగా మాట్లాడుతున్న టీడీపీ నాయకులు వారి ప్రభుత్వంలో గజం స్థలం కూడా ఇచ్చిన పాపాన పోలేదు.

– సూర్య భాస్కర్ కుమార్, సామర్లకోట, కాకినాడ జిల్లా

దశాబ్దాల కల నెరవేరింది..



మా ఆయన చిరు వ్యాపారి. ఆయన సంపాదనంతా ముగ్గురమ్మాయిల చదువులు, కుటుంబ పోషణకే సరిపోయేది. వారికి పెళ్లిళ్లు చేయడానికి తలకు మించిన భారమైంది. దీంతో మాకంటూ ఒక సొంత ఇల్లు ఉండాలన్న కోరిక అలాగే మిగిలిపోయింది. ఇప్పుడు సీఎం జగన్ మా దశాబ్దాల ఇంటి కలను నెరవేర్చారు. ఆయన రుణం ఈ జన్మకు తీర్చుకోలేం.

– లంక లక్ష్మి, వైఎస్సార్–జగనన్న కాలనీ సామర్లకోట, కాకినాడ జిల్లా

ఇంతకన్నా మేలు ఏ ప్రభుత్వం చేయలేదు..



నెలకు రూ.3,500 చెల్లించి అద్దె ఇంట్లో ఉండేవాళ్లం. గత ప్రభుత్వంలో ఇంటి స్థలం కోసం దరఖాస్తు చేసుకున్నా పట్టించుకోలేదు. ఇప్పుడు ప్రభుత్వం ఇచ్చిన సెంటు స్థలంలో ఇల్లు నిర్మించుకుని ఆత్మగౌరవంతో జీవిస్తున్నాం. మా పిల్లల చదువులకు కూడా అమ్మఒడి ద్వారా సీఎం జగన్ అండగా నిలుస్తున్నారు.

– వి.సతీష్, పద్మావతి, వైఎస్సార్, జగనన్న కాలనీ, సామర్లకోట

పేదరిక నిర్మూలనే లక్ష్యంగా..



రాష్ట్రంలో పేదరికాన్ని పూర్తిగా నిర్మూలించడమే లక్ష్యంగా సీఎం జగన్ పాలిస్తున్నారు. ప్రజల కనీస అవసరాల్లో ఒకటైన గూడు కోసం ఏ ఒక్కరు బాధ పడకుండా చర్యలు చేపట్టారు. దేశ చరిత్రలో ఎన్నడూ లేనిధంగా పేదలకు ఏకంగా 30 లక్షలకు పైగా ఇంటి పట్టాలు ఇచ్చారు. ఐదు లక్షల ఇళ్లను త్వరలో లబ్ధిదారులకు అందిస్తున్నాం. శరవేగంగా మిగిలిన నిర్మాణాలను కూడా పూర్తి చేస్తాం.

– దవులూరి దొరబాబు, పెద్దాపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త

ఎప్పటికప్పుడు పురోగతి పరిశీలన



పేదల ఇళ్ల నిర్మాణాలను శరవేగంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. సకాలంలో బిల్లులు చెల్లిస్తున్నాం. జిల్లాల వారీగా లక్ష్యాలను నిర్దేశించి ఎప్పటికప్పుడు పనుల పురోగతిని సమీక్షిస్తున్నాం. సామర్లకోటలో త్వరలో సీఎం జగన్ పర్యటించనున్న నేపథ్యంలో ఏర్పాట్లు చేస్తున్నాం.

– డాక్టర్ లక్ష్మీశా, ఎండీ, ఏపీ గృహనిర్మాణ సంస్థ

ఆర్థిక వ్యవస్థ పునర్నిర్మాణం



పెద్ద ఎత్తున ఇళ్ల నిర్మాణం ద్వారా దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారికి సమాజంలో సముచిత స్థానం లభిస్తుంది. ఇది కేవలం గృహ నిర్మాణంగానే చూడకూడదు. ఇళ్ల నిర్మాణంతో అనుబంధ రంగాల కార్మికులకు కూడా ఉపాధి లభిస్తుంది. సిమెంట్, ఇనుము, ఇటుకలు.. ఇలా వివిధ పరిశ్రమల ఉత్పత్తిలో వృద్ధి పెరుగుతుంది. తద్వారా ఆర్థిక వ్యవస్థ పునర్నిర్మాణం జరుగుతుంది. పేదలు తమ సంపాదనలో తిండికి పెట్టే ఖర్చుతో సమానంగా ఇంటి అద్దెలు చెల్లించాల్సి వస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో వారికి పక్కా ఇళ్లు సమకూరితే అద్దెల భారం తగ్గుతుంది. – ప్రొఫెసర్ కె.మధుబాబు, ఆర్థిక శాస్త్రం విభాగాధిపతి, ఏఎన్‌యూ

క్లుప్తంగా...

పలువురు డిప్యూటీ కలెక్టర్ల బదిలీ

విజయవాడ దుర్గగుడి ఈవోగా శ్రీనివాస్

సాక్షి, అమరావతి/ ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): రాష్ట్రంలో పలువురు డిప్యూటీ కలెక్టర్లను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్) జవహర్‌రెడ్డి ఆదివారం ఉత్తర్వులిచ్చారు. ఎన్టీఆర్ జిల్లా డీఆర్‌వోగా ఉన్న మనుగోడు శ్రీనివాస్‌ను విజయవాడ కనకదుర్గ ఆలయ ఈవోగా నియమించారు. గుంటూరు మునిసిపల్ కార్పొరేషన్‌లో అడిషినల్ కమిషనర్‌గా పనిచేస్తున్న పెద్ది రోజాను కృష్ణా జిల్లా డీఆర్‌వోగా బదిలీ చేయగా.. ప్రస్తుతం కృష్ణా జిల్లా డీఆర్‌వోగా పనిచేస్తున్న పి. వెంకటరమణను బాపట్ల జిల్లా డీఆర్వోగా బదిలీ చేసినట్లు ఉత్తర్వులో పేర్కొన్నారు. అలాగే ఎన్టీఆర్ జిల్లా డీఆర్‌వోగా ఎస్వీ నాగేశ్వరరావును నియమించారు.

ప్యాకేజీ తీసుకుని పార్టీని తాకట్టు పెడతావా!


పవన్ కళ్యాణ్‌పై డిప్యూటీ సీఎం నారాయణస్వామి ధ్వజం



శ్రీరంగరాజపురం: ప్రశ్నిస్తా.. ఎదిరిస్తానని చెప్పిన జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ చివరకు చంద్రబాబు దగ్గర ప్యాకేజీ తీసుకుని పార్టీని తాకట్టు పెట్టడం సిగ్గుచేటని డిప్యూటీ సీఎం కె.నారాయణస్వామి ధ్వజమెత్తారు. చిత్తూరు జిల్లా ఉడమలకూర్తి వద్ద ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 2014లో ప్రశ్నిస్తా అని పార్టీ పెట్టి.. చంద్రబాబుతో పవన్ బేరం కుదుర్చుకున్నారన్నారు. 2019 ఎన్నికల సమయంలో చంద్రబాబును అరెస్ట్ చేసి జైల్లో పెట్టాలని చెప్పిన పవన్... ఇప్పుడు అదే జైలులో చంద్రబాబు దగ్గర ప్యాకేజీ మాట్లాడుకోవడానికి సిగ్గు అనిపించలేదా... అని నిలదీశారు.

బాబూ.. ఎగతాళి కావొద్దు

మండలి చీఫ్ విప్ ఉమ్మారెడ్డి హితవు



సాక్షి ప్రతినిధి, గుంటూరు: తన అరెస్టుపై కోర్టులో వాదించుకోకుండా పళ్లేలు మోగించడం వంటి చర్యలతో ప్రజల్లో ఎగతాళి కావొద్దని తెలుగుదేశం అధ్యక్షుడు చంద్రబాబుకు శాసనమండలి చీఫ్ విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు హితవు పలికారు. ఆయన ఆదివారం తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ రోడ్లపైకి వెళ్లి గొడవ చేస్తే ప్రభుత్వం లొంగిపోదని, న్యాయవ్యవస్థ ప్రభావితం కాదని టీడీపీ నాయకులు గుర్తుంచుకోవాలని చెప్పారు. తాను తప్పు చేయలేదనుకున్నప్పుడు ఎటువంటి విచారణకైనా ముందుకు వస్తే బాగుండేదన్నారు. ప్రస్తుతం టీడీపీ నేతలు ఆందోళన పేరుతో చేస్తున్న కార్యక్రమాలను పరిశీలిస్తే... చంద్రబాబును అరెస్టు చేసినందుకు పండుగ చేసుకుంటున్నట్లు ఉందన్నారు. ఒక్కరిలో కూడా తమ నాయకుడు అరెస్టయినందుకు బాధ కనపడటం లేదన్నారు.

ప్రజా రాజధాని పేరుతో చంద్రబాబు నిలువు దోపిడీ

1,099వ రోజు దీక్షల్లో బహుజన నేతలు



రిలే దీక్షల్లో బహుజన పరిరక్షణ సమితి నేతలు

తాడికొండ: అమరావతి పేరుతో 29 గ్రామాల్లో జరిగిన అవినీతిని చూసి ఆ ప్రాంత ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారని బహుజన పరిరక్షణ సమితి నేతలు చెప్పారు. తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు ఆదివారం 1,099వ రోజుకు చేరాయి. పలువురు నేతలు మాట్లాడుతూ ప్రజా రాజధాని అమరావతి అని చెబుతూ బాబు అండ్ కో నిలువు దోపిడీ చేశారని ధ్వజమెత్తారు. బహుజన పరిరక్షణ సమితి నేతలు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి పలువురు దళిత నాయకులు పాల్గొన్నారు.

'పల్లె' పాదయాత్రలో అపశ్రుతి

వృద్ధుడి మృతి



మృతి చెందిన బాబయ్య

పుట్టపర్తి అర్బన్: చంద్రబాబు అరెస్ట్‌ను నిరసిస్తూ శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి మాజీ ఎమ్మెల్యే పల్లె రఘునాథరెడ్డి చేపట్టిన పాదయాత్రలో అపశ్రుతి చోటుచేసుకుంది. పాదయాత్రలో పాల్గొన్న ఓ వృద్ధుడు మృత్యువాత పడ్డాడు. పల్లె రఘునాథరెడ్డి ఆదివారం పుట్టపర్తి మండలం నిడిమామిడి నుంచి బత్తలపల్లి సమీపాన ఉన్న గంటల మారెమ్మ ఆలయం వరకూ సుమారు 15 కిలోమీటర్ల పాదయాత్ర చేపట్టారు. జనం ఎవరూ రాకపోవడంతో మద్యం, విందు ఎర వేశారు. దీంతో పాదయాత్రలో పలువురు వృద్ధులు పాల్గొన్నారు. ఇలా వచ్చిన వారిలో గాజులపల్లికి చెందిన బాబయ్య (62) ఆలయం వరకూ పాదయాత్ర చేసి.. అక్కడే పూటుగా మద్యం తాగాడు. సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చి వలంటీర్ ద్వారా వృద్ధాప్య పింఛన్ తీసుకున్నాడు. డబ్బు భార్య రామలక్ష్మమ్మకు ఇచ్చి మంచంపై పడుకుని ప్రాణాలు విడిచాడు. వృద్ధాప్యంలో అంతదూరం నడవడం, మద్యం తాగడంతో గుండె పట్టేసి మృతి చెందాడని గ్రామస్తులు తెలిపారు.

'ఆరోగ్య సురక్ష'పైనా అక్కసే..

ఎన్నడూలేని విధంగా ప్రజలకు వైద్యం చేరువ కావడాన్ని చూసి ఓర్వేలేకపోతున్న రామోజీ

పద్నాలుగేళ్లపాటు రాష్ట్రాన్ని ఏలిన రామోజీ ఆత్మబంధువు చంద్రబాబుకు ఏనాడు వైఎస్ జగన్ మాదిరిగా ప్రజలకు సేవ చేయాలని ఆలోచన కూడా రాలేదు. పైగా.. ఈ చేతగానితనాన్ని సమర్థించుకుంటూ ఈనాడు ఒక్కోరోజు ఒక్కో రకంగా అడ్డగోలు వాదన చేస్తోంది. తాజాగా ఆ వాదన దేనిమీదో తెలుసా.. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై.. గత టీడీపీ ప్రభుత్వంలో సంచార వైద్య సేవల కార్యక్రమమే ఇదని సిగ్గూఎగ్గూ లేకుండా రాసిపారేస్తోంది. నిజానికి.. ఈ రెండు కార్యక్రమాలను పోల్చిచూస్తే నక్కకు నాక లోకానికి ఉన్నంత తేడా ఉంది.

సాక్షి, అమరావతి

రాష్ట్రంలో వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడుతూ వైద్యానికి ఏ ఒక్కరూ దూరం కావడానికి వీల్లేకుండా సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి తాజాగా శనివారం శ్రీకారం చుట్టింది. 1.67 కోట్ల గృహాలకు వైద్య సిబ్బందిని పంపి ప్రజల సమస్యలు గుర్తించి వాటిని పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటోంది. దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రజలకు ఎంతో ఉపయోగపడే ఈ కార్యక్రమంపై రామోజీరావు ఎక్కడలేని అక్కసు వెళ్లగక్కారు. ఈనాడులో ఆదివారం 'వైకాపా వారి వైద్య శిబిరాలు' అంటూ విషపు రాతలు రాసుకొచ్చారు. ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రారంభించిన తొలిరోజే రాష్ట్రవ్యాప్తంగా 620 వైద్య శిబిరాలను నిర్వహించి సొంత ఊళ్లలోనే 1.54 లక్షల మందికి పైగా ప్రజలకు ప్రభుత్వం ఉచిత వైద్య సేవలు అందించింది. అయితే, ఈ విషయాన్ని ఎక్కడా తన కథనంలో ప్రస్తావించని రామోజీ ఉద్దేశ్యపూర్వకంగా ప్రభుత్వంపై విషం కక్కింది.



వైకాపా వారి వైద్య శిబిరాలు

రూపాయి ఖర్చులేకుండా..



గ్రామీణ ప్రాంతాల్లోని వివిధ అనారోగ్య సమస్యలున్న ప్రజలు స్పెషలిస్ట్ వైద్య సేవలు పొందాలంటే వ్యయ, ప్రయాసలకోర్చి ఆస్పత్రులకు వెళ్లాలి. ఈ ఇబ్బందులకు తావులేకుండా సొంత ఊరిలోనే పూర్తి ఉచితంగా స్పెషలిస్ట్ వైద్య సేవల కల్పనకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలుచేస్తోంది. వైద్య శిబిరాల్లో 14 రకాల వైద్య పరీక్షలు, 172 రకాల మందులను అందుబాటులో ఉంచడంతో పాటు, వృద్ధులకు కంటి పరీక్షలు, కళ్లద్దాలు, హెల్త్ ప్రొఫైల్ మ్యాపింగ్ చేపడుతున్నారు. ఇదిలా ఉంటే.. ఆరోగ్యశ్రీ పథకంలో భాగమైన వైద్య శిబిరాలనే ఆరోగ్య సురక్ష శిబిరాలుగా నిర్వహిస్తున్నారని రామోజీరావు వింత వాదన చేస్తున్నారు. ప్రజలకు గతంలో ఎన్నడూలేని విధంగా మేలు చేస్తుంటే కడుపు మంటతో వాస్తవ దూరమైన రాతలు రాస్తుండటం రామోజీరావు దిగజారుడుతనానికి నిదర్శనంగా ఉంటోందని వైద్య రంగ నిపుణులు అంటున్నారు.

రామోజీరావు డూప్ రాతలు..


ప్రభుత్వ వైద్య రంగాన్ని నిర్వీర్యం చేసిన గత టీడీపీ పాలనలోని కార్యక్రమాలతో ప్రస్తుత ప్రభుత్వం నిర్వహిస్తున్న కార్యక్రమాలను పోల్చి రామోజీరావు డూప్ రాతలు రాయడం ఆశ్చర్యానికి గురిచేస్తున్నాయి. గత ప్రభుత్వంలోని సంచార వైద్య సేవల కార్యక్రమాన్నే ఫ్యామిలీ డాక్టర్‌గా అమలుచేస్తున్నారని ఆయన ఆరోపించడం హాస్యాస్పదంగా ఉంది. కేవలం 292 డొక్కు 104 మొబైల్ మెడికల్ యూనిట్స్ (ఎంఎంయూ)తో మొక్కుబడిగా సంచార వైద్య సేవలను అప్పట్లో అమలుచేసేవారు. మందులు, వైద్య పరీక్షలు సరిగా అందుబాటులో ఉండేవి కాదు. కానీ, ప్రస్తుతం సీఎం జగన్ ప్రభుత్వం అమలుచేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ విధానంలో గ్రామాలకు నెలలో రెండుసార్లు ప్రభుత్వ వైద్యులు వెళ్తున్నారు. మంచానికి పరిమితమైన రోగుల ఇళ్లకు వెళ్లి వైద్యం చేస్తున్నారు. ఈ కార్యక్రమం కోసం ఏకంగా 936 ఎంఎంయూ వాహనాలను ప్రభుత్వం కొనుగోలు చేసింది. అంతేకాక.. 105 రకాల మందులు, 14 రకాల వైద్య పరీక్షలు సొంత గ్రామంలో అందిస్తోంది. ఈ లెక్కన పరిశీలిస్తే.. టీడీపీ ప్రభుత్వంలో అమలుచేసిన సంచార వైద్య సేవలు, ప్రస్తుత ఫ్యామిలీ డాక్టర్ విధానానికి మధ్య నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా ఉంది. దీన్ని కప్పిపుచ్చి ప్రభుత్వం చేస్తున్న మంచి నుంచి ప్రజల దృష్టిని మళ్లించేలా రామోజీరావు దురుద్దేశ్యంతో రోత రాతలు రాసుకొచ్చారు.

వచ్చేది సంకీర్ణ ప్రభుత్వమే

- వలసలు, పిల్లల మరణాలపై శ్వేతపత్రం విడుదల చేయాలి
- జగన్ డబ్బు వ్యామోహం గురించి పీఎం వద్ద చెబుదామనుకున్నా
- కానీ, చిన్న తనమనిపించి ఆగిపోయా
- అవనిగడ్డ వారాహి యాత్రలో పవన్‌కళ్యాణ్



పవన్ మాట్లాడుతుండగానే వెళ్లిపోతున్న జనం



అవనిగడ్డ/చిలకలపూడి (మచిలీపట్నం): రాష్ట్రంలో రానున్న ఎన్నికల్లో ఈసారి జనసేన పార్టీ టీడీపీతో కలిసే పోటీచేస్తుందని, వచ్చేది ఈ రెండు పార్టీల సంకీర్ణ ప్రభుత్వమని జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ చెప్పారు. అవకాశం వస్తే సీఎం పదవి స్వీకరించడానికి తాను సిద్ధంగా ఉన్నట్లు ఆయన వెల్లడించారు. రానున్నది కురుక్షేత్ర సంగ్రామమని వైసీపీ అంటోందని.. తాము పాండవులం, వాళ్లు కౌరవులని ఆయనన్నారు. బైబిల్‌లో చెప్పినట్లు.. 14ఏళ్ల డేవిడ్ ఎంతో బలవంతుడైన గొలియాత్‌ని ఒడిసెలతో చంపేశాడని, గొలియాత్ వంటి జగన్‌కు అదే గతి పడుతుందని హెచ్చరించారు. వారాహియాత్ర నాలుగో విడత కార్యక్రమాన్ని కృష్ణాజిల్లా అవనిగడ్డలో పవన్‌కళ్యాణ్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ.. ఏపీ ప్రభుత్వ సర్వేలో బయటపడిన వలసలు, పిల్లల మరణాలపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

సంకీర్ణ ప్రభుత్వం రాగానే మెగా డీఎస్సీ

ఇక అమ్మఒడి, నాన్నఒడి అని గొప్పలు చెప్పుకునే మహానుభావుడు రాష్ట్రంలో 3,88,000 మంది విద్యార్థులు డ్రాపౌట్ అయితే ఏమిచేస్తున్నారని పవన్‌కళ్యాణ్ ప్రశ్నించారు. 2024లో టీడీపీ, జనసేన సంకీర్ణ ప్రభుత్వం వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ చేపడతామని.. అలాగే, తాము అధికారంలోకి వచ్చిన వెంటనే నిరుద్యోగభృతి ఇచ్చేందుకు కృషిచేస్తామన్నారు. సీఎం జగన్ లక్ష కోట్లు సంపాదించుకున్నాడని అంటున్నారని, రూ.18 వేల కోట్లు సంపాదించినట్లు నిరూపణ అయిందని, ఈ వ్యక్తికి ఇంకెంత అవసరమవుతాయని తాను ప్రధానికి చెబుదామని నోటి వరకూ వచ్చినా చిన్నతనమనిపించి ఆగిపోయినట్లు పవన్ చెప్పారు. గతంలో బీజేపీ, టీడీపీతో జతకట్టినపుడు అనుకున్న హామీలు నెరవేర్చనందునే మీ పక్షాన అన్నగా బయటకు వచ్చి నిలబడ్డానని పవన్ గుర్తుచేశారు. అవనిగడ్డ నియోజకవర్గంలో ఒక ట్రక్కు పేరుతో 40 ట్రక్కుల ఇసుక దోచేశారని, దీనివల్ల ఏర్పడిన గోతులు, కోతకు గురవడంవల్ల వాటిలో పడి 76 మంది చనిపోయారని పవన్‌కళ్యాణ్ ఆరోపించారు. ఒక్కడినే ఒంటరి పోరాటం చేశానని, కానీ.. ఒక్కచోట కూడా ప్రజలు తనను గెలిపించలేదని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. తప్పులు జరుగుతుంటే చూస్తూ ఊరుకోబోమని భగత్‌సింగ్, పింగళి వెంకయ్య వారసులమని.. మాతో పెట్టుకుంటే మా దెబ్బేంటో చూపిస్తామని హెచ్చరించారు.

ప్రెస్ గ్యాలరీలోనే టీడీపీ నేత

మరోవైపు.. వారాహిహి వాహనం దగ్గరకు జనసేన నాయకులకు మాత్రమే అనుమతిచ్చారు. దీంతో మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ తనయుడు టీడీపీ పార్లమెంటరీ ఉపాధ్యక్షుడు మండలి వెంకట్రామ్ (రాజా) ప్రెస్ గ్యాలరీలోనే కూర్చున్నారు. మ.3 గంటలకు ప్రారంభం కావాల్సిన సభ, జనం లేకపోవడంవల్ల 6.05కు ప్రారంభమైంది. ఇక పవన్ పసలేని ప్రసంగంతో జనం మధ్యలోనే వెనుతిరిగి వెళ్లిపోవడంతో సభా ప్రాంగణం సగం ఖాళీ అయిపోయింది. సభ అనంతరం రాత్రి బస నిమిత్తం పవన్ మచిలీపట్నం చేరుకున్నారు.

అవినీతి బాబుపైనే పవన్ ప్రేమ

- 2019 ఎన్నికల్లో ఓటమితో పిచ్చిపట్టింది
- అందుకే మతిస్థిమితం లేని మాటలు
- మాది అవనిగడ్డ.. జనసేనానిది ఎర్రగడ్డ
- ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ ధ్వజం



సాక్షి, అమరావతి: అటు కేంద్ర ప్రభుత్వ ఐటీశాఖ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ).. ఇటు రాష్ట్ర ప్రభుత్వ సీఐడీ.. ఎల్లో వైరస్ చంద్రబాబు అవినీతిని వారి ల్యాబ్ టెస్టుల్లో నిర్ధారిస్తున్నా.. ఆ వైరస్ అంటే తనకెంతో ప్రేమ అని, ఆ వైరస్ కోసమే బతుకుతున్నానని అవనిగడ్డలో జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ నిరూపించుకున్నాడని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ ఎద్దేవా చేశారు. కనీసం భీమవరంలో గెలవలేని ఈ వీరుడు సీఎంను ఏకవచనంతో పిలిచి గొప్పవాడిని అయిపోయానని అనుకోవడం కంటే పిచ్చి ఎక్కడైనా ఉంటుందా?.. అన్నారు. అసలు నీ పిచ్చికి మందు ఉందా? అని పవన్‌కళ్యాణ్‌ను ప్రశ్నించారు. అందుకే నీది ఎర్రగడ్డ.. మాది అవనిగడ్డ.. అంటూ పవన్‌పై వ్యంగోక్తులు విసిరారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆ ప్రకటనలో ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ ఇంకా ఏమన్నారంటే..

- చంద్రబాబు అవినీతి చేయలేదు అని చెప్పటానికి న్యాయస్థానాలే సిద్ధంగా లేనప్పుడు పవన్‌కళ్యాణ్ డైలాగులు ఎవరికి కావాలి? అవి ఎవరిని సంతోషపెడతాయి? పవన్‌కళ్యాణ్ తనకు తానే భ్రమల్లో ఉంటూ రెండో ప్రపంచయుద్ధం అంటాడు.. హిట్లర్ అంటాడు.. యాక్సిస్ పవర్స్, ఎలైట్ పవర్స్ అంటాడు. దానికి, ఏపీ రాజకీయానికి ఏమిటి సంబంధం? 2019లో తన ఓటమి, చంద్రబాబు ఓటమి.. ఈ రెండింటి సమయంలో జరిగిన సంఘటనలు బహుశా పవన్‌కళ్యాణ్‌ను పిచ్చివాడిని చేసినట్లు ఉన్నాయి.
- బెంగాల్ విభజన.. లార్డ్ కర్జన్ అంటాడు. అది 2007లో జరిగిందంటాడు. 2007లో బెంగాల్ విభజన ఏమిటి? లార్డ్ కర్జన్ ఏమిటి? ఈ చరిత్ర తెలియని వ్యక్తితో, 1905లో బెంగాల్ విభజన జరిగిందని తెలియని వ్యక్తితో ఇంత భారీ ప్రసంగాలు చేయించడమేమిటి? మతిస్థిమితం లేనివారిని రోడ్లమీద నిలబెట్టి అంతసేపు మాట్లాడించడం ఏమిటి? ఇంతకంటే దురదృష్టం తెలుగు ప్రజలకు ఉంటుందా?
- ఇక ఎవరు అధికారంలో ఉన్నా, ఎప్పుడూ హైదరాబాద్‌లోనే ఉండే ఈ అజ్ఞాతవాసి, అజ్ఞానవాసి.. అసలు ఏపీతో తనకు ఉన్న సంబంధం ఏమిటో ముందు చెప్పాలి. అసలు ఏపీ ఇతని రాష్ట్రం ఎలా అవుతుందో ముందుగా చెప్పాలి. తన కులం ఓట్లని చంద్రబాబుకు వేయించాలి అన్న పన్నాగం తప్ప మరేదీలేని ప్యాకేజీ స్టార్‌ని అసలు ఏపీలోకి ఎందుకు రానివ్వాలో వివరంగా చెప్పాలి. పొద్దున లేస్తే చాలు.. సీఎం వైఎస్ జగన్‌ను చూసి అసూయతో దహించుకుపోయే ఈ మనిషికి రాజకీయాలు, ప్రజాసేవ అనే పదాలకు అర్థం కూడా తెలియదు.
- ఇక తనమీద ఎన్నికేసులైనా పెట్టుకోమన్నాడు. దత్తపుత్రుడికి ఎంత ప్యాకేజీ ఇచ్చారో, ఏదో ఒకరోజున చంద్రబాబు, లోకేశ్ బయటపెడతారు. ఆరోజు తప్పకుండా అతని కోరిక నెరవేరుతుంది. కేసులేం ఖర్మ.. అంతకుమించిన శిక్షలు కూడా ఉంటాయి. బెదిరింపులు, అదిరింపులు పవన్‌కళ్యాణ్ మార్క్ రాజకీయాలు తప్ప, అసలు ప్రజాసేవలో ఉండటానికే అతను అర్హుడు కాదు.

చంద్రబాబుపై అవినీతి మచ్చ చెరిపేసేందుకు టీడీపీ తంటాలు

వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి



సాక్షి ప్రతినిధి, నెల్లూరు: చంద్రబాబు చేసిన అవినీతి సక్రమం.. అరెస్ట్ అక్రమం అన్నట్టుగా టీడీపీ సిద్ధాంతం ఉందని వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి విమర్శించారు. నెల్లూరులోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఆదివారం మీడియాతో మాట్లాడుతూ స్కిల్ డెవలప్‌మెంట్ విషయంలో తప్పు జరిగిన మాట వాస్తవమే గానీ.. అందులో చంద్రబాబు పాత్ర కొంతే అని టీడీపీ నేతలు చెబుతుండటం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్రంలో కొనసాగుతున్న స్కిల్ సెంటర్లు, వాటిలోని పరికరాలన్నీ సీమెన్స్ కంపెనీయే ఏర్పాటు చేసిందని చెప్పడానికి టీడీపీ నేతలు ప్రయత్నించారని పేర్కొన్నారు. కానీ.. కాకుటూరులోని విక్రమ సింహపురి యూనివర్సిటీలోని స్కిల్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన పరికరాలకు, సీమెన్స్ సంస్థకు సంబంధమే లేదని ఆధారాలతో సహా తాము చూపించామని తెలిపారు. గూడూరులోని ఆదిశంకర సంస్థలో ఆరా తీస్తే స్కిల్ సెంటర్ పరికరాలకు సంబంధించి కనీసం ఇన్వాయిస్‌లు కూడా లేవన్నారు. రాష్ట్రంలో 42 స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు ఉంటే వాటిలో సామగ్రి కొనుగోలుకు సంబంధించి ఏ ఒక్క ఇన్వాయిస్ చూపలేని పరిస్థితి ఉందన్నారు. రాష్ట్రంలోని యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామంటూ మోసం చేసిన వ్యక్తి చంద్రబాబు అని, నిరుద్యోగుల కంచాల్లో మెతుకులు తినేసి వారిని ఆకలితో పస్తులు పెట్టారని కాకాణి దుయ్యబట్టారు. తండ్రిని కాపాడాలనే తాపత్రయంతో కొడుకు లోకేశ్ ఢిల్లీ వెళ్లారని, అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ స్కామ్‌లో నిందితుడైన ఆయన కోర్టు నోటీసులు అందుకుని ఏపీకి వస్తున్నారని తెలిపారు. నిజంగా టీడీపీ నేతలకు దమ్ముంటే ఢిల్లీకి వెళ్లి రాష్ట్రపతి భవన్ ఎదుట, ప్రధాని మోదీ ఎదుట, కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఎదుట, ఈడీ, సీబీఐ, ఐటీ కార్యాలయాల ఎదుట కంచాలు మోగించాలన్నారు.

నేడు చంద్రబాబు దీక్ష

- గాంధీ జయంతి సందర్భంగా సెంట్రల్ జైలులో నిరసన
- రాజమహేంద్రవరంలో బాబు సతీమణి భువనేశ్వరి కూడా..
- భువనేశ్వరి బస్సు యాత్రకు ప్లానింగ్



భువనేశ్వరి దీక్ష చేపట్టే ప్రదేశాన్ని పరిశీలిస్తున్న టీడీపీ నేతలు

సాక్షి, రాజమహేంద్రవరం: స్కిల్ స్కామ్ కేసులో రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రిమాండ్ అనుభవిస్తున్న టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు సోమవారం గాంధీ జయంతి సందర్భంగా నిరాహార దీక్ష నిర్వహించనున్నారు. అదే రోజు ఆయన భార్య భువనేశ్వరి సైతం రాజమహేంద్రవరం క్వారీ మార్కెట్ ప్రాంతంలో దీక్ష చేయనున్నారు. 'సత్యమేవ జయతే' పేరిట సోమవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ ఈ దీక్ష చేస్తారు. ఈ విషయాన్ని టీడీపీ నేతలు యనమల రామకృష్ణుడు, ప్రత్తిపాటి పుల్లారావు, గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఆదివారం మీడియా సమావేశంలో వెల్లడించారు. రాజమహేంద్రవరంలోని లోకేశ్ శిబిరంలో చంద్రబాబు భార్య భువనేశ్వరిని ఆదివారం పలువురు నాయకులు కలిసి సంఘీభావం తెలిపారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన రూ.11 లక్షల కోట్ల అప్పు రాబోయే ఎన్నికల్లో వినియోగించుకుని లబ్ధి పొందేందుకేనని ఆరోపించారు. ప్రజాధనంతో ఎన్నికలకు వెళ్లాలని నిర్ణయించుకున్నారన్నారు. ప్రజల డబ్బుతో రాజకీయం చేయడం తగదన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ జీరో స్థాయికి వెళుతుందనే భయంతోనే చంద్రబాబుపై అక్రమ కేసులు పెట్టారని ఆరోపించారు. ప్రజలందరూ కులాలకు అతీతంగా చంద్రబాబు వెంట నడవాలని పిలుపునిచ్చారు. అతి త్వరలోనే జగన్ బాధపడే రోజులు వస్తాయని అన్నారు.

22వ రోజుకు బాబు జైలు జీవితం

స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో 23 రోజుల క్రితం అరెస్టయి రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో జ్యుడిషియల్ రిమాండ్‌లో ఉన్న చంద్రబాబు జైలు జీవితం ఆదివారం 22వ రోజుకు చేరింది. ఆయన జైలు జీవితానికి అలవాటు పడ్డారు. ఉదయం లేవగానే యోగా, వాకింగ్‌తో పాటు న్యూస్ పేపర్లతో కాలక్షేపం చేస్తున్నట్టు సమాచారం. రెగ్యులర్‌గా టీవీ చూస్తున్నారు. ఎప్పటికప్పుడు ఇంటినుంచి తీసుకు వస్తున్న అల్పాహారం, భోజనం చేస్తున్నారు. ప్రతి వారం కుటుంబ సభ్యులతో ములాఖత్ అవుతున్నారు. ఆయన తరఫు న్యాయవాదులు నిత్యం చంద్రబాబును కలుస్తున్నారు. ఈ సందర్భంగా బాబు న్యాయపరమైన విషయాలతోపాటు, రాష్ట్ర రాజకీయాలపై వారిని ఆరా తీస్తున్నట్టు సమాచారం. బెయిల్ ఇంకా రాకపోవడంపై అసహనం వ్యక్తం చేస్తున్నట్టు తెలిసింది.

భువనేశ్వరి బస్సు యాత్ర!

చంద్రబాబు భార్య భువనేశ్వరి ఈ వారంలో బస్సు యాత్ర చేపట్టనున్నట్టు సమాచారం. ఇందుకు పార్టీ నేతలు ముహూర్తం ఫిక్స్ చేశారు. రూట్ మ్యాప్ సిద్ధం చేయడంలో పార్టీ సీనియర్ నేతలు తలమునకలవుతున్నారు. యాత్ర సందర్భంగా అన్ని జిల్లా కేంద్రాల్లోనూ సభలు నిర్వహించనున్నారు. దీనికి 'మేలుకో తెలుగోడా' అనే పేరు ఖరారు చేసినట్టు సమాచారం.

సిట్టింగ్ జడ్జితో విచారణకు సిద్ధమా?

నారా లోకేశ్‌కు మాజీ మంత్రి పేర్ని నాని సవాల్

- మీ బాబు అన్నం తిని కాదు.. స్టేలు తెచ్చుకుని బతుకుతోంది వాస్తవం కాదా?
- ఆ కేసుల్లో విచారణ జరిగితే యావజ్జీవ శిక్ష పడటం ఖాయం
- విచారణకు సిద్ధంగా లేకుంటే నొక్కేసిన ప్రజాధనాన్ని ప్రభుత్వ ఖజానాలో జమ చేయండి
- చేసిన తప్పులకు ఇప్పటికైనా ప్రాయశ్చిత్తం చేసుకోండి

సాక్షి, అమరావతి: చంద్రబాబు అవినీతిపై సిట్టింగ్ జడ్జితో విచారణకు ఆయన తనయుడు నారా లోకేశ్ సిద్ధమా అని మాజీ మంత్రి పేర్ని నాని సవాల్ విసిరారు. చంద్రబాబు అన్నం తిని కాకుండా.. స్టేలు తెచ్చుకుని బతుకుతోంది వాస్తవం కాదా అని నిలదీశారు. అవినీతి కేసుల్లో విచారణ జరిగితే ఆయనకు యావజ్జీవ కారాగార శిక్ష పడటం ఖాయమన్నారు. విచారణకు సిద్ధంగా లేకుంటే నొక్కేసిన ప్రజాధనాన్ని ప్రభుత్వ ఖజానాకు జమ చేయాలని సూచించారు. ఇప్పటికైనా చేసిన తప్పులకు ప్రాయశ్చిత్తం చేసుకోవాలన్నారు. చంద్రబాబు జైలుకెళ్లడం పట్ల ఆయన కుటుంబ సభ్యులకే కాకుండా.. ఆ పార్టీ నేతలు, కార్యకర్తల్లో ఎవరికీ కించిత్ బాధ కూడా లేదని చెప్పారు. చంద్రబాబును జైలుకు పంపడాన్ని నిరసిస్తూ టీడీపీ చేపట్టిన కార్యక్రమంలో ఆయన కుటుంబ సభ్యులే ఆనందంతో డోలు కొట్టి డమరుకం వాయించారని గుర్తు చేశారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం పేర్ని నాని మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు అవినీతికి పాల్పడ్డాడని ప్రజలే కాదు.. టీడీపీ కార్యకర్తలు కూడా విశ్వసిస్తున్నారన్నారు.



ఆత్మావలోకనం చేసుకోకుండా గగ్గోలు ఏంటి?

ఇప్పటికైనా ఆత్మావలోకనం చేసుకోకుండా చంద్రబాబుపై అక్రమ కేసులు పెడుతున్నారని నారా లోకేశ్‌తోపాటు టీడీపీ నేతలు కొందరు తెగ గగ్గోలు పెడుతున్నారని పేర్ని నాని మండిపడ్డారు. బాబు ఏ దోపిడీ చేయకపోతే న్యాయస్థానాలు ఎందుకు ఉపశమనం కల్పించలేదో చంటి పిల్లలకు కూడా అర్థమవుతోందన్నారు. కానీ మీకెందుకు తెలియడంలేదని టీడీపీ నేతలకు చురకలంటించారు. బాబు అవినీతిపరుడు కాదు సచ్ఛీలుడని ఆయన కుటుంబం నమ్మితే 1995లో ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు ఆస్తులపై సిట్టింగ్ జడ్జితో విచారణకు సిద్ధమా అని సవాల్ విసిరారు. 'మీ బాబుపై 1997లో రెడ్యానాయక్ హైకోర్టులో కేసు వేస్తే స్టే తెచ్చుకున్నారు. 1998లో వైఎస్సార్ హైకోర్టులో దావా వేస్తే స్టే. 1999లో షబ్బీర్ అలీ, 1999లో డీఎల్ రవీంద్రారెడ్డి వేసిన దావాల్లో స్టే. 1999, 2000, 2001ల్లో వైఎస్సార్ తిరిగి పిటిషన్లు వేస్తే స్టే. 2003లో కృష్ణకుమార్ గౌడ్ కేసు వేస్తే స్టే. 2003లో పాపపు సొమ్ముతో చంద్రబాబు హెరిటేజ్ పెట్టాడని కన్నా లక్ష్మీనారాయణ దావా వేస్తే స్టే. 2004లో కన్నా మళ్లీ కేసు వేస్తే స్టే. 2004లో పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి చంద్రబాబుపై అక్రమాస్తులు, భూదోపిడీకి సంబంధించి రెండు పిటిషన్లు వేశారు. వీటిలోనూ స్టేలు తెచ్చుకున్నారు. 2005లో లోకేశ్ అమ్మమ్మ, చంద్రబాబు అత్తగారైన లక్ష్మీపార్వతి హైకోర్టులో అక్రమాస్తులపై కేసు వేస్తే స్టే. 2005లో శ్రీహరి, అశోక్ అనే ఇద్దరు ఏపీ పౌరులు కేసు వేస్తే స్టే. 2011లో బి.ఎల్లారెడ్డి అనే వ్యక్తి చంద్రబాబుపై కేసు వేస్తే స్టే. విచారణలు జరగకుండా ఈ స్టేల బాగోతం ఎందుకు?' అంటూ లోకేశ్‌ను నిలదీశారు. ఈ కేసులపై విచారణ జరిగితే మీ బాబుకు యావజ్జీవ కారాగార శిక్ష తప్పదని తెలిసి స్టేలు తెచ్చుకున్నారని ధ్వజమెత్తారు. 'ఎన్ని కన్నీళ్ల ఉసురిదీ..వెంటాడుతున్నది నీడల్లే ఖర్మ.. ధర్మం నీ పాలి దండనై దండించ..తప్పించుకోలేదు ఖర్మ'' ఈ గేయం చంద్రబాబుకు సరిగ్గా సరిపోతుందన్నారు.

జూబ్లీహిల్స్ కొంప ఎవరు కట్టారు లోకేశ్?

హైదరాబాద్‌లో జూబ్లీహిల్స్, మాదాపూర్ ఇళ్లు, ఎన్టీఆర్ ట్రస్టు భవనం, ఉండవల్లి కరకట్ట ఇల్లు, మంగళగిరిలో పార్టీ కొంపలు ఎవరు కట్టారో చెప్పాలని లోకేశ్‌ను పేర్ని నాని నిలదీశారు. కరకట్ట నివాసం ప్రభుత్వానిదని చంద్రబాబే చెప్పారు. మరి ఓడిపోగానే ప్రభుత్వానికి ఎందుకు అప్పగించలేదని ప్రశ్నించారు. కాపులు రిజర్వేషన్ల కోసం, ప్రత్యేక హోదా కోసం ప్రజలు రోడ్లెక్కితే తన పాలనలో చంద్రబాబు వాళ్లను అరెస్టు చేయించారని మండిపడ్డారు. జనం సొమ్ము దోచుకున్నాడని బాబును అరెస్టు చేస్తే మాత్రం గంటలు మోగించాలా అని నిలదీశారు. పవన్ కళ్యాణ్ లక్ష్యం చంద్రబాబును సీఎంను చేయడమేనన్నారు. 2019లో ఇదే పవన్.. చంద్రబాబు వెధవ, లుచ్చా అని, ప్రజల డబ్బు దోచేశాడని ప్రచారం చేశారని గుర్తుచేశారు. కాపులు ఎక్కువగా ఉన్న నియోజకవర్గాల్లోనే పవన్ పర్యటిస్తున్నారని.. వారిని తాకట్టు పెడతావని కాపులకు తెలియదనుకుంటున్నావా అని మండిపడ్డారు. చంద్రబాబు అరెస్టును హరీశ్‌రావు ఖండిస్తూ మాట్లాడుతున్నారని.. చంద్రబాబు చేతిలో ఎన్టీఆర్‌కి అయినట్టే, హరీశ్ చేతిలో కేసీఆర్‌కు కూడా కావొచ్చన్నారు.



బలహీనులు ఎప్పటికీ క్షమించలేరు.
క్షమాగుణం బలవంతుల లక్షణం.
– మహాత్మా గాంధీ

సాక్షి
సోమవారం, 2 అక్టోబర్ 2023

మనుషులు చేజారుతారు

'హమ్ తుమ్ ఏక్ కమరే మే బంద్ హో'.... భారత సినీ ప్రేక్షకుల్ని ఉర్రూతలూపిన 'బాబీ' మొన్నటి సెప్టెంబర్ 28కి యాభై ఏళ్లు పూర్తి చేసుకుంది. ఇవాళ్టికీ దేశంలోని అన్ని భాషల్లో ఏదైనా టీనేజ్ ప్రేమకథ తీస్తూంటే గనక అది ఏదో ఒక మేరకు 'బాబీ'కి కాపీ. ఆ సినిమా ఇచ్చిన ఫార్ములాతో వందలాది కథలు వచ్చాయి. వస్తాయి. 'మేరా నామ్ జోకర్' తీసి నిండా మునిగిన రాజ్‌కపూర్‌ను కుబేరుణ్ణి చేసిన సినిమా అది. ఆ సంపద వచ్చిన సందర్భంలోనే రాజ్‌కపూర్ ఒక మనిషిని చేజార్చుకున్నాడు. తెలిశా.. తెలియకనా?

'బాబీ'ని కనీస ఖర్చుతో తీద్దామనుకున్నాడు రాజ్‌కపూర్. హీరో తన కొడుకే రిషికపూర్. హీరోయిన్ కొత్తమ్మాయి డింపుల్ కపాడియా. ముఖ్య పాత్రలు ప్రేమ్‌నాథ్, ప్రేమ్‌చోప్రా భార్య తరపు బంధువులు. లక్ష్మీకాంత్– ప్యారేలాల్ ఇంకా కెరీర్ ప్రారంభంలో ఉండి రాజ్‌కపూర్‌తో మొదటి సినిమా చేయడమే వరం అనుకునే రకం. ఖర్చేముంది? ఒక్కటి ఉంది... ప్రాణ్ రెమ్యూనరేషన్. ఆ రోజుల్లో ప్రాణ్ సినిమాకు రెండు, మూడు లక్షలు తీసుకుంటున్నాడు. రాజ్‌కపూర్‌తో అప్పటికి నలభై ఏళ్లుగా ప్రాణస్నేహం. 'ఒక్కరూపాయి తీసుకొని చేస్తా. సినిమా ఆడితే ఇవ్వు. ఆడకపోతే మర్చిపో' అన్నాడు ప్రాణ్. అన్నమాట ప్రకారం ఒక్క రూపాయికే చేశాడు. సినిమా రిలీజ్ అయ్యింది. ఇరవై పాతిక లక్షలు పెట్టి తీస్తే దేశంలో, బయట కలిపి 30 కోట్లు వచ్చాయి. నేటి లెక్కల ప్రకారం 1200 కోట్లు! రాజ్‌కపూర్ ప్రాణ్‌ని పిలిచి మంచి పార్టీ ఇస్తే బాగుండేది. థ్యాంక్స్ చెప్పి అడిగినంత ఇచ్చి ఉంటే బాగుండేది. ఇవ్వకపోయినా బాగుండేది. కాని రాజ్‌కపూర్ లక్ష రూపాయల చెక్ పంపాడు. లక్ష? తను అడగలేదే? పోనీ తాను అందరి దగ్గరా తీసుకునేంత కూడా కాదే. ప్రాణ్ ఆ చెక్ వెనక్కు పంపాడు. మళ్లీ జీవితంలో రాజ్‌కపూర్‌ని కలవలేదు. జారిపోయాడు.

'షోలే' రిలీజ్ అయితే మొదటి రెండు వారాలు ఫ్లాప్‌టాక్. రాసిన సలీమ్–జావేద్ ఆందోళన చెందారు. ఫ్లాప్ కావడానికి స్క్రిప్ట్ కారణమనే చెడ్డపేరు ఎక్కడ వస్తుందోనని బెంబేలెత్తారు. మాటల్లో మాటగా దర్శకుడు రమేష్ సిప్పీతో 'గబ్బర్‌సింగ్ వేషం వేసిన అంజాద్‌ఖాన్ వల్లే సినిమా పోయింది. అతడు ఆనలేదు' అన్నారు. అప్పటికే తన తొలి సినిమాకు ఇలాంటి టాక్ రావడం ఏమిటా అని చాలా వర్రీగా ఉన్న అంజాద్‌ఖాన్ బ్లేమ్ గేమ్‌లో తనను బలి చేయబోతున్నారని తెలిసి హతాశుడయ్యాడు. తీవ్రంగా కలత చెందాడు. కాని సినిమా కోలుకుంది. ఎలా? అలాంటి కలెక్షన్లు ఇప్పటికీ లేవు. అతి గొప్ప విలన్‌గా అంజాద్‌ఖాన్ ఎన్నో సినిమాలు చేశారు. కాని ఒకనాటి మిత్రులైన సలీమ్–జావేద్ రాసిన ఏ స్క్రిప్ట్‌లోనూ మళ్లీ యాక్ట్ చేయలేదు. చేజారిపోయాడు.

దాసరి నారాయణరావు తొలి రోజుల్లో నటుడు నాగభూషణాన్ని ఎంతో నమ్ముకున్నాడు. అభిమానించాడు. నాగభూషణం దాసరికి దర్శకుణ్ణి చేస్తానని చెప్పి చాలా పని చేయించుకున్నాడు. చివరి నిమిషంలో వేరొకరిని పెట్టుకున్నాడు. దాసరి ఆ తర్వాత పెద్ద దర్శకుడయ్యి 150 సినిమాలు చేశాడు. వందల పాత్రలు రాశాడు. కాని దాసరి కలం నుంచి ఒక్క పాత్ర కూడా నాగభూషణం కోసం సృజించబడలేదు. దాసరి సినిమాల్లో నాగభూషణం ఎప్పుడూ లేడు.

రామానాయుడు అవకాశం ఇస్తే ఎంతో కష్టం మీద 'ప్రేమఖైదీ' సినిమాకు దర్శకత్వం వహించాడు ఇ.వి.వి.సత్యనారాయణ. అప్పటికి అతని మొదటి సినిమా ఫ్లాప్. ఈ సినిమా కూడా పోతే భవిష్యత్తు లేదు. ఫస్ట్ కాపీ చూసిన పరుచూరి బ్రదర్స్ ఏ మూడ్‌లో ఉన్నారో 'మా స్క్రిప్ట్‌ను చెడగొట్టినట్టున్నాడే' అనే అర్థంలో రామానాయుడు దగ్గర హడావిడి చేశారు. వారు స్టార్‌రైటర్స్. వారి మాట మీద రామానాయుడుకు గురి. ఇ.వి.వి హడలిపోయాడు. స్క్రిప్ట్‌ను తన బుర్రతో ఆలోచించి మెరుగుపెట్టి తీస్తే ఇలా అంటారేమిటి అని సిగరెట్లు తెగ కాల్చాడు. సినిమాను మూలపడేస్తే ఇంతే సంగతులే అని కుంగిపోయాడు. కాని సినిమా రిలీజయ్యి సూపర్ హిట్ అయ్యింది. ఆ తర్వాత 51 సినిమాలు తీశాడు ఇ.వి.వి. ఒక్కదానికీ గురు సమానులైన పరుచూరి సోదరుల స్క్రిప్ట్ వాడాలనుకోలేదు.

బాగా చనువుగా, ఆత్మీయంగా ఉండే మనుషుల పట్ల కొందరికి హఠాత్తుగా చిన్నచూపు వస్తుంది. ఆ.. ఏముందిలే అనుకోబుద్ధవుతుంది. వారితో మనం ఎలా వ్యవహరించినా చెల్లుబాటవుతుందిలే అనిపిస్తుంది. వారితో చెప్పకుండా ఫలానా పని చేద్దాం... శుభలేఖ ఆఖరున పంపుదాం... కష్టంలో ఉన్నారని తెలిసినా చూసీ చూడనట్టు ఉందాం... ఇచ్చిన మాటను తేలిగ్గా తీసుకుందాం... వారి వీపు మీద విస్తరి పరిచి భోం చేద్దాం... అనుకుంటే ఆ క్షణంలో ఆ సదరు వారు మనం చెప్పింది విన్నట్టుగా కనపడతారు. నవ్వుతున్నట్టే ఉంటారు. కాని వారి లోపల మనసు చిట్లుతున్న చప్పుడు మన చెవిన పడకుండా జాగ్రత్త పడతారు. ఆ తర్వాత వారు మనకు కనిపించరు. జారిపోతారు. చేజారిపోతారు.

మనుషులు చేజారితే ఏమవుతుంది? వారితో మాత్రమే సాధ్యమయ్యే జీవన సందర్భాలన్నీ నాశనమవుతాయి. వారితో నిర్మించుకున్న గతం తుడిచిపెట్టుకుపోతుంది. వారితో వీలైన భవిష్యత్తు నష్టమవుతుంది. ఉంటే బాగుండు అనుకునే క్షణాల్లో వారు ఉండరు. డబ్బు, దస్కం, పలుకుబడి, క్షమాపణ ఏదీ వారిని మళ్లీ వెనక్కు తీసుకురాదు.

హాయ్, హలో బాపతు సవాలక్ష దొరుకుతారు. ఈ నిజమైన ఆత్మీయులను కాపాడుకుంటున్నారా? అసలు మీరెంత మందిని చేజార్చుకున్నారో ఎప్పుడైనా లెక్క చూసుకున్నారా?

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు భాద్రపద మాసం, **తిథి:** బ.పాడ్యమి ప.2.03 వరకు, తదుపరి విదియ, **నక్షత్రం:** రేవతి రా.12.07 వరకు, తదుపరి అశ్విని, **వర్జ్యం:** ప.12.44 నుండి 2.14 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.5.53 నుండి 7.29 వరకు, **అమృతఘడియలు:** రా.9.49 నుండి 12.21 వరకు

సూర్యోదయం: 5.53
సూర్యాస్తమయం: 5.51
రాహుకాలం: ఉ.9.00 నుండి 10.30 వరకు
యమగండం: ప.1.30 నుండి 3.00 వరకు

భారత్ తప్పించుకోగలదా?

కామెంట్



కరణ్ థాపర్

ఖలిస్థానీ సానుభూతిపరుడు, నిషేధిత 'ఖలిస్థాన్ టైగర్ ఫోర్స్' నేత హర్‌దీప్ సింగ్ నిజ్జర్ హత్య వెనుక భారత్ హస్తం ఉందని కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో చేసిన ఆరోపణ అత్యంత వివాదాస్పదం అయింది. ఈ ఏడాది జూన్‌లో కెనడాలోని బ్రిటిష్ కొలంబియా సర్రే ప్రాంతంలోని ఓ గురుద్వారా సాహిబ్ ప్రాంగణంలో గుర్తు తెలియని వ్యక్తులు నిజ్జర్‌ని కాల్చి చంపిన నేపథ్యంలో... భారత్‌లో మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాదుల జాబితాలో ఉన్న నిజ్జర్ హత్య వెనుక భారత ఏజెంట్ల హస్తం ఉండొచ్చనేందుకు 'విశ్వసనీయమైన ఆరోపణలు' ఉన్నాయని ట్రూడో గత నెలలో తమ పార్లమెంటులో ప్రకటించారు. దరిమిలా ఇరుదేశాల మధ్య దౌత్య సంబంధాలు క్రమంగా దెబ్బతింటూ వచ్చాయి. ఈ పరిణామాలను అమెరికాపై దృష్టిని కేంద్రీకరించి చూడవలసిన అవసరం ఉంది. ఎందుకంటే ఆ దేశ స్పందన మనకు అత్యంత కీలకం కాబట్టి!

జస్టిన్ ట్రూడో (కెనడా ప్రధానమంత్రి) ఆరోపణలపై మన ప్రభుత్వ ప్రతిస్పందనను నేను విశ్వసిస్తున్నప్పటికీ, ఒక జర్నలిస్టుగా కొన్ని ప్రత్యేకమైన వాస్తవాలను కూడా మన మది పరిగణనలోకి తీసుకోవాలేమోనని నా ఆలోచన. అయితే ఆ వాస్తవాలు అవసరమైనంత మేరకైనా నివేదనకు వచ్చాయని నేను అనుకోవడం లేదు. కొన్నిసార్లు అవి ఉద్దేశపూర్వకమైన విస్మరణకు కూడా గురయ్యాయి. అందువల్ల వాటిని మీ దృష్టికి తీసుకురావడం నా కర్తవ్యంగా భావిస్తూ, ముగింపును మాత్రం మీకే వదిలేస్తున్నాను. నా వ్యక్తిగత అభిప్రాయంతో మిమ్మల్ని ప్రభావితం చేయడం నాకు ఇష్టం లేదు.



మొదటిది– ఢిల్లీలో జరిగిన జీ–20 సదస్సులో అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ భారత ప్రధాని నరేంద్ర మోదీని కలిసినప్పుడు ఈ ఆరోపణలను లేవనెత్తి ''ఆందోళన వ్యక్తం చేసినట్లు'' 'ఫైనాన్షియల్ టైమ్స్' రాసింది. యూఎస్‌ఏ జాతీయ భద్రతా సలహాదారు జేక్ సల్లివాన్ ''అత్యున్నత స్థాయుల్లో ఈ అంశంపై చర్చ జరిగింది,'' అని చెప్పినప్పుడే ఆయన ఈ ''ఆందోళన వ్యక్తం అవడాన్ని'' ధ్రువీకరించి ఉండొచ్చు. భారత్‌పై కెనడా చేసిన ఈ ఆరోపణలను బైడెన్ ఎలా చూస్తున్నారన్న విషయమై ఇది మనకు ఏం చెబుతోంది?

గట్టి సాక్ష్యాలు ఉన్నాయా?

రెండవది– కెనడాలోని అమెరికన్ రాయబారి ఒకటీ లేదా అంతకన్నా ఎక్కువ 'పంచనేత్ర నిఘా కూటమి దేశాలు' (ఫైవ్–ఐస్ కంట్రీస్: యూఎస్, యూకే, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, కెనడా) రహస్య సమాచారాన్ని అట్టావా (కెనడా రాజధాని)తో పంచుకున్నట్లు రూఢి పరిచారు. వాటిలో ఒక దేశం యూఎస్‌ఏ అని 'న్యూయార్క్ టైమ్స్' వెల్లడించింది. ఆ పత్రిక ఇంకా ఇలా రాసింది: ''చూస్తుంటే కెనడా దగ్గర 'పొగలు గక్కే తుపాకీ' (వివాదానికి తావులేని సాక్ష్యం) ఉన్నట్టు కనబడుతోంది. ఆ దేశంలోని భారతీయ దౌత్యవేత్తల సమాచార వ్యవస్థలోకి చొరబడటం అన్నది పన్నాగంలో (వారికి) ప్రమేయం ఉందన్న సంకేతాలను ఇస్తోంది.'' ఈ చొరబాట్లు ఏం చెబుతున్నాయి? అవి నిజంగానే పొగలు గక్కుతున్న తుపాకీతో సమానమైనవా?

మూడవది – ఆరంభంలో జేక్ సల్లివాన్, ఆ మర్నాడు యూఎస్ విదేశాంగ కార్యదర్శి ఆంటోనీ బ్లింకెన్: ''మేమే మా కెనడియన్ సహోద్యోగులతో చాలా దగ్గరగా సంప్రదింపులు జరుపుతున్నాం. కేవలం సంప్రదింపులు మాత్రమే కాదు, ఈ అంశంపై వారితో సమన్వయం చేసుకుంటున్నాం'' అని ప్రకటించారు. అంటే ఏమిటి? కెనడా దగ్గర ఉన్న సమాచారం ఎలాంటిదో మాత్రమే కాదు, అందులోని నాణ్యత ఎంతటిదో కూడా వాషింగ్టన్‌కు అవగాహన ఉందని ఇది సూచిస్తోందా?

నాల్గవది – ఇంకా స్పష్టంగా చెప్పాలంటే బ్లింకెన్, ''ఈ పరిశోధనలో కెనడాతో కలిసి ఇండియా పని చేయడం చాలా ముఖ్యం. దీనికి బాధ్యులెవరో చూడాలనుకుంటున్నాం. దర్యాప్తు దానికై అదే జరిగి, ఫలితం వైపునకు దారి తీయాలి'' అన్నారు. ఆయన అలా అన్నది ఒక పత్రికా సమావేశంలో అయినప్పటికీ అది న్యూఢిల్లీకి ఒక సందేశం అనుకోవాలా?

ఐదవది – ''ఇలాంటి చర్యలకు మీకు కొన్ని ప్రత్యేకమైన మినహాయింపులేమీ ఉండవు. దేశంతో నిమిత్తం లేకుండా మేము గట్టిగా నిలబడి, మా ప్రాథమిక సూత్రాలను కాపాడుకుంటాం'' అని సల్లివాన్ అనడం చూస్తుంటే, దానిని మనం ఎలా అర్థం చేసుకోవాలి?

ఎవరిది అబద్ధం?

ఆరవది–కెనడా జాతీయ భద్రతా సలహాదారు జోడీ థామస్... కెనడా ఇంటెలిజెన్స్ సర్వీసెస్ హెడ్‌తో కలిసి ఆగస్టులో నాలుగు రోజులు, సెప్టెంబరులో ఐదు లేదా ఆరు రోజులు ఢిల్లీలో ఉండి, భారత నిఘా సంస్థలకు సమాచారం అందించినట్లు కెనడియన్ బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్ వెల్లడించింది. అయితే భారత ప్రతినిధి మాత్రం... 'కెనడా అప్పుడు గానీ, ఇప్పుడుగానీ, ఎప్పుడూ గానీ తమతో ఎటువంటి నిర్దిష్ట సమాచారాన్ని పంచుకోలేదు'' అని పేర్కొన్నారు. మరి అలాంటి సమాచారం ఏదీ లేకుంటే జోడీ థామస్ భారత దేశంలో పది రోజుల పాటు ఎందుకు గడిపినట్లు?

ఏడవది– మన భారత ప్రతినిధి అరిందమ్ బాగ్చి కెనడాను... ''ఉగ్రవాదులకు, తీవ్రవాదులకు, వ్యవస్థీకృత నేరాలకు సురక్షితమైన స్వర్గధామం'' అని పేర్కొన్నారు. ఆ మాటలు సాధారణంగా పాకిస్తాన్‌ను ఉద్దేశించి వాడుతుంటారు. అలాంటిది తమ నాటో మిత్రపక్షం, జీ–7 సభ్య దేశం, మరీ ముఖ్యంగా సన్నిహిత, సాంస్కృతిక పరిచయాలు కలిగిన తమ పొరుగు దేశం అయిన కెనడా గురించి ఇండియా అలా అనడాన్ని అమెరికా ఎలా చూస్తుంది?

అమెరికా వైఖరి కీలకం

ఎనిమిదవది– అట్లాంటిక్‌కు ఇరు వైపులా ఉన్న అనేక ఆంగ్ల భాషా వార్తాపత్రికలు భారతదేశం ఇలా ఎలా మారిందీ అని ప్రశ్నల్ని లేవదీశాయి. ఉదాహరణకు, 'ది అబ్జర్వర్' పత్రిక ''స్వదేశంలో, విదేశాలలో మోదీ ప్రభుత్వ విధానం ప్రజా స్వామ్యం పట్ల ఆ దేశ నిబద్ధత, భాగస్వామ్య దేశంగా తన విశ్వసనీయతల పైన సందేహాలను లేవనెత్తుతోంది'' అని రాసింది. 'న్యూయార్క్ టైమ్స్' కాలమిస్ట్ నికోలస్ క్రిస్టోఫ్ పాకిస్తాన్ పాలకుడు జనరల్ జియాతో మోదీని పోల్చారు. 'ది ఎకనామిస్ట్' నిర్మొహమాటంగా ''ఇది కఠిన నిర్ణయాలు తీసుకోవలసిన సమయం'' అని పేర్కొంది. మన దేశం గురించి ఇలాంటి వ్యాఖ్యలన్నిటికీ మనం ఎలా స్పందించాలి?

చివరిగా– ఒక అధికారిక ప్రకటనలో భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ట్రూడో ఆరోపణలను ''పూర్తిగా తిరస్కరించింది''. వాటిని ''అసంబద్ధము, ప్రేరణపూరితమూ అయినవి''గా పేర్కొంది. బైడెన్ గురించి మనకు తెలిసిన దానిని బట్టి... అలాగే సల్లివాన్, బ్లింకెన్‌ల ప్రకటనలను బట్టి చూస్తే అమెరికా ఈ ప్రతిస్పందనను అంగీకరిస్తుందని అనుకోవచ్చా?

ఇప్పుడు నేను అమెరికా పైననే నా దృష్టిని కేంద్రీకరించాను. ఎందుకంటే ఆ దేశ ప్రతిస్పందన చాలా ముఖ్యమైనది. భారత్ కేవలం ఆరోపణలను మాత్రమే ఎదుర్కొంటుండగా, బ్లింకెన్ అంటున్న 'అంతర్జాతీయ అణచివేత'లో దోషి కచ్చితంగా అమెరికానే అని నాకు తెలుసు. అయినప్పటికీ అమెరికా దీని నుంచి పదే పదే తప్పించుకుంటూ వచ్చింది. భారత్ కూడా అలా తనపై వచ్చిన ఆరోపణల నుంచి తప్పించుకోగల స్థితిలో ఉందా?

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

మైండ్‌సెట్ మారాలి!



ప్రారంభం నుంచీ ఇస్లాం పేరు మీదుగా ముస్లింలను ముస్లింలే చంపుకుంటూ వస్తున్నారు. అయినప్పటికీ (సుమారు 60 మంది ప్రాణాలు తీసిన) మస్తుంగ్ బాంబు పేలుళ్లు సహా ముస్లింలు అలాంటి తీవ్రవాద చర్యలకు పాల్పడరనే దగ్గరే పాకిస్తానీ మేధావులు ఆగిపోయారు. పాకిస్తాన్ రాజ్య ప్రాయోజిత మదరసాల్లోని బోధనలే అలాంటి జిహాదీ తీవ్రవాదానికి ఆజ్యం పోస్తున్నాయని మనం అంగీకరించేంత వరకూ మార్పు రాదు.

– తాహా సిద్ధిఖి, పాకిస్తాన్ జర్నలిస్ట్

పారని పాచిక



ఎన్నికల్లో పెద్ద ప్రభావం ఉండదని తెలిసినా మోదీ మహిళా రిజర్వేషన్ బిల్లు తెచ్చారనీ, ఆయన సంస్కర్త అనీ చెప్పేవాళ్లు దయచేసి మోదీ అలా అనుకోవడం లేదని గమనించండి. ఐదు రాష్ట్రాల ఎన్నికల ర్యాలీల్లో దాన్ని తరచుగా ప్రస్తావిస్తున్నారు. మహిళల ఓట్ల కోసం ఆ బిల్లును తేవాలన్న ఆలోచన ఆయనకు ఉంది. కాకపోతే ఆయన ఎక్కడ పొరబడ్డారంటే, ఆ అంశం మీద ఓట్లు వేసే మహిళలు స్వల్పం.

– శాశ్వతీ సర్కార్, ప్రొఫెసర్

ఏది ప్రాధాన్యం?



బీజేపీ అధికారంలోకి వచ్చాక దేవుళ్లు, నాయకుల స్మారకంగా నూరు అడుగుల కంటే ఎత్తయిన 15 కంటే ఎక్కువ విగ్రహాలు పూర్తయినాయి. వీటిల్లో చాలావాటికి రూ. 2 వేల కోట్ల కంటే ఎక్కువ ఖర్చయింది. ఇంకా డజన్ల కొద్దీ తయారీలో ఉన్నాయి. ఇదే సొమ్ముతో వారి గౌరవంగా ఆసుపత్రులు నిర్మిస్తే సముచితంగా ఉండదా?

– థామస్ ఐజాక్, సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు

చూసి నేర్చుకోండి!



శ్రీలంకలో చిన్న ట్రిప్ ముగించు కుని వచ్చాను. అసలు రాజధాని కొలంబో నుంచి మొదలుపెట్టి చిన్న గ్రామాల వరకు అన్ని ప్రాంతాలు ఎంత నీటుగా ఉన్నాయో ఆశ్చర్యం వేసింది. జనాలకు సివిక్ సెన్స్ అపారం. ముంబయి లాగే వేడీ, వర్షాలున్నాయి. అయినా తారు (కాంక్రీట్ కాదు) రోడ్లు చక్కగా ఉన్నాయి. రోడ్లు వేయడం, నిర్వహించడాన్ని మన మున్సిపల్ కార్పొరేషన్లు లంకేయులకు ఔట్‌సోర్సింగ్ ఇవ్వడం మేలు.

– అతుల్ కస్బేకర్, ఫొటోగ్రాఫర్

తక్షణ న్యాయం



పదేళ్లుగా నా స్నేహితురాలు చట్టబద్ధంగా అన్ని విధాలుగా ప్రయత్నించింది. అయినప్పటికీ ఆమె గ్రీన్ కార్డ్ (యూఎస్‌లో శాశ్వత నివాసితులకు ఇచ్చే కార్డు) ఇంకా పునర్విచారణలోనే ఉంది. దీనికి బదులుగా ఆమెను మెక్సికో వెళ్లి నదిని ఈదుకుంటూ రమ్మని సలహా ఇస్తాను. తక్షణం లీగల్ స్టేటస్ వచ్చేస్తుంది.

– మయీ మస్క్, రచయిత్రి

తెలుసుకుని తాగండి



పూర్తిగా తాగకూడని పానీయాలు: చక్కెరతో తీపి చేసిన డ్రింకులు (సాఫ్ట్ డ్రింక్స్), ప్యాకేజ్డ్ పళ్ల రసాలు, మద్యం. చూసుకుని తాగాల్సినవి: తాజా పళ్ల రసం (పళ్లు తినడం ఇంకా నయం), డైట్ సాఫ్ట్ డ్రింక్స్. సురక్షితం: నీళ్లు, కొబ్బరి నీళ్లు, టీ (గ్రీన్ టీ, బ్లాక్ టీ సహా), కాఫీ (బ్లాక్ కాఫీ సహా), నిమ్మకాయ నీళ్లు.

– సుధీర్ కుమార్, న్యూరాలజిస్ట్

ఇన్ బాక్స్

మహాత్ముడి అవసరం పెరిగింది

గాంధీజీ ఆలోచనలు, భావాలు, సిద్ధాంతాలు ఎందరికో స్ఫూర్తిగా నిలిచాయి. తన సిద్ధాంత బలంతో రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యాన్ని ఓడించి దేశానికి స్వాతంత్ర్యాన్ని తెచ్చారు. ఆయన పోరాట పంథా వినూత్నమైనది. అహింస అనే ఆయుధంతో, సహాయ నిరాకరణ, సత్యాగ్రహం వంటి పోరాట రూపాలతో ఆయన యుద్ధం చేశారు. 'క్విట్ ఇండియా' ఉద్యమంలో గాంధీ ఇచ్చిన నినాదం 'డూ ఆర్ డై' ఎందరినో ఉత్తేజితులను చేసింది. 'విజయమో, వీర స్వర్గమో' అనే నినాదంతో



యావత్ దేశ ప్రజలు ముందుకురికి భారత గడ్డ మీద నుంచి బ్రిటిష్ వారిని తరిమేశారు. మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. స్వాతంత్ర్యం సిద్ధించి సంవత్సరం తిరగకుండానే 1948 జనవరి 30న ఆయన హత్యకు గురై దేశాన్ని శోకసంద్రంలో ముంచారు. ఆయన ఘనత ప్రపంచ మంతా గుర్తించింది. అయితే భారతదేశంలో ఆయన్ని మెల్లగా మరచిపోతున్న ధోరణి కనిపించడం బాధాకరం. గాంధీజీ జయంతి సందర్భంగా ఆయన ఆశయాలు, సిద్ధాంతాలను మరోసారి గుర్తు చేసుకోవలసిన అవసరం ఉంది. 'అర్ధరాత్రి ఒంటరిగా ఆడవాళ్లు ఎప్పుడైతే క్షేమంగా వెళతారో ఆరోజే నా దేశానికి నిజమైన స్వాతంత్ర్యం' అని ప్రకటించారు గాంధీ.

గాంధీ సహించనివి– మగువలపై అత్యాచారాలు, చిన్నారులపై లైంగిక వేధింపులు, హత్యలు, కక్షలు, వైషమ్యాలు. కానీ ఇవే ఎక్కువైన ఈ సమాజంలో ఆయన ఆదర్శం గాలికి కొట్టుకుపోయిందని చెప్పక తప్పదు. మతసామరస్యాన్ని ఆయన ప్రగాఢంగా వాంఛించారు. కానీ ఇవాళ మత అసహనం పెచ్చరిల్లుతోంది. కులాంతర, మతాంతర వివాహాలు చేసుకున్నవారిని వెంటాడి చంపేసే దృశ్యాలు అనేకం చూస్తున్నాం. నేడు అంతటా, అన్ని రంగాలలో అవినీతి పెచ్చరిల్లింది. గాంధీజీ స్థానిక ప్రభుత్వాలు బలంగా ఉండాలని కోరుకున్నారు. ముఖ్యంగా గ్రామాలు స్వయం పోషకత్వం సాధించి ఏ గ్రామానికది 'స్వరాజ్యం'గా అభివృద్ధి చెందాలనుకున్నారు. మరి ఆయన కలలను మన పాలకులు ఎంతవరకు నెరవేర్చారో సమీక్షించుకోవాలి.

– కనుమ ఎల్లారెడ్డి, పౌరశాస్త్ర అధ్యాపకులు, తాడిపత్రి । 93915 23027

ప్రకృతి సమతౌల్యానికి సంరక్షణ!

తమిళనాడులో నలభై రోజుల్లో 10 పులులు మరణించాయనే తాజా వార్త దేశంలో పులుల సంరక్షణపై మరోసారి చర్చను రేకెత్తిస్తోంది. ఇటీవల బాంబే హైకోర్టు 'గోవా బెంచ్' ముందుకు వచ్చిన ఓ ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని న్యాయమూర్తులు విచారిస్తూ... స్వాతంత్ర్యం సిద్ధించిన నాటికి దేశంలో 40 వేల పులులు అరణ్యంలో స్వేచ్ఛగా విహరించేవనీ, ఈ 76 ఏళ్లలో వాటి సంఖ్య 92 శాతం తగ్గిందనీ ప్రకటించడం వాస్తవ పరిస్థితికి అర్థం పడుతోంది. ప్రస్తుతం వ్యాఘ్రాల సంఖ్య ఆశాజనకంగా వృద్ధి చెందుతున్నా వాటిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని బెంచ్ హితబోధ చేయడం గమనార్హం. అడవి లేకపోతే పులి లేదనీ, పులి లేకపోతే అడవి లేదనీ, రెండూ పరస్పరం సంరక్షించుకొనే ధోరణిలో ఉంటాయనీ కోర్టు గుర్తు చేసింది.

1947 నాటి నుంచి దేశ వ్యాప్తంగా ఉన్న అభయారణ్యాల్లో పులులు తగ్గడానికి చాలా కారణాలు ఉన్నాయి. విపరీతంగా అడవుల నరికివేత, పటిష్ఠమైన రక్షణ సిబ్బంది లేకపోవడం, వ్యాఘ్రాల అవయవాలకు విదేశాల్లో గిరాకీ ఉండడంతో ఎక్కువ మొత్తంలో వేటకు గురయ్యాయి. అడవుల్లో గడ్డి భూములు తగ్గడంతో జింకలు, అడవి పందులు వంటి పులి వేటాడే జంతువులు నానాటికీ కనుమరుగైపోతున్నాయి. దీంతో పులులకు ఆహారం దొరక్క ఆ జాతి క్షీణిస్తోంది.

భారతదేశంలో 54 పులి సంరక్షణ కేంద్రాలు ఉండగా.. వాటిలో నడవాలు (కారిడార్) కీలకం. పులులు వాటి పరిధిని దాటి బయటికి వచ్చి విహరించే ప్రదేశాలను నడవాలు అంటారు. ముఖ్యంగా సంతానోత్పత్తి కోసం పులులు ఇతర ప్రాంతాలకు వెళ్తుంటాయి. ఈ క్రమంలో వాటికి మానవాళి నుంచి ప్రమాదం పొంచి ఉండే ఆస్కారం ఉంది. గత మూడు దశాబ్దాలుగా ఈ కారిడార్ల నిర్వహణ పకడ్బందీగా కొనసాగుతోంది. వేటగాళ్ళ బారి నుంచి వ్యాఘ్రాలను రక్షించేందుకు అటవీ అధికారులు తీసుకున్న చర్యలు సత్ఫలితాలనిచ్చాయి. కొండలు, కోనల్లో నివసించే ఆదివాసీ బిడ్డలకు పులితో సావాసం ఎక్కువ ఉంటుంది. అందుకే 'టైగర్ కేర్ టేకర్స్'గా వారిని ఎంచుకొని ప్రభుత్వాలు 'ప్రాజెక్ట్ టైగర్' లక్ష్యాలను అందుకున్నాయి. అడవిపైనే ఆధారపడిన ఆదివాసీ తెగలకు ఆర్థిక తోడ్పాటును అందిస్తూ పులి సహజ విహారానికి భంగం కలగకుండా ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయి. అభివృద్ధి పేరుతో అడవులను నిర్మూలించే ధోరణికి చరమగీతం పాడేందుకు ప్రభుత్వం 'అటవీ సంరక్షణ చట్టం–1980' తీసుకొచ్చింది. దీన్ని కొన్నేళ్ళుగా పటిష్ఠంగా అమలు చేస్తున్నారు. ఫలితంగా నిపుణులు సైతం ఊహించని రీతిలో పులులు తమ సంఖ్యను వృద్ధి చేసుకుంటున్నాయి.



దేశంలో నివాసయోగ్యత ఉన్నప్పటికీ అనేక రక్షిత ప్రాంతాలు పులులు లేకుండానే ఉన్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆయా అడవుల్లో మౌలిక వసతుల కల్పన, సిబ్బందిని నియమించడం తదితర చర్యలు చేపట్టాలి.' రణథంబోర్ టైగర్ రిజర్వ్' – రాజస్థాన్, 'బాంధవర్' – మధ్యప్రదేశ్, 'సుందర్బన్స్' – పశ్చిమ బెంగాల్, 'సరిస్కా' – రాజస్థాన్, 'జిమ్ కార్బెట్ పార్క్' – ఉత్తరాఖండ్, 'కన్హా'– మధ్యప్రదేశ్ సంరక్షణా కేంద్రాల్లో ఎక్కువ మొత్తంలో వ్యాఘ్రాలు విస్తరించాయి. ప్రపంచంలో ఎక్కడా ఈ స్థాయిలో పులి ఆవాసం ఉన్న దేశం లేదు.

పాఠశాల స్థాయి నుంచే పిల్లలకు పులుల ప్రాధాన్యాన్ని వివరించాలి. అడవులు, పులులు ఇతర వన్యప్రాణులను సంరక్షించుకోవాల్సిన అవసరాన్ని సామాన్యులకు అవగతం అయ్యేలా చర్యలు చేపట్టినప్పుడే మళ్లీ పులులతో మన అడవులు కళకళలాడుతాయి.

– రాహుల్. జి

దేవుడెందుకు కనబడడు?

ఇన్ని ప్రాణులను సృష్టి చేసి, ఆ ప్రాణులకు ఇన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసిన భగవంతుడు, ఆ ప్రాణులకు అప్పుడప్పుడన్నా దర్శనం ఇవ్వవచ్చు కదా? ఎందుకు కనిపించకుండా అదృశ్యంగా ఉంటాడు? ఈ ప్రశ్నకు వేదాంతులు వివిధ కోణాల నుంచి సమాధానం చెప్పడం కనిపిస్తుంది. ఒకటి – కంటికి కనిపించేందుకు ఆయనకు మన లాగా ఆకారం, నామ రూపాలు లేవు. భగవత్తత్త్వం నిరాకారం, అవ్యక్తం.

రెండు – ఆ భగవత్తత్త్వం సర్వ వ్యాపి. కానీ జగత్తు రూపంలో ఉంటుంది. అది సర్వాంతర్యామి. అందరిలోనూ ఉంటుంది. హృదయ గుహలో వెలుగుతుంటుంది కానీ, జీవుడి అవిద్య అనే ముసుగులో కప్పబడి ఉంటుంది. జగత్తంతా తానుగా వ్యాపించి ఉన్న భగవంతుడిని చూడగల జ్ఞానికి ఆయన సర్వత్రా కనిపిస్తాడు. అంతర్ముఖులై ఏకాగ్ర చిత్తంతో ధ్యానించే యోగులకు వాళ్ళలోనే కనిపిస్తాడు. ఆయన కనిపించక పోవడం అనేది లేదు. మనం సరిగా తదేకంగా చూడలేకపోవడమే!



జ్యోతిర్మయం

మూడు – సర్వత్రా పరచుకొని ఉన్న భగవంతుడు అనే ఏకత్వాన్ని మనం చూడలేక పోవడానికి కారణం మనకున్న 'అహం'కారం అనే లక్షణం. (ఇది 'నేను గొప్ప' అన్న భావనను సూచించే 'అహంకారం' కాదు). ఉన్నది బ్రహ్మమొక్కటే అయినా, 'నేను వేరు'– 'నేను కానిది వేరు' అన్న భావన కలిగించే భ్రాంతి జనితమైన, జీవ సామాన్యమైన లక్షణం. అహంకారం అనే ఈ 'మాయ'దారి లక్షణం కరిగిపోతేనే భగవత్తత్త్వం అనుభవమౌతుంది. అప్పుడు ఉండేదంతా బ్రహ్మమొక్కటే. 'నేనూ', 'నువ్వు', 'వాడు', 'స్వ'– 'పర', ఇలాంటి భేదాల అనుభవమే ఉండదు. ఏ భేదాలూ లేని సర్వైక్యతా స్థితి అనుభవమవుతుంది. అప్పుడు 'సర్వం బ్రహ్మ మయమ్'. అది మోక్ష స్థితి. బంధ రహిత స్థితి. దుఃఖ రహిత స్థితి. పరమ శాంత స్థితి. నిర్వాణ స్థితి.

ఈ అహంకారం ఈశ్వర మాయాజనితం. దీనితో ఉన్నప్పుడు 'నేను, 'నేను' అనే ఈ గుర్తింపు కోల్పోవడం అన్న భావననే భరించలేను. గ్రహించలేను. అందుకు నాకు మనసొప్పదు'... వైరాగ్య, అభ్యాసాల ద్వారా ఈ అహంకారాన్ని వదలగలిగిన ఘనులు... 'ఉన్నది బ్రహ్మమొక్కటే' అన్న సర్వైక్యతాస్థితిని అనుభవించగలుగుతారు. వాళ్ళకూ భగవంతుడు 'కనబడడు'. వాళ్ళే భగవంతుడిలో భాగమవుతారు!

– ఎం. మారుతి శాస్త్రి

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
టోల్ ఫ్రీ నం: 1800 425 9899

క్లుప్తంగా...

భీమేశ్వరుని దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి



భీమేశ్వరుని సన్నిధిలో పూజలు చేస్తున్న జస్టిస్ గోపాలకృష్ణారావు, కుటుంబసభ్యులు

రామచంద్రపురం రూరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని పంచారామ క్షేత్రం ద్రాక్షారామ మాణిక్యాంబ సమేత భీమేశ్వర స్వామి వారిని ఆదివారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.గోపాలకృష్ణారావు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. తొలుత వారికి ఆలయ అర్చకులు, వేద పండితులు, అభిషేక పురోహితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం వేదాశీర్వచనం చేశారు. జస్టిస్ వి.గోపాలకృష్ణారావుకు స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలను దేవస్థానం ఈవో పితాని తారకేశ్వరరావు అందజేశారు.

ఆదిత్యుని సేవలో జస్టిస్ మాలా



ఆదిత్యుని జ్ఞాపికను జస్టిస్ మాలా దంపతులకు అందజేస్తున్న ఈవో

అరసవల్లి: శ్రీకాకుళం జిల్లా అరసవల్లిలోని శ్రీ సూర్యనారాయణస్వామి ఆలయంలో ఆదివారం మహాకవి శ్రీశ్రీ కుమార్తె, మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నిడుమోలు మాలా ప్రత్యేక పూజలు చేశారు. కుటుంబ సమేతంగా స్వామి దర్శనానికి వచ్చిన జస్టిస్ మాలాకు ఆలయ సంప్రదాయం ప్రకారం ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ పూర్ణకుంభ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. ఆమె వెంట శ్రీకాకుళం జిల్లా మొబైల్ కోర్టు జడ్జి విద్య, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శారదాంబ తదితరులు ఉన్నారు.

నేడు కాణిపాకానికి స్వరూపానందేంద్ర రాక



కాణిపాక ఆలయ చైర్మన్, ఈవో

కాణిపాకం (యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో సోమవారం విశాఖ శ్రీశారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి పలు పూజా కార్యక్రమాలలో పాల్గొననున్నట్లు ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈవో వెంకటేశు తెలిపారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ సోమవారం మధ్యాహ్నం స్వరూపానందేంద్ర తన శిష్య బృందంతో కాణిపాకానికి చేరుకుంటారని చెప్పారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని సంకటహర చతుర్థి వ్రతంలో పాల్గొంటారని వెల్లడించారు. సాయంత్రం 5 గంటలకు స్వర్ణరథం ఊరేగింపులో పాల్గొని, 6.30 గంటలకు స్వామివారి పుష్కరిణికి హారతులు ఇస్తారని పేర్కొన్నారు.

విశాఖలో నేటి నుంచి కశ్మీరీ యువ సమ్మేళనం

సాక్షి, విశాఖపట్నం: విశాఖలో తొలిసారిగా కశ్మీరీ యువ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు నెహ్రూ యువ కేంద్రం ఉమ్మడి విశాఖ జిల్లా అధికారి మహేశ్వరరావు ఆదివారం తెలిపారు. అక్టోబర్ 2 నుంచి 7 వరకు జరిగే ఈ సమ్మేళనంలో పాల్గొనేందుకు కశ్మీర్‌లోని అనంతనాగ్, కుప్వారా, బారాముల్లా, బుద్గం, శ్రీనగర్, పుల్వామా జిల్లాల నుంచి 120 మంది యువతీ యువకులు, 12 మంది టీం లీడర్లు వస్తున్నట్లు చెప్పారు. సమ్మేళనంలో భాగంగా విశాఖలోని ముఖ్యమైన ప్రాంతాలను సందర్శిస్తారన్నారు. కశ్మీర్ లోయలో యువకులలో జాతీయ ఐక్యత, సమగ్రత, శాంతి ప్రతిపాదకులుగా వ్యవహరించేలా దిశా నిర్దేశం చేయడం ఈ సమ్మేళనం ముఖ్య ఉద్దేశమని వివరించారు.

'పరిసరాల శుభ్రతపై అవగాహన తప్పనిసరి'

సాక్షి, అమరావతి: పరిసరాల పరిశుభ్రతపై అవగాహన పెంచుకోవాలని ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఏపీ ప్రాంతీయ డిప్యూటీ జనరల్ మేనేజర్‌లు ఆశిష్ తక్, రవిశేఖర్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం 'గార్బేజ్ ఫ్రీ ఇండియా' స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ఆదివారం విజయవాడలోని ఆటో నగర్ బస్టాండ్ ప్రాంగణంలో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. చెత్త, ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను శుభ్రం చేసి, గ్రీన్, బ్లూ డస్ట్‌బిన్‌ల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించారు. డీజీఎంలు మాట్లాడుతూ.. స్వచ్ఛతా క్యాంపెయిన్ 3.0లో భాగంగా తమ డివిజన్ కార్యాలయాలతో పాటు ఏపీలో ఎంపిక చేసిన 33 బహిరంగ ప్రదేశాల్లో అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ జనరల్ మేనేజర్లు సురేష్, రవీంద్ర కుమార్ మాలిక్, రాఘవేంద్ర సింగ్, మనోజ్ కుమార్ సింగ్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ ప్రళయం



ప్రపంచాన్ని కమ్మేస్తున్న ప్లాస్టిక్ వ్యర్థాలు

- సముద్ర, అటవీ జీవులతో పాటు మానవ ప్రాణాలకు ముప్పు
- పండ్లు, కూరగాయలు, ఆకు కూరల్లోనూ ప్లాస్టిక్ కణాలను గుర్తించిన శాస్త్రవేత్తలు
- యాపిల్, బేరి పండ్లలో అత్యధికంగా ప్లాస్టిక్ రేణువులు
- 1950లో రెండు మిలియన్ టన్నుల నుంచి ప్రస్తుతం 391 మిలియన్ టన్నులకు పెరిగిన ప్లాస్టిక్ కాలుష్యం

సాక్షి, అమరావతి: ప్రపంచాన్ని ప్లాస్టిక్ మింగేస్తోంది. సముద్ర జీవులు, అడవి జంతువులను హరించడంతో పాటు మానవుల ఆహారంలోకి చొరబడుతోంది. గ్లోబల్ ప్లాస్టిక్ కాలుష్యం 1950లో రెండు మిలియన్ టన్నులు ఉండగా.. తాజా వినియోగం 391 మిలియన్ టన్నులను దాటిపోవడం ఆందోళన కలిగిస్తోంది. ప్రతి చిన్న పనిలోనూ ప్లాస్టిక్‌పై ఆధారపడటంతో వీటి వినియోగం క్రమేపీ ఎక్కువైంది. ఇది 2040 నాటికి రెట్టింపు అవుతుందని పర్యావరణ వేత్తలు అంచనా వేస్తున్నారు.

పండ్లలోనూ ప్లాస్టిక్ భూతమే

మానవులు తరచూ తినే పండ్లు, కూరగాయలను కూడా ప్లాస్టిక్ వదలడం లేదు. తాజాగా ఇటలీలోని కాటానియా విశ్వవిద్యాలయానికి చెందిన పరిశోధకులు క్యారెట్, పాలకూర, యాపిల్స్, బేరి పండ్లలో చిన్నచిన్న ప్లాస్టిక్ కణాలను కనుగొన్నారు. యాపిల్స్‌లో అత్యధికంగా సగటున గ్రాముకు 1.95 లక్షలు, బేరిలో 1.89 లక్షలు, క్యారెట్, బ్రోకోలీలో లక్ష వరకు అతి సూక్ష్మ ప్లాస్టిక్ రేణువులను గుర్తించారు. ప్లాస్టిక్ కలుషిత నీరు, భూమి ద్వారా ఆహార ఉత్పత్తుల్లోకి చేరుతున్నట్టు పేర్కొన్నారు.

తాబేలు పొట్టలోనూ చేరుతోంది

గతంలో సముద్ర తీరాల్లో అకారణంగా తాబేళ్ల మృత్యువాత పడుతుండటంపై శాస్త్రవేత్తలు పరిశోధనలు చేశారు. అరచేతిలో ఒదిగిపోయే చిన్న తాబేలు పొట్టలో దాదాపు 140 మైక్రో ప్లాస్టిక్ ముక్కలను కనుగొన్నారు. ప్రస్తుతం ఏటా 11 మిలియన్ టన్నుల ప్లాస్టిక్ సముద్రాల్లోకి చేరుతుండగా.. ఇది వచ్చే 20 ఏళ్లల్లోపే మూడు రెట్లు పెరగనుందని పలు అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. ఇందులో 800కి పైగా సముద్ర, తీర ప్రాంత జాతులను ఆహారంగా తీసుకున్న వేలాది మంది ప్రజలు తీవ్ర అనారోగ్యానికి గురైనట్టు, వారి రక్తంలో అతి సూక్ష్మమైన ప్లాస్టిక్ కణాలు ఉన్నట్టు వైద్యులు నిర్ధారించారు. ముఖ్యంగా ప్రపంచంలో 1,557 సముద్ర జాతులు వేగంగా అంతరించిపోతున్నాయి. వీటిలో ఎక్కువ శాతం జీవులు ప్లాస్టిక్‌ను ఆహారంగా తీసుకుంటున్నాయని తేలింది.

భూసారానికి పెనుముప్పు

ప్లాస్టిక్‌లోని మైక్రో ప్లాస్టిక్స్ భూసారాన్ని దెబ్బతీస్తున్నాయి. ఫలితంగా భూమికి మేలు చేసే మిత్ర పురుగులు, లార్వాలు, అనేక కీటకాల క్షీణతలకు దారి తీస్తోంది. ప్లాస్టిక్ ఫుడ్ ప్యాకేజింగ్, ప్లాస్టిక్ గొట్టాలు, బయోవ్యర్థాలు హానికరమైన రసాయనాలను మట్టిలోకి విడుదల చేస్తాయి. అవి భూగర్భ జలాల్లోకి ప్రవేశించి నీటిని సైతం కలుషితం చేస్తున్నాయి. ఈ క్రమంలోనే సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించడం, ప్లాస్టిక్‌ను రీసైక్లింగ్‌పై అనేక స్వచ్ఛంద సంస్థలు, ఐక్యరాజ్య సమితి పెద్దఎత్తున ప్రచారం చేస్తున్నాయి. ఇందులో భాగంగానే ప్రపంచ వ్యాప్తంగా 77 దేశాలు ప్లాస్టిక్‌పై శాశ్వత, పాక్షిక నిషేధాన్ని విధించాయి.

గజరాజుల పాలిట ప్లాస్టిక్ పాశం

గతేడాది భారత దేశంలోని పెరియార్ అటవీ ప్రాంతంలో 20 ఏళ్ల అడవి ఏనుగు మృతి చెందింది. ప్రతి శీతాకాలంలో శబరిమలకు అడవుల ద్వారా కాలినడకన వెళ్లే లక్షలాది మంది భక్తులు విచ్చలవిడిగా పడేసిన ప్లాస్టిక్ వ్యర్థాలను తినడంతో పేగుల్లో అంతర్గత రక్తస్రావం, అవయవాలు విఫలమై అది చనిపోయినట్టు శాస్త్రవేత్తలు గుర్తించారు. ఒక్క ఏనుగులే కాదు అతి శక్తివంతమైన వేటాడే జీవులైన హైనాలు, పులులతో పాటు జీబ్రాలు, ఒంటెలు, పశువులతో సహా భూ ఆధారిత క్షీరదాలు ప్రమాదవశాత్తు ప్లాస్టిక్ వ్యర్థాలను తిని మృత్యువాత పడుతున్నాయి.

గాంధీకి అక్షర నివాళి



గాంధీ జయంతిని పురస్కరించుకొని వైఎస్సార్ జిల్లా 11వ బెటాలియన్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడు సమీర్ బాషా మహాత్మా గాంధీ రూపాన్ని అక్షరాలతో తీర్చిదిద్దారు. నాలుగు గంటల పాటు శ్రమించి ఆయన బాపు చిత్రానికి అక్షరాభిషేకం చేశారు.

– సిద్దవటం

గుంటూరులో ఆటోవాలాల భారీ ర్యాలీ

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): వైఎస్సార్ వాహన మిత్ర ఐదో విడత నగదు విడుదల చేసిన క్రమంలో ఆదివారం ఆటో డ్రైవర్లు గుంటూరు నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ర్యాలీని ఎమ్మెల్సీ అప్పిరెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా, నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు, డిప్యూటీ మేయర్ డైమండ్ బాబులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే గిరి మాట్లాడుతూ సీఎం జగన్ కార్మికుల పక్షపాతి అని చెప్పారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా కార్మికుల సంక్షేమానికి కట్టుబడి చిత్తశుద్ధితో ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను చేస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ ఇచ్చిన ప్రతి హామీని



ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి

అమలు చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. కలెక్టర్ కార్యాలయం వద్ద ప్రారంభమైన ర్యాలీ.. జిల్లా కోర్టు, మూడు బొమ్మల సెంటర్, హిందూ కళాశాల కూడలి, ఏసీ కళాశాల, ఓవర్ బ్రిడ్జి, శంకర్ విలాస్ మీదుగా లాడ్జి సెంటర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వరకూ సాగింది.

13న మానసిక వైద్య నిపుణుల సదస్సు

గుంటూరు (మెడికల్): దక్షిణ భారత మానసిక వైద్యుల సంఘం 56వ వార్షిక విజ్ఞాన సదస్సును ఈ నెల 13న గుంటూరులో నిర్వహిస్తున్నట్టు మానసిక వైద్య నిపుణుల సంఘం ఏపీ అధ్యక్షుడు డాక్టర్ ఐవీఎల్ నరసింహారావు చెప్పారు. ఆదివారం గుంటూరులో మీడియాతో మాట్లాడుతూ.. గుంటూరు ఇన్నర్ రింగ్ రోడ్‌లోని శ్రీ కన్వెన్షన్ సెంటర్‌లో ఈ నెల 13 నుంచి 15 వరకు సదస్సు జరుగుతుందన్నారు. ఆంధ్రా, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ, పాండిచ్చేరి రాష్ట్రాలకు చెందిన మానసిక వైద్య నిపుణులు సదస్సుకు విచ్చేస్తున్నట్టు చెప్పారు. మానసిక చికిత్సా విధానంలో నూతన ఆవిష్కరణలపై అమెరికా, ఆస్ట్రేలియాకు చెందిన సీనియర్ మానసిక వైద్య నిపుణులు సదస్సులో మాట్లాడతారన్నారు. యూజీ వైద్య విద్యార్థులకు క్విజ్ పోటీలు, పీజీ వైద్య విద్యార్థులకు పోస్టర్ ప్రజెంటేషన్ పోటీలు ఉంటాయని చెప్పారు. కాగా.. ఈ నెల 12న గుంటూరు ఆర్‌వీఆర్ ఇంజినీరింగ్ కాలేజ్‌లో ఐదు రాష్ట్రాల క్రికెట్ టోర్నమెంట్



సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మానసిక వైద్య నిపుణుల సంఘం నేతలు

జరుగుతుందని తెలిపారు. నిరంతర వైద్య విద్య కార్యక్రమాలు (సీఎంఈ) జరుగుతాయని, వైద్యులంతా సదస్సును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మానసిక వైద్య నిపుణుల సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఇవటూరి శరత్‌చంద్ర, డాక్టర్ ఎస్వీ రమణరావు, డాక్టర్ వద్దాది వెంకటకిరణ్, డాక్టర్ నల్లూరి మురళీకృష్ణ పాల్గొన్నారు.

తిరుమలలో కొనసాగుతున్న రద్దీ

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ ఆదివారం కూడా కొనసాగుతోంది. క్యూ కాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండాయి. శనివారం అర్ధరాత్రి వరకు 87,081 మంది స్వామివారిని దర్శించుకోగా, 41,575 మంది తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీల్లో రూ.4.05 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 36 గంటల్లో దర్శనం లభిస్తోంది. క్యూలో వేచి ఉన్న భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా టీటీడీ ఎప్పటికప్పుడు పాలు, ఉప్మా, పులిహోర, సాంబార్ అన్నం అందిస్తోంది. అదేవిధంగా అవసరమైన భక్తులకు అశ్విని ఆస్పత్రి సిబ్బంది మందులు పంపిణీ చేస్తున్నారు.



తిరుమలలో కిటకిటలాడుతున్న భక్తులు

28న తిరుమల శ్రీవారి ఆలయం మూత

ఈ నెల 28వ తేదీ రాత్రి తిరుమల శ్రీవారి ఆలయాన్ని మూసివేయనున్నట్లు టీటీడీ తెలిపింది. ఈ నెల 29వ తేదీ తెల్లవారుజామున 1.05 నుంచి 2.22 గంటల మధ్య పాక్షిక చంద్రగ్రహణం ఉంటుందని, కాబట్టి 28వ తేదీ రాత్రి 7.05 గంటలకు ఆలయ తలుపులు మూసివేయనున్నట్లు వెల్లడించింది. గ్రహణ సమయానికి ఆరు గంటల ముందుగా ఆలయ తలుపులు మూసివేయడం ఆనవాయితీ. తిరిగి 29వ తేదీ తెల్లవారుజామున 3.15 గంటలకు ఏకాంతంలో శుద్ధి, సుప్రభాత సేవ నిర్వహించి ఆలయ తలుపులు తెరుస్తారు. చంద్రగ్రహణం కారణంగా ఎనిమిది గంటలపాటు ఆలయ తలుపులు మూసి ఉంటాయి. అందువల్ల ఈ నెల 28న సహస్ర దీపాలంకార సేవ, వికలాంగులు, వృద్ధుల దర్శనాలను రద్దు చేశారు.

నేడు ఎస్ఎస్‌డీ టోకెన్లు రద్దు

పెరటాసి నెల రద్దీ కారణంగా సోమవారం ఎస్ఎస్‌డీ టోకెన్లను టీటీడీ రద్దు చేసింది. భక్తులు ఈ విషయాన్ని గమనించాలని తెలిపింది.

శ్రీవారిని దర్శించుకున్న న్యాయమూర్తులు



శ్రీవారి ఆలయం ఎదుట సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దీపాంకర్ దత్తా



సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బేలా ఎం.త్రివేది



ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జైసూర్య, జస్టిస్ రవినాథ్ తిలహరి, అలహాబాద్ హైకోర్టు జస్టిస్ సంగీత చంద్ర

తిరుమల: తిరుమల శ్రీవారిని ఆదివారం పలువురు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు, వివిధ హైకోర్టుల న్యాయమూర్తులు దర్శించుకున్నారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బేలా ఎం.త్రివేది, జస్టిస్ దీపాంకర్ దత్తా, ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జైసూర్య, జస్టిస్ రవినాథ్ తిలహరి, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు, అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంగీత చంద్ర స్వామివారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం అందించగా, అధికారులు లడ్డూ ప్రసాదాలు అందించి సత్కరించారు.

శ్రీవారిని దర్శించుకున్న స్పీకర్

తిరుమల శ్రీవారిని ఆదివారం రాష్ట్ర స్పీకర్ సీతారాం, ఎంపీ సంజీవ్‌కుమార్ దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు.

రెవెన్యూలో ఇన్ని సంస్కరణలు ఇప్పుడే

రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో మంత్రి ధర్మాన



సాక్షి, అమరావతి/భవానీపురం (విజయవాడ పశ్చిమ): గతంలో ఎప్పుడూ జరగనన్ని రెవెన్యూ సంస్కరణలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ హయాంలో పెద్దఎత్తున జరిగాయని, తద్వారా లక్షలాది మందికి ప్రయోజనం కలిగిందని రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు చెప్పారు. రూ.76 వేలకోట్ల విలువైన భూమిని 31 లక్షల మందికి ఇళ్ల స్థలాలుగా ఇచ్చామని తెలిపారు. గత ప్రభుత్వాలు ప్రభుత్వ భూమిని ఇచ్చాయని, ఈ ప్రభుత్వమే తొలిసారి వేల కోట్లతో భూమి కొని ఇళ్లస్థలాలు ఇచ్చిందని చెప్పారు. విజయవాడలో ఆదివారం జరిగిన రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ 17వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసైన్డ్ భూములు, చుక్కల భూములు, షరతులు గల భూములు, సర్వీస్ ఈనాం వంటి లక్షల ఎకరాల భూములు త్వరలో ఓపెన్ మార్కెట్‌లోకి వస్తాయని తెలిపారు. రెవెన్యూశాఖ పేరును ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ అండ్ జనరల్ అడ్మినిస్ట్రేషన్‌గా మార్చాల్సిన అవసరం ఉందని, ఈ విషయం గురించి ముఖ్యమంత్రితో మాట్లాడతానని తెలిపారు. ప్రొహిబిషన్ ఆఫ్ ట్రాన్స్‌ఫర్-1977 చట్టాన్ని మార్చడంతో 30 లక్షల ఎకరాల భూమి మళ్లీ వ్యవస్థలోకి వస్తుందన్నారు. రెవెన్యూ ఉద్యోగులు లేవనెత్తిన అంశాలను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి ప్రయత్నిస్తామని, సీఎం మానవతాకోణం ఉన్న వ్యక్తి అని చెప్పారు. ఉద్యోగులకు చేయాల్సినవన్నీ చేస్తామని ఆయన పేర్కొన్నారు. రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, సీసీఎల్ఏ సాయిప్రసాద్ మాట్లాడుతూ భవిష్యత్తులో ల్యాండ్ టైటిల్ ఆఫీసర్ వ్యవస్థ వస్తుందని, వ్యవసాయ భూములతోపాటు నివాస, పారిశ్రామిక తదితర భూములన్నీ రెవెన్యూ పరిధిలోకి వస్తాయని తెలిపారు. ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మన సమస్యలను ప్రభుత్వం ఎప్పటికప్పుడు పరిష్కరిస్తోందని చెప్పారు. అయితే ఉద్యోగులపై పని ఒత్తిడి తగ్గించాలని కోరారు. వచ్చే ఏడాదికి రెవెన్యూశాఖ ఏర్పడి 60 ఏళ్లవుతున్న నేపథ్యంలో జూన్ 20వ తేదీని రెవెన్యూ డేగా ప్రకటించాలని కోరారు. రెవెన్యూ ఉద్యోగులకు ఇంటిస్థలాలు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. అసోసియేషన్‌కు ఎన్నికైన 30 మంది సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.



వైఎస్సార్‌సీపీ చంద్రగిరి ఆత్మీయ సమ్మేళనానికి భారీగా తరలివచ్చిన జనం

జన సంద్రమైన చంద్రగిరి

- వైఎస్సార్‌సీపీ ఆత్మీయ సమ్మేళనానికి 25 వేల మంది హాజరు
- చెవిరెడ్డిపై నాయకుల ప్రశంసల జల్లు

తిరుపతి రూరల్: వైఎస్సార్‌సీపీ శ్రేణులతో చంద్రగిరి జన సంద్రమైంది. ఆత్మీయ సమ్మేళనం జన ఉప్పెనను తలపించింది. ప్రభుత్వ విప్, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి నాయకత్వంలో తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం తిరుపతి రూరల్ మండలంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. నియోజకవర్గం నలుమూలల నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులతో సభాప్రాంగణం కిక్కిరిసిపోయింది. దాదాపు 25 వేలమందికి పైగా హాజరయ్యారు. ఆత్మీయ సమ్మేళనానికి ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, మంత్రి రోజా, టీటీడీ చైర్మన్ కరుణాకరరెడ్డి, ఎంపీలు మిథున్‌రెడ్డి, రెడ్డెప్ప, డాక్టర్ గురుమూర్తి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం, మాజీ ఎమ్మెల్యే జయదేవనాయుడు పాల్గొన్నారు. వైఎస్సార్సీపీకి చంద్రగిరి నియోజకవర్గాన్ని కంచుకోటగా మార్చారని, నిబద్ధత, నిజాయితీ, క్రమశిక్షణ, అంకితభావంతో చెవిరెడ్డి రాజకీయాల్లో ఉన్నత శిఖరాలను అధిరోహించారని పలువురు కొనియాడారు. రానున్న ఎన్నికల్లో చంద్రగిరి ఎమ్మెల్యేగా చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని ఆదరించాలని నాయకులంతా పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రోత్సాహంతో పార్టీలకు అతీతంగా నియోజకవర్గంలో అభివృద్ధి పనులను చేపట్టినట్టు తెలిపారు.

కాంగ్రెస్‌కు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి గుడ్‌బై

తెలంగాణ

మెదక్: మెదక్ డీసీసీ అధ్యక్షుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి కాంగ్రెస్ పార్టీకి ఆదివారం గుడ్‌బై చెప్పారు. రాబోయే శాసనసభ ఎన్నికల్లో ఆయన మెదక్ టికెట్ ఆశించారు. కానీ ఈ స్థానం నుంచి మైనంపల్లి హన్మంతరావు తనయుడు రోహిత్‌కు టికెట్ దక్కే అవకాశం ఉండటంతో తిరుపతిరెడ్డి కాంగ్రెస్‌కు రాజీనామా చేశారు. జిల్లా అధ్యక్ష పదవికి, ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ఆయన ఓ లేఖను అధిష్టానానికి పంపారు.

ఎన్నికల నిర్వహణలో ఎన్నో సంస్కరణలు

భారత మాజీ ఎన్నికల కమిషనర్ సంపత్

మొగల్రాజపురం (విజయవాడ తూర్పు): ఎన్నికల నిర్వహణలో టీఎన్ శేషన్ ఎన్నో సంస్కరణలు తెచ్చారని భారత ఎన్నికల కమిషన్ మాజీ చీఫ్ కమిషనర్ వీఎస్ సంపత్ పేర్కొన్నారు. ఆయన నేతృత్వంలో కేంద్ర ఎన్నికల కమిషన్ బలోపేతమైందన్నారు. విజయవాడలోని పీబీ సిద్ధార్థ ఆడిటోరియంలో సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ సంస్థ ప్రారంభ సభ ఆదివారం జరిగింది. సంస్థ వెబ్‌సైట్‌ను ఆవిష్కరించిన సంపత్ మాట్లాడుతూ.. ఓటర్ల జాబితా ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో ఉంటుందని, ఓటర్లు ఎప్పుడైనా తమ పేరును పరిశీలించుకోవచ్చని సూచించారు. దొంగ ఓట్లు ఉన్నా ఫిర్యాదు కూడా చేయవచ్చని చెప్పారు. స్వేచ్ఛాయుత ఎన్నికలు జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ సంస్థ అధ్యక్షుడు భవానీప్రసాద్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య పరిరక్షణే లక్ష్యంగా ఈ సంస్థను స్థాపించామని తెలిపారు. సంస్థ కార్యదర్శి నిమ్మగడ్డ రమేష్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వాల నుంచి



వెబ్‌సైట్‌ను ప్రారంభిస్తున్న సంపత్, చిత్రంలో భవానీప్రసాద్, ఎన్.రమేష్, ఎల్వీ సుబ్రహ్మణ్యం, జంధ్యాల శంకర్, ఎంసీ దాస్

పౌరులు ఆశించేది సుపరిపాలనే అని పేర్కొన్నారు. లోపాలుంటే ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్తామన్నారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి ఎల్వీ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం మాజీ ఐఏఎస్‌లంతా ప్రయత్నం చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రొఫెసర్ ఎంసీ దాస్, మాజీ మేయర్ జంధ్యాల శంకర్, నగరంలోని ప్రముఖులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ 23వ ఆవిర్భావ దినోత్సవం

డాబాగార్డెన్స్ (విశాఖ దక్షిణ): బీఎస్ఎన్ఎల్ 23వ ఆవిర్భావ దినోత్సవాన్ని విశాఖ డాబాగార్డెన్స్‌లోని బీఎస్ఎన్ఎల్ ప్రధాన కార్యాలయంలో ఆలిండియా బీఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (పీడబ్ల్యూఏ) ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా జరిగిన అసోసియేషన్ కార్యనిర్వాహక సమావేశంలో సంఘం ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షుడు కుప్పిలి చంద్రశేఖర్ మాట్లాడారు. 2000లో ఏర్పడిన బీఎస్ఎన్ఎల్ కార్పొరేషన్ 23 ఏళ్లలో ఎన్నో ఒడిదుడుకులు తట్టుకుని మనుగడ సాధించిందని చెప్పారు. బీఎస్ఎన్ఎల్ సేవలు మరింత విస్తరించడానికి వీలుగా 4జీ పరికరాలను



మాట్లాడుతున్న కుప్పిలి చంద్రశేఖర్

సత్వరమే సమకూర్చాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు ఎంఆర్ పట్నాయక్ మాట్లాడుతూ..బీఎస్ఎన్ఎల్ సామాజిక బాధ్యతతో పనిచేస్తుందన్నారు. ఇటీవల హిమాచల్‌ప్రదేశ్ వరదల్లో, ఒడిశాలోని బాలాసోర్ రైలు ప్రమాద సమయంలో బీఎస్ఎన్ఎల్ ఒక్కటే అనేక ప్రతికూల పరిస్థితుల మధ్య నిరంతరంగా ఉచిత సేవలు అందించిందని గుర్తు చేశారు. జిల్లా కార్యదర్శి సోమ సుందరరావు మాట్లాడుతూ.. సెంట్రల్ అడ్మినిస్ట్రేషన్ ట్రిబ్యునల్ ప్రిన్సిపల్ బెంచ్ సెప్టెంబర్ 20న బీఎస్ఎన్ఎల్ పెన్షన్ రివిజన్‌పై తీర్పు ప్రకటించిందని, అందులో వేతన సంఘం సిఫార్సుల మేరకు బీఎస్ఎన్ఎల్ పెన్షనర్లకు పెన్షన్ రివిజన్ చేపట్టాలని, ఈ ప్రక్రియ 10 వారాల్లోగా పూర్తి చేయాలని ఆదేశించిందని తెలిపారు. సంఘం రాష్ట్ర సలహాదారుడు ఎం.శ్రీమన్నారాయణ, రాష్ట్ర సహాయ కార్యదర్శి కేవీడీ స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఒక తార పేలిన వేళ...



సూపర్ నోవా. అంతరిక్షంలో సంభవించే అతి పెద్ద పేలుడు. బహుశా బ్రహ్మాండంలో దీన్ని మించిన పేలుడు మరోటి ఉండదని చెబుతారు. నిజానికి సూపర్ నోవాలు సైంటిస్టులకు ఎప్పుడూ ఆసక్తికరమైన సబ్జెక్టే. నక్షత్రాల జీవిత కాలంలోని చివరి ఏడాదిలో మనకు ఇప్పటిదాకా తెలిసిన వాటికంటే చాలా ఎక్కువ విశేషాలే జరుగుతాయని వారిప్పుడు చెబుతున్నారు. ఆ సమయంలో అవి భారీ పరిమాణంలో ద్రవ్యరాశిని కోల్పోతాయట.

- ఎస్ఎన్2023ఐఎక్స్ఎఫ్ సూపర్ నోవాపై జరిపిన అధ్యయనంలో ఈ విశేషం వెలుగులోకి వచ్చింది.
- అది దాని చివరి ఏడాదిలో ఏకంగా సూర్యునికి సమాన పరిమాణంలో ద్రవ్యరాశిని కోల్పోయిందట.
- నక్షత్రాలు తమ చివరి ఏడాదిలో మనకు ఇప్పటిదాకా తెలిసిన వాటికి మించి చాలా పరిణామాలకు లోనవుతాయని ఈ దృగ్విషయం తేటతెల్లం చేసింది.
- ఎస్ఎన్2023ఐఎక్స్ఎఫ్ ను జపాన్ కు చెందిన ఔత్సాహిక అంతరిక్ష శాస్త్రవేత్త కోయిచీ ఇటగాకీ 2023లో కనిపెట్టాడు.
- ఇది పిన్ వీల్ గెలాక్సీలో భూమికి దాదాపు 2 కోట్ల కాంతి సంవత్సరాల దూరంలో ఉంది.
- మిగతా సూపర్ నోవాలతో పోలిస్తే ఇది భూమికి అత్యంత సమీపంలో ఉంది. పైగా మనకు తెలిసిన వాటిలో అత్యంత నూతన నోవా కూడా ఇదే.
- ఎస్ఎన్2023ఐఎక్స్ఎఫ్ ను టైప్ 2, లేదా కోర్ కొలాప్స్ సూపర్ నోవా గా పిలుస్తారు. సూర్యుని కంటే 8 నుంచి 25 రెట్లు పెద్దవైన తారలు రెడ్ సూపర్ జెయింట్స్ గా మారి తమ బరువును తామే తాళలేక భారీ పేలుడుకు లోనవుతాయి.
- ఇలాంటి సూపర్ నోవాలు సంభవించగానే వాటి నుంచి అతి విస్తారమైన కాంతి పుంజాలు వెలువడతాయి.
- వాటి తాలూకు షాక్ వేవ్స్ సూపర్ నోవా ఆవలి అంచును చేరతాయి.
- కానీ ఎస్ఎన్2023ఐఎక్స్ఎఫ్ నుంచి వెలువడ్డ కాంతి పుంజాలు మాత్రం అలా దాని చివరి అంచును చేరలేదు.
- సదరు సూపర్ నోవా దాని చివరి సంవత్సరంలో తీవ్ర అస్థిరతకు లోనయిందని దీన్నిబట్టి తెలుస్తోందని సైంటిస్టులు వివరిస్తున్నారు.
- పేలుడుకు ముందు సదరు తార నిండా అతి దట్టమైన ద్రవ్యరాశి పరుచుకుని ఉందనేందుకు ఇది ప్రత్యక్ష ప్రమాణమని ఇటగాకీ వివరించారు.
- భారీ తారల ఆవిర్భావ, వికాసాలకు సంబంధించి ఇప్పటిదాకా విశ్వసిస్తున్న పలు కీలక సిద్ధాంతాలపై ఇది పలు ప్రశ్నలు లేవనెత్తిందని సైంటిస్టులు చెబుతున్నారు.

\- సాక్షి, నేషనల్ డెస్క్

కోర్టులో నామకరణం



కొచ్చి: ఆ.. పేరులో ఏముందిలే అని కొందరు అనుకుంటారు కానీ ఆ పేరు కూడా ఒక ప్రహసనంగా మారిందని కేరళలో జరిగిన ఒక ఘటన నిరూపించింది. కన్నబిడ్డకు పేరు పెట్టడంలో ఏకాభిప్రాయానికి రాలేకపోయిన తల్లిదండ్రులు కోర్టుకెక్కడంతో మూడేళ్ల వయసున్న వారి కుమార్తెకు కేరళ హైకోర్టు పేరు పెట్టాల్సి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. కేరళకి చెందిన దంపతులు విభేదాలతో విడి విడిగా ఉంటున్నారు. తల్లి సంరక్షణలో వారి మూడేళ్ల వయసున్న కుమార్తె ఉంటోంది. ఆ పాప బర్త్ సర్టిఫికెట్‌లో పేరు లేదు. ఆ తల్లి కూతురికి పేరు పెట్టి సర్టిఫికెట్‌లో చేర్చాలని సదరు అధికారుల్ని సంప్రదిస్తే తల్లిదండ్రులిద్దరూ ఒకేసారి హాజరై పేరు చెబితే రిజిస్టర్ చేస్తామన్నారు. అప్పటికే విభేదాలతో దూరమైన దంపతులు పేరు విషయంలో కూడా రాజీకి రాలేకపోయారు. భార్య చెప్పిన పేరు భర్తకి, భర్త చెప్పిన పేరు భార్యకి నచ్చలేదు. కూతురు తన వద్దే ఉండడంతో తల్లి కోర్టుకెక్కింది. చివరికి కేరళ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బెచు కురియన్ థామస్ ఆ పాపకు పేరు పెట్టారు. పాప శ్రేయస్సు, తల్లిదండ్రుల ఇష్టాయిష్టాలు, వారి సంస్కృతి, సామాజిక పరిస్థితులు అన్నీ పరిగణనలోకి తీసుకొని పేరు పెట్టినట్టు న్యాయమూర్తి వెల్లడించారు. కానీ ఏం పేరు పెట్టారో మాత్రం ఆయన బయటపెట్టలేదు.

గ్లోబల్ టీచర్ ప్రైజ్ జాబితాలో ఏపీ టీచర్

లండన్: గ్లోబల్ టీచర్ ప్రైజ్–2023 విజేతను ఎంపిక చేసేందుకు రూపొందించిన జాబితాలో భారత్‌కు చెందిన ఇద్దరు ఉపాధ్యాయుల పేర్లున్నాయి. టాప్–50 జాబితాలో ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా భట్టిప్రోలు మండలం ఐలవరం జడ్పీహెచ్ఎస్‌లో పనిచేస్తున్న పి.హరికృష్ణతోపాటు బెంగాల్‌లోని ఆసన్‌సోల్ జిల్లాకు చెందిన ప్రాథమిక పాఠశాల టీచర్ దీప్ నారాయణ్ నాయక్ ఉన్నారు. 130 దేశాల నుంచి అందిన 7 వేలకు పైగా నామినేషన్ల నుంచి ఈ 50 మందిని ఎంపిక చేశారు. తుది జాబితాలో ఉన్న 10 మంది నుంచి విజేతను ఈ ఏడాది చివర్లో గ్లోబల్ టీచర్ ప్రైజ్ అకాడమీ ప్రకటించనుంది. వర్కీ ఫౌండేషన్, యునెస్కో, యూఏఈకి చెందిన దుబాయ్ కేర్స్ కలిసి ఏటా విజేతకు ఈ అవార్డు కింద 10 లక్షల అమెరికన్ డాలర్లను అందజేస్తాయి.

కృష్ణ ‘చక్రం’

సూర్యుని కంటే 650 కోట్ల రెట్లు పెద్ద కృష్ణబిలం!

వర్తులాకృతిలో గిరగిరా తిరుగుతున్న వైనం



కృష్ణ బిలాల అధ్యయనంలో కీలక మలుపు. గెలాక్సీ ఎం87లో ఉన్న అతి భారీ కృష్ణబిలం ఒకటి భూచక్రం మాదిరిగా వర్తులాకారంలో గిరగిరా తిరుగుతోంది. ఇది మనకు 5.5 కోట్ల కాంతి సంవత్సరాల దూరంలో కన్యా నక్షత్ర రాశిలో ఉంది. దీనికి సంబంధించి రెండు దశాబ్దాల పాటు సేకరించిన డేటాను అధ్యయనం చేసిన మీదట సైంటిస్టులకు ఈ విశేషం చిక్కింది. అందులో భాగంగా ఈ కృష్ణబిలానికి సంబంధించి నాలుగేళ్ల క్రితం ఈవెంట్ హోరైజాన్ టెలీస్కోప్ తీసిన ఫొటోను అధ్యయనం చేసి, అది నిలువుగానూ, పక్కలకూ గిరగిరా తిరుగుతోందని తేల్చారు. ఇలా తేలడం ఇదే మొదటిసారి. కృష్ణ బిలాల అధ్యయనంలో దీన్ని కీలక మైలురాయిగా భావిస్తున్నారు.

- కృష్ణ బిలం సమీపానికి వచ్చిన ప్రతి వస్తురాశినీ దాని తాలూకు డిస్క్ లోనికి లాక్కునే క్రమంలో ఇలా తిరుగుతోందట.
- ఇది అచ్చం సౌర వ్యవస్థలోని గురుత్వాకర్షణ బలాల కలయిక తదితరాల ప్రభావంతో భూమి భ్రమణం, పరిభ్రమణం చేస్తున్న తీరును పోలి ఉందట.
- ఈ సరికొత్త సమాచారం చాలా థ్రిల్లింగ్ గా ఉందని దీనిపై సమర్పించిన అధ్యయన పత్రానికి లీడ్ గా వ్యవహరించిన ప్రొఫెసర్ యుజూ కుయ్ చెప్పుకొచ్చారు.
- ప్రపంచవ్యాప్తంగా 45 అంతర్జాతీయ అంతరిక్ష పరిశోధకులతో కూడిన బృందం నాలుగేళ్ల పాటు ఈ అంశంపై లోతుగా పరిశోధించింది.

తెలిసింది గోరంతే

- అత్యంత భారీగా ఉండే కృష్ణబిలాల అధ్యయనం చాలా కష్టం.
- ఎందుకంటే అవి కాంతితో సహా అన్నింటినీ తమలోకి లాగేసుకుంటాయి.
- వీటికి సంబంధించి ఇప్పటిదాకా మనకు అందుబాటులో ఉన్న సమాచారం కూడా చాలా స్వల్పం.

\- సాక్షి, నేషనల్ డెస్క్

గాల్లోనే ఊపిరి పోశారు!

- ఆర్నెల్ల హృద్రోగ చిన్నారికి హఠాత్తుగా శ్వాస సమస్య
- వెంటనే స్పందించి చికిత్స చేసిన వైద్యులు
- వారిలో ఒకరు ఐఏఎస్ అధికారి
- ఇండిగో విమానంలో ఉద్విగ్న క్షణాలు

న్యూఢిల్లీ: అది శనివారం ఉదయం వేళ. రాంచీ నుంచి ఢిల్లీ వెళ్తున్న ఇండిగో విమానం. బయల్దేరి అప్పటికి 20 నిమిషాలైంది. ఇంకో గంట ప్రయాణం ఉంది. ప్రయాణికుల్లో పుట్టుకతోనే తీవ్ర హృద్రోగ సమస్యతో బాధ పడుతున్న ఒక ఆర్నెల్ల చిన్నారి. తల్లిదండ్రులు తనను చికిత్స కోసం ఢిల్లీ ఎయిమ్స్ తీసుకెళ్తున్నారు. ఉన్నట్టుండి ఊపిరాడక పాప అల్లాడింది. దాంతో తల్లి పెద్దపెట్టున రోదించింది. సాయం కోసం అర్థించింది. విషయం అర్థమై ప్రయాణికుల్లో ఉన్న ఇద్దరు డాక్టర్లు హుటాహుటిన రంగంలో దిగారు. తనకు తక్షణం సాయం అందించారు. విమానంలో పెద్దలకు ఉద్దేశించి అందుబాటులో ఉండే ఆక్సిజన్ కిట్ నుంచే పాపకు శ్వాస అందించారు. ఎయిర్ హోస్టెస్ వద్ద అందుబాటులో ఉన్న ఎమర్జెన్సీ కిట్ నుంచే మందులను వాడారు. అలా ఏకంగా గంట పాటు తన ప్రాణం నిలబెట్టారు. అంతసేపూ ప్రయాణికులతో పాటు సిబ్బంది కూడా ఊపిరి బిగబట్టి దీన్నంతా ఉత్కంఠతో చూస్తూ గడిపారు. విమానం ఢిల్లీలో దిగుతూనే అక్కడ అప్పటికే అందుబాటులో ఉన్న ఎమర్జెన్సీ వైద్య బృందం చిన్నారిని హుటాహుటిన ఆస్పత్రికి తరలించింది. దాంతో ప్రయాణికులతో పాటు అందరూ తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నారు.

ఆ 15 నిమిషాలు...

ఇలా చిన్నారి ప్రాణాలను నిలబెట్టిన వైద్యుల్లో ఒకరు ఐఏఎస్ అధికారి కావడం విశేషం! ఆయన పేరు డాక్టర్ నితిన్ కులకర్ణి. జార్ఖండ్ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శిగా ఉన్నారు. మరొకరు డాక్టర్ మొజమ్మిల్ ఫిరోజ్. రాంచీలోని సదర్ ఆస్పత్రిలో పని చేస్తున్నారు. చిన్నారి పుట్టుకతోనే పేటెంట్ డక్టస్ అర్టరియోసిస్ అనే హృద్రోగంతో బాధ పడుతోందని వారు చెప్పారు. ‘మేం వెంటనే రంగంలో దిగి పాపకు ఆక్సిజన్ అందివ్వడంతో పాటు థియోఫైలిన్ ఇంజక్షన్ ఇచ్చాం. అలాగే తల్లిదండ్రులు తమ వెంట తెచ్చిన డెక్సోనా ఇంజక్షన్ కూడా బాగా పని చేసింది. హార్ట్ బీట్ ను స్టెతస్కోప్ తో చెక్ చేస్తూ వచ్చాం. తొలి 15 నుంచి 20 నిమిషాలు చాలా భారంగా గడిచింది. పెద్దగా ఏమీ పాలుపోలేదు. కాసేపటికి పాప స్థితి క్రమక్రమంగా మెరుగైంది’ అని వారు తమ అనుభవాన్ని వివరించారు. సహ ప్రయాణికుల్లో పలువురు వారి అమూల్య సేవను మెచ్చుకుంటూ ఎక్స్‌లో మెసేజీలు చేశారు.

నైట్ క్లబ్‌లో అగ్ని ప్రమాదం..13 మంది సజీవ దహనం

మాడ్రిడ్: స్పెయిన్‌లోని ముర్సియా నగరంలోని ఓ నైట్ క్లబ్‌లో సంభవించిన అగ్ని ప్రమాదంలో 13 మంది సజీవ దహనమయ్యారు. మరో నలుగురు ఊపిరాడక అస్వస్థతకు గురయ్యారు. ప్రముఖ టియేటర్ నైట్ క్లబ్‌లో ఉదయం 6 గంటల సమయంలో మొదలైన మంటలు భవనమంతటా వేగంగా వ్యాపించాయని అధికారులు తెలిపారు. లోపల మరికొంత మంది చిక్కుకుని ఉంటారని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. భవనం పైకప్పు కూలుతుందనే భయంతో ఫైర్ సిబ్బంది లోపలికి వెళ్లలేకపోతున్నారని చెప్పారు.

భారత్‌కు శివాజీ ఆయుధం



ముంబై–లండన్: ఛత్రపతి శివాజీకి పట్టాభిషేకం జరిగి 350 ఏళ్లు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకొని లండన్ మ్యూజియంలో ఉన్న ఆయన ఆయుధాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకురానుంది. 17వ శతాబ్దంలో శివాజీ వాడిన పులిగోళ్ల ఆకారంలో ఉండే ఆయుధాన్ని వెనక్కి తీసుకురావడానికి లండన్‌లోని విక్టోరియా అల్బర్ట్ మ్యూజియం, మహారాష్ట్ర ప్రభుత్వం మంగళవారం నాడు ఒక అవగాహన ఒప్పందంపై సంతకాలు చేయనున్నాయి. ఇనుముతో తయారు చేసిన అత్యంత పదునైన వాఘ్ నఖ్ (పులి గోళ్లు) ఆయుధాన్ని శివాజీ ఎక్కువగా వాడేవారు. ఆ ఆయుధాన్ని చేత్తో పట్టుకొని మహారాజా శివాజీ కదనరంగంలో స్వైరవిహారం చేస్తూ ఉంటే శత్రువులు గడగ డలాడిపోయేవారు. బీజాపూర్ సేనా నాయకుడు అఫ్జల్ ఖాన్‌ను శివాజీ ఈ పులిగోళ్ల ఆయుధంతో చంపాడని చరిత్ర చెబుతోంది. తెల్లదొరల పాలనా కాలంలో 1818లో ఈస్ట్ ఇండియాకు చెందిన అధికారి జేమ్స్ గ్రాండ్ డఫ్ పులి గోళ్ల ఆయుధాల సెట్‌ను విక్టోరియా అల్బర్ట్ మ్యూజియానికి ఇచ్చేశారు. మళ్లీ ఇన్నేళ్ల తర్వాత శివాజీ వాడిన ఆయుధం మన దేశానికి రానుంది. ఛత్రపతి శివాజీ పట్టాభి షిక్తుడై అక్టోబర్ 3నాటికి 350 ఏళ్లు పూర్తి కానున్నాయి. అదే రోజు మహారాష్ట్ర సాంస్కృతిక వ్యవహారాల మంత్రి సుధీర్ ముంగంటివార్ ఒప్పంద పత్రాలపై సంతకం చేయనున్నారు.

మాల్దీవుల ఎన్నికల్లో చైనా అనుకూలవాది గెలుపు



ముయిజ్

మాలె: మాల్దీవుల అధ్యక్ష ఎన్నికల్లో ప్రతిపక్ష నేత మహ్మద్ ముయిజ్ 53 శాతం ఓట్లతో అనూహ్య విజయం సాధించారు. ప్రస్తుత అధ్యక్షుడు ఇబ్రహీం మహ్మద్ సోలెహ్‌కు 46 శాతం ఓట్లు రాగా, మొత్తమ్మీద 18వేల మెజారిటీతో ముయిజ్ విజయం సాధించారని అక్కడి మీడియా తెలిపింది. అధ్యక్ష బరిలోకి ఆలస్యంగా దిగిన ముయిజ్ రెండో రౌండ్‌లో విజయం సాధించడం గమనార్హం. సెప్టెంబర్‌లో జరిగిన మొదటి రౌండ్ పోలింగ్ ముయిజ్, సోలెహ్‌ల్లో ఎవ్వరికీ 50 శాతం పైగా ఓట్లు దక్కలేదు. దీంతో, శనివారం రెండో రౌండ్ పోలింగ్ జరిగింది. ముయిజ్‌కు చెందిన పీపుల్స్ నేషనల్ కాంగ్రెస్‌ను చైనా అనుకూల పార్టీగా భావిస్తుంటారు. అధికారంలోకి వస్తే మాల్దీవుల్లో ఉన్న భారత్ బలగాలను వెనక్కి పంపించివేస్తానని, భారత్‌పై ఆధారపడటం తగ్గిస్తానని హామీ ఇచ్చారు.

భారత్‌లో అఫ్గాన్ ఎంబసీ మూసివేత

న్యూఢిల్లీ: భారత్‌లో రాయబార కార్యాలయాన్ని అఫ్గానిస్తాన్ మూసివేసింది. ఆదివారం నుంచి కార్యకలాపాలన్నీ నిలిపివేస్తున్నట్టు ప్రకటించింది. అఫ్గానిస్తాన్‌లో అష్రాఫ్ ఘనీ ప్రభుత్వాన్ని కూల్చివేసి తాలిబన్లు అధికారంలోకి వచ్చిన రెండేళ్ల తర్వాత భారత్‌లో దౌత్యపరమైన కార్యకలాపాలన్నీ నిలిపివేయాలని నిర్ణయించింది. ఈ మేరకు ఢిల్లీలోని అఫ్గాన్ రాయబార కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. వనరుల కొరత, సిబ్బంది కొరతతో దౌత్య కార్యాలయాన్ని నిర్వహించలేక ఈ నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించింది. పనిలో పనిగా భారత్‌పై కూడా ఆరోపణలు గుప్పించింది. భారత ప్రభుత్వం నుంచి సరైన సహకారం అందకపోవడం కూడా రాయబార కార్యాలయాన్ని మూసివేయడానికి కారణమని ఆ ప్రకటనలో పేర్కొంది. భారత్ సహా ఎన్నో దేశాలు అఫ్గాన్‌లో తాలిబన్ ప్రభుత్వాన్ని ఇంకా గుర్తించడం లేదని వాపోయింది.

స్వచ్ఛ భారత్.. స్వాస్థ్ భారత్

- దేశవ్యాప్తంగా ‘స్వచ్ఛతా కీ సేవా’
- శ్రమదానంలో పాల్గొన్న లక్షలాది మంది ప్రజలు
- ఢిల్లీలో రహదారిని శుభ్రం చేసిన ప్రధాని నరేంద్ర మోదీ
- పరిసరాల పరిశుభ్రతకు ఫిట్‌నెస్, ఆరోగ్య సంరక్షణను జోడించామని వెల్లడి

న్యూఢిల్లీ: జాతిపిత మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకొని దేశవ్యాప్తంగా ‘స్వచ్ఛతా కీ సేవా’ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదివారం ఢిల్లీలో లాంఛనంగా శ్రీకారం చుట్టారు. స్వయంగా చీపురు చేతపట్టి రహదారిని శుభ్రం చేశారు. ఆయన ఈ శ్రమదాన కార్యక్రమంతో వినూత్నంగా ఫిట్‌నెస్, ఆరోగ్య సంరక్షణను కూడా జోడించారు. ప్రముఖ ఫిట్‌నెస్ ఇన్‌ఫ్లూయెన్సర్ అంకిత్ బైయాన్‌పూరియాతో కలిసి శ్రమదానంలో పాల్గొన్నారు. ప్రధానమంత్రి పిలుపుమేరకు దేశమంతటా అన్ని రాష్ట్రాల్లో జరిగిన స్వచ్ఛతా కీ సేవాలో లక్షలాది మంది స్వచ్ఛందంగా పాలుపంచుకున్నారు. గంటపాటు శ్రమించారు. తమ పరిసరాలను శుభ్రం చేసుకున్నారు. మార్కెట్లు, జల వనరులు, బస్ స్టాండ్లు, టోల్ వసూలు కేంద్రాలు, గోశాలలు, జంతు ప్రదర్శనశాలలు, సముద్ర తీర ప్రాంతాలు, ఆలయాలు, ప్రార్థనా మందిరాలు, పాఠశాలలు, కళాశాలల్లోనూ శ్రమదానం చేశారు. 4 నిమిషాల నిడివి గల తన శ్రమదానం వీడియోను ప్రధాని మోదీ తన అధికారిక ‘ఎక్స్’లో షేర్ చేశారు. ‘‘నేడు దేశమంతా స్వచ్ఛతపై దృష్టి పెట్టింది. నేను, అంకిత్ బైయాన్‌పూరియా స్వచ్ఛతా కార్యక్రమంలో పాల్గొన్నాం. కేవలం పరిసరాలను శుభ్రం చేయడమే కాదు, ఫిట్‌నెస్, ఆరోగ్య సంరక్షణను కూడా జతకలిపాం. ఇదంతా స్వచ్ఛ భారత్, స్వాస్థ్ భారత్ కోసమే’’ అని మోదీ ఉద్ఘాటించారు.

9.20 లక్షలకుపైగా ప్రదేశాల్లో..

స్వచ్ఛతా కీ సేవా కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. వివిధ వర్గాల ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. కేంద్ర మంత్రులు, బీజేపీ నాయకులు, ప్రభుత్వ ఉద్యోగులు, మహిళలు, విద్యార్థులు చీపుర్లకు పనిచెప్పారు. ఇళ్ల చుట్టుపక్కన, బహిరంగ ప్రదేశాల్లో చెత్తాచెదారం ఊడ్చేశారు. ప్రభుత్వేతర స్వచ్ఛంద సంస్థలు, మార్కెట్ సంఘాలు, స్వయం సహాయక సంఘాలు, ధార్మిక సంస్థలు, వాణిజ్య సంఘాలు, ప్రైవేట్ కంపెనీలు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నాయి. దేశవ్యాప్తంగా 9.20 లక్షలకుపైగా ప్రదేశాల్లో ఈ కార్యక్రమం జరిగిందని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా, రాష్ట్ర ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ శ్రమదానం చేశారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఢిల్లీలోని ఝుండేవాలన్ ఏరియాలో శ్రమదానంలో పాల్గొన్నారు. భారత వైమానిక దళం(ఐఏఎఫ్) చీఫ్ ఎయిర్ మార్షల్ వీఆర్ చౌదరి ఢిల్లీలో స్వచ్ఛతా యజ్ఞంలో భాగస్వాములయ్యారు. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సీతాపూర్‌లో ‘స్వచ్ఛతా పఖ్వాడా’ నిర్వహించారు.


‘చెత్త రహిత భారత్’ను సాధిద్దాం

దేశాన్ని పరిశుభ్రంగా మార్చాలని కేంద్ర ప్రభుత్వం తీర్మానించుకుందని, ఇదొక పెద్ద సవాలు అయినప్పటికీ చేసి చూపిస్తామని కేంద్ర మంత్రి ఆర్‌కే సింగ్ పేర్కొన్నారు. స్వచ్ఛతా యజ్ఞంతో మహాత్మా గాంధీకి నివాళులర్పిద్దామని కేంద్ర మంత్రి హార్దీప్ సింగ్ పురి ప్రజలకు పిలుపునిచ్చారు. స్వచ్ఛతా కీ సేవాలో పాల్గొన్ని, కొత్త చరిత్ర సృష్టిద్దామని ఉద్బోధించారు. ‘చెత్త రహిత భారత్’ అనే కలను నెరవేర్చుకుందామని సూచించారు.



స్వచ్ఛతా కీ సేవా కార్యక్రమంలో భాగంగా ఢిల్లీలో శ్రమదానం చేస్తున్న ప్రధాని మోదీ





ప్రజలు శ్రమదానంలో పాల్గొనాలంటూ క్రికెటర్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ కూడా పిలుపునిచ్చారు. ప్రధానమంత్రి మోదీ ఇచ్చిన ‘స్వచ్ఛ భారత్’ పిలుపును ప్రజలు అందిపుచ్చుకుంటారని తాము ఆశిస్తున్నట్లు బీజేపీ ఎంపీ మీనాక్షి లేఖీ చెప్పారు.

స్లొవేకియాలో రష్యా అనుకూలవాది గెలుపు



రాబర్ట్ ఫికో

ప్రేగ్: యూరప్‌లోని చిన్న దేశం స్లొవేకియాలో ఎన్నికల ఫలితాలు అమెరికా, యూరప్ దేశాలకు కంగారు పుట్టిస్తున్నాయి. రష్యా అనుకూల మాజీ ప్రధాని రాబర్ట్ ఫికోకు చెందిన వామపక్ష స్మెర్(డైరెక్షన్)పార్టీ తాజాగా జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధిక సీట్లు సాధించింది. రష్యాతో జరుగుతున్న యుద్ధంలో ఉక్రెయిన్‌కు మొదట్నుంచీ పొరుగునే ఉన్న స్లొవేకియా మద్దతుగా నిలుస్తోంది. ఆయుధాలను సరఫరా చేస్తోంది. ఉక్రెయిన్ శరణార్థుల కోసం సరిహద్దులను తెరిచి ఉంచింది. తాము అధికారంలోకి వస్తే ఉక్రెయిన్‌కు మద్దతు ఉపసంహరించుకుంటామని, వలసలను అడ్డుకుంటామని, రష్యాపై ఆంక్షలను ఎత్తివేస్తామని ప్రజలకు ఫికో హామీ ఇచ్చారు. గతంలో రెండు పర్యాయాలు ఫికో ప్రధానిగా పనిచేశారు. తాజా ఎన్నికల్లో ఏ పార్టీకీ స్పష్టమైన మెజారిటీ రానప్పటికీ ఫికోయే ప్రభుత్వం ఏర్పాటు చేయొచ్చని పరిశీలకులు భావిస్తున్నారు. స్లొవేకియా ఎన్నికల ఫలితాల గెలుపు ప్రభావం జర్మనీ, ఫ్రాన్స్, స్పెయిన్ వంటి దేశాల్లో మరికొద్ది రోజుల్లో జరగనున్న జాతీయ, ప్రాంతీయ ఎన్నికలపై పడుతుందన్నది పరిశీలకుల అంచనా.

తుర్కియేలో ఆత్మాహుతి దాడి

అంకారా: తుర్కియే రాజధాని అంకారా నడిబొడ్డున ఆదివారం ఆత్మాహుతి దాడి జరిగింది. పార్లమెంట్ సమావేశాలను అధ్యక్షుడు ఎర్డోగన్ ప్రారంభించడానికి కొద్ది సేపటి ముందే ఈ ఘటన చోటుచేసుకుంది. ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు విదేశాంగ శాఖ కార్యాలయ భవనంలోకి ప్రవేశించేందుకు యత్నించారు. ప్రవేశ ద్వారం వద్ద వారిని పోలీసులు అడ్డుకున్నారు. వారిలో ఒకడు తనను తాను పేల్చేసుకోగా ఇద్దరు పోలీసులు గాయపడ్డారు. మరో దుండగుడిని పోలీసులు కాల్చి చంపారు. దాడి వెనుక కుర్దిష్ మిలిటెంట్లు లేదా ఐఎస్ ఉగ్రవాదులు ఉండొచ్చని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



పాత పింఛను విధానాన్ని మళ్లీ తేవాలంటూ ఆదివారం ఢిల్లీలోని రామ్‌లీలా మైదాన్‌లో ప్రభుత్వ ఉద్యోగుల నిరసన

పాత పింఛన్ పథకాన్ని పునరుద్ధరించాలి

ఢిల్లీ రామ్‌లీలా మైదాన్‌లో ప్రభుత్వ ఉద్యోగుల ధర్నా

న్యూఢిల్లీ: పాత పింఛన్ పథకాన్ని(ఓపీఎస్) పునరుద్ధరించాలని కేంద్ర ప్రభుత్వ, ఢిల్లీ ప్రభుత్వ ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఢిల్లీలోని రామ్‌లీలా మైదాన్‌లో ఆదివారం ‘పెన్షన్ శంఖనాథ్ మహార్యాలీ’ పేరిట భారీ ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 20కిపైగా రాష్ట్రాల నుంచి వేలాది మంది ఉద్యోగులు తరలివచ్చారు. ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త పింఛన్ పథకాన్ని వ్యతిరేకిస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. రిటైర్‌మెంట్ తర్వాత తమ జీవితానికి భరోసానిచ్చే పాత పింఛన్ పథకాన్ని పునరుద్ధరించాలని తేల్చిచెప్పారు. జాయింట్ ఫోరం ఫర్ రిస్టోరేషన్ ఆఫ్ ఓల్డ్ పెన్షన్ స్కీమ్, నేషనల్ జాయింట్ కౌన్సిల్ ఆఫ్ యాక్షన్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టినట్లు నిరసనకారులు వెల్లడించారు. 2004 జనవరి 1 తర్వాత ప్రభుత్వ ఉద్యోగంలో చేరినవారు కొత్త పింఛన్ పథకాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు ఆలిండియా రైల్వే మెన్స్ ఫెడరేషన్ జాతీయ కన్వీనర్ శివగోపాల్ మిశ్రా చెప్పారు.

కన్నడ సినీ నటుడు నాగభూషణ్ అరెస్టు

బెంగళూరు: కారును వేగంగా, నిర్లక్ష్యంగా నడిపి, ఒక మహిళ మరణానికి కారణమైన కన్నడ సినీ నటుడు నాగభూషణ్ ఎస్.ఎస్.ను పోలీసులు అరెస్టు చేశారు. నాగభూషణ్ కారు శనివారం రాత్రి బెంగళూరులోని వసంతపుర ప్రధాన రహదారిపై కృష్ణ(58), ప్రేమ(48) అనే దంపతులపైకి దూసుకెళ్లింది. వారిద్దరూ ఫుట్‌పాత్‌పై నడుస్తుండగా ఈ సంఘటన జరిగింది. తర్వాత కారు కొద్ది దూరం వెళ్లి, కరెంటు స్తంభాన్ని ఢీకొట్టి ఆగిపోయింది. ఈ సమయంలో కారును నాగభూషణ్ నడుపుతున్నట్లు పోలీసులు గుర్తించారు. ప్రమాదంలో ప్రేమ మృతిచెందగా, కృష్ణ తీవ్రంగా గాయపడ్డాడు. కారును నడిపిన నాగభూషణ్‌ను అరెస్టు చేశామని పోలీసులు వెల్లడించారు. ప్రమాద సమయంలో మద్యం సేవించి ఉన్నాడో లేదో తెలుసుకొనేందుకు అతడి రక్తపు నమూనాలు సేకరించామని అన్నారు. కారును స్వాధీనం చేసుకున్నామని, కేసు దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

అమెరికా, భారత్ బంధాలకు హద్దుల్లేవ్

అమెరికాలో ప్రవాస భారతీయుల సదస్సులో విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్



వాషింగ్టన్: అమెరికా, భారత్ మధ్య ద్వైపాక్షిక బంధాలకు హద్దుల్లేవని విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ అన్నారు. ఇరు దేశాల మధ్య సంబంధాలు అత్యున్నత స్థాయికి చేరుకున్నాయని, ఇరు దేశాలు పరస్పర అవసరాలు తీర్చుకుంటూ, సౌకర్యవంతమైన, అనుకూలమైన భాగస్వామ్యులుగా మెలగుతున్నాయని పేర్కొన్నారు. చంద్రయాన్ మాదిరిగా ఇరు దేశాల మధ్య బంధాలు చంద్రుడిని తాకాయని, అంతకుమించి హద్దుల్లేకుండా సాగిపోతున్నాయని అభివర్ణించారు. అమెరికాలో పర్యటిస్తున్న జైశంకర్ శనివారం ప్రవాస భారతీయులతో ఇండియా హౌస్‌లో సమావేశమయ్యారు. ఇక్కడ నిర్వహించిన సెలబ్రేటింగ్ కలర్స్ ఆఫ్ ఫ్రెండ్‌షిప్ కార్యక్రమానికి అమెరికాలో వివిధ రాష్ట్రాల నుంచి భారీ సంఖ్యలో ప్రవాస భారతీయులు తరలివచ్చారు. ప్రవాస భారతీయులనుద్దేశించి జై శంకర్ మాట్లాడుతూ ఇరు దేశాల మధ్య సంబంధాల్ని మరో కొత్త స్థాయికి తీసుకువెళతామని చెప్పారు. ప్రపంచంలో ఎన్నో మార్పులు వచ్చినా ఇరు దేశాల మధ్య సంబంధాలు పటిష్టంగా సాగుతున్నాయని, ఇక భవిష్యత్‌లో సరికొత్త రంగాల్లో అమెరికాతో కలిసి పని చేస్తామని వెల్లడించారు. భారత్‌లో నిర్వహించిన జీ–20 సదస్సుకి అమెరికా సహకారం అందించడం వల్లే విజయ వంతమైందని అన్నారు. ‘‘దేశాలు ఒకరితో ఒకరు వ్యాపారాలు చేస్తాయి. రాజకీయాలు చేస్తాయి. మిలటరీ బంధాలు కలిగి ఉంటాయి. విన్యాసాలు నిర్వహిస్తాయి. సాంస్కృతిక బదలాయింపులు ఉంటాయి. అయినప్పటికీ రెండు దేశాలు లోతైన మానవీయ సంబంధాలు కలిగి ఉండాలి. అప్పుడే ఆ బంధం సంపూర్ణమవుతుంది. ప్రస్తుతం భారత్, అమెరికా మధ్య అలాంటి సంబంధాలే ఉండాలి’’ అని జైశంకర్ వివరించారు.

మణిపూర్ విద్యార్థుల హత్య కేసు.. నలుగురి అరెస్ట్

ఇంఫాల్: మణిపూర్‌లో మళ్లీ హింసాత్మక నిరసనలకు దారి తీసిన ఇద్దరు విద్యార్థుల కిడ్నాప్, హత్య కేసుకు సంబంధించి సీబీఐ నలుగురిని అరెస్ట్ చేసింది. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి ఎన్. బైరన్ సింగ్ ‘ఎక్స్’లో ధ్రువీకరించారు. వారికి మరణ శిక్ష పడేలా చూస్తామని తన పోస్టులో తెలిపారు. ఇద్దరు విద్యార్థులు ఫిజమ్ హేమాంజిత్, హిజమ్ లింతోయిన్‌గాంబీల కిడ్నాప్, హత్యకు బాధ్యులైన దంపతులు సహా నలుగురిని పోలీసులు ఆదివారం చూర్‌చాంద్‌పూర్‌లో అరెస్ట్ చేశారని సీఎం చెప్పారు. వారిని ప్రత్యేక విమానంలో రాష్ట్రం వెలుపలికి తరలించినట్లు వెల్లడించారు. అయితే, వారిని ఎక్కడికి తీసుకెళ్లిందీ ఆయన వివరించలేదు.

అమెరికాకు తప్పిన షట్‌డౌన్ ముప్పు

స్వల్పకాలిక ద్రవ్యవినిమయ బిల్లుపై చివరిక్షణంలో బైడెన్ సంతకం



వాషింగ్టన్: అమెరికాకు షట్‌డౌన్ ముప్పు తాత్కాలికంగా తప్పింది. వార్షిక ద్రవ్య వినిమయ బిల్లుని ఆమోదించడానికి ప్రతిపక్ష రిపబ్లికన్లు ససేమిరా అనడంతో బిల్లులు చెల్లించలేక అగ్రరాజ్యం ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయే ప్రమాదకరకర పరిస్థితులు వచ్చాయి. అయితే శనివారం రాత్రి చివరి క్షణంలో స్వల్పకాలిక బిల్లుకి రిపబ్లికన్లు ప్రతినిధుల సభలో ఆమోదించారు. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ చివరి క్షణంలో తాత్కాలిక నిధుల విడుదల బిల్లుపై సంతకాలు చేశారు. దీంతో దేశంలో వివిధ పథకాలు, సైనికులు, ప్రభుత్వ జీత భద్రతాలకు మరో 45 రోజులు ఢోకా లేదు. ఈ బిల్లు నుంచి ఉక్రెయిన్‌కు అందించే ఆర్థిక సాయాన్ని మినహాయించారు. అమెరికాలో కొత్త ఆర్థిక సంవత్సరం అక్టోబర్ 1 నుంచి ప్రారంభమవుతుంది. సెప్టెంబర్ 30 అర్ధరాత్రి 12 గంటల్లోగా ద్రవ్యవినిమయ బిల్లుల్ని ఆమోదించాల్సి ఉంది. అయితే ప్రతినిధుల సభలో మెజార్టీ కలిగిన రిపబ్లికన్లు ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లుల్ని ఆమోదించడానికి నిరాకరించారు. ప్రతినిధుల సభ స్పీకర్ మెకార్థీ రిపబ్లికన్ పార్టీకి చెందినవారే అయినప్పటికీ ద్రవ్య బిల్లుల్ని అడ్డుకుంటే ప్రజలకి ఇబ్బందులకు గురవుతారని నచ్చజెప్పడంతో వారు ఒక్క మెట్టు దిగారు. స్పీకర్ ప్రతిపాదించిన స్వల్పకాలిక బిల్లుకు ఆమోదం తెలిపారు. దీంతో అమెరికాలో ఫెడరల్ ప్రభుత్వానికి ఉపశమనం లభించింది.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
సోమవారం : 2 : అక్టోబర్ : 2023

సార్థకమైన బతుకు బతకాలి: సీఎం

శివాజీనగర: ప్రతి ఒక్కరూ విశ్వమానవునిగా బ్రతికి, అలాగే నిష్క్రమించాలని సీఎం సిద్దరామయ్య అన్నారు. ఆదివారం నగరంలో రవీంద్ర కళాక్షేత్రలో ఏర్పాటు చేసిన ప్రపంచ వయో వృద్ధుల దినోత్సవాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. వృద్ధులను గౌరవించాలి, వారు చూపిన విలువలను పాటించాలని అన్నారు. మనం ఎన్నేళ్లు బతుకుతామనే దానికంటే ఉన్నన్ని రోజులు సార్థకమైన బతుకు సాగించటమే ఉత్తమమైనదన్నారు. రాబోయే బడ్జెట్‌లో వృద్ధుల నెలవారి పింఛన్‌ను పెంచుతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పద్మశ్రీ పురస్కార గ్రహీత హిరేకళ హాజబ్బ, సీనియర్ న్యాయవాది పీ.ఎస్.రాజగోపాల్, యోగా గురువు డీ నాగరాజ్, సంబాళ వాదకుడు హణమంత గోవిందప్ప హుగార తదితరులను సన్మానించారు.

న్యూస్‌రీల్

స్వచ్ఛతా సేవ



తుమకూరు: ప్రధాని మోదీ పిలుపు మేరకు తుమకూరు మహానగర పాలికే, రోటరి, విద్యానగర నాగరిక సమితి ఆధ్వర్యంలో ఆదివారం స్వచ్ఛతా ఆందోళన నిర్వహించారు. విద్యానగర ఉద్యానవనంలో చెత్తను తొలగించి శుభ్రం చేశారు. పాలికె అధికారులు, నగరవాసులు పాల్గొన్నారు.

కావేరికి పరిష్కార సూత్రం కావాలి: ఎస్ఎం

బనశంకరి: కావేరి నదీ జలాల పంపకానికి తగిన పరిష్కార సూత్రాన్ని రూపొందించాలని మాజీ సీఎం ఎస్.ఎం.కృష్ణ తెలిపారు. ఆదివారం నగరంలో విలేకరులతో మాట్లాడుతూ నాలుగు రాష్ట్రాలతో చర్చించి సంకష్టసూత్రం ద్వారా నీటి నిర్వహణ చేయాలన్నారు. తాను సీఎంగా ఉన్నప్పుడు కూడా వివాదం వస్తే అప్పటి ప్రధాని వాజ్‌పేయి ఉభయరాష్ట్రాల ముఖ్యమంత్రులతో సమావేశం నిర్వహించి రాజీ చేయడానికి ప్రయత్నించినప్పటికీ సఫలం కాలేదన్నారు, అంతిమంగా సుప్రీం కోర్టును ఆశ్రయించామన్నారు. జేడీఎస్-బీజేపీ పొత్తుపై మాట్లాడానికి ఎస్ఎం కృష్ణ నిరాకరిస్తూ నేను ప్రస్తుతం రాజకీయాల్లో లేనని అన్నారు.

వృద్ధులను గౌరవించాలి



వృద్ధులకు సన్మానోత్సవం

మండ్య: పెద్దల పట్ల ప్రతి ఒక్కరూ గౌరవంతో నడుచుకోవడంతో పాటు వారు చూపిన మంచిమార్గంలో ముందుకు సాగాలని జిల్లా దివ్యాంగుల సంక్షేమ శాఖ అధికారి రోహిత్ అన్నారు. ఆదివారం జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో వయో వృద్ధుల దినోత్సవం నిర్వహించారు. పలువురు వృద్ధులను సన్మానించి మాట్లాడారు. పెద్దలు ఎంతో అనుభవం కలిగి ఉంటారని, వారు నేర్పిన విలువలను కాపాడుకుంటూ జీవించాలని తెలిపారు.

దేశద్రోహులకు కాంగ్రెస్ మద్దతు: శోభ

శివాజీనగర: బెంగళూరులోని కేజీ హళ్లి, డీజే హళ్లి అల్లర్లలో సొంత ఎమ్మెల్యేకు కాంగ్రెస్ మద్దతు ఇవ్వలేదని, ఎమ్మెల్యే ఇల్లు కాల్చినా ఎవరూ వెళ్లలేదని, ముందుగా తామే అక్కడికి వెళ్లామని కేంద్ర మంత్రి శోభా కరంద్లాజె అన్నారు. డీజే హళ్లి, హుబ్లీ గొడవల్లో కాంగ్రెస్ దేశ ద్రోహులకు అండగా నిలిచింది, అక్కడ తప్పు జరిగిందని కాంగ్రెస్‌కు నేడు అర్థమవుతోందని ఆమె ధ్వజమెత్తారు. ఆదివారం చిక్కమగళూరులో విలేకరులతో మాట్లాడిన ఆమె, నాటి గలాటాల్లో కే.జే.హళ్లి, డీ.జే.హళ్లి ఒక విధంగా స్మశానమయ్యాయి, బీజేపీ ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకురావటంతో పాటుగా ఒక వర్గాన్ని మెప్పించేందుకు కాంగ్రెస్ కుట్ర పన్నిందన్నారు. దీనిపై న్యాయసమ్మతంగా విచారణ జరిపితేనే దోషులెవరో తెలుస్తుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతికి పాల్పడుతూ ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని విమర్శించారు. కావేరి నీటి విషయంలో సర్కారు పూర్తిగా విఫలమైంది, ఇక గ్యారంటీ పథకాలు సగం మందికి కూడా అందడం లేదు, దరఖాస్తు చేయడానికి వెళ్తే సర్వర్ డౌన్ అని చెబుతున్నారని మండిపడ్డారు. చివరికి కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు కూడా అసంతృప్తి ఏర్పడిందన్నారు.

బాపూని మరిచారా?

- రాజధానిలో గాంధీజీ స్మారకాల పరిరక్షణ ఏదీ?
- బెంగళూరుతో జాతిపితకు ప్రగాఢ అనుబంధం
- స్వాతంత్రోద్యమ కాలంలో 14 సార్లు సందర్శన
- నేడు అహింసామూర్తి జయంతి

శివాజీనగర: నిరాడంబరత, అహింస ద్వారా మహాత్మాగాంధీ యావత్ ప్రపంచానికే ఆదర్శనీయులయ్యారు. కాలగమనంలో కొన్ని సిద్ధాంతాలు పాతబడతాయి. కొందరు ప్రముఖులు కనుమరుగవుతారు. అయితే ఆయన మాత్రం జాతిపితగా గౌరవాన్ని అందుకుంటున్నారు. దేశాన్ని తెల్లదొరల దాస్యశృంఖలాల నుంచి విముక్తి కల్పించిన పోరాటంలో గాంధీ పాత్ర ఎనలేనిది. అలాగే కర్ణాటకకు గాంధీజీతో ఎనలేని అనుబంధం ఉంది.

పాడుబడిన గాంధీ బావి

1934లో మొట్టమొదటి సారిగా బెంగళూరుకు వచ్చిన మహాత్మాగాంధీ కెంగేరి ప్రాంతాన్ని సందర్శించారు. అంటరానితనంపై పోరాటంలో భాగంగా కెంగేరిలోని ఓ హరిజన వాడను సందర్శించారు.



బాలుని వెంట బాపూజీ... బెంగళూరు గాంధీభవన్ ఆవరణలో ఉన్న విగ్రహం

ఆ ప్రాంతంలోని గ్రామ సేవా కేంద్రంవారు తవ్విన ఓ బావిని ఆయన ఈ పర్యటనలో ప్రారంభించారు. బావిలోని నీటిని ఓ వెండి చెంబుతో తోడి వాటిని అక్కడే ఉన్న దళితులకు అందించారు. అప్పటి నుంచి ఆ బావిని గాంధీ బావిగా పిలుస్తున్నారు. అయితే ప్రస్తుతం ఎటువంటి సంరక్షణ లేక ఆ బావి పాడుబడింది.

సమరయోధుల మొర

గాంధీ పర్యటించిన స్థలాలు, భవనాలను భావి తరాల కోసం కాపాడుకోవాలి. కానీ పాలకుల నిర్లక్ష్యంతో పాడుబడిపోతున్నాయని పలువురు స్వాతంత్ర్య సమరయోధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బాపూజీ జ్ఞాపకాలను కాపాడుకోవడానికి ఇప్పటికైనా చొరవ చూపాలని సూచించారు.

ఘనమైన గాంధీభవన్



జాతిపిత జ్ఞాపకంగా బెంగళూరులోని గాంధీభవన్ మాత్రమే మిగిలి ఉంది. ఈ భవనాన్ని మహాత్ముడు సాహిత్య గోష్టి కోసం ఉపయోగించేవారు. గాంధీ స్మారక నిధితో ఈ భవన్ నడుస్తోంది. ఇందులో గాంధీజీ జీవితంలోని ముఖ్య ఘట్టాలన్నింటి ఛాయాచిత్రాల్ని పొందుపరిచారు. స్వాతంత్ర్యోద్యమంలో గాంధీజీ రాసిన లేఖలు, ఆయన ప్రజలకు ఇచ్చిన పిలుపుల సందేశాలను ఇక్కడ నిక్షిప్తం చేశారు. అంత విలువైన సంపద నేడు నిర్లక్ష్యానికి గురవుతోంది. గాంధీజీ జీవితాన్ని గురించి శోధించాలనుకునే ఔత్సాహికులకు సరైన పుస్తకాలు అందుబాటులో లేవనే విమర్శలున్నాయి. భవన నిర్వహణకు నిధులు కూడా సక్రమంగా ఇవ్వడం లేదని సిబ్బంది వాపోయారు.



మహాత్ముని వెంట స్వాతంత్ర్య ఉద్యమానికి తరలిన ప్రజానీకానికి అద్దం పట్టే కళాఖండం. దీనిని గాంధీభవన్‌లో చూడవచ్చు



గాంధీ జయంతి సందర్భంగా సౌధ వద్ద బాలల ర్యాలీ

1934లో మొదటిసారి రాక

1934లో గాంధీజీ మొట్టమొదటిసారిగా ఉద్యాన నగరాన్ని సందర్శించారు. తరువాత 18 సార్లు రాష్ట్రాన్ని సందర్శిస్తే అందులో 14 సార్లు నగరానికి వచ్చారు. ఆయన బెంగళూరులో అనేక ప్రాంతాలలో సభలు, సమాలోచనలు జరిపారు. అయితే ఆ ప్రాంతాలను ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోంది. జాతిపిత జ్ఞాపకాలను స్మారక స్థలాలుగా అభివృద్ధి చేయాల్సింది పోయి అవి పాడుబడుతున్నా పట్టించుకోవడం లేదు.

జాతిపిత నడయాడిన చోట వినోద క్లబ్‌లు!

మద్యపానం మంచిది కాదని పోరాటాన్ని సాగించిన మహాత్ముడు నడిచిన చోటనే ఇప్పుడు విలాసవంత క్లబ్‌లు వెలిశాయి. ఇందులో ఎప్పుడూ మద్యం పొంగుతూ, జూదం సాగుతూ ఉంటుందంటే అతిశయోక్తి కాదు. మహాత్ముడు మల్లేశ్వరంలో అనేకసార్లు స్వాతంత్ర్య పోరాట సమావేశాలు నిర్వహించారు. ఇప్పుడు ఇక్కడే ఓ క్లబ్ ఏర్పాటైంది. నంది హిల్స్‌లో గాంధీజీ మూడు నెలల పాటు గడిపారు. ఆ ప్రాంతంలో కూడా ప్రస్తుతం ఓ క్లబ్ నడుస్తోంది. ప్రార్థనలు నిర్వహించిన కుమార పార్క్‌లో ప్రస్తుతం ఓ ఫైవ్‌స్టార్ హోటల్ వెలసింది.

ఈద్ మిలాద్ ముబారక్



ఆదివారం బెళగావి నగరంలో ముస్లింలు ఈద్ మిలాద్ ఊరేగింపు నిర్వహించారు. ఇందులో పాల్గొన్న ఓ చిన్నారి

నటుడు ప్రేమ్ రక్త లేఖ

యశవంతపుర: తమిళనాడుకు కావేరి నీటిని వదలడాన్ని వ్యతిరేకిస్తూ నటుడు ప్రేమ్ రక్తంతో లేఖ రాశాడు. రైతులు, కన్నడ సంఘాలు, సినీ ప్రముఖులు ఉద్యమాలు చేస్తుండడం తెలిసిందే. ఈ నేపథ్యంలో కర్ణాటకకు అన్యాయం జరుగుతోందని నటుడు ప్రేమ్ కూడా గొంతెత్తాడు. కావేరి మాది అంటూ రక్తంతో ప్రధాని మోదీకి లేఖ రాశారు.

ప్రైవేటు ఉపాధ్యాయుని దాష్టీకం

దొడ్డబళ్లాపురం: విద్యార్థినిని బెదిరించి నగ్న వీడియోలు తీసి లైంగిక వేధింపులకు గురిచేసిన ఉపాధ్యాయుడు కటకటాల పాలయ్యాడు. ఈ సంఘటన కనకపుర పట్టణంలో చోటుచేసుకుంది. పట్టణంలోని ప్రైవేటు పాఠశాలలో టీచర్ ఆంటోని (51), ఇతనికి సహకరించిన నందీష్ (29)లను అరెస్టు చేశారు. ఒక విద్యార్థినికి మాయమాటలు చెప్పి నగ్న వీడియోలు తీసి లైంగికంగా వేధించాడు. ఇతడికి నందీష్ సహకరించాడు. వీరి వేధింపులను తట్టుకోలేక బాలిక తల్లిదండ్రులకు చెప్పుకోగా వారు ఫిర్యాదు చేయడంతో పోలీసులు నిందితులను అరెస్టు చేశారు.

పుట్టినరోజు వేడుకలో మంటలు

- నలుగురికి తీవ్రగాయాలు

కృష్ణరాజపురం: చిన్నారి పుట్టిన రోజు వేడుకలను ఉత్సాహంగా జరపడానికి హీలియం బెలూన్లతో అలంకరించగా అవి పేలిపోయి ముగ్గురు చిన్నారులతో పాటు మరొకరికి తీవ్రంగా కాలిన గాయాలయ్యాయి. బెంగళూరు కాడుగోడి పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం రాత్రి ఈ సంఘటన జరిగింది. విజయ్ కుమార్ (44), ధ్యాన్(7), సంజయ్ (8), సోహిలా (3) గాయపడగా వారిని నగరంలోని విక్టోరియా ఆస్పత్రికి తరలించారు. ఓ చిన్నారి బర్త్ డే సందర్భంగా ఇంటిని హీలియం బెలూన్లతో అలంకరించారు. కొవ్వొత్తి తగిలి బెలూన్లు పేలిపోయి మంటలు వ్యాపించినట్లు తెలిసింది.




ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలలు

పూజగదిలో బుస్....



పడగ విప్పిన పాము

తుమకూరు: దేవుని గదిలో పాము బొమ్మను పెట్టుకుని నాగదేవత అని పూజలు చేస్తారు. అదే నిజమైన పాము వస్తే బెంబేలెత్తిపోతారు. ఆహారం వెతుక్కుంటూ వచ్చిన నాగుపాము ఒకటి ఇంటిలోకి వెళ్లి ఏకంగా దేవుని గదిలో తిష్టవేసింది. పడగ విప్పి బుస్ మంటున్న పామును చూసి ఇంట్లోనివారు కేకలు వేస్తూ పరుగులు తీశారు. ఈ సంఘటన తుమకూరు నగరంలోని యల్లాపురలోని వినాయక నగరలో ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది.



పామును పట్టి తీసుకొస్తున్న దిలీప్

సిద్దరాజు అనే వ్యక్తి ఇంటిలోని దేవుని గదిలోకి ఎక్కడి నుంచో నాగుపాము వచ్చింది. పూజ చేయాలని వచ్చిన సిద్దరాజు పామును చూసి భయపడిపోయాడు. పాములు పట్టడంలో నిపుణుడైన దిలీప్‌కు కాల్ చేయగా ఆయన వచ్చి పామును పట్టుకుని దేవరాయన దుర్గ అడవిలో వదిలిపెట్టాడు.

కర్మకాండలకు వచ్చి అనంతలోకాలకు

- కాలువలో మునిగి దంపతులు, కూతురు మృతి

మైసూరు: నుగు జలాశయం కుడి కాలువలోకి పడిపోయి దంపతులు, వారి కుమార్తె జలసమాధి అయ్యారు. ఈ దుర్ఘటన మైసూరు జిల్లాలోని హెచ్.డి.కోటె తాలూకాలోని చంగౌడనహళ్లి గ్రామంలో శనివారం సాయంత్రం జరిగింది. మహ్మద్ కపిల్ (42), అతని భార్య షావరా బాను (35), వారి కుమార్తె షాహిరాబాను (20) మృతులు. వీరు బెంగళూరులో పని చేసుకుంటూ నివాసం ఉంటున్నారు. వారి బంధువైన ఓ వృద్ధురాలు మరణించగా తిథి కార్యక్రమం కోసం వచ్చారు. తిథి ముగించుకొని కుమార్తె షాహిరాబాను నుగు జలాశయం కుడి కాలువలోకి వెళ్లి ముఖం కడుక్కుంటూ ఉండగా జారి పడిపోయింది. ఆమె కేకలు వేయడంతో తల్లిదండ్రులు కాపాడాలని ప్రయత్నించి వారు సైతం కాలువలోకి పడిపోయారు. నీటి ఉధృతి ఎక్కువగా ఉండడంతో మునిగిపోయారు. పోలీసులు, ఫైర్ సిబ్బంది చేరుకుని గాలింపు జరిపి ముగ్గురి మృతదేహాలను బయటికి తీసి ఆస్పత్రికి తరలించారు.



మృతుల కోసం కాలువలో గాలింపు

బీజేపీతో పొత్తు అవసరం

- నేతల భేటీలో దళపతులు

బనశంకరి: బీజేపీతో పొత్తును ఖరారు చేయడానికి జేడీఎస్ అధినేత హెచ్‌డీ దేవెగౌడ, మాజీ సీఎం హెచ్‌డీ.కుమారస్వామి ఆదివారం పార్టీ ఎమ్మెల్యేలు, నేతలతో బిడది వద్ద ఫాంహౌస్‌లో భేటీ నిర్వహించారు. పార్టీ రాష్ట్రాధ్యక్షుడు సీఎం ఇబ్రహీం పొత్తు పట్ల అసంతృప్తి వ్యక్తం చేసి ఈ నెల 16 తేదీన తన అనుచరులతో చర్చిస్తానని ప్రకటించగా, ఈ భేటీలో ఆయనను బుజ్జగించినట్లు తెలిసింది. బీజేపీతో పొత్తు వల్ల మనం లాభపడతామని, ప్రస్తుత రాజకీయాల్లో అవసరమని నేతలకు నచ్చజెప్పారు. పొత్తు గురించి కార్యకర్తలు గందరగోళానికి గురికారాదని, నియోజకవర్గాల్లో తలెత్తే సమస్యలను పరిష్కరిస్తామని, పార్టీని కాపాడుకోవడానికి తప్పదని వివరించారు.

చిరుప్రాయంలోనే చివరిశ్వాస

- బైక్‌ను ఢీకొన్న లారీ..
- ముగ్గురు బాలల మృతి

శివమొగ్గ: శివమొగ్గ జిల్లాలోని భద్రావతి తాలూకా హొళె హొన్నూరు వద్ద ఘోర ప్రమాదంలో ముగ్గురు బాలలు మరణించారు. జంబరఘట్ట గ్రామానికి చెందిన వికాస్ (17), యశ్వంత్ (17), శశాంక్ (17) మృతులు. శనివారం రాత్రి దగ్గరిలో కళ్లిహాళ గ్రామంలో చవితి నిమజ్జనానికి వీరు బైక్‌పై వెళ్లారు. తిరిగి వస్తుండగా లారీ ఢీకొట్టింది. ఎదురుగా ఒక బైక్ అడ్డదిడ్డంగా రావడంతో దానికి తప్పించబోయే క్రమంలో లారీ వీరి మీదకు దూసుకెళ్లింది. దీంతో ముగ్గురూ అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు. గగన్ అనే మరో యువకుడు తీవ్రంగా గాయపడగా శివమొగ్గలో మెగ్గాన్ ఆస్పత్రికి తరలించారు. హొళెహొన్నూరు పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు. కొంతసేపటిలోనే ఇంటికి వస్తున్నామని ఫోన్ చేశారని, అంతలోనే ఘోరం జరిగిందని మృతుల తల్లిదండ్రులు శోకసంద్రంలో మునిగిపోయారు.



ఢీకొన్న లారీ ఇదే, పడిపోయిన బైక్



● మైసూరు కిటకిట

రాష్ట్రంలో వరుసగా సెలవులు రావడంతో మైసూరులో రద్దీ పెరిగింది. ఆదివారం రాత్రి ప్యాలెస్ ముందు సందడి.

పార్వతీపుత్రా వీడ్కోలు



తుమకూరు: జిల్లాలోని శిర పట్టణంలో ఉన్న గణపతి దేవాలయం ఆవరణలో ప్రతిష్టించిన మహా గణపతి నిమజ్జనం ఆదివారం వేలాది మంది భక్తుల మధ్య వైభవంగా నిర్వహించారు. జానపద కళాకారుల బృందాలు, యువత నృత్యాల నడుమ గణేశుడు నిమజ్జనానికి తరలివెళ్లాడు.



నిమజ్జనం ఊరేగింపులో యువత కోలాహలం

క్లుప్తంగా

సర్కారీ కొలువులో సేవలు ప్రధానం



మహదేవ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: సర్కారీ కొలువులో ప్రజలకు సేవలు చేయడం ప్రధానమని రాయచూరు రూరల్ సీఐ సాబయ్య అన్నారు. ఆదివారం రాయచూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న మహాదేవ్ ఎస్ఐగా పదోన్నతి పొంది మాన్వికి బదిలీ అయిన సందర్భంగా ఆయనను సన్మానించి మాట్లాడారు. 34 ఏళ్ల పాటు పోలీస్ శాఖలో విధులు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ ప్రకాష్ డంబల్ తదితరులు పాల్గొన్నారు.

కొట్టూరేశ్వర స్వామి హుండీ లెక్కింపు

కంప్లి: కొట్టూరు శ్రీ గురు కొట్టూరేశ్వర స్వామి ఆలయ హుండీ లెక్కించారు. మార్చి నుంచి సెప్టెంబర్ వరకు భక్తులు రూ. 61.13 లక్షల నగదు స్వామి వారికి సమర్పించినట్లు ముజరాయి శాఖ కమిషనర్ గంగాధరప్ప ప్రకటించారు. ఈ సందర్భంగా పోలీసులు, బ్యాంక్ అధికారులు, శాఖ అధికారులు పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొన్న లారీ, ఇద్దరు దుర్మరణం

రాయచూరు రూరల్: బైక్‌ను లారీ ఢీకొనడంతో ఇద్దరు మృతి చెందిన ఘటన యాదగిరిలో చోటుచేసుకుంది. శనివారం రాత్రి హోసళ్లి క్రాస్ వద్ద ద్విచక్ర వాహనంపై యువకులు వస్తుండగా లారీ అతి వేగంగా వచ్చి బైక్‌ను ఢీకొంది. దీంతో బైక్‌లో ఉన్న కృష్ణ (21), ఆకాశ్ (19)లు అక్కడికక్కడే మృతి చెందినట్లు యాదగిరి ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ప్రైవేటు వీడియోలతో బ్లాక్‌మెయిలింగ్
నిందితుడి అరెస్ట్

దొడ్డబళ్లాపురం: వివాహితను బ్లాక్‌మెయిల్ చేస్తున్న వ్యక్తిని కార్వార మహిళా పోలీసులు అరెస్టు చేశారు. దక్షిణ కన్నడ జిల్లా పుత్తూరుకు చెందిన ప్రశాంత్‌భట్ ఓ వివాహితతో ఏకాంతంగా గడిపిన క్షణాలను వీడియోలు తీశాడు. డబ్బు కోసం బ్లాక్‌మెయిల్ చేశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకున్న పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు.

విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

రాయచూరు రూరల్: మస్కి తాలూకా అమీన్‌గడ ప్రభుత్వ హాస్టల్లో ఓ విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. పదో తరగతి చదువుతున్న అక్షత (16) బ్లేడ్‌తో చేయి, గొంతు కోసుకుంది. అనంతరం గట్టిగా అరవడంతో భయపడిన తోటి బాలికలు వంట వారికి సమాచారం ఇచ్చారు. హుటాహుటిన అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు వార్డెన్ గంగమ్మ తెలిపారు. ఆత్మహత్యాయత్నానికి కారణాలు తెలియ రాలేదని మస్కి పోలీసులు తెలిపారు.

ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి



మొక్కకు నీరు పోస్తున్న స్వామీజీలు

రాయచూరు రూరల్: ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని మంత్రి బోసురాజ్, ఎమ్మెల్యే శివరాజ్ పాటిల్ అన్నారు. ఆదివారం వ్యవసాయ విశ్వ విద్యాలయంలో సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి శివరాజ్ పాటిల్ ప్రతిష్టాన, మీనా ఏడీడీ చారిటీ ఇన్షియేటివ్ ఫౌండేషన్, బెంగళూరు సప్తగిరి, కలబుర్గి కిద్వాయ్ ఆస్పత్రి, జనహిత ఐకేర్ కేంద్రం, జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రపంచ వృద్ధుల దినోత్సవం, ఉచిత వైద్య శిబిరాలను ప్రారంభించి మాట్లాడారు. ఉచిత వైద్యాలకు సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి శివరాజ్ పాటిల్ ముందుకు రావడం అభినందనీయమని స్వామీజీలు అన్నారు.

శుభ్రతకు ప్రాధాన్యత



స్వచ్ఛత కార్యక్రమంలో కలెక్టర్ అక్రం పాషా

కోలారు: గాంధీ జయంతి పురస్కరించుకుని ఆదివారం నగరంలోని కలెక్టరేట్‌లో స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ అక్రం పాషాతో పాటు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ అక్రం పాషా మాట్లాడుతూ... పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. స్వచ్ఛ సేవ మహాత్ముడి కల అన్నారు. కార్యక్రమంలో నగరసభ కమిషనర్ శివానంద, తహసీల్దార్ హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

బళ్లారిలో గాంధీజీ జ్ఞాపకాలు



సుధాక్రాస్ వద్ద స్వాతంత్య్ర సంగ్రామ చిహ్నం



బళ్లారి రైల్వేస్టేషన్

సందర్భం | **నేడు జాతిపిత మహాత్మా గాంధీ జయంతి**

బళ్లారి రూరల్: రఘుపతి రాఘవ రాజారాం.. పతీతపావన సీతారాం, ఈశ్వర అల్లాతేరానాం సబ్‌కో సమ్మతి హే భగవాన్. ఇది శాంతిదూత మహాత్ముడు ఆలపించిన గీతం. శాంతి, అహింసా మార్గంలో తెల్లదొరలను తరిమి భరతమాతకు విముక్తిని కలిగించిన జాతిపిత, బాపూజీ, మోహన్‌దాస్ కరమ్‌చంద్ గాంధీని భారతీయులు గాంధీజీ, గాంధీతాతగా పిలుచుకొనే మహాత్మా గాంధీ జ్ఞాపకాలు చరిత్రపుటల్లో బళ్లారికి దక్కింది. జిల్లాలోని కూడ్లిగి, నగరంలోని కౌల్‌బజార్‌లో బాపూజీ చితాభస్మ జ్ఞాపకాలు సజీవంగా ఉన్నాయి. ఆ మహనీయుడి స్మృతుల్లో భారతావని తరిస్తోంది.

రెండు పర్యాయాలు బళ్లారికి బాపూజీ రాక

1921 స్వాతంత్య్ర ఉద్యమంలో భాగంగా బళ్లారికి మహాత్ముడు వచ్చారు ఈ సమయంలో ఆంధ్ర, కర్ణాటక కాంగ్రెస్ వర్గాల మధ్య విభేదాలను తొలగించడానికి నాటి బలుసు సాంబమూర్తి మైదానంలో (నేటి పాతబస్టాండు)లో చర్చలు జరిపారు. ఈ చర్చల్లో రెండు వర్గాల మధ్య సమోధ్య కుదరలేదు. దీంతో మనస్తాపం చెందిన గాంధీజీ నేరుగా బళ్లారి రైల్వేస్టేషన్‌కు రైలుకోసం వచ్చి ప్లాట్‌ఫారం మీదే విరమించాడు. ఆంగ్లేయుడైన స్టేషన్ మాస్టర్ వెయిటింగ్‌హాల్‌లో ఉండమన్నా అంగీకరించలేదు. రైలురాగానే టికెట్టు కొనుక్కొని వెళ్లిపోయాడు. 1934లో హరిజనోద్ధరణ ఉద్యమంలో భాగంగా రెండోసారి బళ్లారి జిల్లాకు వచ్చాడు. సండూరు, కూడ్లిగి, హరపనహళ్లిని సందర్శించాడు. ఈ సమయంలో సండూరు ప్రకృతి అందాలను తిలకించి ముగ్ధుడై సీ సండూర్ ఇన్ సెప్టెంబర్, అన్న వ్యాఖ్యాన్ని విజిటర్స్ పుస్తకంలో రాశాడు.



బళ్లారి రైల్వేస్టేషన్‌లో నాడు గాంధీజీ వేచి ఉన్న ప్రదేశంలో శిలా ఫలకం



కౌల్‌బజార్‌లో గాంధీజీ చితాభస్మం

స్వచ్ఛతకు వెల్లువెత్తిన స్పందన



చిక్కబళ్లాపురం: సిబ్బందితో కలిసి పిచ్చి మొక్కలు తొలగిస్తున్న జెడ్పీ సీఈఓ ప్రకాశ్



సుంద్రళ్లిలో రోడ్డును శుభ్రం చేస్తున్న ఇండో టిబెట్ బార్డర్ పోలీసులు

చిక్కబళ్లాపురం: మహాత్ముడి జయంతిని పురస్కరించుకొని ఆదివారం చేపట్టిన స్వచ్ఛతా హి సేవ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. చిక్కబళ్లాపురం నగర సమీపంలోని రంగస్థల శ్రీ రంగనాథ స్వామి ఆలయ ఆవరణలో జెడ్పీ, నగర సభ సిబ్బంది శ్రమదానం చేశారు. కళ్యాణిలో చెత్తా చెదారం తొలగించారు. జెడ్పీ సీఈఓ ప్రకాశ్, టీపీఎస్ సీఈఓ మంజునాథ్, తిప్పేనహళ్లి గ్రామ పంచాయతీ అధ్యక్షుడు శ్రీనివాస్ ఉపాధ్యక్షులు శైలజ, కార్యాలయాల ఉద్యోగులు పాల్గొన్నారు.

విజయపుర(బెంగళూరు గ్రామీణ) : విజయపుర పట్టణ సమీపంలోని సుంద్రళ్లిలో ఇండో టిబెట్ బార్డర్ పోలీసులు బెంగళూరు సెక్టారు ప్రధాన కార్యాలయం డిప్యూటీ ఇన్స్‌పెక్టర్ జనరల్ ఓపీ యాదవ ఆధ్వర్యంలో రోడ్లను శుభ్రం చేశారు. 15 రోజులపాటు స్వచ్ఛతా సేవ కార్యక్రమాలు చేపడుతామని డిప్యూటీ కమాండెంట్ మునేష్‌బాబు తెలిపారు.



రాష్ట్రంలో కరువు పరిస్థితికి అద్దం పట్టే చిత్రం ఇది. ఆదివారం బెళగావి జిల్లా రామదుర్గ తాలూకాలో ఎండిపోయిన కనిపిస్తున్న మలప్రభ నది. నది ప్రవాహం కరువై ఇసుక మేటలు తేలిన కొలాచి బ్యారేజ్



అరేబియా సముద్రంలో అలలు పోటెత్తుతున్నాయి. దీంతో మంగళూరు ఉచ్చిల వద్ద తరంగాల తాకిడికి కూలిపడిన పలు ఇళ్లు

తుంగభద్ర డ్యాం వెలవెల



తుంగభద్ర జలాశయంలో నీరు

- సగానికి క్షీణించిన నీటిమట్టం

బొమ్మనహాళ్: హొసపేటె వద్దనున్న తెలుగు, కన్నడ రాష్ట్రాల వరదాయిని తుంగభద్ర జలాశయంలో నీటి నిల్వ బాగా క్షీణించింది. ఇప్పుడు పూర్తిస్థాయి నీటిమట్టంతో తొణికిసలాడాల్సిన డ్యాంలో సగం నీరే ఉన్నాయి. ఆదివారం నీటి నిల్వ 55.737 టీఎంసీలకు తగ్గింది. నెల రోజుల క్రితం 79 టీఎంసీల నీరు ఉండేది. జలాశయం ఎగువ భాగంలో వర్షాలు తగ్గడం, ఎండల కారణంగా నీటి లభ్యత తగ్గిపోయింది. కాలువలకు నీటిని వదులుతుండడంతో జలాశయంలో మూడు రోజులకు 2 టీఎంసీల చొప్పున నీరు ఖాళీ అవుతోంది. డ్యాంలో ఆదివారం ఇన్‌ఫ్లో 1,220 క్యూసెక్కులు మాత్రమే ఉండగా అవుట్‌ఫ్లో 9,791 క్యూసెక్కులుంది.

గతేడాది 104 టీఎంసీలు

జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టం 1,633 అడుగులు కాగా 1,618 అడుగుల వరకు నీరు నిల్వ ఉంది. 105 టీఎంసీల పూర్తి స్థాయి మట్టానికి గాను 55 టీఎంసీలకు పరిమితం కావడంతో రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. ఆంధ్రా సరిహద్దుల్లో (105వ కిలోమీటర్ వద్ద) 1,670 క్యూసెక్కులు నీటి ప్రవాహం కొనసాగుతోంది. గతేడాది ఇదే సమయానికి 104 టీఎంసీల నీరు నిల్వతో, 42,089 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, 55,320 క్యూసెక్కుల అవుట్ ఫ్లోతో జలాశయం కళకళలాడేది.

వన్యజీవులను కాపాడుకుందాం

- వారోత్సవంలో గవర్నర్ పిలుపు
- ఆకట్టుకున్న వింటేజ్ వాహనాల ర్యాలీ

శివాజీనగర: అటవీ శాఖ ఏర్పాటు చేసిన 69వ వన్యజీవుల వారోత్సవం -2023 సందర్భంగా వన్యజీవుల సంరక్షణ కోసం వింటేజ్ వాహన అభియానను గవర్నర్ థావర్ చంద్ గెహ్లోట్ ఆదివారం రాజ్‌భవన్‌లో ప్రారంభించారు. ప్రాచీన గ్రంథాల్లో ప్రాణుల రక్షణ, సంరక్షణ గురించి రాశారని, మానవులు, వన్యజీవులు యుగ యుగాల నుంచి కలసికట్టుగా జీవిస్తున్నారని గవర్నర్ చెప్పారు. నేడు ఈ వన్యజీవులను సంరక్షించాల్సిన అవసరముందన్నారు. అందుకోసం అడవులు సమృద్ధిగా ఉండటం చాలా ముఖ్యమని తెలిపారు. దేశంలో వన్యప్రాణుల సంరక్షణ కోసం అనేక అభయారణ్యాలు, చట్టాల రక్షణ ఉందన్నారు.

అబ్బురపరిచిన వాహనాలు

ఈ సందర్భంగా భారతీయ చారిత్రక వాహనాల ఒక్కూట సహాయంతో అలనాటి పాత వాహనదారులు తరలివచ్చారు. చారిత్రక కార్లు, మోటార్ సైకిళ్లు ఆకట్టుకున్నాయి. వాహన యజమానులను గవర్నర్ అభినందించారు. ఈ చారిత్రక వింటేజ్ వాహన యానం వన్యజీవి పరిరక్షణకు అందరికీ స్ఫూర్తినివ్వాలన్నారు.ఈ కార్యక్రమంలో అటవీ మంత్రి ఈశ్వర్ ఖండ్రె, రవిప్రకాశ్, డీసీఎఫ్ ప్రభాకర్ ప్రియదర్శి, అనేకమంది ప్రముఖులు పాల్గొన్నారు.

రైఫిల్ షూటింగ్ క్రీడాకారులకు సదుపాయాలు

తుమకూరు: రైఫిల్ షూటింగ్ క్రీడ కోసం మహాత్మగాంధీ క్రీడా మైదానంలో కొంత స్థలం కేటాయించి క్రీడాకారులకు శిక్షణ ఇస్తామని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి డాక్టర్ జీ పరమేశ్వర్ హామీ ఇచ్చారు. మహాత్మాగాంధీ క్రీడా మైదానంలో జరుగుతున్న రాష్ట్రస్థాయి రైఫిల్ షూటింగ్ పోటీలను ఆయన ఆదివారం వీక్షించారు. క్రీడాకారులను పరిచయం చేసుకొని మాట్లాడారు. ఇక్కడ షూటింగ్ క్రీడాకారులకు సరైన సదుపాయాలు లేవన్నారు. త్వరలో స్థలం కేటాయించి శిక్షణకు సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు.



పోటీలను వీక్షిస్తున్న మంత్రి పరమేశ్వర్

కోలారు వార్తలు...

రుణాలివ్వని బ్యాంకుల్లో నిధులు నిల్వ చేయొద్దు



లబ్ధిదారులకు గుర్తింపు కార్డులు అందిస్తున్న దృశ్యం

కెజీఎఫ్: పేదలకు రుణాలు ఇవ్వని బ్యాంకులలో ప్రభుత్వం నిధులను నిల్వ చేయకూడదని ఎంపీ మునిస్వామి అధికారులకు సూచించారు. ఆదివారం నగరసభ సభాంగణంలో వీధి వ్యాపారులకు ఆత్మనిర్భర్ పథకంలో భాగంగా గుర్తింపు కార్డులను అందించే కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. పేదలు, దళితులు బ్యాంకులకు వెళితే అకారణంగా వేధిస్తారు, అవమానిస్తారు. ఇలాంటి బ్యాంకులలో ప్రభుత్వ సొమ్మును జమ చేయవద్దన్నారు. బ్యాంకు అధికారులు పేదలు, రైతులను అవమానం చేసినట్లయితే అలాంటి బ్యాంకు అధికారులపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. కెజీఎఫ్ నగర వ్యాప్తిలో ఇంతవరకు 2248 మంది సీఎం స్వానిధి పథకం ద్వారా దరఖాస్తులు చేసుకున్నారు. వీరికి ఎలాంటి వడ్డీ లేకుండా 1647 మందికి 10 వేల రూపాయలు, 20 వేల రూపాయల ప్రకారం 524 మందికి, 50 రూపాయల ప్రకారం 77 మందికి రుణాలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. రుణాలు తీసుకున్న వారు సకాలంలో తిరిగి చెల్లించి తిరిగి రుణాలు పొందవచ్చునని తెలిపారు. ఈ సందర్భంగా నగరసభ సభ్యుడు రాధా విజయకుమార్, మాజీ సభ్యుడు వెంకటేష్, దిశా సమితి సభ్యుడు సూర్యానారాయణ తదితరులు పాల్గొన్నారు.

చెత్తముక్త భారత్‌కు సహకరించాలి



స్వచ్ఛత అభియాన్‌లో పాల్గొన్న విద్యార్థులు

శ్రీనివాసపురం: చెత్త రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరు సహకారం అందించాలని ప్రభుత్వ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీధర్ తెలిపారు. ఆదివారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గాంధీ జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన స్వచ్ఛతా కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని చెత్త రహిత సమాజ నిర్మాణానికి అందరు నడుం బిగించాలన్నారు. అన్ని అనారోగ్యాలకు అపరిశుభ్రతే కారణమని, చెత్తను సేకరించి చెత్త కుండీలలోనే వేయాలన్నారు ఆరోగ్యకర సమాజ నిర్మాణంలో విద్యార్థుల పాత్ర ఎంతో ఉంటుందని, మహాత్ముడి కలలను సాకారం చేయాలన్నారు. ప్రజలు కూడా పరిసరాల శుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో తాలూకా ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు సుబ్రమణి తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా నిమజ్జనం



వినాయకుడిని ఊరేగిస్తున్న దృశ్యం

మాలూరు: తాలూకాలోని చిక్కతిరుపతిలో శ్రీ వెంకటేశ్వర యువక సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్టించిన వినాయకుడి నిమజ్జన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. మంగళవాయిద్యాలు, మేళతాళాల మధ్యన డప్పులు వేయిస్తూ యువత చిందులు వేస్తూ వినాయకుడిని గ్రామంలో ఊరేగించిన అనంతరం గ్రామ సమీపంలోని చెరువులో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా సాయంత్రం మ్యూజికల్ చైర్, రసమంజరి తదితర సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా వివిధ రంగాలలో సాధన చేసిన వారిని సన్మానించారు. గ్రామ పంచాయతీ అధ్యక్షుడు టీఎం రామ్ ప్రసాద్, సభ్యుడు వి రాఘవేంద్ర ప్రసాద్, రాజశేఖర్, సుజాత మునిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహా గణపతి నిమజ్జనం



శోభాయాత్రలో యువత సందడి

కంప్లి: హువినహడగలి గ్రామంలో శనివారం వినాయకుల నిమజ్జనం కోలాహలంగా సాగింది. ఆంజనేయ దేవసానం నుంచి సాగిన వినాయకుడి శోభాయాత్ర సందర్భంగా యువత డప్పులు వాయిస్తూ, నృత్యాలు చేస్తూ సందడి చేశారు. పట్టణంలోని ప్రధాన కూడళ్లలో ఊరేగింపు సాగింది. అనంతరం గణనాథుడిని తుంగభద్ర నదిలో నిమజ్జనం చేశారు. అర్ధరాత్రి వరకు నిమజ్జనం కొనసాగింది.

తుంగభద్ర కాలువలో పడి యువకుడి మృతి

కంప్లి: ప్రమాదశాత్తు తుంగభద్ర కాలువలో పడి ఓ యువకుడు మృతి చెందిన ఘటన కురుగోడు తాలూకాలో ముష్టిగట్టి గ్రామంలో చేటు చేసుకుంది. మృతుడు గ్రామానికి చెందిన ఉమేశ్ (20). వివరాలు...ఈరాక్షి, కృష్ణ దంపతుల కుమారుడు ఉమేశ్ అక్షర దాసోహలో పనిచేస్తున్నాడు. వరుస సెలవులు రావడంతో ఇంటికి వచ్చాడు. ఆదివారం తెల్లవారుజామున బహిర్భూమికని చెప్పి తుంగభద్ర కాలువ వద్దకు వెళ్లాడు. అక్కడ ప్రమాదవశాత్తు కాలువ నీటిలో పడిపోయాడు. ఈత రాకపోవడంతో నీటిలో మునిగిపోయాడు. ఆదివారం ఉదయం 7 గంటల సమయంలో గణికహాల్ వద్ద కాలువలో శవాన్ని గుర్తించారు. విగతజీవిగా పడి ఉన్న కుమారుడిని చూసి తల్లిదండ్రులు షాక్‌కు గురయ్యారు. కన్నీరు మున్నీరుగా విలపించారు.

ఎనిమిది కాళ్లతో మేక పిల్ల

రాయచూరు రూరల్: సింధనూరు తాలుకాలో ఎనిమిది కాళ్లలో ఓ మేక జన్మించింది. తాలూకాలోని కురకుందలో గ్యానప్ప అనే రైతుకు చెందిన ఓ మేక ఆదివారం రెండు దేహాలు, ఒకే తల కాయతో ఒక పిల్లకు జన్మనిచ్చింది. మేక పిల్లను చూడటానికి ప్రజలు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు.

నగల షోరూం ప్రారంభం



బనశంకరి: బెంగళూరులో ఏవీఆర్ స్వర్ణమహల్ 20వ శాఖను మల్లేశ్వరంలో అట్టహాసంగా ప్రారంభించారు. ఆదివారం సంపిగే సినిమా థియేటర్ ముందు భాగంలో షోరూంను ఎండీ ఏబీఎస్.సంజయ్, సౌమ్య సంజయ్ తదితరులు ఆరంభించారు. ఆధునిక శైలి ఆభరణాలు తమ ప్రత్యేకమన్నారు.

సీనియర్ సిటిజన్లను గౌరవించాలి



సీనియర్ సిటిజన్లను సన్మానించిన దృశ్యం

కోలారు: ప్రభుత్వం సీనియర్ సిటిజన్లకు వివిధ సౌలభ్యాలు కల్పిస్తోందని, వాటిని సక్రమంగా అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అక్రం పాషా తెలిపారు. ఆదివారం నగరంలోని పాత్రికేయుల భవనంలో ప్రపంచ సీనియర్ సిటిజన్ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సీనియర్ సిటిజన్లను గౌరవించడం మన కర్తవ్యమని, వారి అనుభవం, మార్గదర్శనం ఎంతో అవసరమన్నారు. కలెక్టరేట్‌లో వారి కోసం లిఫ్ట్ సౌకర్యం కల్పించినట్లు చెప్పారు. సీనియర్ సిటిజన్లు ఎలాంటి సమస్యలనైనా జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకు వచ్చినట్లయితే వెంటనే పరిష్కరిస్తామన్నారు. ముఖ్య అతిథిగా వచ్చిన జిల్లా న్యాయ సేవల ప్రాధికార కార్యదర్శి న్యాయమూర్తి సునీల్ ఎస్ హొసమని మాట్లాడుతూ... పోషకుల క్షేమ, పాలనా చట్టం ప్రకారం సీనియర్ సిటిజన్‌లకు అన్ని సౌలభ్యాలను అందించాలన్నారు. ఈ సందర్భంగా వివిధ రంగాలలో సేవలందించిన సీనియర్ సిటిజన్లను సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

అమృతోత్సవాల వేళా వివక్ష

మాలూరు: 21వ శతాబ్దంలోనూ అంటరానితనం సజీవంగా ఉండడం విచారించదగిన విషయమని సాహితీవేత్త కోటిగానహళ్లి రామయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం తాలూకాలోని సొసగెరె గ్రామ పంచాయతీ పరిధిలోని బ్యాలహళ్లి గ్రామంలో సహపంక్తి భోజనం, గ్రామరత్న ప్రశస్తి ప్రదాన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. జిల్లాలో అంటరానితనాన్ని రూపుమాపడానికి అరివు శివప్ప చేస్తున్న ప్రయత్నాలు శ్లాఘనీయమన్నారు. దళితుల గృహప్రవేశ కార్యక్రమం, సహపంక్తి భోజనం వంటి కార్యక్రమాలను నిర్వహిస్తుండడం సంతోషించదగిన విషయమన్నారు. కార్యక్రమంలో అరివు భారత సంస్థకు చెందిన అరివు శివప్ప, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు సి లక్ష్మీనారాయణ, ఆంధ్రప్రదేశ్ అంబేడ్కర్ సేన అధ్యక్షుడు పీటీఎం శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుల్లో ఉత్సాహం పరవళ్లు


నృత్యాలు చేస్తున్న సీనియర్ సిటిజన్లు


కార్యక్రమంలో పవిత్రారెడ్డి, అలెగ్జాండర్‌థామస్ తదితరులు

బనశంకరి: నగరంలోని సెయింట్ జోసెఫ్ కాలేజీలో ఆదివారం ఏర్పాటు చేసిన ప్రపంచ వృద్ధుల దినోత్సవం సందడిగా సాగింది. వయోవికా సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో వృద్ధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా హాస్య సమ్మేళన, శంకర్‌మహదేవన్ అకాడమి ఆధ్వర్యంలో సంగీత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధులు యువతీ యువకులకు తీసిపోని విధంగా ఆటపాటలతో అలరించారు. సినిమా పాటలకు నృత్యాలు చేశారు. వంటలపోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. సీనియర్ సిటిజన్ల బ్రాండ్ రాయబారి కన్నడ నటుడు చంద్రు, వయోవికాస్ సంస్థ మండలి సభ్యుడు డాక్టర్ అలెగ్జాండర్‌థామస్, ఆ సంస్థ సీఈఓ పవిత్రారెడ్డి మాట్లాడుతూ..సీనియర్ సిటిజన్లను సమాజంలో గౌరవంగా చూడటం, వారిసమస్యలపై సానుకూలంగా స్పందించడం కోసం సీనియర్‌సిటిజన్ల హబ్బ ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో సమాచార సాంకేతిక దిగ్గజం క్రిస్ గోపాలకృష్ణన్, గుండె వైద్య నిపుణులు డాక్టర్ దేవీశెట్టి, జమునరవి, రోహిత్ కటు తదితరులు పాల్గొన్నారు.


ఆటపాటలతో అలరింపజేస్తున్న కళాకారిణి

క్లుప్తంగా

4న జనతా దర్శన్

గౌరిబిదనూరు: ఈ నెల 4న మధ్యాహ్నం 12 గంటలకు తాలూకా కార్యాలయ సభాభవనంలో ఎమ్మెల్యే పుట్టస్వామిగౌడ ఆధ్వర్యంలో జనతా దర్శన్ నిర్వహించనున్నారు. తాలూకాలోని ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో సమర్పించుకోవచ్చని ఎమ్మెల్యే పుట్టస్వామిగౌడ తెలిపారు.

మారతహళ్లిలో స్వచ్ఛ సేవ


చెత్త ఊడ్చుతున్న ఎమ్మెల్యే మంజుల తదితరులు

కృష్ణరాజపురం: స్వచ్ఛతాహీ సేవలో భాగంగా నగరంలో మహాదేవపుర నియోజకవర్గం మారతహళ్లి పోలీసు స్టేషన్ చుట్టుపక్కల పాలికె ఆధ్వర్యంలో పారిశుధ్య చర్యలు చేపట్టారు. స్థానిక ఎమ్మెల్యే మంజుల లింబావళి పాల్గొని చెత్తను ఊడ్చారు. కార్యక్రమంలో ప్రజలు, బీబీఎంపీ సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు. అలాగే వర్తూరు వార్డులోని చెరువు వద్ద ఎమ్మెల్యే భర్త, మాజీ మంత్రి అరవింద లింబావళి స్వచ్ఛ భారత్‌ను నిర్వహించారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు కూడా చెత్తను ఊడ్చి శుభ్రం చేశారు.

ఘనంగా ఓనం వేడుకలు

బొమ్మనహళ్లి : నగరంలోని బెంగళూరు దక్షిణలో ఉన్న హుల్లహళ్లిలోని విస్తార కన్వెన్షన్ హాల్‌లో బెంగళూరు దక్షిణ మలయాళం అసోసియేషన్ ఆధ్వర్యంలో ఓనం వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో పాల్గొన్న బొమ్మనహళ్లి ఎమ్మెల్యే సతీష్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలతో మలయాళీలు ఆకట్టుకున్నారు.

నవంబర్‌లో బెంగళూరులో కంబళ పోటీలు


దున్నలను పరిగెత్తిస్తున్న పోటీదారుడు(ఫైల్)

యశవంతపుర: మొదటి సారిగా బెంగళూరులో కంబళ పోటీలను నిర్వహిస్తున్నట్లు బెంగళూరు కంబళ సమితి అధ్యక్షుడు, ఎమ్మెల్యే అశోక్ కుమార్ రై తెలిపారు. ఆయన ఆదివారం మంగళూరులో విలేకర్లతో మాట్లాడారు. నవంబర్ 25, 26 తేదీల్లో పోటీలు నిర్వహిస్తామన్నారు. నవంబర్ 23న దక్షిణకన్నడ, ఉడిపి, కేరళ కాసరగోడుల నుంచి నూరు జతల దున్నపోతులను బెంగళూరుకు తీసుకెళ్తున్నట్లు తెలిపారు. దున్నపోతులకు బెంగళూరులో మేత, నీరు, టెంట్ వ్యవస్థ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

పోకిరీ అరెస్ట్

యశవంతపుర: యువతిపట్ల అసభ్యకరంగా వ్యవహరించిన పోకిరీని బెంగళూరు హైగ్రౌండ్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఇతర రాష్ట్రం నుంచి ఉపాధి కోసం వచ్చిన ఓ యువతి వసంత నగరలో పీజీలో ఉంటుంది. రోజూ పీజీ నుంచి నడిచి వెళ్తున్న సమయంలో ఒక మెకానిక్ ఆ యువతి వెంటపడి వేధించేవాడు. దీంతో బాధితురాలు హైగ్రౌండ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు గాలింపు చేపట్టి నిందితుడిని అరెస్ట్ చేశారు.

చెరుకు తోటల్లో గజరాజుల విధ్వంసం


చెరకు తోటలో సంచరిస్తున్న ఏనుగులు

మండ్య : ఏనుగులు చెరకు తోటలోకి చొరబడి విధ్వంసం సృష్టించి అన్నదాతలకు తీరని నష్టాన్ని చేకూర్చాయి. చెన్న పట్టణ అటవీ ప్రాంతం నుంచి వచ్చిన ఐదు ఏనుగులు శనివారం రాత్రి మండ్య తాలూకా హోసబూదనూరు, హళె బూదనూరు మధ్య ఉన్న చెరకు తోటల్లోకి చొరబడ్డాయి. తిన్నంత తిని మిగతా పంటను తొక్కిపడేశాయి. ఆదివారం ఉదయం అంబరహళ్లిలోని చెరకుతోటలోకి వెళ్లి పంటను ధ్వంసం చేశాయి. పొలాలకు వచ్చిన రైతులు.. ఏనుగుల సంచారాన్ని గమనించి అటవీశాఖకు సమాచారం ఇచ్చారు. ఏసీఎఫ్ మహదేవస్వామి, ఇతర అధికారులు సిబ్బందితో వచ్చి ఏనుగులను తరిమివేసే కార్యక్రమం చేపట్టారు. ఏనుగుల విధ్వంసంతో భారీగా పంట నష్టం జరిగిందని రైతులు అటవీశాఖ అధికారుల వద్ద మొరపెట్టుకున్నారు. పరిహారం అందించాలని కోరారు.

ఆర్‌టీఐ కార్యకర్త అనుమానాస్పద మృతి

దొడ్డబళ్లాపురం: ఆర్టీఐ కార్యకర్త అనుమానాస్పదంగా మృతిచెందిన సంఘటన అనేకల్ తాలూకా మాదపట్టణ వద్ద చోటుచేసుకుంది. ప్రదీప్(38) అనే వ్యక్తి ఆర్టీఐ కార్యకర్తగా ఉన్నాడు. ఈయన తన ఇంటి కార్ షెడ్‌లో అర్ధనగ్నంగా ఉరివేసుకున్న స్థితిలో విగతజీవిగా ఉండగా స్థానికులు గమనించి జిగణి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు ఘటన స్థలానికి వచ్చి మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

తల్లిని చూడాలని వస్తూ...


యువకుడు నగేష్ మృతదేహం
నగేష్ (ఫైల్‌ఫోటో)

మడకశిర రూరల్: తుమకూర జిల్లా మిడిగేశి సమీపంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మడకశిర మండలం జక్కేపల్లి గ్రామానికి చెందిన నగేష్ (30) అనే యువడు మృతి చెందాడు. వివరాలు... బెంగళూరులో నగేష్ పని చేసుకుంటూ అక్కడే ఉండేవారు. తల్లి తిప్పక్కను చూసి వెళ్ళాదామని బెంగళూరు నుంచి ద్విచక్రవాహనంలో స్వగ్రామానికి వస్తుండగా నల్లక్కమనహళ్ళి సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టుకున్ని వెళ్ళడంతో రోడ్డుపైనే పడిపోయి గాయాలతో చనిపోయాడు. మిడిగేశి పోలీసులు పరిశీలించి మృతదేహాన్ని మధుగిరి ఆస్పత్రికి తరలించారు. మృతుని జేబులో ఉన్న ఆధార్ కార్డును చూసి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. ఈ యువకుని మృతితో జక్కేపల్లిలో విషాదచాయలు అలుముకున్నాయి.

కాలం చెల్లిన ఔషధాల విక్రయాలు

- తండ్రీ కొడుకు అరెస్ట్
- రూ.1.50 కోట్ల విలువైన మందులు స్వాధీనం


నిందితులు జై బచ్చావత్, అభిషేక్

యశవంతపుర: కాలం చెల్లిన ఔషధాలు, కాస్మెటిక్స్ విక్రయిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న తండ్రీకొడుకును సీసీబీ పోలీసులు అరెస్ట్ చేశారు. రాజాజీనగర పోలీసుస్టేషన్ పరిధిలో జై బచ్చావత్, అభిషేక్ బచ్చావత్ అనే తండ్రీ కొడుకులు ఫార్మసీ నిర్వహిస్తున్నారు. హర్యాణ, పంజాబ్, చండీఘడ్‌తో పాటు వివిధ రాష్ట్రాల నుంచి అవధి ముగిసిన ఔషధాలు, కాస్మెటిక్స్ తెప్పించి వాటిపై లేబుల్స్‌ను తొలగించి కొత్త అవధి లేబుల్స్‌ను అంటించి అమ్ముతున్నట్లు సమాచారంతో సీసీబీ పోలీసులు దాడి చేశారు. రూ.1.50 కోట్ల విలువైన కాలం చెల్లిన ఔషధాలు, కాస్మెటిక్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిర్వాహకులు ఇద్దరినీ అరెస్ట్ చేశారు.

ఎస్.ఎం.కృష్ణతో బెంగళూరుకు ఖ్యాతి


కార్యక్రమంలో డీకే.శివకుమార్, బీఎల్.శంకర్, ఎస్ఎం.కృష్ణ, జగదీశ్‌కొప్ప, డాక్టర్ సుధాకర్

బనశంకరి: బెంగళూరు నగరానికి అంతర్జాతీయ ఖ్యాతి తీసుకువచ్చిన దూరదృష్టి కలిగిన నేత మాజీ సీఎం ఎస్.ఎం.కృష్ణ అని డిప్యూటీ సీఎం డీకే.శివకుమార్ తెలిపారు. ఎస్.ఎం.కృష్ణ జీవితంపై డాక్టర్ ఎస్.జగదీశ్ కొప్ప రాసిన నెలదసిరి పుస్తకావిష్కరణ ఆదివారం చిత్రకళాపరిషత్‌లో స్వప్నబుక్‌హౌస్ ఆధ్వర్యంలో జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన డీకే శివకుమార్ మాట్లాడుతూ ఎస్.ఎం.కృష్ణ హయాంలో బెంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయం, వికాససౌధ, ఉద్యోగ సౌధ, బెంగళూరు మెట్రో ఏర్పాటుకు కృషి చేశారన్నారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం ప్రవేశపెట్టిన ఘనత ఎస్.ఎం.కృష్ణకు దక్కుతుందన్నారు. మహిళల ఆర్థిక సాధికారత కోసం స్త్రీశక్తి సంఘాల ఏర్పాటుకు ఎస్.ఎం.కృష్ణ చర్యలు తీసుకున్నారన్నారు. ఎస్.ఎం.కృష్ణ సీఎంగా రాష్ట్రానికి అందించిన సేవలు కన్నడిగులకు గర్వకారణమని సాహితీవేత్త డాక్టర్ నరహళ్లి బాలసుబ్రమణ్య తెలిపారు. కార్యక్రమంలో ఎస్.ఎం.కృష్ణ, సీనియర్ సాహితీవేత్త డాక్టర్ హంపనాగరాజయ్య, చిత్రకళాపరిషత్ అధ్యక్షుడు బీఎల్ శంకర్, మాజీమంత్రి డాక్టర్ కే.సుధాకర్, ఎమ్మెల్సీ ఆ.దేవెగౌడ, దినేశ్‌గూళిగౌడ, డీకే.శివకుమార్ సతీమణి ఉషా, ఎస్.ఎం.కృష్ణ సతీమణి ప్రేమకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల స్వచ్ఛత అందరి బాధ్యత


రోడ్డును ఊడ్చుతున్న ఎమ్మెల్యే ఎం.సతీష్‌రెడ్డి


కృష్ణరాజపురంలో బీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో స్వచ్ఛ సేవ

బొమ్మనహళ్లి : హోంగసంద్ర గ్రామంలో ఆదివారం బీబీఎంపీ ఆధ్వర్యంలో స్వచ్ఛతాహీసేవా కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఎం.సతీష్ రెడ్డి స్థానికులతో కలిసి శ్రమదానం చేశారు. చీపురు చేతపట్టి రోడ్లను ఊడ్చి శుభ్రం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఇది ఒక రోజుకే పరిమితం కారాదన్నారు. మాజీ కార్పొరేటర్ భారతీ రామచంద్ర, టి.రామచంద్ర, బీబీఎంపీ వార్డు అధ్యక్షుడు బాబురెడ్డి, బీజేపీ నాయకులు రుపేష్, నాగభూషన్ రెడ్డి, మహిళా మోర్చ నాయకులు పాల్గొన్నారు.

కృష్ణరాజపురం: బీఎస్ఎఫ్ బెంగళూరు ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ఇన్స్‌పెక్టర్ జనరల్ హేమంత్ కుమార్, డిప్యూటీ ఇన్స్‌పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ఆధ్వర్యంలో సుమారు 95 మంది సిబ్బంది, విద్యార్థులు, యువకులు పాల్గొని వీధులను శుభ్రం చేశారు.

నటుడు నాగభూషణం కారు బీభత్సం

- స్తంభాన్ని ఢీకొని దంపతులపైకి దూసుకెళ్లిన వాహనం
- వివాహిత మృతి, భర్తకు తీవ్ర గాయాలు


ప్రమాద దృశ్యం(ఇన్‌సెట్‌లో నాగభూషణ)

బనశంకరి: నటుడు నాగభూషణం నడుపుతున్న కారు దూసుకెళ్లి ఓ వివాహిత మృతి చెందగా ఆమె భర్తకు తీవ్ర గాయాలయ్యాయి. కుమారస్వామిలేఔట్ వసంతనగర మెయిన్‌రోడ్డు సుప్రభాతశ్రీం బ్రీజ్ అపార్టుమెంట్ నివాసి ప్రేమ(48), కృష్ణ దంపతులు శనివారం రాత్రి 9.45 సమయంలో కోణణకుంట వద్ద కాలినడకన వెళ్తుండగా నాగభూషణం కారు ఉత్తరహళ్లి వైపు నుంచి కోణణకుంటె క్రాస్ వైపు వెళ్తూ అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న కరెంటు స్తంభాన్ని ఢీకొంది. అనంతరం వాహనం ప్రేమ, కృష్ణ దంపతులపైకి దూసుకెళ్లింది. ప్రమాదంలో దంపతులు తీవ్రంగా గాయపడటంతోఅస్త్రా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి ప్రేమ తలకు తీవ్రగాయం కావడంతో తీవ్రరక్తస్రావమై అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. కృష్ణా రెండుకాళ్లు, పొట్ట, తలకు బలమైన గాఆయాలు కావడంతో మెరుగైన చికిత్సకోసం పోర్టీస్ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై బెంగళూరు దక్షిణ విభాగ డీసీపీ శివప్రకాష్‌దేవరాజ్ మాట్లాడుతూ దంపతులు కుమారుడు ప్రార్థ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నటుడు నాగభూషణను కుమారస్వామిలేఔట్ ట్రాఫిక్ పోలీసులు అరెస్టు చేశారన్నారు. అతివేగం, నిర్లక్ష్యంగా డ్రైవ్ చేయడం వల్లనే ప్రమాదం జరిగినట్లు ప్రాథమికంగా నిర్ధారించినట్లు తెలిపారు. నాగభూషణంను స్టేషన్ బెయిల్ మీద విడుదలచేశామని, విచారణకు మళ్లీ పిలుస్తామని తెలిపారు. ఆల్కాహాల్ టెస్టింగ్ మీటరులో అతను తాగలేదని తెలిసిందన్నారు. రక్తనమూనాలు సేకరించి పరీక్షించగా నివేదికలో మద్యం సేవించలేదని గుర్తించామన్నారు. ప్రమాదం అనంతరం స్థానికులతో కలిసి నటుడు నాగభూషణ గాయపడిన దంపతులను ఆసుపత్రిలో చేర్చారని, అయితే ప్రేమ తీవ్ర గాయాలతో మృతి చెందిందని డీసీపీ శివప్రకాష్‌దేవరాజ్ తెలిపారు.

కుమారస్వామి కలలు భగ్నమయ్యాయి

- సీఎం సిద్ధరామయ్య

శివాజీనగర: సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడి తానే ముఖ్యమంత్రి అవుతానని మాజీ సీఎం హెచ్.డీ.కుమారస్వామి కన్న కలలు భగ్నమయ్యాయని సీఎం సిద్ధరామయ్య ఎద్దేవా చేశారు. దివ్యాంగుల, వయో వృద్ధుల సాధికారిత డైరెక్టరేట్ ద్వారా రవీంద్రకళాక్షేత్రలో ఆదివారం నిర్వహించిన ప్రపంచ వయో వృద్ధుల దినాచరణ కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు.ఆరు నెలల్లో ప్రభుత్వం కూలిపోతుందని హెచ్.డీ.కుమారస్వామి చేసిన వ్యాఖ్యలపై సీఎం స్పందిస్తూ కుమారస్వామి పెట్టుకున్న కలలు గల్లంతు కావడంతో ఆయన ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని ఎదురుదాడికి దిగారు. తమది లౌకికవాద ప్రభుత్వమని, అన్నభాగ్య, శక్తి, గృహజ్యోతి, గృహలక్ష్మీ పథకాలను జాతిని చూచి ఇవ్వలేదన్నారు. అన్ని కులాలను సమానంగా చూస్తున్నామన్నారు. శామనురు శివశంకరప్ప వ్యాఖ్యలను ముఖ్యమంత్రి తీవ్రంగా పరిగణించాలని మాజీ సీఎం బీ.ఎస్.యడ్యూరప్ప చెప్పిన విషయంపై మాట్లాడుతూ ఈ విధంగా స్పందించారు.

స్వచ్ఛతకు కదిలిన నగరవాసులు


చెత్తా చెదారం తొలగిస్తున్న కార్యకర్తలు


తుమకూరులో పిచ్చిమొక్కలు తొలగిస్తున్న దృశ్యం

బనశంకరి: మహాత్మగాంధీ జయంతి సందర్భంగా బీబీఎంపీ చేపట్టిన స్వచ్ఛత, శ్రమదానం కార్యక్రమానికి ఉత్తమ స్పందన లభించింది. ప్రతివార్డులో కనీసం రెండు మూడుచోట్ల స్వచ్ఛతా అభియాన చేపట్టింది. ఎన్‌జీఓ, ఎస్‌హెచ్‌పీ, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ క్యాడెట్స్, ఆర్‌డబ్ల్యూఏ, స్వయంసేవకులు, ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని శ్రమదానం చేశారు. రోడ్లు, వంతెనలు కిందభాగం, పై వంతెనల వద్ద, మురికివాడ ప్రాంతాలు, మార్కెట్ ప్రాంతాలు, ఆలయాలు, పర్యాటక ప్రాంతాలు, బస్టాండ్లు, విద్యా సంస్థల వద్ద చెత్తా చెదారం తొలగించారు. బీబీఎంపీ పొడిచెత్త విభాగం జాయింట్ కమిషనర్ ప్రతిభ మాట్లాడుతూ పరిసరాల సంరక్షణ, పచ్చదనంపై ప్రజల్లో చైతన్యం చేయడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని తెలిపారు. కాగా1260 ప్రాంతాల్లో జరిగే స్వచ్ఛతా హిసేవా డాట్‌కామ్ వెబ్‌పోర్టల్, పాలికె వెబ్‌సైట్‌లో ప్రజలు పేర్లు నమోదు చేసుకొని స్వచ్ఛతా కార్యక్రమంలో పాల్గొన్నారు.

తుమకూరు : తుమకూరు నగరంలో ఉన్న పాల్‌టెక్నిక్ కళాశాల ఆవరణలో ఎస్‌బీఐ, ప్రాదేశిక కార్యాలయం ఆధ్వర్యంలో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమం జరిగింది. ఎస్‌బీఐ ప్రధాన వ్యవస్థాపకుడు క్రిశన్ శర్మ, ఉద్యోగులు, నగరవాసులు పాల్గొని శ్రమదానం చేశారు. రోడ్లను ఊడ్చి శుభ్రం చేశార

కన్నడిగులను హేళన చేస్తూ పోస్టులు

- పశ్చిమబెంగాల్ యువకుడి అరెస్ట్

బనశంకరి: బెంగళూరు నగరాన్ని, కన్నడిగులను హేళన చేస్తూ ఇన్‌స్టాగామ్‌లో పోస్టు పెట్టిన పశ్చిమబెంగాల్‌కు చెందిన నిలోయ్‌మండల్ అనే యువకుడిని కొడిగేహళ్లి పోలీసులు ఆదివారం అరెస్ట్‌చేశారు. ఇతను బెంగళూరులోని ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నాడు. ఉత్తరభారతదేశం వారు బెంగళూరు వెడిచి వెళ్తే నగరం అడవి మనషులతో సమానమంటూ నేటివ్ బెంగళూరియన్స్ అనే పేజ్‌లో పోస్టు చేశాడు. కన్నడభాషను కూడా అవమానించాడు. దీనిపై కన్నడసంఘాల కార్యకర్తలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గాలింపు చేపట్టి నిలోయ్‌మండల్‌ను అరెస్ట్‌చేశారు. కంపెనీ కూడా అతన్ని ఉద్యోగం నుంచి తొలగించింది.

ఏనుగు అనుమానాస్పద మృతి

మైసూరు : పొలాల్లో ఏనుగు అనుమానాస్పద స్థితిలో విగతజీవిగా కనిపించింది. ఈఘటన మైసూరు జిల్లా సరగూరు తాలూకా కొత్తెగాల గ్రామంలో వెలుగు చూసింది. గ్రామానికి చెందిన రైతు నాగప్ప పొలంలో ఏనుగు మృతి చెందినట్లు సమాచారంతో అటవీశాఖ అధికారులు వెళ్లి పరిశీలించారు. 20 సంవత్సరాల ఆడ ఏనుగుగా గుర్తించారు. కళేబరానికి ఒక దంతం మాత్రమే ఉండటంతో దంతాల కోసం వన్యప్రాణి వేటగాళ్లు ఏనుగును చంపేశారా అన్న అనుమానాలను వ్యక్తం చేశారు. అనంతరం మృతదేహాన్ని శవపరీక్షల కోసం తరలించారు.

స్తంభాన్ని ఢీకొన్న కారు..రైతు మృతి


మృతుడు సిద్ధప్ప(ఫైల్)

మైసూరు: కారు ఢీకొని కరెంటు స్తంభం విరిగిపడి రైతు మృతి చెందాడు. ఈ ఘటన జిల్లాలోని సరగూరు తాలూకా బాడగ గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన గురుసిద్ధప్ప కుమారుడు సిద్ధప్ప(46) వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఆదివారం గ్రామ సమీపంలోని మెయిన్ రోడ్డులో కాలినడకన వెళ్తుండగా వేగంగా వచ్చిన కారు అక్కడ కరెంటు స్తంభాన్ని ఢీకొంది. ఘటనలో స్తంభం విరిగి సిద్ధప్పపై పడటంతో అతని తల, వెన్నుకు తీవ్ర గాయాలయ్యాయి. ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలోనే మృతి చెందాడని సరగూరు పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

హోసూరు వార్తలు..

రౌడీషీటర్ అరెస్ట్

కెలమంగలం: వాహనదారులకు, ప్రజలకు అంతరాయం కల్పిస్తున్న రౌడీషీటర్‌ను డెంకణీకోట పోలీసులు అరెస్ట్ చేశారు. డెంకణీకోట ఎస్ఐ జయగణేష్ నేతృత్వంలో పోలీసులు శనివారం రాత్రి కొరటగిరి ప్రాంతంలో గస్తీ నిర్వహించారు. ఈ సమయంలో గలాటకు పాల్పడుతున్న రౌడీషీటర్ క్రిష్ణప్ప(40)ని అదుపులోకి తీసుకున్నారు. ఆరా తీయగా ఉద్దనపల్లి పోలీస్‌స్టేషన్‌లో హత్య కేసు, కెలమంగలం పోలీస్‌స్టేషన్‌లో హత్యా బెదరింపు కేసులు నమోదైనట్లు తెలిసింది. అతన్ని అరెస్ట్ చేసి జైలుకు తరలించారు.

లారీ ఢీకొని బైకిస్టు మృతి

కెలమంగలం: ద్విచక్రవాహనాన్ని టిప్పర్ లారీ ఢీకొన్న ప్రమాదంలో వృద్ధుడు మరణించిన ఘటన కెలమంగలం వద్ద జరిగింది. కెలమంగలం సమీపంలోని ఒన్నుగురికి చెందిన క్రిష్ణప్ప(62) శనివారం రాత్రి కెలమంగలంలో మందులు కొనుక్కోవడానికి బైక్ మీద వస్తుండగా లారీ ఢీకొట్టింది. అతడు తీవ్ర గాయాలతో ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. కెలమంగలం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని శవాన్ని ఆస్పత్రికి తరలించారు.

డెంగీని అరికడదాం

హోసూరు: హోసూరు కార్పొరేషన్ పరిధిలో ఆరోగ్య శాఖ ఆదివారం పలు చోట్ల డెంగీ వ్యాధి ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహించింది. ప్రజలు ఇందులో డెంగీ జ్వర పరీక్షలు చేయించుకున్నారు. పారిశుధ్య కమిటీ అధ్యక్షుడు ఎస్.ఎస్.మాదేశ్వరన్ అధ్యక్షతన కార్పొరేషన్ పరిధిలోని చిన్నయలసగిరి, కర్నూరు, బేగేపల్లి, గోవిందఅగ్రహారం, సమత్వపురం తదితర ప్రాంతాల్లో ప్రత్యేక శిబిరాలను నిర్వహించారు. పట్టణంలో డెంగీ నియంత్రణకు ప్రజలు సహకరించాలని, ఇళ్ల పరిసర ప్రాంతాల్లో వర్షపునీరు నిల్వకుండా చూసుకోవాలని, ప్లాస్టిక్ వ్యర్థాలు, పాత టైర్లు, కొబ్బరి చిప్పలను ఇళ్ల ప్రక్కన పడేయరాదని తెలిపారు.

ప్లాస్టిక్ చెత్తను తొలగించరూ

కెలమంగలం: కెలమంగలం సమీపంలోని ప్రభుత్వ టాస్‌మార్క్ దుకాణం పక్కన పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. మందుబాబులు ప్లాస్టిక్ గ్లాసులు, తినుబండారాలు తీసుకొని అక్కడే పడేసి వెళ్లడంతో ప్లాస్టిక్ వ్యర్థాలు పెద్ద కుప్పలా పేరుకుపోయాయని తెలిపారు. గాలులకు ప్లాస్టిక్ వస్తువులు దగ్గర్లోని రైతుల పొలాల్లోకి వెళ్తున్నాయని చెప్పారు. ప్లాస్టిక్ చెత్తను పశువులు తిని రోగాలకు గురవుతున్నాయన్నారు. అధికారులు వెంటనే ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించాలని స్థానికులు కోరారు.

టీచర్‌కు సన్మానం


టీచర్ స్వర్ణను సన్మానిస్తున్న దృశ్యం

హోసూరు: హోసూరు పారిశ్రామికవాడలోని జూజువాడి ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయిని ఆర్.స్వర్ణను లయన్స్ క్లబ్‌సభ్యులు ఘనంగా సన్మానించారు. గత పదేళ్లుగా పాఠశాలలో పని చేస్తూ పిల్లలను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దడానికి పాటుపడుతున్నారు. విద్యార్థుల వికాసం కోసం పలు కార్యక్రమాలను నిర్వహిస్తుంటారు. స్వర్ణను సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యాకమిటి అధ్యక్షులు శ్రీధర్, కార్పొరేటర్ అశోక్‌రెడ్డి, లయన్స్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

అటెండర్ ఆత్మహత్యాయత్నం

బొమ్మనహళ్లి : పై అధికారుల వేధింపులు తాళలేక అటెండర్ ఆత్మహత్యకు యత్నించాడు. వివరాలు... ఆనేకల్ తాలూకా పరిధిలోని చందాపుర పురసభ కార్యాలయంలో వేణు అనే వ్యక్తి అటెండర్‌గా పనిచేస్తున్నాడు. కొన్ని దాఖలాల విషయంలో ముఖ్యాధికారి శ్వేతబాయి, మధ్యవర్తి రవిలు వేణును ప్రశ్నించగా తనకు తెలియదని సమాధానం ఇచ్చినట్లు సమాచారం. నీపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని చెప్పడంతో అటెండర్ విషం తాగాడు. సిబ్బంది అతన్ని ఆస్పత్రికి తరలించగా చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నాడు. వేధింపుల వల్లనే తన భర్త ఆత్మహత్యకు యత్నించినట్లు చందాపుర పోలీసులకు బాధితుడి భార్య ఫిర్యాదు చేసింది.

స్వయంఉపాధితో అభివృద్ధి

గౌరిబిదనూరు: సొంత ఉపాధి ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చని, వ్యాపార మెళకువలను తెలిసి ఉంటే రాణించవచ్చని ధర్మస్థళ గ్రామీణాభివృద్ధి సంస్థ జిల్లా డైరెక్టర్ ప్రశాంత్ తెలిపారు. తాలూకాలోని దారినాయకనపాళ్య గ్రామంలో ధర్మస్థళ గ్రామీణాభివృద్ధి సంస్థ చే జరిగిన స్వంత ఉద్యోగ ప్రేరణా శిబిరం ప్రారంభించి ప్రసంగించారు. తమ సంస్థచే దివ్యాంగులకు సౌలభ్యాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మధుప్రియ, లలిత, అశ్విని, లక్ష్మి, అనిత, గంగరత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

చిరుత ఆగడాలకు చెక్


బోనులో పడిన చిరుత

మైసూరు: జిల్లాలోని ఇలవాల సమీపంలో ఉన్న ఉయిలాల, చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు కునుకు లేకుండా చేస్తున్న చిరుత ఎట్టకేలకు బోనులో పడింది. కొన్ని రోజులుగా చిరుత గ్రామాల్లో సంచరిస్తూ కుక్కలు, మేకలు, గొర్రెలను హతమార్చుతోంది. దీంతో అటవీశాఖ అధికారులు ఉయిలాల గ్రామం వద్ద బోను ఏర్పాటు చేశారు. శనివారం రాత్రి ఆహారం కోస వచ్చిన చిరుత బోనులో పడింది. స్థానికులు ఇచ్చిన సమాచారంతో అటవీసిబ్బంది ఆదివారం గ్రామానికి చేరుకొని పరిశీలించారు. రెండున్నర సంవత్సరాల వయసున్న ఆడ చిరుతగా గుర్తించి అటవీ ప్రాంతానికి తీసుకెళ్లారు.

బస్సు ఢీకొని వ్యక్తి మృతి


ముబారక్ మృతదేహం

మైసూరు: బస్సు ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. ఈఘటన మైసూరు–నంజనగూడు రహదారిలోని జేఎస్ఎస్ పాల్‌టెక్నిక్ కళాశాల వద్ద జరిగింది. ముబారక్ అనే (28) వ్యక్తి తన భార్యతో కలిసి మైసూరులోని త్యాగరాజ కాలనీలో నివాసం ఉంటున్నాడు. ఇతను సెల్‌ఫోన్ రిపేరి దుకాణం నిర్వహిస్తున్నాడు. ఆదివారం కాలినడకన వెళ్తుండగా మైసూరు వైపు నుంచి వస్తున్న కేఎస్ ఆర్టీసీ బస్సు ఢీకొంది. తలకు బలమైన గాయాలు కావడంతో ఘటన స్థలంలోనే మృతి చెందాడు. ట్రాఫిక్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

రూ.2,851 కోట్ల పెట్టుబడులు

రాష్ట్రంలో ఆహార శుద్ధి, పరిశ్రమల రంగంలో ప్రాజెక్టులు, యూనిట్ల ఏర్పాటు

6,705 మందికి ప్రత్యక్షంగా ఉపాధి

లబ్ధి పొందనున్న 90,700 మంది రైతులు

4న వర్చువల్‌గా సీఎం జగన్ చేతుల మీదుగా భూమి పూజ, ప్రారంభోత్సవాలు



సాక్షి, అమరావతి: ఆహార శుద్ధి, పరిశ్రమల రంగంలో మొత్తం 13 కీలక ప్రాజెక్టులకు సంబంధించి రూ.2,851 కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి తరలి వచ్చాయి. వీటి ద్వారా 6,705 మందికి ప్రత్యక్షంగా ఉపాధి లభించనుండగా ఆహార శుద్ధి యూనిట్ల ద్వారా 90,700 మంది రైతులు ప్రయోజనం పొందనున్నారు. బుధవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్‌గా వీటికి భూమి పూజ, ప్రారంభోత్సవాలు నిర్వహించనున్నారు.

ఏడు ప్రాజెక్టుల పనులకు శ్రీకారం

పరిశ్రమల రంగంలో రూ.2,294 కోట్ల విలువైన ఏడు ప్రాజెక్టుల నిర్మాణ పనులకు ముఖ్యమంత్రి జగన్ వర్చువల్‌గా భూమి పూజ నిర్వహించనున్నారు. ఏడు ప్రాజెక్టుల ద్వారా 4,300 మందికి ప్రత్యక్షంగా ఉపాధి లభించనుంది. అనంతపురం జిల్లా డి.హీరేహాళ్‌లో రూ.544 కోట్లతో ఎకో స్టీల్ ఇండియా, తిరుపతి నాయుడుపేటలో రూ.800 కోట్లతో గ్రీన్‌లామ్ సౌత్, బాపట్ల జిల్లా కొరిసిపాడు వద్ద శ్రావణి బయో ఫ్యూయల్ రూ.225 కోట్లు, శ్రీకాకుళం జిల్లా రణస్థలంలో రూ.200 కోట్లతో నాగార్జునా ఆగ్రో కెమికల్స్, తూర్పుగోదావరి జిల్లా ఖండవల్లి వద్ద రూ.150 కోట్లతో రవళి స్పిన్నర్స్, శ్రీసత్యసాయి జిల్లా గూడుపల్లి వద్ద రూ.125 కోట్లతో యునైటెడ్ ఇండస్ట్రీస్ ఆటో ప్లాస్టిక్, శ్రీసత్యసాయి జిల్లా మడకశిర వద్ద రూ.250 కోట్లతో ఎవరెస్ట్ స్టీల్ బిల్డింగ్ యూనిట్ల నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి.

పులివెందులలో అరటి ప్రాసెసింగ్ యూనిట్ ప్రారంభం

ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో రూ.557 కోట్ల పెట్టుబడులకు సంబంధించి సీఎం చేతుల మీదుగా భూమి పూజ, ఉత్పత్తి ప్రారంభం, ఒప్పందాలు జరగనున్నాయి. వీటి ద్వారా 2,405 మందికి ప్రత్యక్షంగా ఉపాధి లభించనుండగా 90,700 మంది రైతులు ప్రయోజనం పొందనున్నారు. 12 అసెంబ్లీ నియోజకవర్గాల్లో రూ.65 కోట్లతో 13 మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్ల నిర్మాణ పనులను ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారు. తిరుపతి జిల్లా కంచరపాలెం వద్ద రూ.168 కోట్లతో ఏటా 40,000 టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో ఏర్పాటు చేసిన డీపీ చాక్లెట్స్ యూనిట్‌ను సీఎం ప్రారంభిస్తారు. విశాఖపట్నం జిల్లా మద్ది వద్ద రూ.50 కోట్లతో ఏర్పాటు చేస్తున్న ఓరిల్ ఫుడ్స్ నిర్మాణ పనులకు, అనకాపల్లి జిల్లా కొడవాటిపూడి వద్ద రూ.20 కోట్లతో ఏర్పాటు చేస్తున్న నేటివ్ అరకు కాఫీ నిర్మాణ పనులకు సీఎం శంకుస్థాపన చేయనున్నారు. తూర్పు గోదావరి జిల్లా అయ్యవర్తం వద్ద రూ.350 కోట్లతో 3 ఎఫ్ ఆయిల్ యూనిట్ ఏర్పాటుకు ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకోనున్నారు. కడప జిల్లా పులివెందులలో రూ.4 కోట్లతో ఏర్పాటు చేసిన అరటి ప్రాసెసింగ్ యూనిట్‌ను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రారంభించనున్నారు.

హృదయాలయం.. నిరుపేదల గుండె గుడి

చిన్నారులకు పునర్జన్మనిస్తున్న సీఎం జగన్ మానసపుత్రిక

- చిన్నపిల్లలకు ప్రాణాలు పోస్తున్న వైద్యులు
- తాజాగా నెల్లూరుకు చెందిన చిన్నారికి గుండె మార్పిడి
- దేశంలోని ప్రముఖ గుండె వైద్య నిపుణులూ వచ్చి సేవలందిస్తున్నారు
- ఇప్పటివరకు చేపట్టిన గుండె మార్పిడులన్నీ విజయవంతం
- రూ.లక్షలు విలువచేసే గుండె మార్పిడి శస్త్రచికిత్స ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా అందుబాటులోకి..
- ఆస్పత్రి నిర్మాణంలో టీటీడీ పెద్దన్న పాత్ర
- ఉత్తమ పీడియాట్రిక్ కార్డియాక్ సెంటర్‌గా తిరుపతి 'హృదయాలయం'కు గుర్తింపు
- తెలంగాణ గవర్నర్ చేతుల మీదుగా అవార్డు ప్రదానం



తెలంగాణ గవర్నర్ తమిళిసై చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న డాక్టర్ శ్రీనాథరెడ్డి

సాక్షి, తిరుపతి : శ్రీపద్మావతి చిన్నపిల్లల హృదయాలయం.. నిరుపేదల పాలిట గుండె'గుడి'గా పూజింపబడుతోంది. చిన్నవయస్సులో హృద్రోగ సమస్యతో ఆస్పత్రిలో చేరిన నిరుపేద చిన్నారులకు గుండె మార్పిడి చేసి పునర్జన్మ ప్రసాదిస్తోంది. వెల కట్టలేని గుండెను ఉచితంగా అమర్చి శభాష్ అనిపించుకుంటోంది. రూ.లక్షల విలువచేసే గుండె మార్పిడి శస్త్రచికిత్స చేయించుకోలేక అనేకమంది చిన్నారులు ప్రాణాలు విడుస్తున్నారు. అలాంటి వారికి పునర్జన్మనివ్వటమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్ గొప్ప సత్సంకల్పంతో తిరుపతిలో చిన్నపిల్లల ఆస్పత్రి ఏర్పాటుచేయాలని భావించారు. ఆ బాధ్యతను టీటీడీకి అప్పగించారు. దీంతో కార్డియాక్ కేర్ సెంటర్‌కు టీటీడీ శ్రీకారం చుట్టింది. ఈ ఆస్పత్రి తన మానసపుత్రికగా ప్రకటించిన సీఎం వైఎస్ జగన్ 2021 సెప్టెంబర్ 11న శ్రీపద్మావతి కార్డియాక్ కేర్ సెంటర్‌ను ప్రారంభించారు. కేవలం ఎనిమిది నెలల్లోనే దీన్ని అందుబాటులోకి తెచ్చారు. అంతేకాక.. అతికొద్ది కాలంలోనే 1,908 గుండె శస్త్రచికిత్సలను ఇక్కడి వైద్యులు విజయవంతంగా పూర్తిచేశారు. ఈ ఆస్పత్రిలో తొలిసారి గుండెమార్పిడి చికిత్సను కూడా చేయడంతో ఆస్పత్రి కీర్తి ఒక్కసారిగా రెపరెపలాడింది. ఇలా ఇప్పటికి రెండు గుండెమార్పిడి శస్త్రచిత్సలను విజయవంతంగా నిర్వహించింది. తాజాగా.. శ్రీకాకుళంలో బ్రెయిన్‌డెడ్ అయిన వ్యక్తి గుండెను రోడ్డు మార్గంలో విశాఖకు తరలించి అక్కడ నుంచి ప్రత్యేక ఎయిర్ అంబులెన్స్‌లో రేణిగుంట విమానాశ్రయానికి తీసుకొచ్చారు. అక్కడి నుంచి నిమిషాల వ్యవధిలో తిరుపతిలోని శ్రీ పద్మావతి చిన్నపిల్లల హృదయాలయానికి తీసుకొచ్చి నెల్లూరుకు చెందిన చిన్నారికి అమర్చారు. ఈ నేపథ్యంలో.. టీటీడీ ఆధ్వర్యంలోని శ్రీ పద్మావతి చిన్నపిల్లల హృదయాలయానికి ఉత్తమ పీడియాట్రిక్ కార్డియాక్ సెంటర్‌గా గుర్తించి ఆసియా టుడే రీసెర్చ్ అండ్ మీడియా సంస్థ ప్రైడ్ ఆఫ్ నేషన్ అవార్డును ఇటీవల ప్రకటించింది. హైదరాబాద్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో తెలంగాణ గవర్నర్ తమిళిసై చేతుల మీదుగా ఆస్పత్రి డైరెక్టర్ డా.ఎన్.శ్రీనాథరెడ్డి ఈ అవార్డును అందుకున్నారు.

> **ఆయన తనయుడిగా..**
>
> దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తనయుడుగా సీఎం వైఎస్ జగన్ నాలుగడుగులు ముందుకేసి చిన్నపిల్లల గుండె సంరక్షణ బాధ్యత నాది అంటూ ఓ ఆస్పత్రిని నిర్మించాలని సంకల్పించారు. ఆయన చెప్పిన అనతికాలంలోనే టీటీడీ సహకారంతో అత్యాధునిక వైద్య సదుపాయాలతో శ్రీపద్మావతి చిన్నపిల్లల హృదయాలయాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. ఆరోగ్యశ్రీ ఉన్న ప్రతి ఒక్కరికీ ఖరీదైన గుండె సంబంధిత చికిత్సలను ఉచితంగా అందజేస్తున్నారు. టీటీడీ సంపూర్ణ సహకారంతో ఆస్పత్రి విజయవంతంగా వైద్యసేవలందిస్తూ అనతి కాలంలోనే దేశం నలుమూలలా వ్యాప్తి చెందింది.

మొట్టమొదటి గుండె మార్పిడి శస్త్రచికిత్స ఇలా..

తిరుపతిలోని టీటీడీ శ్రీపద్మావతి చిన్నపిల్లల గుండె చికిత్సాలయంలో ఈ ఏడాది జనవరి 20న తొలిసారి ఓ చిన్నారికి గుండెమార్పిడి శస్త్రచికిత్సను నిర్వహించారు. జనవరి 16న జంజూరు సన్యాసమ్మ (48) రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలపాలై బ్రెయిన్‌డెడ్ అయ్యింది. షీలానగర్‌లోని కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో ఉన్న ఆమె అవయవదానం చేశారు. ఆమె గుండెను అన్నమయ్య జిల్లా చిట్వేల్ మండలం కేఎస్సార్ అగ్రహారం గ్రామానికి చెందిన 15 సంవత్సరాల బాలుడికి అమర్చి చికిత్సను విజయవంతంగా పూర్తిచేశారు.

దేశంలోని ప్రముఖ వైద్య నిపుణుల సేవలు..

ఇక ఆస్పత్రిలో అత్యాధునిక వైద్య సదుపాయాలతో మెరుగైన చికిత్స అందిస్తున్నారు. ప్రముఖ గుండె సంబంధిత వైద్య నిపుణులు, ఇతర వైద్య సిబ్బందితో పాటు ఎకో స్కానింగ్, మెడికల్ ల్యాబ్, ఎక్స్‌రే, క్యాథ్‌ల్యాబ్, అడ్వాన్స్‌డ్ ల్యాబ్ అందుబాటులో ఉన్నాయి. దేశంలోని ప్రముఖ చిన్నపిల్లల గుండె వైద్య నిపుణులు సైతం శ్రీపద్మావతి చిన్నపిల్లల కార్డియాక్ కేర్ సెంటర్‌కు వచ్చి తమ సేవలు అందిస్తున్నారు.

వైఎస్సార్ మాట..

అభం శుభం తెలియని ఏ పసిబిడ్డ కూడా గుండె సంబంధిత వ్యాధులతో బాధపడకూడదు. వ్యాధిబారిన పడ్డ నా బిడ్డను కాపాడుకోలేకపోయాననే వేదన ఏ ఒక్కరూ పడకూడదు. ఇందుకు ఎంత ఖర్చయినా ప్రభుత్వమే భరించాలి. ఆ బాధ్యత నాది అంటూ చిన్నపిల్లల గుండె సంబంధిత చికిత్సలను ఆరోగ్యశ్రీలో చేర్చి వివిధ ప్రముఖ ఆసుపత్రుల్లో అందించేలా దివంగత వైఎస్ కృషిచేశారు. 2003లో చెప్పిన ఆ మాటలను కార్యరూపం దాల్చేలా 2004లో నిర్ణయం తీసుకుని పసిగుండెలకు సాంత్వన చేకూర్చారు.

వరంగా మారిన ఆరోగ్యశ్రీ..

నిజానికి.. తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడా ప్రత్యేకించి చిన్నపిల్లల హార్ట్‌కేర్ సెంటర్ లేదు. గుండె సంబంధిత చికిత్సలనగానే రూ.లక్షలతో కూడుకున్న వైద్యం అన్న భయం జనంలో ఉండేది. కానీ, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పేదలకు వరంగా మారింది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక గుండెకు గుడి కట్టారు. మహానగరాలకు వెళ్లి వైద్యం చేయించుకునే స్తోమతలేని ఎన్నో పేద గుండెలకు పునర్జన్మనిస్తున్నారు. తిరుపతిలోని శ్రీపద్మావతి చిల్డ్రన్ కార్డియాక్ కేర్ సెంటర్‌లో ఆరోగ్యశ్రీ కార్డు ఉంటే ఉచితంగా శస్త్రచికిత్సలను అందిస్తున్నారు. ఆరోగ్యశ్రీ లేకున్నా ఇక్కడ వైద్య ఖర్చులు (పరికరాలు, మందులు) భరిస్తే ఎవరికైనా శస్త్రచికిత్సలను చేపడుతున్నారు. ఆయుష్మాన్ భారత్ స్కీమ్ ద్వారా వివిధ రాష్ట్రాల్లోని పేదల పిల్లలకు సైతం ఉచితంగానే శస్త్రచికిత్సలను అందిస్తున్నారు.

ఆస్పత్రి గురించి..

ఆస్పత్రి	:శ్రీపద్మావతి చిన్నపిల్లల హృదయాలయం
ప్రత్యేకతలు	: చిన్నపిల్లల గుండె సంబంధిత చికిత్సలు
ఆస్పత్రి స్థాపన	: 11 అక్టోబర్ 2021
శస్త్ర చికిత్సలు ప్రారంభం	: జనవరి 2022
డైరెక్టర్ : డాక్టర్ నరహరి శ్రీనాథరెడ్డి	
ప్రముఖ వైద్య నిపుణులు	: 15 మంది
మెడికల్ ఆఫీసర్లు	: 8 మంది
ఆఫీసు సిబ్బంది	: 92 మంది
రోజువారీ శస్త్రచికిత్సలు	: 3–5
ఇప్పటివరకు గుండె మార్పిళ్లు	: 06
గుండె శస్త్రచికిత్సలు	: 1,908
మొత్తం పడకలు	: 75
ఆపరేషన్ థియేటర్లు	: 3
ఐసీయూ	: 2

అడ్వాన్స్‌డ్ క్యాథ్‌ల్యాబ్, మెడికల్ ల్యాబ్, ఎక్స్‌రే, ఈసీజీ ఒక్కోటి

> **అనతికాలంలోనే వందల మందికి పునర్జన్మ**
>
> సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, టీటీడీ సహకారంతో రూ.12 లక్షలు ఖర్చయ్యే గుండె మార్పిడి శస్త్రచికిత్సలను ఉచితంగా చేస్తున్నాం. అనతి కాలంలోనే వందల మందికి వైద్యులు పునర్జన్మనిచ్చారు. ఈ ఆస్పత్రిని ఆదర్శంగా తీసుకుని అలిపిరి వద్ద సుమారు రూ.450 కోట్ల వ్యయంతో చిన్నపిల్లల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని నిర్మిస్తున్నాం. డిసెంబర్‌లో దీనిని ప్రారంభించేందుకు కృషిచేస్తున్నాం.
>
> – డాక్టర్ శ్రీనాథరెడ్డి, డైరెక్టర్, శ్రీ పద్మావతి కార్డియాక్ కేర్ సెంటర్

కొండంత అండగా టీటీడీ..

సీఎం ఆదేశాలతో ఆస్పత్రిని అందుబాటులోకి తీసుకురావడంలో టీటీడీ అప్పటి ఈఓ కేఎస్ జవహర్‌రెడ్డి, ప్రస్తుత ఈఓ ఏవీ ధర్మారెడ్డి, ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథరెడ్డిలు ఎంతో కృషిచేశారు. ఆస్పత్రి నిర్వహణ, వైద్య సదుపాయాల కోసం రూ.25 కోట్లను టీటీడీ విడుదల చేసింది. 2022–23 వార్షిక ఏడాదికి ప్రాణదాన పథకం ద్వారా వైద్యఖర్చుల కోసం రూ.15 కోట్లను విడుదల చేసి టీటీడీ పెద్దన్న పాత్ర పోషించింది. చిన్నారి గుండెలకు శ్రీవారి అభయం తోడవడంతో అనతికాలంలోనే మంచి గుర్తింపు లభించింది.

ముందుకొస్తున్న దాతలు..

మరోవైపు.. ఆస్పత్రిలో శస్త్రచికిత్సలు ప్రారంభమైన ఎనిమిది నెలల వ్యవధిలోనే ఇక్కడి వైద్య సేవలను గుర్తించి దాతలు ముందుకొస్తున్నారు. శ్రీవేంకటేశ్వర ఆపన్న హృదయం స్కీమ్ ద్వారా వచ్చే మొత్తాన్ని ఇక్కడి పిల్లల వైద్యం కోసం ఖర్చుచేయాలని టీటీడీ నిర్ణయించింది. ఆ మేరకు టీటీడీ ఇచ్చిన పిలుపునకు వివిధ రాష్ట్రాలకు చెందిన 150 మందికి పైగా దాతలు ముందుకొచ్చారు. రూ.లక్ష నుంచి పది లక్షల వరకు ఈ స్కీమ్‌లో జమచేశారు. ఈ పథకం కింద లక్షపైన ఇచ్చే భక్తులకు వీఐపీ బ్రేక్ (5 మందికి) దర్శన సదుపాయం కల్పిస్తోంది. మరింత మంది దాతలు ముందుకొచ్చి చిన్నారి గుండెలకు అండగా నిలవాలని టీటీడీ పిలుపునిచ్చింది.

కాళ్లు మొక్కినా.. కనికరించలేదు

- కన్నతండ్రి కళ్లెదుటే కూతురి దారుణహత్య
- బంగారు నగల కోసం ఆటోడ్రైవర్ ఘాతుకం
- కరీంనగర్ జిల్లా తాడికల్‌లో ఘటన



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఏసీపీ జీవన్‌రెడ్డి

శంకరపట్నం(మానకొండూరు): బంగారు నగలు కాజేయాలనే దురాశతో ఓ మహిళను కన్నతండ్రి కళ్లెదుటే ఆటోడ్రైవర్ దారుణంగా హత్య చేశాడు. తన బిడ్డను చంపవద్దని ఆమె తండ్రి కాళ్లు మొక్కినా ఆ కర్కోటకుడి మనసు కరగలేదు. ఈ ఘటన కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం తాడికల్ శివాలయంలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం భీంపల్లికి చెందిన గుండారపు ప్రమీల(55) ఆదివారం శంకరపట్నం మండలం అర్కండ్లలో ఉండే తన తండ్రి ఇజిగిరి కొమురయ్యను తీసుకుని మొలంగూర్‌లోని నాటువైద్యుడి వద్దకు బయలుదేరింది. మొలంగూర్‌లో నడుచుకుంటూ వెళ్తున్న ప్రమీల, కొమురయ్యకు ఓ ఆటోడ్రైవర్ తారసపడ్డాడు. తాయిత్తులు కట్టే నాటువైద్యుడు ఊరెళ్లాడని, తనకు తెలిసిన మరో నాటువైద్యుడి వద్దకు తీసుకెళ్తానని మభ్యపెట్టి ఆటో ఎక్కించుకున్నాడు. మొలంగూర్ నుంచి తాడికల్ శివాలయానికి తీసుకొచ్చాడు. ఆటోడ్రైవర్ ఒక్కసారిగా మహిళపై కత్తితో దాడి చేశాడు. పక్కనే ఉన్న ప్రమీల తండ్రి కొమురయ్య డ్రైవర్ కాళ్లు పట్టుకుని తన బిడ్డను చంపవద్దంటూ వేడుకున్నా అతడు కరుణించలేదు. ప్రమీల రక్తపుమడుగులో కుప్పకూలి ప్రాణాలు వదిలింది. విషయం తెలుసుకున్న గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. హుజూరాబాద్ ఏసీపీ జీవన్‌రెడ్డి అక్కడికి చేరుకొని విచారించారు. మొలంగూర్‌లోని సీసీ ఫుటేజీలు పరిశీలించారు. క్లూస్‌టీంతో వివరాలు సేకరించారు. బంగారు నగల కోసమే మహిళను ఆటోడ్రైవర్ హత్య చేసినట్లు పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. హుజూరాబాద్, జమ్మికుంట సీఐలు రమేశ్, సంతోష్ కుమార్‌లతో ఓ ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి ఆటోడ్రైవర్ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హుజూరాబాద్ ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

దసరాకు 5,265 ప్రత్యేక బస్సులు

13వ తేదీ నుంచి 25 వరకు నడవనున్న సర్వీసులు

టీఎస్ ఆర్టీసీ యాజమాన్యానికి మంత్రి పువ్వాడ ఆదేశం

ఖమ్మం మయూరిసెంటర్: దసరా పండగకు ప్రయాణికులను క్షేమంగా, సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చేందుకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీఎస్ ఆర్టీసీ) అన్ని ఏర్పాట్లు చేస్తోంది. బతుకమ్మ, దసరాకు సొంతూళ్లకు వెళ్లే వారి కోసం రాష్ట్ర వ్యాప్తంగా 5,265 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. అక్టోబర్ 13 నుంచి 25 వరకు ఈ ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంటాయి. వీటిలో 536 సర్వీసులకు ముందస్తు రిజర్వేషన్ సౌకర్యాన్ని కల్పించారు. అక్టోబర్ 22న సద్దుల బతుకమ్మ, 23న మహర్నవమి, 24 దసరా సందర్భంగా ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండే అవకాశం ఉన్న నేపథ్యంలో మరిన్ని ప్రత్యేక బస్సులు నడపనుంది. హైదరాబాద్, సికింద్రాబాద్ నుంచి జిల్లాలకు, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసింది. హైదరాబాద్‌లో ఎంజీబీఎస్, జేబీఎస్, సీబీఎస్‌తో పాటు కేపీహెచ్‌బీ కాలనీ, ఉప్పల్ క్రాస్ రోడ్, ఉప్పల్ బస్టాండ్, దిల్‌సుఖ్ నగర్, ఎల్బీనగర్ తదితర ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులు నడిపించనున్నట్లు అధికారులు తెలిపారు. గత దసరాకు 4,280 ప్రత్యేక బస్సులు నడపగా ఈసారి దాదాపు 1000 బస్సులను అదనంగా నడుపుతున్నట్లు వివరించారు. ప్రత్యేక బస్సులకు కూడా సాధారణ చార్జీలనే వసూలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఆదేశాల మేరకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని టీఎస్ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్ తెలిపారు. ఈ ప్రత్యేక సర్వీసుల్లో ముందస్తు రిజర్వేషన్‌ను సంస్థ అధికారిక వెబ్‌సైట్ tsrtconline.inలో చేసుకోవాలని కోరారు. పూర్తి సమాచారం కోసం టీఎస్ ఆర్టీసీ కాల్ సెంటర్ నంబర్‌లు 040–69440000, 040–23450033ను సంప్రదించాలని సూచించారు.

కన్నతండ్రిపై కొడుకులు, కూతురు దాడి

పనిమనిషిని చెట్టుకు కట్టేసి కొట్టిన వైనం

వివాహేతర సంబంధమని అనుమానం..

ములుగు ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

ములుగు రూరల్: మానవత్వాన్ని మరచి కన్న తండ్రిపైనే కూతురు, అల్లుడు, కొడుకులు దాడి చేశారు. ములుగు జిల్లా గోవిందరావుపేటలో ఆదివారం ఈ ఘటన చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. గోవిందరావుపేటకు చెందిన సండ్లగుండ్ల వెంకటేశ్వర్లు, సాంబలక్ష్మి దంపతులకు ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు. వెంకటేశ్వర్లు పస్రాలో కిరాణ వ్యాపారం చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. కూతురు సిరికి వరంగల్‌కు చెందిన గడ్డెల లక్ష్మీనారాయణతో వివాహం అయింది. కుమారులు ఇద్దరూ ఉద్యోగ రీత్యా హన్మకొండలో స్థిరపడ్డారు. కొంతకాలంగా ఆరోగ్య పరిస్థితి బాగోలేకపోవడంతో తల్లి సాంబలక్ష్మి కూతురు వద్దే ఉంటోంది. కొద్దిరోజుల తర్వాత తన భార్యను ఇంటికి పంపించాలని వెంకటేశ్వర్లు అల్లుడితో ఫోన్‌లో మాట్లాడగా, మాటామాటా పెరిగి, చివరకు ఈ విషయం సాంబలక్ష్మి తన భర్తకు విడాకులిస్తా.. అనే వరకు దారితీసింది. ఈ క్రమంలో సాంబలక్ష్మి భర్త వెంకటేశ్వర్లుపై గృహహింస చట్టం కింద కేసు పెట్టింది. అప్పటి నుంచి ఆమె ఇంటికి వెళ్లలేదు. దీంతో వెంకటేశ్వర్లు తన తల్లి రోషమ్మ (80) బాగోగులు చూసేందుకోసం ఖమ్మం జిల్లాకు చెందిన సుమలత అనే యాచకురాలిని నెలక్రితం పనికి ఏర్పాటు చేసుకున్నాడు. ఈ విషయం తెలిసిన కుమారులు వివేక్, శ్రావణ్, అల్లుడు లక్ష్మీనారాయణ, కూతురు సిరి కలసి ఆదివారం వెంకటేశ్వర్లుపై దాడికి పాల్పడ్డారు. అంతటితో ఆగక నాన్నమ్మతోపాటు పని మనిషిని కూడా చితక బాదారు. పని మనిషిని చెట్టుకు కట్టేసి తల వెంట్రుకలను కత్తిరించి, చిత్ర హింసలకు గురిచేశారు. తీవ్రంగా గాయపడిన ఆమె గ్రామస్తుల సహకారంతో తప్పించుకుని ములుగు ఏరియా ఆస్పత్రికి చేరుకుంది. కాగా, వెంకటేశ్వర్లను కూడా స్థానికులు ఆస్పత్రిలో చేర్పించారు. ఆయన పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. మనవళ్లు తన కొడుకును, తనను, పనిమనిషిని కొట్టారని వెంకటేశ్వర్లు తల్లి రోషమ్మ ఆస్పత్రిలో విలపిస్తూ చెప్పింది. ఇదిలా ఉండగా.. పని మనిషితో వెంకటేశ్వర్లు వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడనే నెపంతో కుటుంబ సభ్యులు దాడి చేసినట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై వెంకటేశ్వర్లు ఫిర్యాదు చేయడంతో దాడికి పాల్పడిన కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మస్తాన్ తెలిపారు.

నేడు సీఎం జగన్ చిత్రపటాలకు క్షీరాభిషేకాలు

గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయిస్ అసోసియేషన్ వెల్లడి

సాక్షి, అమరావతి: గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థ ప్రారంభమైన అక్టోబర్ రెండో తేదీని పురస్కరించుకుని సోమవారం అన్ని గ్రామ, వార్డు సచివాలయాల వద్ద 'థ్యాంక్యూ సీఎం సార్' పేరుతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకాలు నిర్వహించనున్నట్లు గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయీస్ అసోసియేషన్ తెలిపింది. సచివాలయ వ్యవస్థ ఏర్పాటు ద్వారా ఒకే విడతలో 1.34 లక్షల శాశ్వత ప్రభుత్వ ఉద్యోగాలను సృష్టించడంతోపాటు లక్షలాది మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు వెల్లడించింది. 'మాకు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపు ఇచ్చారు. మా కుటుంబాల్లో వెలుగులు నింపారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మార్గదర్శకత్వంలో ఎల్లవేళలా ప్రజలకు మంచి చేస్తూ ఉంటాం' అని గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తుల అంకమ్మరావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌లు విప్పర్తి నిఖిల్ కృష్ణ, భార్గవ్ సుతేష్, డి.సుధాకర్, అదనపు ప్రధాన కార్యదర్శి బీఆర్ కిషోర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

రాష్ట్రంలోని 8 వేల ప్రాంతాల్లో స్వచ్ఛతా హీ సేవ

మున్సిపల్ మంత్రి ఆదిమూలపు సురేష్ వెల్లడి



రోడ్లను శుభ్రంచేస్తున్న మంత్రి సురేష్, ఎమ్మెల్యే కేపీ నాగార్జున రెడ్డి, గంధం చంద్రుడు, బాలమురళీకృష్ణ తదితరులు

మార్కాపురం: 'ఏక్ తారీఖ్ ఏక్ గంట' కార్యక్రమంలో భాగంగా ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా 8 వేల ప్రాంతాల్లో 'స్వచ్ఛతా హీ సేవ' నిర్వహించినట్లు మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ తెలిపారు. మార్కాపురంలో ఆదివారం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ గంధం చంద్రుడు, సబ్ కలెక్టర్ సేదుమాధవన్‌లతో కలిసి ఆయన 'స్వచ్ఛతా హీ సేవ' కార్యక్రమంలో పాల్గొన్నారు. పట్టణంలోని రీడింగ్‌రూం సెంటరు నుంచి అమ్మవారిశాల, తేరు బజారు, నాయుడు వీధి వరకు పారిశుధ్య కార్మికులతో కలిసి శుభ్రం చేశారు. అనంతరం జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో మొదటిసారిగా బీచ్‌లు, నదులు, దేవాలయాలను శుభ్రం చేస్తున్నామని తెలిపారు. తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు కంటే మన రాష్ట్రంలోనే పారిశుధ్య కార్మికులకు మెరుగైన జీతభత్యాలు అందిస్తున్నామని, వారికి మేలుచేసే విషయంలో ఎక్కడా రాజీ పడవద్దని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారని చెప్పారు. ఈ సభకు మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ అధ్యక్షత వహించగా, పలువురు నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లులపై అపోహలు నమ్మొద్దు..

- వినియోగదారులకు విద్యుత్ పంపిణీ సంస్థల సీఎండీల విజ్ఞప్తి

సాక్షి,అమరావతి : విద్యుత్ బిల్లులకు సంబంధించి వివిధ సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారం చక్కర్లు కొడుతోందని, వాటిని నమ్మొద్దని ఆంధ్రప్రదేశ్ తూర్పు, మధ్య, దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)ల సీఎండీలు ఐ.పృధ్వీతేజ్, జె.పద్మాజనార్దనరెడ్డి, కె.సంతోషరావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం వేర్వేరు ప్రకటనలు విడుదల చేశారు. వినియోగదారులకు నెల రోజుల విద్యుత్ వినియోగానికి ఇవ్వాల్సిన బిల్లును 31 నుంచి 40 రోజులకు ఇస్తున్నారని సామాజిక మాధ్యమాల్లో కొందరు అసత్య ప్రచారం చేస్తున్నారని, సాధారణంగా విద్యుత్ బిల్లుల జారీ ప్రక్రియ ప్రతి నెలా ఒకటో తేదీ న ప్రారంభమై, వారం పాటు కొనసాగుతుందని పేర్కొన్నారు. ప్రతి నెలా వినియోగదారులకు బిల్లులను జారీ చేసే తేదీలకు అనుగుణంగా మరుసటి నెల అదే తేదీల్లో బిల్లులు ఇస్తారని తెలిపారు. అయితే డోర్ లాక్, 0 యూనిట్ల విద్యుత్ వినియోగం ఉన్న సర్వీసులకు ఆయా పరిస్థితులకు అనుగుణంగా బిల్లులను జారీ చేస్తున్నామని పేర్కొన్నారు. సామాజిక మాధ్యమాల్లో పేర్కొన్న విధంగా వంద యూనిట్ల వరకు టారిఫ్ రూ.3.60 ఉండగా, వినియోగం వంద యూనిట్లు దాటి 106 యూనిట్లు అయినట్లయితే 106 యూనిట్లకూ రూ.6.90 చొప్పున విద్యుత్ బిల్లు చెల్లించాల్సి ఉంటుందని పేర్కొనడం వాస్తవం కాదన్నారు. విద్యుత్ టారిఫ్ ప్రకారం 0–30 యూనిట్ల వరకు రూ.1.90, 31 నుంచి 75 యూనిట్ల వరకు రూ.3.00, 76 నుంచి 125 యూనిట్ల వరకు రూ.4.50 చొప్పున చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. వినియోగం 80 యూనిట్లు అయితే అందులో 75 యూనిట్లకు రూ.3 చొప్పున, మిగిలిన 5 యూనిట్లకు రూ.4.50 చొప్పున చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. వివిధ సామాజిక మాధ్యమాలలో పేర్కొన్న విధంగా 80 యూనిట్లకూ రూ.4.50 చొప్పున చెల్లించాల్సిన అవసరం లేదని సీఎండీలు స్పష్టం చేశారు. కొందరు వ్యక్తులు పనిగట్టుకుని విద్యుత్ సంస్థలపై నిందలు మోపుతూ అసత్య ప్రచారం చేస్తున్నారని, అలాంటి వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని సీఎండీలు హెచ్చరించారు.

'అరారత్' అధిరోహణలో ఎనిమిదేళ్ల బాలుడు



అరారత్ శిఖరం బేస్ క్యాంపు మీద భారత పతాకాన్ని ఎగురవేస్తున్న అక్షజ్, అనురాధ

ఒంగోలు సెంట్రల్: ఒంగోలుకి చెందిన 8 ఏళ్ల బాలుడు అక్షజ్ ఉదయ్ వాల్ టర్కీలోని ప్రసిద్ధ అరారత్ పర్వతాన్ని అధిరోహించి రికార్డు సృష్టించాడు. నగరంలోని రాజీవ్ నగర్‌కు చెందిన వెలగపూడి వెంకట రమణ ఏపీ ట్రాన్స్‌కో లో ఎస్ఈ గా ఉద్యోగం చేసి రిటైర్డ్ అయ్యారు. ఆయన అల్లుడు అమిత్, కుమార్తె వెలగపూడి అనురాధలు మస్కట్‌లో ఇంజినీర్లుగా చేస్తున్నారు. వీరి కుమారుడు అక్షజ్ అక్కడే 3వ తరగతి చదువుతున్నాడు. సెప్టెంబర్ 2న తల్లి అనురాధతో కలిసి టర్కీలోని ఈస్టన్ టర్కీ నగరం నుంచి కాలినడకన బయలుదేరి సెప్టెంబర్ 4న అరారత్ పర్వతాన్ని అధిరోహించాడు. ఈ పర్వతం 5,137 మీటర్ల ఎత్తు ఉంటుంది. అక్కడ –25 డిగ్రీల ఉష్ణోగ్రత ఉంటుంది. అనురాధతో కలిసి 3,200 మీటర్ల వరకు చేరుకొని బేస్ క్యాంపు మీద భారత జాతీయ పతాకాన్ని అక్షజ్ ఎగురవేశాడు. బేస్ క్యాంపు వద్ద ఉష్ణోగ్రత పగలు –5 డిగ్రీలు, రాత్రి –15 డిగ్రీలు ఉంటుంది. అక్షజ్ గతంలోనూ ఉత్తరాఖండ్‌లోని చంద్రశీల పర్వతాన్ని అధిరోహించాడు. 2021లో నేపాల్‌లోని 5077 మీటర్ల ఎత్తు ఉన్న మౌంట్ సంగాకర్షంగ్ ఎవరెస్ట్ రీజియన్ ను అధిరోహించి లిమ్కా బుక్ ఆఫ్ రికార్డులో స్థానం సంపాదించాడు.

తెలంగాణ

బీఆర్ఎస్‌కు ఎమ్మెల్సీ కసిరెడ్డి రాజీనామా

కల్వకుర్తి/ఆమనగల్లు/సాక్షి, హైదరాబాద్: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణ రెడ్డి బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేశారు. అలాగే నాగర్‌కర్నూల్ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ బాలాజీసింగ్ కూడా బీఆర్ఎస్‌కు గుడ్‌బై చెప్పారు. ఈ మేరకు వీరు తమ రాజీనామా లేఖలను సీఎం కేసీఆర్‌కు పంపించినట్లు సమాచారం. ఆదివారం హైదరాబాద్‌లో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డితో ఆయన నివాసంలో ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి, బాలాజీసింగ్ భేటీ అయ్యారు. కల్వకుర్తిలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన, ప్రారంభోత్సవానికి మంత్రి హరీశ్‌రావు వచ్చిన రోజే వీరు పార్టీని వీడటం చర్చనీయాంశమైంది. ప్రజల అభీష్టం మేరకే పార్టీని వీడుతున్నామని వీరు చెప్పారు. నాలుగేళ్ల ఎమ్మెల్సీ పదవీకాలం ఉన్నా ఎమ్మెల్యేగా నియోజకవర్గ ప్రజలకు, ఈ ప్రాంతానికి మేలు చేయాలన్న ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నానని కసిరెడ్డి పేర్కొన్నారు. కాగా ఆయన ఒకట్రెండు రోజుల్లో ఢిల్లీలో ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరే అవకాశం ఉందని తెలుస్తోంది.



గౌరవ మర్యాదలు

మర్యాద అనే మాటకి హద్దు, చెలియలికట్ట అనే అర్థాలున్నాయి. వ్యవహారంలో గౌరవమర్యాదలని కలిపి జంటపదాలుగా వాడుతాము. ఇతరుల చేత చెప్పించుకోకుండా తన హద్దుల్లో తాను ఉండటం మర్యాద. చెలియలికట్ట అంటే సముద్రానికి ఒడ్డు. నదులు, చెరువులు మొదలైన వాటికి ఒక ఒడ్డు ఉంటుంది. అవి కొన్ని సార్లు ఒడ్డుని తెగ కొట్టి విజృంభించటం చూస్తాం. కాని, సముద్రానికి ఎవరు ఒక ఒడ్డుని తయారు చేయలేదు. 'ఈ గీత దాటవద్దు' అని ఎవరూ కట్టడి చేయలేదు. అయినా ఎటువంటి సమయంలోనూ చెలియలికట్టని దాటి సముద్రుడు భూభాగంలో ప్రవేశించటం చూడం మనం. మనిషి విషయం కూడా అంతే!

కొన్ని రకాలైన రీతి, రివాజులని, తీరు తెన్నులని ప్రవర్తనా నియమావళిని నేర్పే పద్ధతులు అనేకం ఉన్నాయి. చిన్నతనంలో ఇంట్లో పెద్దలు ఏం చేయాలి? ఏం చేయకూడదు? మొదలైన విషయాలని కొన్ని మాటలతోనూ, కొన్ని చేతలతోనూ నేర్పిస్తారు. కొన్ని చదువుకోటం వల్ల తెలుస్తాయి. కొన్ని ఎవరూ చెప్పరు. చెప్పాలని కూడా తెలియదు. ప్రతివ్యక్తి తనంతట తానుగా తెలుసుకుని అమలు చేయవలసి ఉంటాయి. ఎదుటి వారికి ఆ విషయం చెప్పటానికి ఇబ్బందిగా ఉంటుంది. అవతలి వారిని ఇబ్బంది పెట్టకుండా ధర్మబద్ధంగా ఉండే ప్రవర్తనని మర్యాద అనవచ్చునేమో! ఎవరి చేతా చెప్పించుకోకుండా తన పరిమితుల్లో తాను ఉండటం మర్యాద. సముద్రం గట్టు లేకపోయినా తన హద్దు తాను దాటనట్టు.

> సున్నితమైన విషయాలు ప్రస్తావించక పోవటం ఒక మర్యాద. ఏ విషయం ప్రస్తావిస్తే బాధ కలుగుతుందో దానిని తనంత తాను ఎత్తక పోవటం మర్యాదస్తుల లక్షణం. మర్యాద ఇచ్చి పుచ్చుకోవలసినది. వస్త్రధారణ, మాటతీరు, నడతలలో మర్యాద వ్యక్తమౌతుంది. మర్యాదస్తులకి మాత్రమే సమాజంలో గౌరవం లభిస్తుంది.

ఉదాహరణకి – ఒక గదిలోకి ప్రవేశించాం అనుకోండి. ముందు వెళ్ళిన వారు లోపలికి వెళ్ళాలి. వెనక ఉన్న వారు అప్పుడే కదా లోపలికి అడుగు పెట్టటానికి వీలు కలిగేది. అదే కాస్త పదవో, అధికారమో ఉన్న వాళ్ళు అయితే, కదలమని చెప్పలేరు. బహుళ అంతస్తుల భవనాల్లో లిఫ్ట్ దగ్గర తరచూ ఎదుర్కొనే సమస్య ఇది. చెపితే,"మాకు తెలియదా? మీరు చెప్పాలా? జరుగుతాం లెండి. అంత తొందర ఎందుకు?" అని పెద్ద బోధ చేస్తారు. నిజానికి చెప్పించుకున్నామే, అని సిగ్గుపడాలి. ముందు లోపలికి వెళ్ళిన వారు వెనక ఉన్న వారికి అవకాశం కలిగించాలనే నియమం ఎక్కడా రాసి లేదు. అయినా పాటించాలని తెలుసు కనకనే నీది తప్పు అనలేక ఎదురు దాడికి దిగటం.

ఎవరైనా నిద్రపోతూ ఉంటే గట్టిగా పాటలో, టీవీనో పెట్టుకోవటం గురించి ఎక్కడా ప్రస్తావన లేదు కనక నా ఇష్టం వచ్చినట్టు చేస్తాను అనటం మూర్ఖత్వం అవుతుందా? కాదా? నలుగురి మధ్యలో ఉన్నప్పుడు చికాకు కలిగించే చేష్టలు, శబ్దాలు చేయటం, జుగుప్సావహంగా ప్రవర్తించటం ఆమోదయోగ్యం కాదు కదా! వెకిలి చేష్టలు ఎప్పుడైనా, ఎక్కడైనా అమర్యాదగా పరిగణించ బడతాయి. సభల్లో, సమావేశాలలో కొన్ని పాటించవలసిన పద్ధతులు నిర్దేశించ బడతాయి. కొన్ని పేర్కొనక పోయినా అమలు జరుగుతూ ఉంటాయి. సమాజంలో కూడా అంతే! ఉదాహరణకి పెద్దలు మాట్లాడుకుంటుంటే పిల్లలు మధ్యలో కలిగించుకో కూడదు. అసలు ఆ ప్రాంతంలో ఉండకూడదు. ఒక వేళ ఉండటం తటస్థిస్తే, పేరు పెట్టి పిలిచి మాట్లాడమంటే తప్ప నోరు విప్పకూడదు. రామాయణంలో రాముడు బాలకాండ మొత్తం మీద మాట్లాడిన మాటలు వేళ్ళ మీద లెక్క పెట్టవచ్చు. మర్యాదాపురుషోత్తముడు కదా! సభల్లో కూడా ఇదే పాటించ వలసిన నియమం. మర్యాద ప్రవర్తన వల్ల లభిస్తుంది. అడిగితే రాదు. కనుకనే మర్యాద గౌరవంతో జత కలిసి ఉంటుంది.

– డా. ఎన్. అనంతలక్ష్మి

బౌద్ధవాణి

నీ మనసే నిన్ను ప్రశ్నిస్తుంది!

పోతలియుడు అనే వ్యక్తి ఆపణం అనే పట్టణంలో పెద్ద ధనవంతుడు. వ్యాపారం వ్యవసాయం మీద చాలా ధనం సంపాదించాడు. వెండి, బంగారు నగలు, వజ్రాలు పెట్టెల కొద్దీ ప్రోవు చేశాడు. వయస్సు మళ్ళగానే తాను సంపాదించినదంతా తన కొడుకులకి పంచేశాడు. సంపాదన కార్యక్రమాన్ని విరమించుకున్నాడు. కనీసం వారికి సలహాలు కూడా ఇవ్వడం మానేశాడు.

"మీ మీ ఆలోచనల్ని బట్టి, మీ అవసరాల్ని బట్టి మీరే వ్యాపారాల్ని నడుపుకోండి. వ్యవసాయం చేసుకోండి" అని చెప్పేవాడు. దానితో తాను కుటుంబాన్ని పరిత్యజించినట్లుగా భావించి, అలాగే కాలం గడుపుతూ ఉన్నాడు. తాను అన్నింటినీ వదులుకుని "సన్యసించాను" అనుకుంటూ ఉండేవాడు. కనిపించిన వారందరికీ– "నాదేముంది? నేను ఇప్పుడు ఒక సర్వం వదిలేసిన పరిత్యాగిని"అంటూ ఉండేవాడు. ఒకరోజున పోతలియుడు ఉదయం భోజనం ముగించుకుని వ్యాహ్యాళికి బయలు దేరాడు. శుభ్రమైన, విలువైన వస్త్రాలు ధరించాడు. కిర్రు చెప్పులు తగిలించుకున్నాడు. గొడుగు పట్టుకుని ఊరి చివరకు వెళ్ళాడు. అక్కడ ఎత్తైన సాలవృక్షాల వనానికి చేరాడు. ఆ వనంలో ఒక విశాల సాలవృక్షం కింది అరుగు మీద బుద్ధుడు కూర్చొని ఉన్నాడు. ఆయన అప్పుడే భిక్ష స్వీకరించి, భిక్షాపాత్ర కడిగి, ఆ అరుగు మీద ఒక పక్కన బోర్లించి, విశ్రాంతిగా కూర్చున్నాడు. పోతలియుడు బుద్ధుని దగ్గరకు వచ్చాడు. నమస్కరించి నిలబడ్డాడు.

"గృహపతీ! ఇదిగో ఇక్కడ కూర్చోవడానికి ఆసనాలు ఉన్నాయి గదా! కూర్చో" అన్నాడు. కానీ, పోతలియుడు అక్కడే అలాగే నిలబడ్డాడు. బుద్ధుడు మరో రెండు సార్లు చెప్పాడు. పోతలియుడు కూర్చోలేదు. అది గౌరవంతో కాదు. కోపంతో."తాను అన్నీ వదిలివేసినప్పటికీ తనని పరివ్రాజకునిగా గుర్తించక ఈ గౌతముడు పదే పదే "గృహపతీ" అంటున్నాడు ఏమిటి?"అనే ఆలోచన అతనిలో అసహనాన్ని కలిగించింది.



"గౌతమా! ఇప్పుడు నా దగ్గర ధనం లేదు. ధాన్యం లేదు. వెండి బంగారాలు లేవు. వజ్రాలు లేవు. అన్నీ నా వారసులకి ఇచ్చేశాను. ఇంటికీ, తిండికీ, కొద్దిపాటి అవసరాలకీ, వస్త్రాలకీ మాత్రమే వారి మీద ఆధారపడుతున్నాను. ఇప్పుడెవర్నీ తిట్టడం లేదు. అది చెయ్యండి ఇది చెయ్యండి అని కోపగించుకోవడం లేదు. ఇన్ని వదిలిన నన్ను ఇంకా 'గృహపతీ' అనే పిలుస్తున్నారు మీరు, ఇది తగునా?" అని ప్రశ్నించాడు కొద్దిగా అసహనంగా.

"పోతలియా! వ్యవహారాల్ని వదిలిపెట్టడం అంటే ఇవి కాదు. హింసను మానడం ద్వారా జీవహింసను వదిలిపెట్టాలి. ఇచ్చిన దాన్నే తీసుకోవాలి. ఇవ్వని దాన్ని దేన్నీ తీసుకోకూడదు. సత్యాన్ని పలకడం ద్వారా అసత్యాన్ని వదిలివేయాలి. చాడీలు చెప్పకుండా ఉండటం ద్వారా చాడీలు చెప్పడాన్ని వదిలేయాలి. అలోభం ద్వారా లోభాన్ని వదిలిపెట్టాలి. శాంతం ద్వారా కోపాన్ని వదులుకోవాలి. నిందలు మానడం ద్వారా నిందించే విధానానికి దూరం కావాలి. నిరహంకారం ద్వారా అహంకారాన్ని వదులుకోవాలి.

ఈ ఎనిమిది ధర్మాల్ని సాధించుకుంటే నీవు పరిత్యాగిని కాగలవు. "ఓ పోతలియా! హింస చేసే నీవు హింసను మానాక, మరలా ఎప్పుడైనా హింసకు పూనుకుంటే.. నీ మనస్సే నిన్ను ప్రశ్నిస్తుంది. హింస విషయం ఒక్కటే కాదు. నేను ఇప్పుడు చెప్పిన ఎనిమిది విషయాల్లోనూ అంతే... తప్పుగా, అకుశలంగా తలచి వదిలి పెట్టిన వాటిని తిరిగి పాటిస్తే నీ మనస్సే నిన్ను ప్రశ్నిస్తుంది. ఆ సంఘర్షణే నిన్ను సంస్కరిస్తుంది. సరైన దారిలో పెడుతుంది" అన్నాడు.

అకుశల ధర్మాల్ని వదలడమే పరిత్యాగం అని పోతలియుడు గ్రహించాడు. బుద్ధునికి ప్రణమిల్లాడు!

– డా. బొర్రా గోవర్ధన్

వాగ్గేయకార వైభవం

రాజోపచారాలు అందుకు...

"గీతం వాద్యం తథా నృత్యం త్రయ సంగీతముచ్యతే..."... అన్నట్లు గీతం, వాద్యం, నృత్యం .. ఈ మూడూ సంగీతంలో అంతర్భాగాలే. అది త్రివేణీ సంగమం. అది ఎప్పుడూ ప్రశాంతంగా ఉండగలిగిన స్థితిని ఇస్తుంది. మొట్టమొదట సంగీతాన్ని ఎవరు పట్టుకున్నారు... అంటే భగవంతుడే. పరమశివుడికన్నా బాగా నృత్యం చేసేవారెవరు! శ్రీకృష్ణ పరమాత్మకన్నా వేణువు వాయించగల విద్వాంసుడెవరు! శంకరుడికన్నా దక్షిణామూర్తిగా వీణ వాయించేదెవరు! వైదికమైన రూపాలు వేరయినా సరస్వతీ దేవి కూడా ఎప్పుడూ వీణతోనే కన్పిస్తుంటుంది.



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

అయితే మనసుకు ఒక లక్షణం ఉంటుంది. దానికున్న శక్తి – వేగం, యాంత్రీకరణ. ఇక్కడున్నట్టుంటుంది... క్షణాల్లో ఎక్కడికో వెళ్ళిపోతుంది. పూజలో కూర్చుంటాం.. శివాయనమః అంటూ చేతితో పువ్వును శివలింగం మీద ఉంచుతాం. తరువాత.. మంత్రాలు నోరు చెబుతుంటుంది, చెయ్యి పూలు వేస్తుంటుంది... కానీ మనసు మాత్రం మెల్లగా జారుకుని ఎక్కడికో వెళ్ళిపోతుంది. దేముడికి ఇది కాదు కావలసింది. ఆయన వీటితో సంతోషించడు. పత్రం పుష్పం ఫలం తోయం యో మే భక్త్యాప్రయచ్ఛతి/తదహం భక్త్యుపహృతమ్ అశ్నామి ప్రయతాత్మనః... భక్తితో ఆకులు, పండ్లు, పూలు, నీళ్ళిస్తే నేను తీసుకుంటా... అవి చాలు నాకు... అంటాడు. కానీ చంచలమైన మనసును ఒకేచోట నిలబెట్టడం అంత తేలికయిన పనేమీ కాదు.




అందుకే ఏకాగ్రత లేనప్పుడు గంటలకొద్దీ పూజలొద్దు... సమయం ఉంటే 16 రకాలుగా సేవించు... లేదా 'పంచసంఖ్యోపచారిణీ'... అన్నారు.. గంధ, పుష్ప, ధూపం, దీపం, నైవేద్యాలతో చేయి.. దానికీ మనసు మొండికేస్తుందా... రాజోపచారాలు చెయ్యి. ... చామరం వెయ్యి, పాట విను, నృత్యం చెయ్యి... ఇవి మనసును బాగా పట్టుకుంటాయి. కంజదళాయతాక్షీ కామాక్షీ... అని కీర్తన అందుకున్నాడు శ్యామ శాస్త్రి.... కుంజరగమనే.. అని పాడాడు వాసుదేవాచార్యులవారు. శుక్రవారం మంటపంలో కామాక్షీ పరదేవత నడచివస్తుంటే ఏనుగు నడిస్తే ఎంత గంభీరంగా ఉంటుందో అంత నయనానందకరంగా ఉంటుందన్నాడు... అంటే ఆ కీర్తన వింటూంటే మనం అమ్మవారి నడకనే చూస్తున్నాం.. మనసుకు క్ళెం పడింది. ఆ తత్త్వం మనసును అలరించి శాంతినిస్తుంది. అందుకే గీతం, వాద్యం, నృత్యం మనసుకి ప్రశాంతతను ఇస్తాయి. అందుకే వాటిని రాజోపచారాల్లో చేర్చారు.

అసలు మనకంటే ప్రశాంతంగా ఉండాల్సింది .. భగవంతుడు. ఉద్వేగాలు ఎవరికి ఉండాలి? అదీ ఆయనకే. అందరి మనసుల్లో భగవంతుడున్నప్పుడు మన ఉద్వేగాలు, అశాంతి అన్నింటి సెగ ఆయనకే కదా తగులుతుంటుంది. ఆ వేడిని తట్టుకోవడానికే ఆయన అభిషేకం స్వీకరిస్తున్నాడట. నెత్తిన చల్లటి చంద్రుడిని కూడా ఉంచుకున్నాడని చమత్కారంగా చెప్పారు.

అమ్మవారు శక్తి స్వరూపం. శక్తి అంటే కదలిక. మరి అన్ని కదలికలతో అమ్మవారు ప్రశాంతంగా ఎలా ఉండగలుగుతారు... దానికి కాళిదాసంటారు కదా... సరిగమపదనిరతాంతాం... వీణా సంక్రాంత హస్తాంతాం... ఆ తల్లి చేతిలో వీణ పట్టుకుని సప్త స్వరాల్లో రమిస్తూ ఉంటుంది. అందుకే ఆమె ప్రశాంతంగా ఉంటుంది... అంటే సంగీతం మనసుకు ఏకాగ్రతను, శాంతిని ఇస్తుంది... చివరిదయిన మోక్ష సాధనకు వాగ్గేయకారులు కూడా సంగీతాన్నే సాధనంగా చేసుకుని తరించారు.

సినిమా



• 'లాల్ సలాం' పోస్టర్

సంక్రాంతికి సలాం

సంక్రాంతికి 'లాల్ సలాం' అంటున్నారు రజనీకాంత్. విష్ణు విశాల్, విక్రాంత్ హీరోలుగా రజనీకాంత్, కపిల్ దేవ్, జీవితా రాజశేఖర్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'లాల్ సలాం'. ఐశ్వర్యా రజనీకాంత్ దర్శకత్వంలో లైకా ప్రొడక్షన్స్‌పై సుభాస్కరన్ నిర్మించారు. ఈ సినిమాను సంక్రాంతికి రిలీజ్ చేస్తున్నట్లు వెల్లడించి, కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేసింది చిత్ర యూనిట్. "లాల్ సలాం' చిత్రంలో ముంబై డాన్ మొయిద్దీన్ భాయ్ పాత్రలో కనిపిస్తారు రజనీకాంత్. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి" అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: ఏఆర్ రెహమాన్.

సినిమా అంటే సులభం కాదు – నిర్మాత ఏఎం రత్నం



• రత్నం కృష్ణ, నేహాశెట్టి, కిరణ్ అబ్బవరం, ఏఎం రత్నం

"రాజకీయం, వ్యాపారం.. ఇలా అన్నిరంగాలపై అవగాహన ఉన్నవాళ్లే మూవీస్ చేయగలరు. సినిమా అంత సులభం కాదు.. ఖర్చు, రిస్క్‌తో కూడిన పని. అయినా నేను ఇండస్ట్రీలో ఉన్నందుకు గర్విస్తున్నాను. కిరణ్‌తో మరో సినిమా చేస్తా.. ఆ చిత్రానికి నేనే దర్శకత్వం చేస్తాను" అని నిర్మాత ఏఎం రత్నం అన్నారు. కిరణ్ అబ్బవరం, నేహా శెట్టి జంటగా రత్నం కృష్ణ దర్శకత్వం వహించిన చిత్రం 'రూల్స్ రంజన్'. ఏఎం రత్నం సమర్పణలో దివ్యాంగ్ లవానియా, మురళీ కృష్ణ వేమూరి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 6న విడుదలకానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకకి నిర్మాతలు ఏఎం రత్నం, అంబికా కృష్ణ, దర్శకుడు అనుదీప్ కేవీ ప్రత్యేక అతిథులుగా హాజరయ్యారు. "పక్కా యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ చిత్రం 'రూల్స్ రంజన్'. నేను సిక్స్ కొట్టడానికి దొరికిన లాస్ట్ బాల్ ఇది.. తప్పకుండా సిక్సర్ కొడతా" అన్నారు రత్నం కృష్ణ. "నిర్మాణ రంగంలో ఏఎం రత్నంగారు మాకు అండగా ఉన్నారు" అన్నారు మురళీకృష్ణ వేమూరి. "నేను నటించిన పూర్తి స్థాయి వినోదాత్మక సినిమా ఇది" అన్నారు కిరణ్ అబ్బవరం.

మేడమ్ చీఫ్ మినిస్టర్



• సూర్య రేవతి, మహేందర్ రెడ్డి

డా.సూర్య రేవతి మెట్టకూరు కథానాయికగా నటిస్తూ, స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్న చిత్రం 'మేడమ్ చీఫ్ మినిస్టర్'. ఈ చిత్రం ప్రారంభోత్సవంలో తెలంగాణ రాష్ట్ర మంత్రి పట్నం మహేందర్ రెడ్డి అతిథిగా పాల్గొని, మాట్లాడుతూ– "ఇది సామాజిక చిత్రంలా అనిపిస్తోంది. ఐదు భాషల్లో రిలీజ్ కానున్న ఈ సినిమా హిట్టవ్వాలి" అన్నారు. "అమెరికాలో చదువుకుని, ఓ సంస్థ స్థాపించి, ఇండియాకొచ్చి ఐదు గ్రామాలను దత్తత తీసుకున్నాను. సమాజంలో జరుగుతున్న పరిస్థితులను చెప్పాలని ఈ సినిమా ఆరంభించాను. ఇది పొలిటికల్ చిత్రం కాదు.. పబ్లిక్ మూవీ" అన్నారు డా.సూర్య రేవతి. ఈ చిత్రానికి సంగీతం: కార్తీక్ బి.కొండకండ్ల, కెమెరా: వల్లెపు రవికుమార్.



• విగ్రహావిష్కరణలో అల్లు రామలింగయ్య కుటుంబ సభ్యులు

అల్లు రామలింగయ్య కాంస్య విగ్రహం ఆవిష్కరణ

తెలుగు సినిమా గర్వించే లెజెండరీ సీనియర్ నటులు, దివంగత పద్మశ్రీ డా.అల్లు రామలింగయ్య కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఆదివారం ఆయన 101వ జయంతి. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని అల్లు బిజినెస్ పార్క్‌లో అల్లు రామలింగయ్య కాంస్య విగ్రహాన్ని హీరో అల్లు అర్జున్ కుమారుడు అల్లు అయాన్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అల్లు రామలింగయ్య కుమారుడు, నిర్మాత అల్లు అరవింద్ మాట్లాడుతూ–"వెయ్యి సినిమాలకుపైగా నటించి ప్రేక్షకుల హృదయాల్లో చెరగని ముద్ర వేసిన గొప్ప నటులు నాన్నగారు. తనదైన నటనతో యాభై ఏళ్లపాటు ప్రేక్షకుల్ని అలరించిన ఆయన తెలుగు ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారు" అన్నారు. ఈ కార్యక్రమంలో అల్లు రామలింగయ్య కుమార్తె సురేఖ, హీరో అల్లు శిరీష్‌తో పాటు అల్లు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



జెంటిల్‌మన్‌లో భాగమవడం సంతోషం – ప్రాచీ తెహ్లాన్

"జెంటిల్‌మన్ 2' సినిమాలో నటించాలని నిర్మాత కేటీ కుంజుమోన్‌గారు ఫోన్ చేసినప్పుడు చాలా ఎగ్జయిటింగ్‌గా ఫీలయ్యాను. ఓ బ్లాక్ బస్టర్ మూవీ ఫ్రాంచైజీలో భాగమవుతున్నందుకు సంతోషంగా ఉంది" అని హీరోయిన్ ప్రాచీ తెహ్లాన్ అన్నారు. అర్జున్, మధుబాల, శుభశ్రీ ప్రధాన పాత్రల్లో శంకర్ దర్శకత్వం వహించిన చిత్రం 'జెంటిల్‌మేన్'. కేటీ కుంజుమోన్ నిర్మించిన ఈ సినిమా 1993లో విడుదలై బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఈ సినిమాకి సీక్వెల్‌గా 'జెంటిల్‌మన్ 2' నిర్మిస్తున్నారు కుంజుమోన్. చేతన్ చీను హీరోగా ఎ.గోకుల్ కృష్ణ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాలో హీరోయిన్‌గా అవకాశం రావడంపై ప్రాచీ తెహ్లాన్ మాట్లాడుతూ– "జెంటిల్‌మన్ 2' లో ఇప్పటి వరకు చేయనటువంటి పాత్ర చేస్తున్నాను. యాక్షన్ సన్నివేశాల్లోనూ మెప్పించబోతున్నాను. ఈ సీక్వెన్స్‌లో నటించటం సవాల్‌తో కూడుకున్నది.. ఇందుకోసం శిక్షణ తీసుకున్నాను. త్వరలోనే షూటింగ్‌లో పాల్గొనబోతున్నాను" అన్నారు.

మనసులను కదిలిస్తేనే గొప్ప చిత్రం – నిర్మాత మిర్యాల రవీందర్ రెడ్డి

"ప్రేక్షకుల మనసులను కదిలిస్తేనే గొప్ప సినిమా అవుతుందని నమ్ముతున్నాను. అలా మా 'పెదకాపు 1' చిత్రం ప్రేక్షకుల మనసులను కదిలించింది. మా మూవీని ఆదరిస్తున్న ఆడియన్స్‌కి థ్యాంక్స్" అని నిర్మాత మిర్యాల రవీందర్ రెడ్డి అన్నారు. విరాట్ కర్ణ, ప్రగతి శ్రీవాస్తవ జంటగా శ్రీకాంత్ అడ్డాల దర్శకత్వం వహించిన చిత్రం 'పెదకాపు 1'. మిర్యాల సత్యనారాయణ రెడ్డి సమర్పణలో మిర్యాల



• శ్రీకాంత్ అడ్డాల, ప్రగతి, విరాట్ కర్ణ, రవీందర్ రెడ్డి, ఛోటా కె.నాయుడు

రవీందర్ రెడ్డి నిర్మించిన ఈ సినిమా సెప్టెంబరు 29న విడుదల అయింది. ఆదివారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో శ్రీకాంత్ అడ్డాల మాట్లాడుతూ–"ప్రేక్షకులకి మంచి చిత్రాన్ని అందించాలని మా యూనిట్ అంతా చాలా కష్టపడి పని చేశాం" అన్నారు. "మా సినిమాని ఇంత గొప్పగా ఆదరించిన ప్రేక్షకులకు థ్యాంక్స్" అన్నారు విరాట్ కర్ణ, ప్రగతి శ్రీ వాస్తవ. "పెదకాపు' చిత్రం నాకు పునర్జన్మ ఇచ్చింది" అన్నారు కెమెరామేన్ ఛోటా కె.నాయుడు.

రెండు భాగాలు?



• విజయ్ దేవరకొండ

విజయ్ దేవరకొండ హీరోగా గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో ఓ యాక్షన్ ఫిల్మ్ రూపొందనున్న సంగతి తెలిసిందే. సితార ఎంటర్‌టైన్మెంట్స్‌పై నాగవంశీ, సాయి సౌజన్య ఈ సినిమాను నిర్మించనున్నారు. అయితే ఈ చిత్రం రెండు భాగాలుగా రానున్నదనే టాక్ తాజాగా ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. ఓ సాధారణ కానిస్టేబుల్ గ్యాంగ్‌స్టర్‌గా ఎందుకు మారాల్సి వచ్చిందనే కోణంలో ఈ సినిమా కథనం ఉంటుందని ఫిల్మ్‌నగర్ భోగట్టా. ఈ సినిమాలో తొలుత హీరోయిన్‌గా శ్రీలీలను అనుకున్నారు. కానీ కాల్షీట్స్ సర్దుబాటు విషయంలో ఇబ్బందులు రావడంతో శ్రీలీల ఈ సినిమా నుంచి తప్పుకున్నారని, ఆమె స్థానంలో రష్మికా మందన్నాను తీసుకున్నారనే టాక్ వినిపిస్తోంది. గతంలో విజయ్–రష్మిక కాంబినేషన్‌లో 'గీత గోవిందం', 'డియర్ కామ్రేడ్' చిత్రాలు వచ్చిన సంగతి తెలిసిందే.

రీల్స్

ప్రేమ పంచాయితీ



• విషిక, శ్రీకాంత్, భరత్

భరత్, విషికా లక్ష్మణ్ జంటగా టి. గంగాధర దర్శకత్వంలో తెరకెక్కిన విలేజ్ లవ్ ఎమోషనల్ లవ్‌స్టోరీ 'ఏందిరా ఈ పంచాయితీ'. ఎం.ప్రదీప్ కుమార్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 6న విడుదల కానుంది. ఈ సినిమా ట్రైలర్‌ను హీరో శ్రీకాంత్ విడుదల చేసి, మాట్లాడుతూ– "ట్రైలర్ బాగుంది.. సినిమా పెద్ద హిట్ కావాలి" అన్నారు. 'సాక్ష్యాలు ఉన్నవన్నీ నిజం కావు.. ఆధారాలు లేనివి అబద్ధాలు కావు', 'కొన్ని ప్రేమలు పెళ్లితో మొదలవుతాయి, కొన్ని పెళ్లికి ముందే ఆగిపోతాయి.. ఆగిపోయిన ప్రేమను వద్దనుకుంటే.. పెళ్లితో మొదలయ్యే ప్రేమను నేను నీకు ఇవ్వాలనుకుంటున్నా' అనే డైలాగ్స్ ట్రైలర్‌లో ఉన్నాయి.


ఓ ఊరి ఆత్మకథ



• శివ కంఠమనేని

శివ కంఠమనేని, క్యాథలిన్ గౌడ జంటగా మల్లి దర్శకత్వం వహించిన చిత్రం 'మధురపూడి గ్రామం అనే నేను'. జి.రాంబాబు యాదవ్ సమర్పణలో కేఎస్ శంకర్ రావు, ఆర్. వెంకటేశ్వరరావు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 13న రిలీజ్ కానుంది. మల్లి మాట్లాడుతూ– "ఒక ఊరికి ఆత్మ ఉంటే.. ఆ ఆత్మ తన కథ తానే చెబితే ఎలా ఉంటుంది? అనేది చిత్రకథాంశం" అన్నారు. "మంచి యాక్షన్ డ్రామాగా రూపొందిన చిత్రమిది" అన్నారు నిర్మాతలు. ఈ చిత్రానికి సంగీతం: మణిశర్మ, కెమెరా: సురేష్ భార్గవ్.

తలకోనలో ఏం జరిగింది?



• అప్సరా రాణి

అప్సరా రాణి ప్రధాన పాత్రలో నటించిన క్రైమ్ థ్రిల్లర్ మూవీ 'తలకోన'. నగేష్ నారదాసి దర్శకత్వం వహించారు. స్వప్న శ్రీధర్ రెడ్డి సమర్పణలో దేవర శ్రీధర్ రెడ్డి (చేవెళ్ల) నిర్మించిన ఈ చిత్రం నవంబరులో విడుదల కానుంది. "కొంతమంది స్నేహితులతో కలిసి అడవికి వెళతారు హీరోయిన్. ఎంతమంది వెళ్లారు? ఎందరు తిరిగొచ్చారు? అక్కడ ఏం జరిగింది? అనే అంశాలతో ఈ చిత్ర కథ సాగుతుంది" అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సుభాష్ ఆనంద్ సంగీత దర్శకుడు.



క్వాలిఫయింగ్‌లో జ్యోతి సురేఖ 'టాప్'

ఆసియా క్రీడల ఆర్చరీ క్వాలిఫయింగ్ రౌండ్‌లో భారత స్టార్, ఆంధ్రప్రదేశ్ అమ్మాయి వెన్నం జ్యోతి సురేఖ టాప్ ర్యాంక్‌లో నిలిచింది. ఆదివారం జరిగిన మహిళల కాంపౌండ్ క్వాలిఫయింగ్‌లో విజయవాడకు చెందిన 27 ఏళ్ల జ్యోతి సురేఖ 704 పాయింట్లు స్కోరు చేసి అగ్రస్థానంలో నిలిచింది. భారత్‌కే చెందిన ప్రపంచ చాంపియన్ అదితి స్వామి 696 పాయింట్లతో నాలుగోర్యాంక్‌ను దక్కించుకుంది. టీమ్ విభాగంలోనూ భారత్‌కు టాప్ ర్యాంక్ దక్కింది. టీమిండియా 2087 పాయింట్లు స్కోరు చేసి నేరుగా క్వార్టర్ ఫైనల్లో పోటీపడనుంది. పురుషుల కాంపౌండ్ క్వాలిఫయింగ్‌లో ఓజస్ ప్రవీణ్ దేవ్‌తలే 709 పాయింట్లతో మూడో ర్యాంక్‌లో, అభిషేక్ వర్మ 708 పాయింట్లతో నాలుగో ర్యాంక్‌లో నిలిచారు. పురుషుల రికర్వ్ క్వాలిఫయింగ్‌లో అతాను దాస్ 678 పాయింట్లతో నాలుగో ర్యాంక్‌లో, ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ బొమ్మదేవర ధీరజ్ 675 పాయింట్లతో ఆరో ర్యాంక్‌లో నిలిచారు. మహిళల రికర్వ్ క్వాలిఫయింగ్‌లో అంకిత 649 పాయింట్లతో పదో ర్యాంక్‌లో, భజన్ కౌర్ 640 పాయింట్లతో 14వ ర్యాంక్‌లో నిలిచారు.

పదిహేను పతకాలతో పండుగ




అవినాశ్ సాబ్లే

ఆసియా క్రీడల్లో ఆదివారం భారత క్రీడాకారులు పతకాల పంట పండించారు. ఒకటి కాదు, రెండు కాదు, మూడు కాదు.... ఏకంగా 15 పతకాలతో పండుగ చేసుకున్నారు. అథ్లెటిక్స్‌లో అత్యధికంగా తొమ్మిది పతకాలు రాగా... షూటింగ్‌లో మూడు పతకాలు... బ్యాడ్మింటన్, గోల్ఫ్, బాక్సింగ్‌లో ఒక్కో పతకం లభించాయి. భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆంధ్రప్రదేశ్, తెలంగాణ క్రీడాకారులు కూడా తమ ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. ఆంధ్రప్రదేశ్ అథ్లెట్ జ్యోతి యర్రాజీ రజతం, తెలంగాణ అథ్లెట్ అగసార నందిని కాంస్యం... తెలంగాణ బాక్సర్ నిఖత్ జరీన్ కాంస్యం... తెలంగాణ షూటర్ కైనన్ చెనాయ్ స్వర్ణం, కాంస్యంతో మెరిపించారు. రజత పతకం నెగ్గిన భారత బ్యాడ్మింటన్ జట్టులో ఆంధ్రప్రదేశ్ ప్లేయర్లు కిడాంబి శ్రీకాంత్, సాత్విక్ సాయిరాజ్ సభ్యులుగా ఉన్నారు. ఎనిమిదో రోజు పోటీలు ముగిశాక భారత్ 13 స్వర్ణాలు, 21 రజతాలు, 19 కాంస్యాలతో కలిపి మొత్తం 53 పతకాలతో నాలుగో స్థానంలో కొనసాగుతోంది.

- ఆసియా క్రీడల్లో ఆదివారం ఒక్కరోజే భారత్‌కు 15 పతకాలు
- 9 పతకాలతో అదరగొట్టిన అథ్లెట్స్
- స్వర్ణాలతో మెరిసిన సాబ్లే, తజీందర్
- జ్యోతి యర్రాజీకి రజతం
- కాంస్యం సాధించిన నందిని

హాంగ్జౌ: ఆసియా క్రీడల్లో భారత అథ్లెట్లు అంచనాలను అందుకున్నారు. అటు సీనియర్లు, ఇటు జూనియర్లు కూడా సత్తా చాటడంతో భారత్ ఖాతాలో ఆదివారం ఒక్క అథ్లెటిక్స్‌లోనే 9 పతకాలు చేరాయి. ఇందులో 2 స్వర్ణాలు, 4 రజతాలు, 3 కాంస్యాలు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ అథ్లెట్ జ్యోతి యర్రాజీ రేసు విషయంలో కాస్త వివాదం రేగినా... చివరకు రజతంతో కథ సుఖాంతమైంది. తెలంగాణకు చెందిన అగసార నందిని కూడా ఏషియాడ్ పతకాల జాబితాలో తన పేరును లిఖించుకుంది.

సత్తా చాటిన సాబ్లే

3000 మీటర్ల స్టీపుల్‌చేజ్‌లో అవినాశ్ సాబ్లే కొత్త చరిత్ర సృష్టించాడు. పురుషుల విభాగంలో గతంలో ఏ భారత అథ్లెట్‌కూ సాధ్యంకాని రీతిలో స్వర్ణ పతకంతో మెరిసాడు. 8 నిమిషాల 19.50 సెకన్లలో ఈవెంట్‌ను పూర్తి చేసిన సాబ్లే మొదటి స్థానంలో నిలిచాడు. 29 ఏళ్ల సాబ్లే ఈ క్రమంలో కొత్త ఆసియా క్రీడల రికార్డును నమోదు చేశాడు. 2018 జకార్తా క్రీడల్లో హొస్సేన్ కేహని (ఇరాన్: 8 నిమిషాల 22.79 సెకన్లు) పేరిట ఉన్న ఘనతను అతను సవరించాడు. 3000 మీటర్ల స్టీపుల్‌చేజ్ మహిళల విభాగంలో మాత్రం భారత్ నుంచి 2010 గ్వాంగ్‌జౌ ఆసియా క్రీడల్లో సుధా సింగ్ స్వర్ణం గెలుచుకుంది.

తజీందర్ తడాఖా

పురుషుల షాట్‌పుట్‌లో తజీందర్‌పాల్ సింగ్ తూర్ సత్తా చాటడంతో భారత్ ఖాతాలో మరో స్వర్ణం చేరింది. 2018 జకార్తా క్రీడల్లో స్వర్ణం గెలుచుకున్న అతను ఈసారి తన మెడల్‌ను నిలబెట్టుకున్నాడు. ఇనుప గుండును 20.36 మీటర్ల దూరం విసిరిన తజీందర్ అగ్రస్థానాన్ని అందుకున్నాడు. తొలి రెండు ప్రయత్నాల్లో అతను ఫౌల్ చేసినా మూడో ప్రయత్నంలో 19.51 మీటర్ల దూరం గుండు వెళ్లింది. తర్వాతి ప్రయత్నంలో దానిని 20.06 మీటర్లతో అతను మెరుగుపర్చుకున్నాడు. ఐదో ప్రయత్నం కూడా ఫౌల్ అయినా... ఆఖరి ప్రయత్నంలో తన అత్యుత్తమ ప్రదర్శనతో పసిడిని ఖాయం చేసుకున్నాడు. పర్దుమన్ సింగ్, జోగిందర్ సింగ్,



తజీందర్‌పాల్

బహదూర్ సింగ్ చౌహాన్ తర్వాత వరుసగా రెండు ఆసియా క్రీడల్లో షాట్‌పుట్ ఈవెంట్‌లో స్వర్ణం సాధించిన నాలుగో భారత అథ్లెట్‌గా తజీందర్ నిలిచాడు.

సిల్వర్ జంప్



మురళీ శ్రీశంకర్

పురుషుల లాంగ్‌జంప్‌లో భారత ఆటగాడు మురళీ శ్రీశంకర్ తనపై ఉన్న అంచనాలను నిలబెట్టుకున్నాడు. ఆగస్టులో బుడాపెస్ట్‌లో జరిగిన వరల్డ్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో రజతం సాధించిన మురళీ ఇక్కడ ఆసియా క్రీడల్లోనూ రజత పతకాన్ని గెలుచుకున్నాడు. 8.19 మీటర్లు దూకిన శ్రీశంకర్ రెండో స్థానంలో నిలిచాడు. జియాన్ వాంగ్ (చైనా–8.22 మీ.), యుహావో షి (చైనా–8.10 మీ.) స్వర్ణ, కాంస్యాలు సాధించారు.

వహ్వా హర్‌మిలన్

1998 జనవరి... పంజాబ్ స్టేట్ ఎలక్ట్రిసిటీ బోర్డులో ఉద్యోగి అయిన మాధురి సింగ్ మూడు నెలల గర్భిణి. అయితే క్రీడాకారుల కోటాలో ఉద్యోగం పొందిన ఆమె సంస్థ నిబంధనలు, ఆదేశాల ప్రకారం తన ప్రధాన ఈవెంట్ 800 మీటర్ల నుంచి 1500 మీటర్లకు మారి పరుగెత్తాల్సి వచ్చింది. 1500 మీటర్ల ట్రయల్‌లో పాల్గొని ఉద్యోగం కాపాడుకున్న మాధురికి ఆరు నెలల తర్వాత పాప పుట్టింది. ఆ అమ్మాయే హర్‌మిలన్ బైన్స్. నాలుగేళ్ల తర్వాత 2002 ఆసియా క్రీడల్లో మాధురి 800 మీటర్ల పరుగులోనే పాల్గొని రజత పతకం సాధించింది. ఇప్పుడు 21 ఏళ్ల తర్వాత ఆమె కూతురు ఆసియా క్రీడల్లో రజత పతకంతో మెరిసింది... అదీ 1500 మీటర్ల ఈవెంట్‌లో కావడం యాదృచ్ఛికం! ఆదివారం జరిగిన 1500 మీటర్ల పరుగును హర్‌మిలన్ 4 నిమిషాల 12.74 సెకన్లలో పూర్తి చేసి రెండో స్థానంలో నిలిచింది.



హర్‌మిలన్ బైన్స్

అజయ్‌కు రజతం, జాన్సన్‌కు కాంస్యం

పురుషుల 1500 మీటర్ల పరుగులో కూడా భారత్ ఖాతాలో రెండు పతకాలు చేరాయి. ఉత్తరప్రదేశ్‌కు చెందిన అజయ్ కుమార్ సరోజ్, కేరళ అథ్లెట్ జిన్సన్ జాన్సన్ రెండు, మూడు స్థానాల్లో నిలిచి రజత, కాంస్యాలు సొంతం చేసుకున్నారు. 3 నిమిషాల 38.94 సెకన్లలో అజయ్ రేసు పూర్తి చేయగా, 3 నిమిషాల 39.74 సెకన్లలో జాన్సన్ లక్ష్యం చేరాడు. ఈ ఈవెంట్‌లో ఖతర్‌కు చెందిన మొహమ్మద్ అల్‌గర్ని (3 నిమిషాల 38.38 సెకన్లు)కు స్వర్ణం దక్కింది.



అజయ్



జాన్సన్

పతకాల పట్టిక (టాప్-10)

దేశం	స్వ	ర	కాం	మొ
చైనా	133	72	39	244
దక్షిణ కొరియా	30	35	60	125
జపాన్	29	41	42	112
భారత్	13	21	19	53
ఉజ్బెకిస్తాన్	11	12	17	40
థాయ్‌లాండ్	10	6	14	30
చైనీస్ తైపీ	9	10	14	33
హాంకాంగ్	6	15	20	41
ఉ. కొరియా	5	9	5	19
ఇండోనేసియా	4	3	11	18

నోట్: స్వ-స్వర్ణం, ర-రజతం, కాం-కాంస్యం, మొ-మొత్తం.

సీనియర్ సీమ జోరు



సీమా పూనియా

మహిళల డిస్కస్ త్రోలో సీమా పూనియా వరుసగా మూడో ఆసియా క్రీడల్లోనూ పతకంతో మెరిసింది. 2014లో స్వర్ణం, 2018లో కాంస్యం గెలిచిన సీమ ఈసారి కూడా కాంస్య పతకాన్ని తన మెడలో వేసుకుంది. 40 ఏళ్ల సీమ డిస్కస్‌ను 58.62 మీటర్ల దూరం విసిరి మూడో స్థానంలో నిలిచింది. దాదాపు 20 ఏళ్ల తన సుదీర్ఘ కెరీర్‌లో కామన్వెల్త్ క్రీడల్లోనూ 3 రజతాలు, 1 కాంస్యం నెగ్గిన సీమ ఇవి తనకు ఆఖరి ఆసియా క్రీడలని ప్రకటించింది. ర్యాంకింగ్ ద్వారా పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధిస్తానని ఆశిస్తున్నట్లు ఆమె పేర్కొంది.



జ్యోతి యర్రాజీ (ఇన్‌సెట్‌లో రజతంతో)

కాంస్యం నుంచి రజతానికి...

దాదాపు రెండున్నర నెలల క్రితం ఆసియా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ 100 మీటర్ల హర్డిల్స్‌లో స్వర్ణం సాధించిన ఆంధ్రప్రదేశ్ అమ్మాయి జ్యోతి యర్రాజీ ఆసియా క్రీడల్లోనూ ఫేవరెట్‌గా బరిలోకి దిగింది. 'ఫాల్స్ స్టార్ట్' ఘటనతో కాస్త ఏకాగ్రత చెదిరినట్లు కనిపించిన జ్యోతి 100 మీటర్ల హర్డిల్స్‌ను 12.91 సెకన్లలో పూర్తి చేసి మూడో స్థానంలో నిలిచింది. చైనాకు చెందిన లిన్ యువీ (12.74 సెకన్లు), వూ యానీ వరుసగా తొలి రెండు స్థానాల్లో నిలిచారు. అయితే 'ఫాల్స్ స్టార్ట్' వివాదం అనంతరం వూ యానీని నిర్వాహకులు డిస్‌క్వాలిఫై చేశారు. నిబంధనల ప్రకారం రెండో స్థానంలో నిలిచిన జ్యోతికి రజతం ఖాయమైంది. ఆసక్తికర అంశం ఏంటంటే జ్యోతి స్వర్ణం నెగ్గిన ఆసియా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లోనూ ఇదే వూ యానీ (చైనా) ఇదే తరహాలో ఫాల్స్ స్టార్ట్ చేసి డిస్‌క్వాలిఫై అయింది.

ఏం జరిగిందంటే...

మహిళల 100 మీటర్ల హర్డిల్స్ ఫైనల్స్‌లో ఎనిమిది మంది తలపడ్డారు. అయితే గన్ మోగి అధికారికంగా పరుగు ప్రారంభించక ముందే 'ఫాల్స్ స్టార్ట్' అయింది. దాంతో రిఫరీ ఇద్దరు అథ్లెట్లు వూ యానీ, జ్యోతిలకు రెడ్‌కార్డ్ చూపించి డిస్‌క్వాలిఫైగా ప్రకటించారు. అయితే దీనిపై జ్యోతి ఒక్కసారిగా ఆశ్చర్యపోయింది. తన తప్పేమీ లేదని, సరిగ్గా విచారించమంటూ నిరసన వ్యక్తం చేసింది. అప్పటికి ఎలాంటి చర్య తీసుకోకుండా వీరిద్దరిని రేసులో పాల్గొనేందుకు నిర్వాహకులు అనుమతించారు. దాంతో పరుగు మళ్లీ ప్రారంభమైంది. రేసు ముగిసిన తర్వాత నిర్వాహకులు స్లో మోషన్ వీడియో రీప్లేల ద్వారా ఏం జరిగిందో తెలుసుకున్నారు. గన్ మోగక ముందే వూ యానీ పరుగుకు సిద్ధం కావడంతో పాటు అప్పటికే ఒక అడుగు లైన్ బయటకు కూడా వేసినట్లు ఇందులో స్పష్టంగా కనిపించింది. దాంతో జ్యోతి డిస్‌క్వాలిఫికేషన్‌ను రద్దు చేసి వూ యానీపై మాత్రమే చర్య తీసుకున్నారు. దీంతో భారత అథ్లెటిక్స్ సమాఖ్య అధికారికంగా ఫిర్యాదు చేయాల్సిన అవసరం లేకపోయింది. తొలి ఆసియా క్రీడల్లోనే తాను రజతం గెలుచుకోవడం పట్ల జ్యోతి సంతోషం వ్యక్తం చేసింది.

'నందివర్ధనం'



కాంస్యంతో నందిని

గత కొంత కాలంగా వేర్వేరు వేదికలపై మెరుగైన ప్రదర్శనలతో సత్తా చాటుతూ వచ్చిన తెలంగాణ అథ్లెట్ అగసార నందిని అసలు సమయంలో తన ఆటను మరింత ఎత్తుకు తీసుకెళ్లింది. ప్రతిష్టాత్మక ఆసియా క్రీడల్లో పాల్గొన్న తొలిసారి కాంస్యంతో మెరిసింది. ఏడు క్రీడాంశాల సమాహారమైన మహిళల హెప్టాథ్లాన్ ఈవెంట్‌లో నందిని మూడో స్థానంలో నిలిచి కంచు పతకాన్ని సొంతం చేసుకుంది. రెండు రోజుల పాటు జరిగిన ఏడు ఈవెంట్లలో కలిపి నందిని 5712 పాయింట్లు సాధించింది. హెప్టాథ్లాన్‌లోని తొలి ఆరు ఈవెంట్లు ముగిసేసరికి నందిని ఐదో స్థానంలో నిలిచింది. 100 మీటర్ల హర్డిల్స్ (4వ స్థానం), హైజంప్ (9వ స్థానం), షాట్‌పుట్ (8వ స్థానం), 200 మీటర్ల పరుగు (1వ స్థానం), లాంగ్‌జంప్ (3వ స్థానం), జావెలిన్ త్రో (9వ స్థానం)... ఇలా వరుసగా ఆమె ప్రదర్శన కొనసాగింది. అయితే చివరి ఈవెంట్ 800 మీటర్ల పరుగులో సత్తా చాటడంతో కాంస్యం ఖాయమైంది. ఈ పరుగును 2 నిమిషాల 15.33 సెకన్లలో పూర్తి చేసిన నందిని అగ్ర స్థానంలో నిలిచింది. దాంతో ఓవరాల్ పాయింట్లలో ఆమె మూడో స్థానానికి ఎగబాకింది. 2018 ఆసియా క్రీడల హెప్టాథ్లాన్‌లో స్వర్ణం సాధించిన మరో భారత అథ్లెట్ స్వప్న బర్మన్ చివరి వరకు పోటీలో నిలిచినా... ఓవరాల్‌గా 5708 పాయింట్లతో నాలుగో స్థానానికే పరిమితమైంది. పేద కుటుంబం నుంచి వచ్చి నార్సింగిలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ పాఠశాలలో చదివిన నందిని అదే పాఠశాలలో నెలకొల్పిన అథ్లెటిక్స్ అకాడమీ తొలి బ్యాచ్ విద్యార్థిని. ప్రస్తుతం సంగారెడ్డిలోని తెలంగాణ సాంఘిన సంక్షేమ శాఖ డిగ్రీ కళాశాలలో బీబీఏ చదువుతున్న నందినికి ఉస్మానియా యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ తాజా విజయానికి రూ. 1 లక్ష నగదు ప్రోత్సాహక బహుమతిని ప్రకటించారు.

సూపర్ కైనన్...

- పురుషుల ట్రాప్ ఈవెంట్‌లో రెండు పతకాలు నెగ్గిన హైదరాబాద్ షూటర్
- టీమ్‌లో స్వర్ణం, వ్యక్తిగత విభాగంలో కాంస్యం సొంతం
- 22 పతకాలతో ఆసియా క్రీడలను ముగించిన భారత షూటింగ్ బృందం



స్వర్ణ పతకాలతో పృథ్వీరాజ్, జొరావర్ సింగ్ సంధూ, కైనన్ చెనాయ్



రజత పతకాలతో రాజేశ్వరి కుమారి, మనీషా కీర్, ప్రీతి రజక్

ఆసియా క్రీడల్లో భారత షూటర్లు తమ అత్యుత్తమ ప్రదర్శన కనబరిచారు. షూటింగ్ క్రీడాంశం చివరిరోజు భారత్‌కు ఒక స్వర్ణం, ఒక రజతం, ఒక కాంస్యం కలిపి మూడు పతకాలు వచ్చాయి. ఓవరాల్‌గా భారత షూటర్లు ఈ క్రీడల్లో ఏడు స్వర్ణాలు, తొమ్మిది రజతాలు, ఆరు కాంస్యాలతో కలిపి మొత్తం 22 పతకాలు గెలిచారు. ఆఖరి రోజు పురుషుల, మహిళల ట్రాప్ టీమ్, వ్యక్తిగత విభాగాల్లో పోటీలు జరిగాయి. పురుషుల ట్రాప్ టీమ్ విభాగంలో హైదరాబాద్‌కు చెందిన కైనన్ చెనాయ్, జొరావర్ సింగ్ సంధూ, పృథ్వీరాజ్ తొండైమన్‌లతో కూడిన భారత జట్టు 361 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచి స్వర్ణ పతకాన్ని సాధించింది. ఈ క్రమంలో ఆసియా క్రీడల కొత్త రికార్డును నెలకొల్పింది. క్వాలిఫయింగ్‌లో కైనన్ 122 పాయింట్లు, జొరావర్ 120 పాయింట్లు స్కోరు చేసి టాప్-2లో నిలిచి వ్యక్తిగత ఈవెంట్ ఫైనల్‌కు అర్హత పొందారు. వ్యక్తిగత విభాగంలో ఆరుగురు షూటర్ల మధ్య ఎలిమినేషన్ పద్ధతిలో జరిగిన ఫైనల్లో జొరావర్ 23 పాయింట్లతో ఐదో స్థానంలో నిలువగా... కైనన్ 32 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకం గెల్చుకున్నాడు. మహిళల ట్రాప్ టీమ్ ఈవెంట్‌లో రాజేశ్వరి కుమారి, మనీషా కీర్, ప్రీతి రజక్‌లతో కూడిన భారత జట్టు 337 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచి రజత పతకం కైవసం చేసుకుంది.



రజతంతో ముగింపు...

ఆసియా క్రీడల్లో తొలిసారి పసిడి పతకం సాధించే అవకాశాన్ని భారత పురుషుల బ్యాడ్మింటన్ జట్టు చేజార్చుకుంది. ఫైనల్లో భారత్ 2-3తో చైనా చేతిలో ఓడింది. తొలి మ్యాచ్‌లో లక్ష్య సేన్ 22-20, 14-21, 21-18 తో షి యుకీపై గెలిచి భారత్‌కు 1-0 ఆధిక్యం ఇచ్చాడు. రెండో మ్యాచ్‌లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి జోడీ 21-15, 21-18తో లియాంగ్ వెకింగ్-చాంగ్ వాంగ్ జంటను ఓడించడంతో భారత్ 2-0తో ఆధిక్యంలోకి వెళ్లింది. మూడో మ్యాచ్‌లో శ్రీకాంత్ 22-24, 9-21తో లి షిఫెంగ్ చేతిలో ... నాలుగో మ్యాచ్‌లో ధ్రువ్-సాయిప్రతీక్ ద్వయం 6-21, 15-21 తో లియు యుచెన్-జువాన్‌యి ఒయు జోడీ చేతిలో ఓడిపోవడంతో స్కోరు 2-2తో సమమైంది. నిర్ణాయక ఐదో మ్యాచ్‌లో గాయంతో ఫైనల్‌కు దూరమైన భారత నంబర్‌వన్ ప్రణయ్ స్థానంలో మిథున్ ఆడాల్సి వచ్చింది. మిథున్ 12-21, 4-21 తో హాంగ్యాంగ్ వెంగ్ చేతిలో ఓటమి చెందాడు.

అదితికి రజతం

ఆసియా క్రీడల్లో పతకం నెగ్గిన తొలి భారతీయ మహిళా గోల్ఫర్‌గా ఘనత



రెండేళ్ల క్రితం టోక్యో ఒలింపిక్స్‌లో త్రుటిలో కాంస్య పతకం కోల్పోయిన భారత మహిళా గోల్ఫర్ అదితి అశోక్ ఆసియా క్రీడల్లో మాత్రం సత్తా చాటుకుంది. ఆదివారం ముగిసిన మహిళల గోల్ఫ్ వ్యక్తిగత విభాగంలో కర్ణాటకకు చెందిన 25 ఏళ్ల అదితి 17 అండర్ 271 స్కోరుతో రెండో స్థానంలో నిలిచి రజత పతకం దక్కించుకుంది. తద్వారా ఆసియా క్రీడల్లో పతకం నెగ్గిన తొలి భారతీయ మహిళా గోల్ఫర్‌గా ఆమె ఘనత సాధించింది. గతంలో పురుషుల వ్యక్తిగత విభాగంలో లక్ష్మణ్ సింగ్ (1982), శివ కపూర్ (2002) స్వర్ణాలు, రాజీవ్ మెహతా (1982) రజతం గెలిచారు.

భారత్, కొరియా మ్యాచ్ 'డ్రా'

ఆసియా క్రీడల మహిళల హాకీ ఈవెంట్‌లో భారత జట్టు తొలి 'డ్రా' నమోదు చేసింది. ఆదివారం దక్షిణ కొరియాతో జరిగిన పూల్ 'ఎ' మూడో లీగ్ మ్యాచ్‌ను భారత్ 1-1 గోల్‌తో 'డ్రా' చేసుకుంది. కొరియా తరఫున చో హైజిన్ (12వ ని.లో), భారత్ తరఫున నవ్‌నీత్ కౌర్ (44వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. ప్రస్తుతం మూడు మ్యాచ్‌ల తర్వాత భారత్, కొరియా ఏడు పాయింట్లతో సమంగా ఉన్నా... మెరుగైన గోల్స్ అంతరం కారణంగా భారత్ టాప్ ర్యాంక్‌లో, కొరియా రెండో ర్యాంక్‌లో ఉంది. లీగ్ దశ తర్వాత టాప్-2లో నిలిచిన జట్లు సెమీఫైనల్‌కు అర్హత సాధిస్తాయి. భారత్ తమ చివరి లీగ్ మ్యాచ్‌ను హాంకాంగ్‌తో మంగళవారం ఆడుతుంది.

భారత చెస్ జట్ల గెలుపు

ఆసియా క్రీడల టీమ్ చెస్ ఈవెంట్‌లో భారత పురుషుల, మహిళల జట్లు మూడో రౌండ్‌లో గెలుపొందాయి. ఇరిగేశి అర్జున్, ప్రజ్ఞానంద, గుకేశ్, పెంటేల హరికృష్ణలతో కూడిన భారత జట్టు 3-1తో కజకిస్తాన్‌ను ఓడించగా... కోనేరు హంపి, ద్రోణవల్లి హారిక, వంతిక అగర్వాల్, వైశాలిలతో కూడిన భారత జట్టు 3.5-0.5తో ఇండోనేసియాపై గెలిచింది. మూడో రౌండ్ తర్వాత భారత మహిళల జట్టు ఆరు పాయింట్లతో టాప్ ర్యాంక్‌లో... ఐదు పాయింట్లతో భారత పురుషుల జట్టు రెండో ర్యాంక్‌లో ఉన్నాయి.

నిఖత్ జరీన్‌కు చుక్కెదురు

- సెమీస్‌లో ఓడిన భారత స్టార్ బాక్సర్
- కాంస్య పతకంతో సరి
- సెమీస్‌లో పర్వీన్ హుడా
- జాస్మిన్‌కు నిరాశ



నిఖత్

కచ్చితంగా స్వర్ణ పతకంతో తిరిగి వస్తుందనుకున్న భారత స్టార్ బాక్సర్, ప్రపంచ చాంపియన్ నిఖత్ జరీన్‌కు ఆసియా క్రీడల్లో అనూహ్య ఓటమి ఎదురైంది. ఆదివారం జరిగిన మహిళల 50 కేజీల విభాగం సెమీఫైనల్లో నిఖత్ 2-3తో రక్సత్ చుథామట్ (థాయ్‌లాండ్) చేతిలో ఓడిపోయింది. దాంతో ఈ తెలంగాణ బాక్సర్ కాంస్య పతకంతో సరిపెట్టుకుంది. ఈ ఏడాది ప్రపంచ చాంపియన్‌షిప్‌లో రక్సత్‌ను అలవోకగా ఓడించిన నిఖత్‌కు ఈసారి గట్టిపోటీ ఎదురైంది. పక్కా ప్రణాళికతో ఈ బౌట్‌లో దిగిన రక్సత్ భారత బాక్సర్‌ను నిలువరించింది. కామన్వెల్త్ గేమ్స్‌లో స్వర్ణం, ప్రపంచ చాంపియన్‌షిప్‌లో రెండుసార్లు స్వర్ణాలు నెగ్గిన నిఖత్ ఆసియా క్రీడల్లో కాంస్య పతకంతో సంతృప్తి పడింది. మరోవైపు భారత్‌కే చెందిన పర్వీన్ హుడా (63 కేజీలు) సెమీఫైనల్ చేరుకొని కనీసం కాంస్య పతకం ఖాయం చేసుకోవడంతోపాటు పారిస్ ఒలింపిక్స్ క్రీడలకు అర్హత సాధించింది. క్వార్టర్ ఫైనల్లో పర్వీన్ హుడా 5-0తో తుర్దిబెకోవా సితోరా (ఉజ్బెకిస్తాన్)పై గెలిచింది. అయితే జాస్మిన్ (60 కేజీలు) పోరాటం క్వార్టర్ ఫైనల్లో ముగిసింది. ఉం గ్యోంగ్ వన్ (ఉత్తర కొరియా) సంధించిన పంచ్‌లకు జాస్మిన్ తట్టుకోలేకపోయింది. దాంతో రిఫరీ రెండో రౌండ్‌లో బౌట్‌ను ముగించి ఉంగ్‌యోంగ్‌ను విజేతగా ప్రకటించారు.

సాక్షి ప్రాఫిట్ ప్లస్
సోమవారం
2-10-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
320	115
65,828	19,638

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (శుక్రవారం ముగింపు)

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	13,219	▲	18
డోజోన్స్	33,508	▽	159
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,608	▲	6
డాక్స్	15,387	▲	63
హాంగ్‌సెంగ్	3,110	▲	3
నికాయ్	31,862	▲	11

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్


ఫారెక్స్ రేట్లు రూ. లలో

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.53	84.39
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	100.34	103.16
€	యూరో	ఎస్‌బీఐ	86.56	89.45
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	55.67	57.98
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	52.01	55.29
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	60.76	63.69
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.19	22.81
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.71	23.51
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.25	12.33

పెట్టుబడికి సోషల్ రూట్..?

ఇటీవలి స్టాక్ మార్కెట్ రికార్డుల ర్యాలీ కొత్త ఇన్వెస్టర్లను పెద్ద ఎత్తున ఆకర్షిస్తోంది. కొత్త డీమ్యాట్ ఖాతాల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. డీమ్యాట్ ఖాతాల సంఖ్య 2023 జూలై నాటికి 12.3 కోట్లు దాటిపోయింది. 2020 మార్చి నాటికి ఉన్న 4 కోట్లతో పోలిస్తే మూడేళ్లలోనే మూడు రెట్లు పెరిగాయి. అంటే మార్కెట్లోకి కొత్త ఇన్వెస్టర్ల రాక ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. (టేబుల్–గడిచిన 12 నెలల్లో డీమ్యాట్ ఖాతాల తీరు). తమ పెట్టుబడులు అనతి కాలంలోనే భారీ రాబడులు ఇవ్వాలనే ఆకాంక్ష కొత్త ఇన్వెస్టర్లలో సహజంగానే కనిపిస్తుంటుంది. ఫలితంగా మల్టీబ్యాగర్ల కోసం జల్లెడ పడుతుంటారు. గతంలో అయితే స్టాక్స్‌లో పెట్టుబడి కోసం కుటుంబ సభ్యులు, బంధు మిత్రులను విచారించే వారు. సోషల్ మీడియా వ్యాప్తితో నేటితరం ఇన్వెస్టర్ల ప్రపంచం మరింత విస్తృతం అయింది. ఎన్నో యూట్యూబ్, ఫేస్‌బుక్, టెలీగ్రామ్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, ట్విట్టర్ ఖాతాలు తెరుచుకుంటున్నాయి. ఎంతో మంది నిపుణుల అవతారం ఎత్తుతున్నారు. ఫలానా స్టాక్స్ కొనుగోలు చేయాలనే టిప్స్‌కు ఆదరణ ఎక్కువగా కనిపిస్తోంది. అయినప్పటికీ పెట్టుబడులకు సంబంధించి కనీస ప్రాథమిక సూత్రాలను విస్మరించకూడదు. నియంత్రణల పరిధిలో లేని సామాజిక మాధ్యమ వేదికలపై చెప్పే సమాచారానికి, ఇచ్చే సలహాలకు జవాబుదారీ ఏది? ఏది నిజం, ఏది తప్పుదారి? తెలుసుకోవడం ఎలా? ఇది అవగాహనపైనే తెలుస్తుంది. ఈ దిశలో సాయపడేదే సోషల్ ఇన్వెస్టింగ్.

- అనుభవజ్ఞులైన ట్రేడర్లు, ఇన్వెస్టర్ల సమూహాలు
- కొత్త ఇన్వెస్టర్లకు ఇవి నేర్చుకునే మార్గాలు
- తమ వంతుగా అధ్యయనం చేయాలి
- ఎవరికి వారికి విడిగా సొంత విధానం ఉండాలి
- రిస్క్, రాబడుల మధ్య సమతుల్యం అవసరం



ఆచరణ ముఖ్యం

ఒకరి నుంచి నేర్చుకోవడం, ఆచరణలో పెట్టడం ఈ రెండు వేర్వేరు. సోషల్ ఇన్వెస్టింగ్ ప్లాట్‌ఫామ్‌లు ట్రేడింగ్, పెట్టుబడి గురించి తెలుసుకునేందుకు సాయపడతాయి. ''ఇన్వెస్టర్‌కు ఒక ప్రణాళిక ఉండాలి. దానికి కట్టుబడి ఉండాలి. రిటైల్ ఇన్వెస్టర్లలో ఎక్కువ మంది తాము పెట్టుబడులు పెట్టే మ్యూచువల్ ఫండ్స్ కంటే నేరుగా స్టాక్స్‌లో తక్కువ రాబడులు సంపాదిస్తున్నట్టు ఆ మధ్య నిర్వహించిన ఒక సర్వేలో తెలిసింది. దీనికి ఇన్వెస్టర్లు మార్కెట్లో అనుకూల సమయం కోసం వేచి చూసి, ఇన్వెస్ట్ చేయడం కారణం కావచ్చు. లేదంటే మ్యూచువల్ ఫండ్స్‌ను అనుకూలం కాని సమయంలో విక్రయించి, కొనుగోళ్లు చేస్తుండొచ్చు. ఇన్వెస్టర్లు పెట్టుబడులు పెట్టిన తర్వాత వార్తలు, ప్రతికూల విశ్లేషణలు చూసి చలించిపోకుండా, ఫండ్స్ మాదిరిగా స్థిరమైన వైఖరి అనుసరించాలి. సోషల్ ఇన్వెస్టింగ్ ప్లాట్‌ఫామ్‌లో తోటి ఇన్వెస్టర్ల పోర్ట్‌ఫోలియో చూసి పెట్టుబడులు పెట్టినట్టయితే.. మార్కెట్ల పతనాల్లో ఎంత స్థిరంగా, దృఢంగా ఉండగలరన్నది కీలకం అవుతుంది. ఆ సమయంలో భయపడి విక్రయించారంటే రాబడులు గణనీయంగా తగ్గిపోతాయి. నష్టాలూ ఎదురు చూడొచ్చు''అని సెబీ రిజిస్టర్డ్ ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్ దీపేశ్ రాఘవ్ వివరించారు.

మార్గదర్శిగానే..

ఇన్వెస్టింగ్ వేదికలను మార్గదర్శిగానే చూడాలి. గుడ్డిగా అనుసరించడం సరి కాదు. ఈ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా తగినంత అవగాహన, విషయ పరిజ్ఞానాన్ని పెంచుకున్న తర్వాత, విడిగా ప్రతీ ఇన్వెస్టర్ తన వైపు నుంచి లోతైన అధ్యయనం చేయాలి. ఆ తర్వాతే తనకు అనుకూలమైన పెట్టుబడుల వ్యూహాలను అనుసరించాలి. ఇతరులు కేవలం తమ అనుభవాన్ని పంచుతారే కానీ, జవాబుదారీగా ఉండరనే విషయాన్ని గుర్తుపెట్టుకోవాలి. సోషల్ ఇన్వెస్టింగ్ ప్లాట్‌ఫామ్‌లు స్టాక్స్, ట్రేడింగ్ గురించి నేర్చుకునే వేదికలే. ఇన్వెస్టర్లు ఎవరికి వారే తమ వంతుగా పెట్టుబడుల లావాదేవీలు నిర్వహించుకోవాలి. ఎవరో పోర్ట్‌ఫోలియో కాపీ చేసి ఇన్వెస్ట్ చేసిన తర్వాత, నష్టాలు వచ్చాయని పరిహారం డిమాండ్ చేయలేరు.

సోషల్ ఇన్వెస్టింగ్ అంటే..?

ఎన్నో తరాల నుంచి ఇది ఉన్నదే సోషల్ ఇన్వెస్టింగ్ (ఇన్వెస్టర్ల సమూహం/సమాజం). గతంలో స్నేహితులు, కుటుంబ సభ్యుల వరకే ఇది పరిమితం. ఇప్పుడు టెక్నాలజీ ఫలితంగా మరింత పెద్దదిగా అవతరించింది. ట్రేడర్లు, ప్రపంచవ్యాప్త నిపుణులు, ఇన్వెస్టర్లు ఇందులో భాగమవుతున్నారు. సోషల్ ఇన్వెస్టింగ్ యాప్స్, ప్లాట్‌ఫామ్‌లు ఇప్పుడు ప్రత్యేకంగా అందుబాటులోకి వస్తున్నాయి. ఏవి అసలైనవో, ఏవి నకిలీవో గుర్తించేందుకు ఇవి దారి చూపిస్తున్నాయి. సీనియర్ ట్రేడర్లు, తమ మాదిరే ఆకాంక్షలతో కూడిన ఇన్వెస్టర్లతో చాట్, సంప్రదింపులకు ఇవి వేదికలుగా నిలుస్తున్నాయి. ట్రేడింగ్, పెట్టుబడులకు సంబంధించిన విజ్ఞానం పంచుకునేందుకు వారధిగా పనిచేస్తున్నాయి. అనుభవజ్ఞులైన ట్రేడర్ల పోస్టులు, పోర్ట్‌ఫోలియోను వీటి ద్వారా తెలుసుకోవచ్చు. ఎప్పటికప్పుడు తాజా సమాచారానికితోడు, పెట్టుబడుల సలహాలు కూడా వీటిపై అందుకోవచ్చు. యూఎస్, యూరప్‌లో అయితే ఇన్వెస్టర్లు, నిపుణుల ట్రేడ్ పోర్ట్‌ఫోలియోను ఇతరులు కాపీ చేసుకోవచ్చు. అమెరికాకు చెందిన ఈటోరో కూడా ప్రముఖ సోషల్ ఇన్వెస్టింగ్ పోర్టల్. ధ్రువీకరించిన ట్రేడర్ల పోర్ట్‌ఫోలియోలను ఈ వేదికపై పరిశీలించొచ్చు. కానీ, మన దేశంలో ఇంకా ఈ విధమైన అవకాశం అందుబాటులోకి రాలేదు. మన దగ్గర సోషల్ ఇన్వెస్టింగ్ అన్నది ఒక చిన్న ఇన్వెస్టర్ల సమూహంగానే ప్రస్తుతం ఉంది. ''సోషల్ ఇన్వెస్టింగ్ అన్నది విస్తృతమైన పదం. ఒక ఉమ్మడి వేదికగా వ్యక్తుల మధ్య సంప్రదింపులకు వీలు కల్పించేది. స్టాక్ ఫండమెంటల్స్ (ఆర్థిక మూలాలు), కంపెనీ లాభ, నష్టాల నివేదిక విశ్లేషణ, కీలక రేషియోలు, సాంకేతిక సూచికలు, మార్కెట్ ధోరణులపై సంప్రదింపులకు అవకాశం కల్పిస్తుంది. ఇన్వెస్టర్లు తాము అనుసరించే ట్రేడింగ్ విధానాలు, పోర్ట్‌ఫోలియోను వీటిపై ఇతరులతో పంచుకుంటారు''అని స్మాల్‌కేస్ సీఈవో వసంత్ కామత్ తెలిపారు.

నేర్చుకునే మార్గం..



''కరోనా సమయంలో మార్కెట్లు కనిష్ట స్థాయిలను చవిచూశాయి. దాంతో అవి ఆకర్షణీయంగా మారాయి. సెబీ కేవైసీ నిబంధనలను సరళతరం చేసింది. దీంతో ఆన్‌లైన్‌లోనే వేగంగా ట్రేడింగ్, డీమ్యాట్ ఖాతాలు ప్రారంభించేందుకు అవకాశం ఏర్పడింది. దీనికితోడు యువ జనాభా ఎక్కువ మంది ఇంటికి పరిమితం కావడం పెద్ద ఎత్తున డీమ్యాట్ ఖాతాల ప్రారంభానికి దారితీసింది''అని ప్రభుదాస్ లీలాధర్ రిటైల్ బ్రోకింగ్ సీఈవో సందీప్ రాయ్‌చురా తెలిపారు. ముంబైకి చెందిన ఉత్కర్ష్ (32) కూడా కరోనా సమయంలో మార్కెట్లోకి ప్రవేశించిన వారిలో ఒకరు. సహజంగా వ్యాపారవేత్త అయిన ఆయన ఇప్పుడు స్టాక్స్‌లో చురుగ్గా ట్రేడింగ్ చేస్తున్నారు. తొలుత మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులకు డీమ్యాట్ ఖాతాను ఉపయోగించుకున్నారు. స్టాక్స్‌లో ట్రేడింగ్ చేయాలని 2021 మార్చిలో ఆయన నిర్ణయించుకున్నారు. కానీ ఇందుకు సంబంధించిన సమాచారం ఎలా తెలుసుకోవాలో ఆయనకు తోచలేదు. ఆ సమయంలో మల్టీబ్యాగర్లు అంటూ పెన్నీ స్టాక్స్ గురించి యూట్యూబ్ చానళ్లు, ట్విట్టర్ పోస్టులలో టిప్స్ కనిపించేవి. అయినా సరే వాటి ట్రాప్‌లో ఆయన పడిపోలేదు. గడిచిన రెండేళ్ల కాలంలో ఈ తరహా అనధికారిక, రిజిస్ట్రేషన్ లేని అడ్వైజర్లు, సామాజిక మాధ్యమ వేదికల అణచివేతకు సెబీ కఠిన చర్యలు తీసుకోవడం గమనించొచ్చు. ఉత్కర్ష్ స్వతహాగా కొంత అవగాహన కలిగి ఉండడంతో విశ్వసనీయత లేని ఇలాంటి బూటకపు చానళ్ల బారిన పడకుండా, సోషల్ ఇన్వెస్టింగ్ ఫోరమ్‌లలో చేరాడు. అన్నీ కాదు కానీ, కొన్ని ఉపయోగకరమైనవి అని కొంత కాలానికి ఆయనకు అర్థమైంది.

కొందరు అనుభవం కలిగిన స్టాక్ ట్రేడర్లు స్టాక్స్, ఫండ్స్, పెట్టుబడి సూత్రాల గురించి చెప్పడం తనకు నిజంగా సాయపడినట్టు ఉత్కర్ష్ వెల్లడించారు. వీటి సాయంతో ట్రేడింగ్‌పై అవగాహన మరింత పెరిగింది. ఇప్పటికీ ఈ సామాజిక మాధ్యమ ఫోరమ్‌ల సాయంతో స్టాక్స్ ట్రెండ్స్ గురించి ఆయన తెలుసుకుంటూనే ఉంటారు. సోషల్ ఇన్వెస్టింగ్ అంటే ఇదే. ''మార్కెట్‌లోని సీనియర్, అనుభవజ్ఞులైన ట్రేడర్ల నుంచి కొత్త ఇన్వెస్టర్లు, ట్రేడర్లు నేర్చుకునే వేదికగానే సోషల్ ఇన్వెస్టింగ్‌ను చూడాలి. మరొకరిని కాపీ కొట్టడం కాకుండా.. స్టాక్ పరిశోధన, వార్తలు, ట్రేడింగ్ విధానాలను రూపొందించుకోవడానికి మార్గంగా నిలుస్తుంది''అని స్మాల్‌కేస్ వసంత్ కామత్ వివరించారు. ఒక్క ఉత్కర్ష్ అనే కాదు లక్షలాది మందికి నేడు ఇలాంటి సామాజిక మాధ్యమ వేదికలు ఇన్వెస్టింగ్‌కు మెరుగైన దారి చూపిస్తున్నాయనడంలో సందేహం లేదు. కాకపోతే నిజమైన–మోసపూరిత వేదికల మధ్య వ్యత్యాసం తెలుసుకోవాలి. సామాజిక మాధ్యమ వేదికలు ఇప్పుడు పోస్టులకు వచ్చే వ్యూస్ ఆధారంగా, ప్రకటనల ఆదాయాన్ని యూజర్లతో పంచుకుంటున్నాయి. దీంతో సీనియర్ ట్రేడర్లు తమ అనుభవాన్ని, ట్రేడింగ్, పెట్టుబడి విధానాలను తోటి యూజర్లతో పంచుకోవడం వల్ల వారికి అదొక ఆదాయ వనరుగానూ మారుతోంది. దీంతో కొత్త ఇన్వెస్టర్లు నేర్చుకునే అవకాశాలు, వేదికలు పెరిగాయి.

గుడ్డిగా అనుసరించడం సరికాదు..



కొత్త ఇన్వెస్టర్లు ఉచిత లేదా చెల్లింపుల వేదికల ద్వారా స్టాక్స్‌లో పెట్టుబడులు, ట్రేడింగ్‌కు మొగ్గు చూపించే ముందు.. ఆయా వేదికలు తమ లక్ష్యాలు, రిస్క్, రాబడుల ఆకాంక్షలకు సరిపోయేవేనా? అన్నది ఒక్కసారి తరిచి చూసుకోవాలి. ''తాము అనుసరించే తోటి ఇన్వెస్టర్ల ప్రొఫైల్‌ను జాగ్రత్తగా గమనించాలి. ఎందుకంటే వారు ఎక్కువ రిస్క్ తీసుకోవచ్చు. వారి పోర్ట్‌ఫోలియో తీవ్ర అస్థిరతలతో కూడుకుని ఉండొచ్చు. ''ప్రతి వ్యక్తి లక్ష్యాలు, అవసరాలు వేర్వేరుగా ఉంటాయి. మీ స్నేహితులు లేదా ఇతరులు వారి కోణం నుంచి సాధారణ సూచనలు ఇవ్వొచ్చు. అది విడిగా ప్రతి ఇన్వెస్టర్‌కు అనుకూలమైనదని చెప్పలేం. మీ ప్రస్తుత పోర్ట్‌ఫోలియో, భవిష్యత్ నగదు అవసరాలు, రిస్క్ సామర్థ్యం ఇలాంటివి ఏవీ ఎదుటి వారికి తెలియవు''అని సర్టిఫైడ్ ఫైనాన్షియల్ ప్లానర్ పారుల్ మహేశ్వరి పేర్కొన్నారు. పెట్టుబడులు పెట్టే ముందు పోర్ట్‌ఫోలియోను ఒక్కసారి పరిశీలించుకోవాలని సూచించారు. తమకు సరిపోలని ఉత్పత్తులు, సాధనాల్లో ఇన్వెస్ట్ చేయడం వల్ల నష్టాలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు. ట్రేడింగ్‌లో రిస్క్ ఎక్కువగా ఉంటుంది. ఇన్వెస్టింగ్‌లో రిస్క్ తక్కువ. ఈ రెండింటిలో తమకు ఏది అనుకూలమో ఇన్వెస్టర్లే తేల్చుకోవాలి.

జీఎస్‌టీ వసూళ్లు @ రూ. 1.62 లక్షల కోట్లు

అక్టోబర్‌లో 10 శాతం వృద్ధి




న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జీఎస్‌టీ వసూళ్లు నాలుగోసారి రూ.1.60 లక్షల కోట్లు దాటాయి. సెప్టెంబర్‌తో పోలిస్తే అక్టోబర్‌లో 10 శాతం పెరిగి రూ. 1.47 లక్షల కోట్ల నుంచి రూ. 1.62 లక్షల కోట్లకు చేరాయి. ఆర్థిక శాఖ విడుదల చేసిన ప్రకటన ప్రకారం.. గత నెల స్థూల జీఎస్‌టీ ఆదాయం రూ. 1,62,712 కోట్లు. ఇందులో సెంట్రల్ జీఎస్‌టీ రూ. 29,818 కోట్లు, రాష్ట్ర జీఎస్‌టీ రూ. 37,657 కోట్లు, సమీకృత జీఎస్‌టీ రూ. 83,623 కోట్లు, సెస్సు రూ. 11,613 కోట్లుగా ఉన్నాయి. ఈ ఆర్థిక సంవత్సరం ప్రథమార్ధంలో (ఏప్రిల్–సెప్టెంబర్) స్థూల జీఎస్‌టీ వసూళ్లు గతేడాది ఇదే వ్యవధితో పోలిస్తే 11 శాతం పెరిగి రూ. 9,92,508 కోట్లకు చేరాయి. సగటున ప్రతి నెలా రూ. 1.65 లక్షల కోట్ల మేర నమోదయ్యాయి. రూ. 1.60 లక్షల కోట్ల వసూళ్లు ఇకపై సర్వసాధారణమైన విషయంగా మారవచ్చని కేపీఎంజీ పరోక్ష పన్నుల విభాగం హెడ్ అభిషేక్ జైన్ తెలిపారు. రాబోయే పండుగ సీజన్‌లో వసూళ్లు మరింత పెరగవచ్చని పేర్కొన్నారు. ఎకానమీ స్థిరంగా వృద్ధి బాటన కొనసాగుతుండటాన్ని ఇది సూచిస్తుందని ఈవై ట్యాక్స్ పార్ట్‌నర్ సౌరభ్ అగర్వాల్ తెలిపారు. జమ్మూ .. కశ్మీర్, మణిపూర్, అరుణాచల్ ప్రదేశ్, లడఖ్‌లలో వసూళ్లు స్థిరంగా వృద్ధి చెందుతుండటమనేది ఆయా ప్రాంతాల్లో వినియోగం పెరుగుతోందనడానికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

02-10-2023	
విశాఖ	533-00
చిత్తూరు	533-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	533-00
విజయవాడ	533-00
రిటైల్ ధర (డజను)	72.00
01-10-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	505-00
వరంగల్	507-00
రిటైల్ ధర	5.65

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ | షేర్‌ఖాన్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 1,526
టార్గెట్: రూ. 1,900



ఎందుకంటే: ప్రయివేట్ రంగ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఇటీవల హెచ్‌డీఎఫ్‌సీ విలీనం తదుపరి పని తీరుకు సంబంధించిన అంశాలను వెల్లడించింది. సమీప కాలానికి గణాంకాలు ఎలా ఉండబోవచ్చునంటూ కొన్ని ప్రాథమిక వివరాలు వెల్లడించింది. అంచనాలకు మించిన సర్దుబాటు సంబంధ వ్యయాల నిష్పత్తి, తగ్గనున్న నికర వడ్డీ మార్జిన్లు(ఎన్ఐఎం), వెనకడుగు వేయనున్న ఆర్‌వోఏపై అంచనాలను తెలియజేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) తోపాటు, వచ్చే ఏడాది(2024–25)లో 1.8 శాతం ఆర్‌వోఏను సాధించవచ్చని అభిప్రాయపడింది. ఈ ఏడాది తొలి త్రైమాసికం(ఏప్రిల్–జూన్)లో విలీన సంస్థ అంచనాలకు అనుగుణంగా 3.7–3.8 శాతం ఎన్ఐఎం సాధించింది. అయితే అధిక లిక్విడిటీ బఫర్‌కు తెరతీయవలసిన అవసరాలరీత్యా హెచ్‌డీఎఫ్‌సీ ప్రారంభ ఎన్ఐఎం 2.7 శాతం నుంచి 2 శాతానికి పరిమితమయ్యాయి. దీంతో సమీప కాలానికి విలీన సంస్థ ఎన్ఐఎంపై 0.25 శాతంమేర ప్రతికూల ప్రభావం పడే వీలుంది. కాగా.. రానున్న త్రైమాసికాలలో నికర వడ్డీ మార్జిన్లు క్రమంగా మెరుగుపడనున్నట్లు అంచనా. విలీన సంస్థ ఆదాయ, వ్యయ నిష్పత్తి 40 శాతంగా నమోదయ్యే అవకాశముంది. దీనికితోడు హెచ్‌డీఎఫ్‌సీ నెట్‌వర్త్‌కు సంబంధించి అకౌంటింగ్ మార్పుల కారణంగా ఒకేసారి కోత పెట్టిన సర్దుబాటును చేపట్టారు. వీటిలో అధిక కవరేజీలో భాగంగా పెరిగిన ప్రొవిజన్లు, పన్ను సంబంధ సర్దుబాట్లు, డివిడెండ్ చెల్లింపులున్నాయి. నెట్‌వర్త్ సర్దుబాటు, రెండేళ్ల కాలంలో తగ్గనున్న మార్జిన్లుసహా ఆర్జన అంచనాలు, విలీనం కారణంగా పెరగనున్న వ్యయాల నిష్పత్తి వంటి అంశాలను పరిగణించి షేరువారీ బుక్‌వ్యాల్యూ(బీవీపీఎస్) అంచనాలలో కోత పెట్టాం.

గాంధీ జయంతి సందర్భంగా నేడు ఎక్స్ఛేంజీలకు సెలవు

శ్రీరామ్ ఫైనాన్స్ | యస్ సెక్యూరిటీస్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 1,920
టార్గెట్: రూ. 2,300



ఎందుకంటే: గ్రూప్ సంస్థల విలీనం తదుపరి ఎన్‌బీఎఫ్‌సీ దిగ్గజంగా ఆవిర్భవించిన శ్రీరామ్ ఫైనాన్స్ మల్టీ ప్రాడక్టులతో బిజినెస్‌ను విస్తరించింది. వెరసి వివిధ విభాగాలలో అధిక వృద్ధికి బాటలు వేసుకుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) తొలి క్వార్టర్(ఏప్రిల్–జూన్)లో నిర్వహణలోని ఆస్తుల విలువ(ఏయూఎం) 18.6 శాతం పురోగతిని అందుకుంది. త్రైమాసికవారీగా చూసినా 4 శాతం వృద్ధి నమోదైంది. ఈ ఏడాది మిగిలిన త్రైమాసికాలలోనూ ఇదేస్థాయి పురోగతిని సాధించే అవకాశముంది. ఇందుకు వినియోగిత(యూజ్‌డ్) వాణిజ్య(ఏయూఎంలో 50 శాతం), ప్యాసింజర్(19 శాతం) వాహన విభాగ విక్రయాలతో ఊపందుకున్న ఫైనాన్సింగ్, యూజ్‌డ్ ప్యాసింజర్ వాహనాల రీప్లేస్‌మెంట్‌కు పెరుగుతున్న పటిష్ట డిమాండ్, వాహన ఫైనాన్సింగ్ బ్రాంచీల నుంచి ఎంఎస్ఎంఈ రుణాలను దశలవారీగా ఎత్తివేయడం, వాహన ఫైనాన్సింగ్ బ్రాంచీల నుంచి బంగారు ఆభరణ రుణాలు(ఏయూఎంలో 3 శాతం), వ్యక్తిగత రుణాలు(ఏయూఎంలో 4 శాతం) పుంజుకోవడం వంటి అంశాలు తోడ్పాటును అందించనున్నాయి. దీర్ఘకాలంలో వృద్ధికి దారిచూపించే పలు అంశాలు కంపెనీకి దన్నునిస్తున్నాయి. అందుబాటులోకి వస్తున్న వినియోగిత బీఎస్–6 ప్రమాణ వాహనాలు, యూజ్‌డ్ వాణిజ్య, ప్యాసింజర్ వాహన కొనుగోళ్లతో పెరుగుతున్న ఫైనాన్సింగ్, విభిన్న విభాగాల మధ్య ఫైనాన్సింగ్ కార్యకలాపాల సమన్వయంతో బలపడుతున్న లాభదాయకత, శ్రీరామ్ గ్రూప్‌యేతర కస్టమర్లను ఆకట్టుకోవడం, గ్రామీణ ప్రాంతాల బ్రాంచీలను పూర్తిస్థాయి సర్వీసులతో పటిష్ట పరచడం వంటి అంశాలు కంపెనీకి లబ్ధిని చేకూర్చనున్నాయి. కంపెనీ యాజమాన్యం రానున్న మూడేళ్లలో ఏయూఎంలో 15 శాతం వృద్ధిని అంచనా వేస్తోంది.

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

రికార్డు స్థాయిలో ఆటో అమ్మకాలు

ముంబై: పండుగ సీజన్ డిమాండ్ దృష్ట్యా కంపెనీలు డీలర్లకు భారీగా నిల్వలను పంపిణీ చేయడంతో సెప్టెంబర్ సంబంధించి వాహన పరిశ్రమలో అమ్మకాలు రికార్డు స్థాయిలో నమోదయ్యాయి. గత నెల ప్యాసింజర్ వాహనాల విభాగంలో 3,63,733 యూనిట్ల హోల్‌సేల్ విక్రయాలు నమోదయ్యాయి. చిప్ సప్లై సరఫరా అంతరాలు తొలగడం కూడా కలిసొచ్చింది. కాగా ఈ ఏడాది ఆగస్టులో నమోదైన 3,60,700 యూనిట్ల సరఫరాయే ఇప్పటి వరకు అత్యుత్తమం. దేశ ప్యాసింజర్ వాహన చరిత్రలో ఇవే మెరుగైన హోల్‌సేల్ అమ్మకాలని మారుతీ సుజుకి ఇండియా మార్కెటింగ్, సేల్స్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శశాంక్ శ్రీవాస్తవ అన్నారు.



- ప్రముఖ కార్ల తయారీ సంస్థ మారుతీ సుజుకీ సెప్టెంబరు నెల 1,81,343 యూనిట్ల కార్ల అమ్మకాలతో 3 శాతం వృద్ధిని నమోదు చేసింది. ఒక నెలలో అత్యధిక అమ్మకాలు ఇవే కావడం విశేషం. ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ ముగిసే నాటికి మొత్తం వాహనాల్లో 10,50,085 యూనిట్లను విక్రయించినట్లు తెలిపింది.

చెత్త పనితీరు చూపిస్తే.. వైదొలగాలా?



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

నిఫ్టీ ఇండెక్స్ ఫండ్స్‌లో మంచి పథకం ఎంపిక చేసుకోవడం ఎలా? - స్వామినాథన్

ఇండెక్స్ ఫండ్‌ను ఎంపిక చేసుకునే విషయంలో పరిశీలించాల్సిన ముఖ్య అంశాలు రెండున్నాయి. ఒకటి ఎక్స్‌పెన్స్ రేషియో. ప్రస్తుతం ఇండెక్స్ ఫండ్స్ మధ్య చాలా పోటీ ఉంది. 10–15 బేసిస్ పాయింట్ల (0.1–0.15 శాతం) ఎక్స్‌పెన్స్ రేషియోకే ఇండెక్స్ ఫండ్స్ డైరెక్ట్ ప్లాన్లు అందుబాటులో ఉన్నాయి. కనుక యాక్టివ్ ఫండ్స్‌ను ఎంపిక చేసుకుంటే ఎక్కువ ఎక్స్‌పెన్స్ రేషియో చెల్లించాల్సిన అవసరం ఉండదు. రెండోది ట్రాకింగ్ ఎర్రర్. ఒక ఇండెక్స్ ఫండ్.. తాను పెట్టుబడులను అనుసరించే ఇండెక్స్‌తో పోలిస్తే రాబడుల విషయంలో ఎంత మెరుగ్గా పనిచేసిందో చెబుతుంది. ఇండెక్స్ ఫండ్ నిర్వహణ బృందం సామర్థ్యాన్ని ఇది ప్రతిఫలిస్తుంది. తక్కువ ఎక్స్‌పెన్స్ రేషియోతోపాటు.. ట్రాకింగ్ ఎర్రర్ తక్కువగా ఉన్న పథకం మెరుగైనది అవుతుంది. ఈ రెండు అంశాలను ప్రామాణికంగా చేసుకుని చూస్తే ఎస్‌బీఐ, యూటీఐ, హెచ్‌డీఎఫ్‌సీ సంస్థల పథకాలు మెరుగ్గా పనిచేస్తున్నాయి.

నేను పెట్టుబడులు పెట్టిన మ్యూచువల్ ఫండ్ వరుసగా రెండేళ్లపాటు చెత్త పనితీరు చూపించినట్టయితే, నా పెట్టుబడులను వెనక్కి తీసుకోవడం సరైనదేనా? - మునావర్

ఏదైనా ఒక మ్యూచువల్ ఫండ్ పథకం నుంచి వైదొలగేందుకు, ఆ పథకం తక్కువ రాబడులను ఇస్తుండడం అన్నది ముఖ్యమైన అంశం అవుతుంది. తక్కువ పనితీరు అంటే ఇతర పథకాలతో పోలిస్తే తక్కువ రాబడులు ఇవ్వడం. వైదొలిగే నిర్ణయానికి ముందు.. మీరు పెట్టుబడులు పెట్టిన మ్యూచువల్ ఫండ్ పథకం విభాగంలోని ఇతర పథకాల పనితీరు కూడా విశ్లేషించాలి. వాటి పనితీరు కూడా తగ్గిందా..? లేక మీరు ఇన్వెస్ట్ చేసిన పథకం పనితీరు మాత్రమే తగ్గిందా? చూడాలి. మీరు ఇన్వెస్ట్ చేసిన ఫండ్ ఎన్ఏవీ క్షీణించడానికి ఎన్నో కారణాలు ఉండొచ్చు. స్టాక్ మార్కెట్ పడిపోయినా రాబడులు తగ్గుతాయి. అన్ని పథకాలు ఏదో ఒక సమయంలో కొన్ని ప్రతికూలతలను ఎదుర్కొంటూ ఉంటాయి. అది చూసి ఒక పథకం నుంచి మరో పథకంలోకి మారిపోవడం సరైన నిర్ణయం కాబోదు. ఈ ప్రతికూల, తక్కువ పనితీరు అనేది ఒక పథకంలో కనీసం నిరంతరాయంగా రెండేళ్లపాటు కొనసాగాలి. అప్పుడు ఆ పథకంలో పెట్టుబడులను సమీక్షించుకోవచ్చు. మీరు ఇన్వెస్ట్ చేసిన పథకం తక్కువ పనితీరు చూపించడం వెనుక కారణాన్ని గుర్తించాలి. ఫండ్ మేనేజర్‌లో మార్పు జరిగిందా? అందుకే పనితీరు మందగించిందా? అని చూడాలి. అదే నిజమైతే ఆ పథకం నుంచి మీ పెట్టుబడులను తీసుకుని బయటకు రావచ్చు. ఒకవేళ ఫండ్ మేనేజర్‌లో మార్పు లేకపోతే.. రాబడులు మందగించడానికి గల కారణాన్ని సాధారణంగా వారు మీడియాకు వెల్లడించే ప్రయత్నం చేస్తుంటారు. లేదంటే ఆయా ఫండ్ సంస్థ నెలవారీ న్యూస్‌లెటర్‌లోనూ సమాచారాన్ని వెల్లడిస్తుంటారు. పథకం పెట్టుబడుల విధానం వల్ల కూడా తాత్కాలికంగా రాబడులు మెరుగ్గా ఉండకపోవచ్చు. అలాంటి సందర్భాల్లో పథకం పనితీరును తప్పుబట్టడం సరైనది కాకపోవచ్చు. ఉదాహరణకు గ్రోత్ ఆధారిత విధానంతో పోలిస్తే వ్యాల్యూ ఆధారిత పెట్టుబడుల విధానం కాస్త ఆలస్యంగా ఫలితాలను ఇస్తుంది. అటువంటప్పుడు మీరు పెట్టుబడులను దీర్ఘకాలం పాటు కొనసాగించాల్సి ఉంటుంది. ప్రతి ఒక్క ఇన్వెస్టర్ తాను ఎంపిక చేసుకున్న పథకం అన్ని కాలాల్లోనూ అద్భుత పనితీరు చూపించాలని ఆశిస్తుంటారు. కానీ, ఆచరణలో ఇది సాధ్యం కాదు. అన్ని పథకాలు సానుకూల, ప్రతికూల సందర్భాలను ఎదుర్కొంటూ వెళుతుంటాయి. కనుక పెట్టుబడులను వెనక్కి తీసుకునే ముందు ఈ అంశాలన్నింటినీ చూడాలి.

8 నుంచి అమెజాన్ గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్

హైదరాబాద్: అమెజాన్ 'గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్ 2023' అక్టోబర్ 8 నుంచి ప్రారంభం కానుంది. స్మార్ట్‌ఫోన్లు, టీవీలు, ఎలక్ట్రానిక్స్, ఫ్యాషన్, సౌందర్య ఉత్పత్తులు, గ్రోసరీ విభాగాల్లో ఆకర్షణీయ ఆఫర్లు అందించనుంది. శామ్‌సంగ్, వన్‌ప్లస్, ఎల్‌జీ, సోనీ, బోట్, ఇంటెల్, ఫాస్ట్‌ట్రాక్, విప్రో, యురేకా ఫోర్బ్స్, ఏషియన్ పెయింట్స్, జిల్లెట్‌తో పాటు మరెన్నో బ్రాండ్ల ఉత్పత్తులను అందుబాటులో ఉంచనుంది. ప్రైమ్ సభ్యత్వం కలిగిన వారికి 24 గంటల ముందే యాక్సెస్ ఉంటుంది. ఎస్‌బీఐ క్రెడిట్, డెబిట్ కార్డులు, ఈఎంఐ లావాదేవీలపై 10 శాతం తక్షణ రాయితీ అందించనుంది. అమెజాన్ పే లేటర్ ఎంపికతో ఇప్పుడు ఉత్పత్తులు కొని వచ్చే నెలలో బిల్లు చెల్లించే సదుపాయం కల్పిస్తోంది. అమెజాన్ పే ఐసీఐసీఐ బ్యాంక్ క్రెడిట్ కార్డు ఖాతాదార్లకు 5 శాతం క్యాష్ బ్యాక్ ఆఫర్ ఉంది.



క్లుప్తంగా...

నేటి సాయంత్రం వరకూ వెబ్ ఆప్షన్‌ల నమోదుకు అవకాశం

సాక్షి, అమరావతి: 2023-24 విద్యా సంవత్సరానికి ఇన్‌సర్వీస్ కోటా పీజీ మెడికల్ సీట్ల భర్తీకి రెండో దశ కౌన్సెలింగ్‌కు వెబ్ ఆప్షన్లు నమోదుకు సోమవారం సాయంత్రం 6 గంటలకు గడువు ముగియనుంది. వెబ్ ఆప్షన్ల నమోదుకు ఆదివారం డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం నోటిఫికేషన్ జారీ చేసింది. ఆదివారం సాయంత్రం 6 గంటల నుంచి వెబ్ ఆప్షన్‌ల నమోదు ప్రక్రియను ప్రారంభించింది. అభ్యర్థులు https:// pgcq.-ysruhs.com/ వెబ్‌సైట్‌లో ఆప్షన్‌లు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఆప్షన్స్ నమోదు సమయంలో సాంకేతిక సమస్యలు తలెత్తితే 7416563063, 7416253073, 9063400829 లను సంప్రదించాలని రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి చెప్పారు.

రేపటి నుంచి సాధారణ బీమా పెన్షనర్ల ఉద్యమ కార్యాచరణ

- సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పీవీ సుబ్బారావు వెల్లడి


మాట్లాడుతున్న పీవీ సుబ్బారావు

గుంటూరు ఎడ్యుకేషన్: దేశవ్యాప్తంగా సాధారణ బీమా పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై కేంద్రం సంఘం పిలుపు మేరకు మంగళవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు ఆంధ్రప్రదేశ్ సాధారణ బీమా పెన్షనర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పీవీ సుబ్బారావు తెలిపారు. గుంటూరు అమరావతిరోడ్డులో ఆదివారం బీమా ఉద్యోగుల సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహించారు. జనరల్ ఎంప్లాయిస్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ అంకయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బారావు మాట్లాడుతూ.. జనరల్ ఇన్సూరెన్స్ పెన్షనర్స్ అసోసియేషన్ పట్ల కేంద్ర ప్రభుత్వ ఆర్థిక మంత్రిత్వ శాఖ తీవ్ర వివక్ష కనపరుస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, బ్యాంకింగ్, ఎల్ఐసీ తదితర ఆర్థిక సంస్థల ఉద్యోగులకు ఆఖరి నెల జీతంలో 30 శాతం ఫ్యామిలీ పెన్షన్‌గా అందచేస్తున్న కేంద్ర ఆర్థిక శాఖ.. సాధారణ బీమా ఉద్యోగుల పట్ల సవతి తల్లి ప్రేమ చూపుతూ కేవలం 15 శాతమే అనుమతించడం వల్ల తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణం 30 శాతం ఫ్యామిలీ పెన్షన్ చెల్లించాలని, ప్రతి ఐదేళ్లకు కేంద్ర ప్రభుత్వ బ్యాంకింగ్, ఎల్ఐసీ తదితర ఉద్యోగుల వేతన సవరణ జరిగినట్లు పెన్షనర్లకు సైతం పెన్షన్ అప్‌డేటేషన్ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోలమన్‌రాజు, అమరావతి యూనిట్ కార్యదర్శి మన్నవ సాంబశివరావు, కోశాధికారి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

సింహాద్రి ఎన్టీపీసీలో రిజర్వ్ షడ్‌డౌన్


పరవాడ(అనకాపల్లి జిల్లా): అనకాపల్లి జిల్లా పరవాడ సమీపంలోని సింహాద్రి ఎన్టీపీసీలో 500 మెగావాట్ల సామర్థ్యం కలిగిన రెండో యూనిట్‌లో రిజర్వ్ షడ్‌డౌన్ కారణంగా ఆదివారం విద్యుదుత్పత్తిని తాత్కాలికంగా నిలిపివేశారు. ప్రస్తుతం సింహాద్రిలో నాలుగు యూనిట్ల నుంచి రెండు వేల మెగావాట్ల విద్యుదుత్పత్తి జరుగుతోంది. విద్యుత్‌కు తగినంత డిమాండ్ లేని కారణంగా ఎన్టీపీసీ ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు ఆదివారం ఉదయం 12 గంటలకు రెండో యూనిట్ ద్వారా సరఫరా అవుతున్న విద్యుదుత్పత్తిని తాత్కాలికంగా నిలిపివేశారు. ఎన్టీపీసీ ఉన్నతాధికారుల ఆదేశాలననుసరించి రెండో యూనిట్‌లో విద్యుదుత్పత్తిని పునరుద్ధరిస్తామని అధికారులు వెల్లడించారు.

నేటి భవితలో..

- టీఎస్‌పీఎస్సీ ఎగ్జామ్స్: గ్రూప్-2.. గురితప్పకుండా! టీఎస్‌పీఎస్సీ గ్రూప్-2 సర్వీసెస్ ఎగ్జామ్! అయిదు లక్షల మందికి పైగా పోటీ పడే పరీక్ష!! లక్షల మంది తమ కలల కొలువు దక్కించుకునేందుకు ఎంతో కాలంగా అకుంఠిత దీక్షతో ప్రిపరేషన్ సాగిస్తున్నారు. ఎన్ని నెలలు కృషి చేసినా.. ఎన్ని పుస్తకాలు చదివినా.. పరీక్షకు నెలరోజుల ముందు నుంచి సమయాన్ని సద్వినియోగం చేసుకోవడమే సక్సెస్‌లో కీలకంగా మారుతుంది. ఈ నేపథ్యంలో.. నవంబర్ 2, 3 తేదీల్లో నిర్వహించనున్న గ్రూప్-2 పరీక్షలో విజయానికి మెలకువలు..
- గ్రూప్స్ ప్రత్యేకం-కరెంట్ అఫైర్స్: సివిల్స్, గ్రూప్స్ వంటి పోటీ పరీక్షల అభ్యర్థులకు ఉపయోగపడేలా..అంతర్జాతీయం,జాతీయం, రాష్ట్రీయం, వార్తల్లో వ్యక్తులు, ఎకానమీ, సైన్స్ అండ్ టెక్నాలజీ, స్పోర్ట్స్ తదితర ముఖ్యాంశాలతో వీక్లీ కరెంట్ అఫైర్స్ రౌండప్
- విద్య, ఉద్యోగ సమాచారం

నేటి భవిత పేజీ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

భూమ్మీద అధిక ఉష్ణం, కరువు పరిస్థితులను ఎదుర్కొని సజావుగా పంట దిగుబడులు పొందాలంటే అందుకు తగినంత జన్యు దృఢత్వం కలిగిన వైవిధ్య భరితమైన వంగడాలు అవసరం. అయితే గడ్డు పరిస్థితులను తట్టుకొనే జన్యు దృఢత్వం తేవడం ఎలా అన్నది ప్రశ్న? అయితే అంతరిక్షంలో వేగంగా ఉత్పరివర్తనాలకు గురైన విత్తనాలతో భూమ్మీద ప్రతికూల పరిస్థితులను తట్టుకొనే వంగడాల తయారీ సాధ్యమనే వాదన బలంగా వినిపిస్తోంది. మరి ఇందులో నిజం ఎంత? ఈ నెల 4 నుంచి 10 వరకు ప్రపంచ అంతరిక్ష వారోత్సవాల నేపథ్యంలో ఈ అంశంపై ప్రత్యేక కథనం.



చైనా పొలాల్లో 260 'అంతరిక్ష వంగడాలు'!



అంతరిక్షంలోని రేడియేషన్‌లో కొన్నాళ్లు ఉంచి భూమిపైకి తెచ్చిన విత్తనాల (స్పేస్ ఇండ్యూస్‌డ్ మ్యుటేషన్ బ్రీడింగ్ లేదా స్పేస్ బ్రీడింగ్)తో సరికొత్త వంగడాలను రూపొందిస్తూ చైనా కొన్ని దశాబ్దాలుగా ప్రయోజనం పొందుతోంది. చైనా వ్యవసాయ పరిశోధనా సంస్థ (సీఏఏఎస్) డిప్యూటీ డైరెక్టర్ జనరల్, చైనా అణు వ్యవసాయ శాస్త్రాల సంస్థ అధ్యక్షుడు కూడా అయిన డా. లూక్సియాంగ్ లియు చెబుతున్న మాట ఇది. 'ప్లాంట్ బ్రీడింగ్ అండ్ జెనెటిక్స్' న్యూస్‌లెటర్ 2023 జనవరి సంచికలో స్పేస్ బ్రీడింగ్ ప్రయోజనాలను వివరిస్తూ ఆయన ఓ వ్యాసం రాశారు. వరి, గోధుమ, మొక్కజొన్న, సోయాబీన్, పత్తి, నువ్వు, క్యాప్సికం, టొమాటో తదితర పంటలకు చెందిన 260 వంగడాలను ఇప్పటివరకు విడుదల చేసినట్లు డా. లియు ఆ వ్యాసంలో వెల్లడించారు. ముఖ్యంగా 2011లో విడుదల చేసిన 'లుయుయాన్ 502' గోధుమ వంగడంతో 12% దిగుబడి పెరగడంతోపాటు కరువును, ప్రధాన తెగుళ్లను తట్టుకుంటోందని పేర్కొన్నారు. హెక్టారుకు 12.18 టన్నుల గోధుమ దిగుబడినిస్తున్నదని డా. లియు చెప్పారు. 2016 తర్వాత 21 గోధుమ, 15 వరి, 7 మొక్కజొన్న వగడాలను అధికారికంగా విడుదల చేశామన్నారు.

'అంతరిక్ష విత్తనాలు' ఆదుకుంటాయా?

విత్తన జన్యువ్యవస్థను సంపూర్ణంగా ప్రభావితం చేసే స్పేస్ బ్రీడింగ్... జన్యుమార్పిడి/సవరణకన్నా మెరుగైన ఫలితాలను అందిస్తుందని కొందరు శాస్త్రవేత్తలు వాదిస్తున్నారు. చైనా గత 15 ఏళ్లుగా స్పేస్ బ్రీడింగ్ ద్వారా వందలాది కొత్త వంగడాలు రూపొందించుకొని బహుళ ప్రయోజనాలు పొందుతున్నట్లు ఆ దేశం చెబుతోంది. మరోవైపు తొలిసారిగా అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ (ఐఏఈఏ), ఐక్యరాజ్య సమితి చెందిన ఆహార-వ్యవసాయ సంస్థ (ఎఫ్ఏఓ) సంయుక్తంగా స్పేస్ బ్రీడింగ్ ప్రాజెక్టుకు 2022 నవంబర్ 7న శ్రీకారం చుట్టాయి. 'నాసా'కు చెందిన వాల్లప్స్ ఫ్లైట్ ఫెసిలిటీ రోదసీ నౌక ద్వారా భూమికి 175 మైళ్ల ఎత్తులోని అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి తెల్లజొన్న విత్తనాలు, అరాబిడోప్సిస్ అనే ఆకుకూర విత్తనాలను అంతరిక్షంలోకి పంపాయి. కొన్ని విత్తనాలను అంతరిక్ష కేంద్రం లోపల భారరహిత స్థితిలో ఉంచగా మరికొన్నింటిని కేంద్రం బయట కాస్మిక్ రేడియేషన్‌కు గురిచేశాయి. ఆర్నెల్ల తర్వాత వాటిని 2022 ఏప్రిల్‌లో తిరిగి భూమిపైకి తీసుకొచ్చాయి. ఆస్ట్రియా రాజధాని వియన్నాలో ఏర్పాటైన ఐఏఈఏ, ఎఫ్ఏఓ ఉమ్మడి ప్రయోగశాలలోని పాలిహౌస్‌లో వాటిని ప్రయోగాత్మకంగా పెంచుతున్నాయి. ఈ ప్రాజెక్టుకు కేరళకు చెందిన జన్యుశాస్త్ర నిపుణురాలు డా. శోభ శివశంకర్ సారథ్యం వహిస్తుండగా మరో భారతీయ శాస్త్రవేత్త అనుపమ హింగనె ఈ ప్రయోగాల్లో కీలకంగా వ్యవహరిస్తున్నారు. అనేక సీజన్లపాటు సాగు చేసి వాటి జన్యుమార్పులను నిర్ధారించాక సరికొత్త వంగడాలను రైతులకు అందించనున్నాయి. ఈ ప్రక్రియకు 2-3 ఏళ్ల పట్టవచ్చని నిపుణులు చెబుతున్నారు.

- సాక్షి, సాగుబడి డెస్క్

రైతుల సమస్యలు తీరతాయనుకోవటం భ్రమే!



అంతరిక్షంలోకి పంపిన విత్తనాల్లో వచ్చే పెను మార్పులు మంచివి లేదా చెడువి కావొచ్చు. జన్యుమార్పిడి మాదిరిగానే మ్యూటేషన్ బ్రీడింగ్ వల్ల కూడా జీవ భద్రతకు ముప్పు ఉంటుంది. దీని వల్ల ఉపయోగం 0.0001% మాత్రమే. దీంతో రైతుల సమస్యలకు ఒక పరిష్కారం దొరుకుతుందనుకోవడం భ్రమ. 60 ఏళ్లుగా మ్యూటేషన్ బ్రీడింగ్ అనుభవాలు చెబుతున్నది ఇదే.

– డా. జీవీ రామాంజనేయులు, సుస్థిర వ్యవసాయ కేంద్రం, కృష్ణ సుధా అకాడమీ ఫర్ అగ్రోఎకాలజీ

స్పేస్ బ్రీడింగ్ అవసరమే!



అంతరిక్షంలో ఉత్పరివర్తనాలు (మ్యుటేషన్లు) ఎక్కువ సంఖ్యలో వస్తాయి. కాస్మిక్ ఎనర్జీ వల్ల విత్తనాల్లోని డీఎన్ఏలో పెనుమార్పులు సంభవిస్తాయి. కొత్త వేరియంట్స్ ఆవిష్కరణకు, విస్తృత జీవ వైవిధ్యానికి ఇది అవసరం. 1960వ దశకంలో ఎక్స్‌రేస్, గామారేస్‌తో మ్యుటేషన్ బ్రీడింగ్‌పై విస్తృత పరిశోధనాలు జరిగాయి. వరిలో జగన్నాథ్ రకం అలా వచ్చిందే.

– డా. రాఘవరెడ్డి, మాజీ కులపతి, ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం

విషయ పరిజ్ఞానమే కొలమానం

సంప్రదాయ పరీక్షలకు భిన్నంగా అకడమిక్ ఎగ్జామ్స్

- బడి పిల్లల్లో సామర్థ్యాలు పెంచేలా విశ్లేషణాత్మక అంశాలపై దృష్టి
- మార్కులు కంటే మానసిక వికాసం, విశ్లేషణ నైపుణ్యాలను పెంచేలా ప్రశ్నల రూపకల్పన
- విద్యా సంవత్సరంలో 6 పరీక్షలు.. 3 ఓఎంఆర్, 3 రాత పద్ధతిలో నిర్వహణ
- జవాబులు ఆధారంగా విద్యార్థి సామర్థ్యం అంచనా.. బోధనలో మార్పులు



సాక్షి, అమరావతి: పాఠశాల విద్యలో విద్యార్థి వికాస చదువులకు రాష్ట్రంలో ప్రాధాన్యం పెరిగింది. పిల్లలు జాతీయ, అంతర్జాతీయంగా రాణించేలా పరీక్షల్లోను, ప్రశ్నల తీరులోను మార్పులు తీసుకొచ్చారు. అకడమిక్ మార్కులు కంటే.. విద్యార్థి మానసిక వికాసం, విశ్లేషణ సామర్థ్యాల పెంపుపై దృష్టి పెట్టారు. అందుకు అనుగుణంగా విషయ పరిజ్ఞానం అంచనా వేసేలా పరీక్షలు నిర్వహిస్తున్నారు. కొన్ని దశాబ్దాలుగా పరీక్షల్లో సంప్రదాయ ప్రశ్నల శైలి.. మార్కుల సాధనకే పరిమితమైంది. పిల్లల్లో వికాసం, విశ్లేషణ సామర్థ్యాలను అంచనా వేసే విధానం కరువైంది. దీంతో గత ఏడాది నుంచి రాష్ట్రంలో పాఠశాల విద్యాశాఖ పరీక్ష నిర్వహణ, ప్రశ్నల శైలిలో మార్పులు తీసుకొచ్చింది. మరోపక్క కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా విద్యాస్థాయిని అంచనా వేసేందుకు, అభ్యసన లోపాలను గుర్తించేందుకు వివిధ రకాల సర్వేలు చేస్తోంది. వీటిలో ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (ఎఫ్ఎల్ఎస్), నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే ముఖ్యమైనవి. వీటిద్వారా వివిధ రాష్ట్రాల్లో విద్యార్థుల సామర్థ్యాలను, ఉపాధ్యాయుల బోధనా నైపుణ్యాలను అంచనా వేసి రాష్ట్రాలకు ర్యాంకింగ్ ఇస్తోంది. విద్యా సంవత్సరంలో నిర్వహించే ఫార్మెటివ్, సమ్మెటివ్ అసెస్‌మెంట్లలో 1 నుంచి 8వ తరగతుల విద్యార్థులకు సిలబస్ ప్రకారం విశ్లేషణాత్మక ప్రశ్నలకు ప్రాధాన్యం ఇస్తోంది.

ఎన్ఏఎస్ సర్వేకు అనుగుణంగా పరీక్షలు

దేశవ్యాప్తంగా విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేసేందుకు కేంద్ర ప్రభుత్వం నేషనల్ అచీవ్‌మెంట్ టెస్ట్ (ఎన్ఏఎస్), ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ నేషనల్ అచీవ్‌మెంట్ సర్వేను ఏటా చేపడుతుంది. 2021లో కేంద్రం ఎన్ఏఎస్, 2022లో ఎఫ్ఎల్ఎస్ నిర్వహించింది. కరోనా అనంతరం నిర్వహించిన ఈ సర్వేలో దేశవ్యాప్తంగా అభ్యసన లోపాలు ఉన్నట్టు గుర్తించి, వాటిని అధిగమించేందుకు పలు సంస్కరణలను చేపట్టి నూతన విద్యా విధానానికి అనుగుణంగా అమలు చేస్తోంది. ఇందులో భాగంగా విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేసేందుకు ఏ తరహా పరీక్షలు, ప్రశ్నలు ఉంటాయో అదే విధానాన్ని ప్రభుత్వం పాఠశాల విద్యలో గత ఏడాది నుంచి అనుసరిస్తోంది. కేంద్ర ప్రభుత్వం వచ్చే నెల 3న జాతీయ స్థాయిలో సర్వే నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగా గత నెలలో అండమాన్-నికోబార్‌లో వివిధ రాష్ట్రాల అసెస్‌మెంట్ సభ్యులకు శిక్షణ ఇచ్చింది. అందులో రాష్ట్రాలు విద్యా ప్రమాణాలు పెంచేందుకు తీసుకుంటున్న చర్యలు, అసెస్‌మెంట్‌లో అనుసరించాల్సిన విధానాలను విడుదల చేసింది. దీనికి అనుగుణంగా సిద్ధమవ్వాల్సిందిగా రాష్ట్రాలను ఆదేశించింది.

రాష్ట్ర స్థాయిలో అసెస్‌మెంట్ సెల్ ఏర్పాటు

ప్రస్తుతం రాష్ట్రంలో ఈ తరహా పరీక్ష విధానాన్ని 2022-23 విద్యా సంవత్సరంలో ప్రవేశపెట్టారు. కేంద్రం నిర్వహించే నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే, ఎఫ్ఎల్ఎస్ పరీక్షల తరహాలోనే రాష్ట్రంలో పరీక్ష పత్రాలను రూపొందిస్తున్నారు. ఇందుకోసం 15 మంది నిపుణులైన ఉపాధ్యాయులతో రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ మండలి (ఎస్సీఈఆర్టీ) ఆధ్వర్యంలో ప్రత్యేక అసెస్‌మెంట్ సెల్ ఏర్పాటు చేశారు. విద్యార్థులు సాధించిన ఫలితాల ఆధారంగా బోధనలో సైతం మార్పులు చేస్తున్నారు. ఇందుకోసం ప్రతినెలా సబ్జెక్టు టీచర్లకు స్కూల్ కాంప్లెక్స్ శిక్షణ సైతం ఇస్తున్నారు.

ఉత్తమ విద్యాసంస్కరణల రాష్ట్రంగా ఏపీ

దేశంలో ఉత్తమ విద్యా సంస్కరణలు అమలు చేస్తున్న రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ గుర్తింపు పొందింది. నూతన విద్యావిధానానికి అనుగుణంగా బోధన, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా పలు విద్యా సంస్కరణలను, పథకాలను అమలు చేస్తోంది. ఈ సంస్కరణల ద్వారా సాధించిన ఫలితాలను అంచనా వేయాలని నిర్ణయించిన కేంద్రం సర్వే కంటే ముందే రాష్ట్ర స్థాయిలో ఒక సర్వే చేసి క్షేత్రస్థాయి పరిస్థితుల్ని అంచనా వేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం 'క్లాస్ రూమ్ బేస్డ్ అసెస్‌మెంట్'ను రూపొందించింది ఓఎంఆర్ (ఆప్టికల్ మార్కింగ్ రికగ్నేషన్) ఆధారంగా పరీక్షలు నిర్వహిస్తోంది. కేంద్ర ప్రభుత్వం సర్వే కోసం ఇదే విధానం అనుసరిస్తుండటం గమనార్హం.

విద్యార్థి సామర్థ్యం అంచనాకు విశ్లేషణాత్మక ప్రశ్నలు

ఒక విద్యా సంవత్సరంలో పాఠశాల విద్యాశాఖ నాలుగు ఫార్మెటివ్, రెండు సమ్మెటివ్ (ఆరు) అసెస్‌మెంట్లు నిర్వహిస్తోంది. వీటిలో రెండు ఫార్మెటివ్, ఒక సమ్మెటివ్ అసెస్‌మెంట్లకు 'ఓఎంఆర్' విధానం అనుసరిస్తున్నారు. ఈ విద్యా సంవత్సరంలో ఎఫ్ఏ-1 ఓఎంఆర్ విధానంలో పూర్తి చేయగా, ఎఫ్ఏ-2ను పాత విధానంలో మంగళవారం నుంచి నిర్వహించనున్నారు. ఈ విధానాన్ని 1 నుంచి 8వ తరగతి వరకు అనుసరిస్తోంది. పదో తరగతిలో బోర్డు పరీక్షలకు ఇబ్బంది లేకుండా 9, 10 తరగతులకు పాత విధానంలోనే పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఎఫ్ఏలో మొత్తం 20 మార్కులకు 15 ప్రశ్నలు ఉంటాయి, ఇందులో 10 ప్రశ్నలకు ఓఎంఆర్ విధానంలో జవాబులు గుర్తించాలి. మరో ప్రశ్నలకు 5 డిస్క్రిప్టివ్ విధానంలో సమాధానాలు రాయాలి. ఈ ప్రశ్నలన్నీ విద్యార్థి మానసిక సామర్థ్యం, ప్రశ్నలు అర్థం చేసుకునే విధానాన్ని పరీక్షించేలా ఉంటాయి.

యూజీసీ నెట్‌కు దరఖాస్తుల ఆహ్వానం

▶ మొదటి పేజీ తరువాయి

దరఖాస్తు చేసుకుంటున్నారు. ఈ ఏడాది జూన్‌లో 181 పట్టణాల్లో నిర్వహించిన పరీక్షకు 6.39 లక్షల మంది దరఖాస్తు చేసుకోగా 4.62 లక్షల మంది రాశారు. వీరిలో 32,304 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు, 4,937 మంది జేఆర్ఎఫ్, అసిస్టెంట్ ప్రొఫెసర్ రెండింటికి అర్హత సాధించారు.

ఆన్‌లైన్‌లో పరీక్ష

యూజీసీ నెట్ కంప్యూటర్ ఆధారిత పరీక్షను డిసెంబర్ 6వ తేదీ నుంచి 22వ తేదీ వరకు నిర్వహిస్తారు. ఆబ్జెక్టివ్ విధానంలో రెండు పేపర్లలో కలిపి 300 మార్కులకు పరీక్ష ఉంటుంది. పేపర్-1లో అభ్యర్థుల పరిశోధన, టీచింగ్ ఆప్టిట్యూడ్, రీజనింగ్, కాంప్రహెన్షన్, జనరల్ అవేర్‌నెస్, వినూత్న ఆలోచన సరళిపై ఒక్కో ప్రశ్నకు రెండు మార్కుల వంతున 50 ప్రశ్నలుంటాయి. పేపర్-2లో అభ్యర్థి ఎంచుకున్న సబ్జెక్ట్ ఆధారంగా ఒక్కో ప్రశ్నకు రెండు మార్కుల చొప్పున 100 ప్రశ్నలకు సమాధానాలు రాయాల్సి ఉంటుంది. నెగెటివ్ మార్కులు లేవు. రెండు పేపర్లలో కలిపి జనరల్ కేటగిరీ అభ్యర్థులు 40 శాతం, ఇతరులు 35 శాతం మార్కులు సాధిస్తే యూజీసీ నెట్‌కు అర్హత సాధించినట్టు పరిగణిస్తారు. అసిస్టెంట్ ప్రొఫెసర్, జేఆర్ఎఫ్ కోసం అర్హత పొందిన అభ్యర్థులకు ఫలితాల తర్వాత కటాఫ్ ప్రకటిస్తారు.

ఎన్టీఏ మాక్ టెస్టు నిర్వహణ

జేఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు 30 ఏళ్లలోపు వయో పరిమితి విధించగా, అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు వయోపరిమితి లేదు. పీజీ పూర్తిచేసిన వారు, చివరి ఏడాది ఫలితాల కోసం ఎదురు చూస్తున్న వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. జనరల్ కేటగిరీ అభ్యర్థులు రూ.1,150, ఈడబ్ల్యూఎస్, ఓబీసీ నాన్ క్రీమీలేయర్ అభ్యర్థులు రూ.600, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులు రూ.325 పరీక్ష ఫీజు చెల్లించాలి. అభ్యర్థుల కోసం nta.ac.in వెబ్‌సైట్‌లో మాక్ టెస్టు నిర్వహిస్తోంది.



నోటిఫికేషన్ మేరకు వివరాలు..

- దరఖాస్తు సమర్పణకు గడువు: 28-10-2023
- పరీక్షఫీజు చెల్లింపునకు గడువు: 29-10-2023
- తప్పుల సవరణకు అవకాశం: 30, 31-10-2023
- పరీక్షకేంద్రాల ప్రకటన: నవంబర్ చివరి వారంలో
- అడ్మిట్ కార్డు డౌన్‌లోడ్‌కు అవకాశం: డిసెంబర్ మొదటి వారంలో
- పరీక్ష తేదీలు: 6-12-2023 నుంచి 22-12-2023 వరకు

పోరాటాల ద్వారానే హక్కుల సాధన

యూటీఎఫ్ గోల్డెన్ జూబ్లీ వేడుకల్లో వక్తలు

కంకిపాడు(పెనమలూరు): పోరాటాల ద్వారానే హక్కుల సాధన సాధ్యమని, హరించుకుపోతున్న హక్కులను ఉద్యమాల ద్వారా సాధించుకోవాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. కృష్ణా జిల్లా కంకిపాడులోని అయానా ఫంక్షన్ హాల్‌లో యూటీఎఫ్ స్వర్ణోత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. యూటీఎఫ్ పతాకాన్ని సంఘం పూర్వ రాష్ట్ర అధ్యక్షుడు జోజయ్య ఆవిష్కరించారు. యూటీఎఫ్ బాధ్యతలు నిర్వహించి అమరులైన వీరులకు అమరస్థూపం వద్ద నివాళులర్పించారు. సభలో ప్రొఫెసర్ నాగేశ్వర్ మాట్లాడుతూ.. యూటీఎఫ్ సామాజిక స్పృహ, అధ్యయనం, అధ్యాపనం ముఖ్యసూత్రాలుగా పనిచేస్తోందన్నారు. పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కులతో ఉద్యోగుల భవిష్యత్తు ప్రశ్నార్థకం కాకుండా ఐక్యంగా ముందుకు సాగాలన్నారు. రాజకీయ విశ్లేషకుడు తెలకపల్లి రవి మాట్లాడుతూ.. ఉపాధ్యాయ సంఘాల్లో యూటీఎఫ్ మేటి అన్నారు. పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కులను నేడు పరిరక్షించుకోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ.. విద్యారంగ పరిరక్షణలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. స్వర్ణోత్సవాలకు రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి యూటీఎఫ్ ప్రతినిధులు వేడుకలకు హాజరయ్యారు.

కృష్ణపట్నం-హైదరాబాద్ మధ్య మల్టీ ప్రొడక్ట్ పైప్‌లైన్

▶ మొదటి పేజీ తరువాయి

ఒక టెక్స్‌టైల్ క్లస్టర్ ఉన్నాయని ఆయన వివరించారు. ఇక దేశంలో నిర్మిస్తున్న ఐదు టెక్స్‌టైల్ పార్కుల్లో తెలంగాణకు ఒకటి కేటాయించామని.. హన్మకొండలో నిర్మించే ఈ పార్క్‌తో వరంగల్, ఖమ్మం ప్రజలకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని చెప్పారు. పాలమూరు పర్యటనకు ఆదివారం వచ్చిన మోదీ.. తెలంగాణ రాష్ట్రానికి పలు వరాలు ప్రకటించారు. రాష్ట్ర రైతులు ఎంతోకాలం నుంచి డిమాండ్ చేస్తున్న జాతీయ పసుపు బోర్డును, ఉమ్మడి ఏపీ విభజన చట్టంలో ఇచ్చిన హామీ మేరకు సెంట్రల్ గిరిజన యూనివర్సిటీని రాష్ట్రంలో ఏర్పాటుచేయనున్నట్లు ఆయన తెలిపారు.

శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు..

మరోవైపు.. మహబూబ్‌నగర్ జిల్లా అమిస్తాపూర్‌లో రూ.13,545 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ప్రధాని మోదీ వర్చువల్‌గా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉందని స్పష్టంచేశారు. ఇక్కడి పసుపు రైతుల సంక్షేమం కోసం తెలంగాణలో జాతీయ పసుపు బోర్డు (నేషనల్ టర్మరిక్ బోర్డు)ను ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే, ములుగు జిల్లాలో కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. రూ.900 కోట్ల వ్యయంతో ఏర్పాటుచేసే ఈ యూనివర్సిటీకి సమ్మక్క-సారలమ్మ పేరు పెడుతున్నామని ఆయన ప్రకటించారు. తెలంగాణ ప్రజల జీవితాల్లో పెను మార్పులు తీసుకొచ్చేలా అనేక రోడ్ కనెక్టివిటీ ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయడం సంతోషంగా ఉందని ప్రధాని అన్నారు. ఇక రాజకీయ అంశాలను ప్రస్తావిస్తూ.. బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలు కుటుంబం కోసమే అన్నట్లుగా వాటి తీరు ఉందని పరోక్షంగా విమర్శించారు. అలాగే, రాష్ట్రంలో నీటి ప్రాజెక్టులు కేవలం అవినీతి కోసమే అన్నట్టుగా ఉన్నాయని.. తప్పుడు హామీలతో రైతులను మోసగిస్తున్నారని మోదీ ఆరోపించారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ తమిళిసై, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ బండి సంజయ్ తదితరులు పాల్గొన్నారు.



డేటా భద్రతకు చట్టం చేయండి

సీఎం జగన్‌కు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు లేఖ

సాక్షి, అమరావతి: జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపెయిన్‌లో సేకరిస్తున్న ప్రజల డేటాకు భద్రత కల్పించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. ప్రత్యేకంగా డేటా భద్రత కోసం చట్టం చేయాలని కోరారు. ఈ మేరకు ఆయన ఆదివారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి లేఖ రాశారు. వివిధ రూపాల్లో సేకరించిన డేటా ప్రైవేటు వ్యక్తులు, కంపెనీల చేతికి వెళ్లిన గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆరోగ్య సురక్ష సమాచారాన్ని కేంద్ర ప్రభుత్వ పథకమైన ఆరోగ్యసేతుకు అనుసంధానం చేస్తున్నారని, కేంద్రం నుంచి డేటా భద్రతకు హామీ లేకుండా ఈ సమాచారాన్ని అనుసంధానం చేయవద్దని కోరారు.

నేటి నుంచి సీపీఎం ప్రజారక్షణ భేరి

ప్రధాని మోదీ ఫాసిస్టు పాలనకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్య హక్కులు, ప్రజా రక్షణకు మరో చరిత్రాత్మక పోరాటం నిర్వహించాల్సిన సమయం వచ్చిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. విజయవాడలోని ఎంబీ విజ్ఞాన కేంద్రంలో ఆయన మాట్లాడుతూ ప్రజాసామ్య హక్కులు, ప్రజా ఉద్యమాలను రక్షించుకునేందుకు 'ప్రజారక్షణ భేరి' కార్యక్రమం అక్టోబర్ 2 నుంచి నవంబర్ 7 వరకు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943
Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

క్లుప్తంగా

సర్కారీ కొలువులో సేవలు ప్రధానం


మహదేవ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: సర్కారీ కొలువులో ప్రజలకు సేవలు చేయడం ప్రధానమని రాయచూరు రూరల్ సీఐ సాబయ్య అన్నారు. ఆదివారం రాయచూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న మహదేవ్ ఎస్ఐగా పదోన్నతి పొంది మాన్వికి బదిలీ అయిన సందర్భంగా ఆయనను సన్మానించి మాట్లాడారు. 34 ఏళ్ల పాటు పోలీస్ శాఖలో విధులు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ ప్రకాష్ డంబల్ తదితరులు పాల్గొన్నారు.

కొట్టూరేశ్వర స్వామి హుండీ లెక్కింపు

కంప్లి: కొట్టూరు శ్రీ గురు కొట్టూరేశ్వర స్వామి ఆలయ హుండీ లెక్కించారు. మార్చి నుంచి సెప్టెంబర్ వరకు భక్తులు రూ. 61.13 లక్షల నగదు స్వామి వారికి సమర్పించినట్లు ముజరాయి శాఖ కమిషనర్ గంగాధరప్ప ప్రకటించారు. ఈ సందర్భంగా పోలీసులు, బ్యాంక్ అధికారులు, శాఖ అధికారులు పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొన్న లారీ, ఇద్దరు దుర్మరణం


మరణించిన యువకుడు

రాయచూరు రూరల్: బైక్‌ను లారీ ఢీకొనడంతో ఇద్దరు మృతి చెందిన ఘటన యాదగిరిలో చోటుచేసుకుంది. శనివారం రాత్రి హోసల్లి క్రాస్ వద్ద ద్విచక్ర వాహనంపై యువకులు వస్తుండగా లారీ అతి వేగంగా వచ్చి బైక్‌ను ఢీకొంది. దీంతో బైక్‌లో ఉన్న కృష్ణ (21), ఆకాశ్ (19)లు అక్కడికక్కడే మృతి చెందినట్లు యాదగిరి ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

హాస్టల్లో విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

రాయచూరు రూరల్: మస్కి తాలూకా అమీన్‌గడ ప్రభుత్వ హాస్టల్లో ఓ విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. పదో తరగతి చదువుతున్న అక్షత (16) బ్లేడ్‌తో చేయి, గొంతు కోసుకుంది. అనంతరం గట్టిగా అరవడంతో భయపడిన తోటి బాలికలు వంట వారికి సమాచారం ఇచ్చారు. హుటాహుటిన అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు వార్డెన్ గంగమ్మ తెలిపారు. ఆత్మహత్యాయత్నానికి కారణాలు తెలియ రాలేదని మస్కి పోలీసులు తెలిపారు.

అక్రమ మద్యాన్ని అరికట్టాలి

హొసపేటె: అక్రమ మద్యాన్ని అరికట్టాలని డిమాండ్ చేస్తూ స్థానిక మద్యం నిషేధం ఆందోళన ఆధ్వర్యంలో ఆదివారం నగర గాంధీ సర్కిల్‌లో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆందోళనకారిణి అక్కమహదేవి మాట్లాడుతూ... రాష్ట్రంలో రోజురోజుకు అక్రమ మద్యం వ్యాపారాలు బాగా పెరిగిపోయాయని, ముఖ్యంగా గ్రామాల్లో అక్రమ మద్యం అమ్మకాలు పెరిగాయని, అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వం అదనంగా వెయ్యి మద్యం దుకాణాలను ప్రారంభించేందుకు అనుమతి ఇవ్వడం శోచనీయన్నారు. ధర్నాలో భాగ్యమ్మ శైనాజ్, సుధ, మంగళ, నీలా తదితరులు పాల్గొన్నారు.

ఎనిమిది కాళ్లతో మేక పిల్ల

రాయచూరు రూరల్: సింధనూరు తాలుకాలో ఎనిమిది కాళ్లలో ఓ మేక పిల్ల జన్మించింది. తాలూకాలోని కురకుందలో గ్యానప్ప అనే రైతుకు చెందిన ఓ మేక ఆదివారం రెండు దేహాలు, ఒకే తలకాయతో ఒక పిల్లకు జన్మనిచ్చింది. మేక పిల్లను చూడటానికి ప్రజలు పెద్ద ఎత్తున వస్తున్నారు.

ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి


మొక్కకు నీరు పోస్తున్న స్వామీజీలు

రాయచూరు రూరల్: ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని మంత్రి బోసురాజ్, ఎమ్మెల్యే శివరాజ్ పాటిల్ అన్నారు. ఆదివారం వ్యవసాయ విశ్వ విద్యాలయంలో సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి శివరాజ్ పాటిల్ ప్రతిష్టాన, మీనా ఏడీడీ చారిటీ ఇన్షియేటివ్ ఫౌండేషన్, బెంగళూరు సప్తగిరి, కలబుర్గి కిద్వాయ్ అస్పత్రి, జనహిత ఐకేర్ కేంద్రం, జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రపంచ వృద్ధుల దినోత్సవం, ఉచిత వైద్య శిబిరాలను ప్రారంభించి మాట్లాడారు. ఉచిత వైద్యాలకు సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి శివరాజ్ పాటిల్ ముందుకు రావడం అభినందనీయమని స్వామీజీలు అన్నారు. కార్యక్రమంలో శాంతమల్ల శివాచార్యులు, అభినవ రాచోటి శివాచార్యులు, ఎమ్మెల్యే హంపనగౌడ, మాజీ ఎమ్మెల్యే బసన గౌడ, సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి శివరాజ్ పాటిల్, జిల్లారోగ్య కుటుంబ సంక్షేమ శాఖ అధికారి సురేంద్ర బాబు, శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

బళ్లారిలో గాంధీజీ జ్ఞాపకాలు


సుధాక్రాస్ వద్ద స్వాతంత్య్ర సంగ్రామ చిహ్నం


బళ్లారి రైల్వేస్టేషన్



బళ్లారి రైల్వేస్టేషన్‌లో నాడు గాంధీజీ వేచి ఉన్న ప్రదేశంలో శిలా ఫలకం


కౌల్‌బజార్‌లో గాంధీజీ చితాభస్మం

సందర్భం | **నేడు జాతిపిత మహాత్మా గాంధీ జయంతి**

బళ్లారి రూరల్: రఘుపతి రాఘవ రాజారాం.. పతీతపావన సీతారాం, ఈశ్వర అల్లాతేరానాం సబ్‌కో సమ్మతి హే భగవాన్. ఇది శాంతిదూత మహాత్ముడు ఆలపించిన గీతం. శాంతి, అహింసా మార్గంలో తెల్లదొరలను తరిమి భరతమాతకు విముక్తిని కలిగించిన జాతిపిత, బాపూజీ, మోహన్‌దాస్ కరమ్‌చంద్ గాంధీని భారతీయులు గాంధీజీ, గాంధీతాతగా పిలుచుకొనే మహాత్మా గాంధీ జ్ఞాపకాలు చరిత్రపుటల్లో బళ్లారికి దక్కింది. జిల్లాలోని కూడ్లిగి, నగరంలోని కౌల్‌బజార్‌లో బాపూజీ చితాభస్మ జ్ఞాపకాలు సజీవంగా ఉన్నాయి. ఆ మహనీయుడి స్మృతుల్లో భారతావని తరిస్తోంది.

రెండు పర్యాయాలు బళ్లారికి బాపూజీ రాక

1921 స్వాతంత్య్ర ఉద్యమంలో భాగంగా బళ్లారికి మహాత్ముడు వచ్చారు ఈ సమయంలో ఆంధ్ర, కర్ణాటక కాంగ్రెస్ వర్గాల మధ్య విభేదాలను తొలగించడానికి నాటి బలుసు సాంబమూర్తి మైదానంలో (నేటి పాతబస్టాండు)లో చర్చలు జరిపారు. ఈ చర్చల్లో రెండు వర్గాల మధ్య సమోధ్య కుదరలేదు. దీంతో మనస్తాపం చెందిన గాంధీజీ నేరుగా బళ్లారి రైల్వేస్టేషన్‌కు రైలుకోసం వచ్చి ప్లాట్‌ఫారం మీదే విరమించాడు. ఆంగ్లేయుడైన స్టేషన్ మాస్టర్ వెయిటింగ్‌హాల్‌లో ఉండమన్నా అంగీకరించలేదు. రైలురాగానే టికెట్టు కొనుక్కొని వెళ్లిపోయాడు. 1934లో హరిజనోద్ధరణ ఉద్యమంలో భాగంగా రెండోసారి బళ్లారి జిల్లాకు వచ్చాడు. సండూరు, కూడ్లిగి, హరపనహళ్లిని సందర్శించాడు. ఈ సమయంలో సండూరు ప్రకృతి అందాలను తిలకించి ముగ్ధుడై సీ సండూర్ ఇన్ సెప్టంబర్, అన్న వ్యాక్యాన్ని విజిటర్స్ పుస్తకంలో రాశాడు.

సర్వ మానవ ధర్మమే శాంతికి సోపానం


కార్యక్రమంలో మాట్లాడుతున్న కళ్యాణస్వామీజీ

బళ్లారి రూరల్: సర్వమత సమ్మేళనం, సర్వ మానవ ధర్మమే శాంతికి సోపానమని కమ్మరచేడు మఠాధిపతి కళ్యాణ స్వామీజీ తెలిపారు. అనువ్రత సమితి ఆధ్వర్యంలో ఉద్బోదనా వారోత్సవాల్లో భాగంగా ఆదివారం థేరాపంత్ భవన్‌లో ఏర్పాటు చేసిన సర్వమత సమ్మేళనంలో పాల్గొని మాట్లాడారు. వ్యాపారి కాని, ఉద్యోగి కాని, డాక్టర్ కాని ధనవంతుడు కాని మొదట మానవుడు కావాలని తెలిపారు. 34 లక్షల జీవరాశుల్లో మానవ జన్మ ఉత్తమమైనది. కాని మానవుడు ధనాపేక్షతో ఇటు ప్రకృతిని ఇతర ప్రాణులకు హాని కలిగిస్తున్నాడు. స్వార్థంతో మోసాలకు, హత్యలకు పాల్పడుతున్నాడు. సర్వమతాలు, అన్నిమతాల పవిత్రగ్రంథాలు విశ్వశాంతిని ఉద్బోదిస్తున్నాయని తెలిపారు. మానవులందరూ శాంతి, అహింస, సర్వమానవాభివృద్ధికి శ్రమించాలని తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథి అఖండ బళ్లారి ప్రత్యేక ప్రజాన్యాయవాది ఎం.ప్రభావతి మాట్లాడుతూ... మహిళలు, చిన్నపిల్లలపై అత్యాచారాలు, లైంగివేధింపులు అధికమౌతున్నాయి. అనువ్రత సమితి జైలులో ఖైదీల్లో పరివర్తన వచ్చేలా కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. సర్వమానవులు శాంతి కోసం శ్రమిస్తే నేరాలు తగ్గుతాయన్నారు. ఈ సందర్భంగా డాక్టర ముని పుల్కిత్‌కుమార్‌జీ, ముని ఆదిత్య కుమార్‌జీ, రెవరెండ్ ఐవన్‌పింటో, ఖాజీమహ్మద్ సిద్దిక్ విశ్వశాంతికి అన్ని మతాలు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా వయోవృద్ధులు, వివిధ సంఘాల ప్రములను సన్మానించారు. అనువ్రతసమిత అధ్యక్షుడు బసంత్‌కుమార్‌చాజీర్, కార్యదర్శి ప్రవీణ్‌లునావత్, సంఘ ప్రముఖులు పాల్గొన్నారు.

హొసపేటెలో స్వచ్ఛత అభియాన్


స్వచ్ఛత కార్యక్రమంలో న్యాయమూర్తులు


కంప్లిలో ఎమ్మెల్యే గణేష్

హొసపేటె: హోస్పేట్ నగరంలో ఆదివారం స్వచ్ఛత అభియాన్ నిర్వహించారు. హోస్పేట్ ఎంజే నగర్‌లోని ఆదాయపు పన్ను శాఖ కార్యాలయ ఆవరణలో స్వచ్ఛత అభియాన్‌ను ప్రారంభించారు. ఆదాయ పన్ను శాఖ అధికారి లోకేష్ మాట్లాడుతూ... ప్రతి పౌరుడు పరిశుభ్రత సంకల్పంతో ఈ ప్రచారంలో పాల్గొనాలన్నారు. ఆరోగ్యంగా ఉండాలంటే పరిసరాల పరిశుభ్రత కూడా అవసరమన్నారు. కార్యక్రమంలో స్వచ్ఛత, రోటరీ, ఇన్నర్ వీల్ క్లబ్, రెడ్‌క్రాస్ సంస్థ సహకారంతో స్వచ్ఛత ప్రచారం నిర్వహించి అవగాహన కల్పించారు.

కోర్టు ప్రాంగణంలో...

స్వచ్ఛత అభియాన్‌లో భాగంగా హొసపేటెలోని కోర్టు ఆవరణంలో న్యాయమూర్తులు స్వచ్ఛత కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు, న్యాయవాదులు కోర్టు ప్రాంగణంలో చెత్త చెదారం తొలగించారు. కార్యక్రమంలో మూడవ అదనపు జిల్లా, సెషన్స్ జడ్జి అబ్దుల్ రహిమాన్, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి హేమలత, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి రమేష్‌బాబు బీఎస్.అదనపు సివిల్, జేఎంఎఫ్‌సి జడ్జి తృప్తి ధరణి, 3వ అదనపు జేఎంఎఫ్‌సీ జడ్జి చైత్ర జే. తాలూకా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీ బసవరాజ్, ప్రధాన కార్యదర్శి ఏ.కరుణానిధి తదితరులు పాల్గొన్నారు.

కంప్లి: పట్టణంలోని కళాశాలలో ఆదివారం స్వచ్ఛతా అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే గణేష్, ఉపాధ్యాయులు కళాశాల ఆవరణంలో చెత్త చెదారం తొలగించారు.

తుంగభద్ర డ్యాం వెలవెల


తుంగభద్ర జలాశయంలో నీరు

- సగానికి క్షీణించిన నీటిమట్టం

బొమ్మనహాళ్: హొసపేటె వద్దనున్న తెలుగు, కన్నడ రాష్ట్రాల వరదాయిని తుంగభద్ర జలాశయంలో నీటి నిల్వ బాగా క్షీణించింది. ఇప్పుడు పూర్తిస్థాయి నీటిమట్టంతో తొణికిసలాడాల్సిన డ్యాంలో సగం నీరే ఉంది. ఆదివారం నీటి నిల్వ 55.737 టీఎంసీలకు తగ్గింది. నెల రోజుల క్రితం 79 టీఎంసీల నీరు ఉండేది. జలాశయం ఎగువ భాగంలో వర్షాలు తగ్గడం, ఎండల కారణంగా నీటి లభ్యత తగ్గిపోయింది. కాలువలకు నీటిని వదులుతుండడంతో జలాశయంలో మూడు రోజులకు 2 టీఎంసీల చొప్పున నీరు ఖాళీ అవుతోంది. డ్యాంలో ఆదివారం ఇన్‌ఫ్లో 1,220 క్యూసెక్కులు మాత్రమే ఉండగా అవుట్‌ఫ్లో 9,791 క్యూసెక్కులుంది.

గతేడాది 104 టీఎంసీలు

జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 1,633 అడుగులు కాగా 1,618 అడుగుల వరకు నీరు నిల్వ ఉంది. 105 టీఎంసీల పూర్తి స్థాయి మట్టానికి గాను 55 టీఎంసీలకు పరిమితం కావడంతో రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. ఆంధ్రా సరిహద్దుల్లో (105వ కిలోమీటర్ వద్ద) 1,670 క్యూసెక్కులు నీటి ప్రవాహం కొనసాగుతోంది. గతేడాది ఇదే సమయానికి 104 టీఎంసీల నీరు నిల్వతో, 42,089 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, 55,320 క్యూసెక్కుల అవుట్ ఫ్లోతో జలాశయం కళకళలాడేది.

స్వచ్ఛతకు సహకరించాలి


స్వచ్ఛత కార్యక్రమంలో మంత్రి బోసురాజు తదితరులు

రాయచూరు రూరల్: పారిశుద్ధ్యం, పరిశుభ్రత ఎంతో ముఖ్యమని, స్వచ్ఛతకు ప్రతి ఒక్కరూ సహకరించాలని మంత్రి బోసురాజు అన్నారు. ఆదివారం నగరంలోని షియాతలాబ్‌లో చేపట్టిన స్వచ్ఛత అభియాన్ కార్యక్రమానికి స్వీకారం చుట్టి మాట్లాడారు. నగరంలో ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయడం తగదని ఆయన ఈ సందర్భంగా మంత్రి అన్నారు.

రైల్వే స్టేషన్‌లో...

నగరంలోని రైల్వే స్టేషన్‌లో ఎమ్మెల్యే శివరాజ్ పాటిల్ స్వచ్ఛత కార్యక్రమం చేపట్టారు. మహాత్ముడి నినాదమైన స్వచ్ఛతను ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వే బోర్డు సలహా సభ్యుడు బాబురావ్, గుంతకల్ డీఆర్ఎం మనీష్ అగర్వాల్, రైల్వే అధికారులు అక్కిరెడ్డి, శంకర్ చౌహన్, శ్రవణ్ కుమార్, అశోక్ కుమార్ మీనా, సభ్యులు జంబన్న, త్రివిక్రం జోషి, హేమన్న, నాగరాజ్, కాంగ్రెస్ నేతలు బసవరాజ, శివమూర్తి, బసవరాజ రెడ్డి, ప్రవీణ్, శాలం, జయన్న, శాంతప్ప, దేవన్న నాయక్, రమేశ్, నగరసభ కమిషనర్ గురు సిద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ వృద్ధుల దినోత్సవం

హుబ్లీ: ధార్వాడలోని ఆలూరు వెంకటరావ్ సాంస్కృతిక భవనంలో ప్రపంచ వృద్ధుల దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమాన్ని జిల్లా న్యాయసేవా ప్రాధికార కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయమూర్తి పరశురామ దండిన ప్రారంభించి మాట్లాడుతూ... మానవ సంబంధాలు కనుమరుగవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబాల కోసం జీవితాలను ధారపోసిన వృద్ధులను ఎంతో గౌరవంగా చూసుకోవడం పిల్లల కర్తవ్యమన్నారు. ఈ సందర్భంగా పోటీలలో గెలిచిన వృద్ధులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వృద్ధుల క్షేమాభివృద్ధి సంఘం వ్యవస్థాపకులు బీఏ పాటిల్, వృద్ధుల సహాయవాణి 1090 ప్రధాన వ్యవస్థాపకులు లక్కుండితో పాటు జిల్లా వికలాంగుల వృద్ధుల సంక్షేమ శాఖ డీడీ జగదీష్‌తో పాటు వివేకానంద, మైత్రి వృద్ధాశ్రమాల ఉద్యోగులు రుద్రేశ్, బసవరాజు, హుస్సేన్‌సాబ్ తదితరులు పాల్గొన్నారు.

విషాదం వెనుకే ఘోరం


జేసీబీతో అంబులెన్స్‌ను పక్కకు తొలగిస్తున్న దృశ్యం

- తల్లి మృతదేహాన్ని తీసుకెళ్తూ కూతురు దుర్మరణం

రాప్తాడు రూరల్: తల్లి బెంగళూరులో మృతి చెందడంతో అంబులెన్స్‌లో మృతదేహాన్ని సొంతూరు బీదరుకు తీసుకెళ్తుండగా జరిగిన ప్రమాదంలో కూతురు మృతి చెందిన విషాదఘటన ఆదివారం తెల్లవారుజామున అనంతపురం రూరల్ మండలం సోములదొడ్డి వద్ద జరిగింది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు...చంద్రకళ, సావిత్రిబాయి తల్లీకూతుళ్లు. బెంగళూరు ఆస్పత్రిలో చంద్రకళ మృతి చెందడంతో సావిత్రిభాయి మరో ఆరుమంది బంధువులతో కలిసి బీదరుకు అంబులెన్స్‌లో మృతదేహాన్ని తీసుకెళ్తున్నారు. సోములదొడ్డి సమీపంలోకి రాగానే డ్రైవరు నిద్రమత్తులో రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్‌ను ఢీ కొట్టాడు. అదుపుతప్పిన వాహనం పల్టీలు కొట్టింది. ఈ ప్రమాదంలో సావిత్రిబాయి (36) ఎగిరి రోడ్డుమీద పడి తీవ్ర గాయాలతో మరణించింది. మరో ముగ్గురు గాయపడ్డారు. పోలీసులు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. బాధితులను జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

చెత్తముక్త భారత్‌కు సహకరించాలి


స్వచ్ఛత అభియాన్‌లో పాల్గొన్న విద్యార్థులు

శ్రీనివాసపురం: చెత్త రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరు సహకారం అందించాలని ప్రభుత్వ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీధర్ తెలిపారు. ఆదివారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గాంధీ జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన స్వచ్ఛతా కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని చెత్త రహిత సమాజ నిర్మాణానికి అందరు నడుం బిగించాలన్నారు. అన్ని అనారోగ్యాలకు అపరిశుభ్రతే కారణమన్నారు. మహాత్ముడి కలలను సాకారం చేయాలన్నారు. ప్రజలు కూడా పరిసరాల శుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో తాలూకా ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు సుబ్రమణి తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా నిమజ్జనం


వినాయకుడిని ఊరేగిస్తున్న దృశ్యం

మాలూరు: తాలూకాలోని చిక్కతిరుపతిలో శ్రీ వెంకటేశ్వర యువక సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన వినాయకుడి నిమజ్జన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. మంగళవాయిద్యాలు, మేళతాళాల మధ్యన డప్పులు వేయిస్తూ యువత చిందులు వేస్తూ వినాయకుడిని గ్రామంలో ఊరేగించిన అనంతరం గ్రామ సమీపంలోని చెరువులో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా సాయంత్రం మ్యూజికల్ చైర్, రసమంజరి తదితర సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా వివిధ రంగాలలో సాధన చేసిన వారిని సన్మానించారు. గ్రామ పంచాయతీ అధ్యక్షుడు టీఎం రామ్ ప్రసాద్, సభ్యుడు వి రాఘవేంద్ర ప్రసాద్, రాజశేఖర్, సుజాత మునిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహా గణపతి నిమజ్జనం


శోభాయాత్రలో యువత సందడి

కంప్లి: హువినహడగలి గ్రామంలో శనివారం వినాయకుల నిమజ్జనం కోలాహలంగా సాగింది. ఆంజనేయ దేవసానం నుంచి సాగిన వినాయకుడి శోభాయాత్ర సందర్భంగా యువత డప్పులు వాయిస్తూ, నృత్యాలు చేస్తూ సందడి చేశారు. పట్టణంలోని ప్రధాన కూడళ్లలో ఊరేగింపు సాగింది. అనంతరం గణనాథుడిని తుంగభద్ర నదిలో నిమజ్జనం చేశారు. అర్ధరాత్రి వరకు నిమజ్జనం కొనసాగింది.

తుంగభద్ర కాలువలో పడి యువకుడి మృతి


ఉమేష్ (ఫైల్)

కంప్లి: ప్రమాదశాత్తు తుంగభద్ర కాలువలో పడి ఓ యువకుడు మృతి చెందిన ఘటన కురుగోడు తాలూకాలో ముష్టిగట్టి గ్రామంలో చేటు చేసుకుంది. మృతుడు గ్రామానికి చెందిన ఉమేశ్ (20). వివరాలు...ఈరాక్షి, కృష్ణ దంపతుల కుమారుడు ఉమేశ్ అక్షర దాసోహాలో పనిచేస్తున్నాడు. వరుస సెలవులు రావడంతో ఇంటికి వచ్చాడు. ఆదివారం తెల్లవారుజామున బహిర్భుమికని చెప్పి తుంగభద్ర కాలువ వద్దకు వెళ్లాడు. అక్కడ ప్రమాదవశాత్తు కాలువ నీటిలో పడిపోయాడు. ఈత రాకపోవడంతో నీటిలో మునిగిపోయాడు. ఆదివారం ఉదయం 7 గంటల సమయంలో గణికహాల్ వద్ద కాలువలో శవాన్ని గుర్తించారు. విగతజీవిగా పడి ఉన్న కుమారుడిని చూసి తల్లిదండ్రులు షాక్‌కు గురయ్యారు. కన్నీరు మున్నీరుగా విలపించారు.

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి


మొక్కలకు నీరు పోస్తున్న ఏడీసీ

రాయచూరు రూరల్: క్రీడా పోటీల్లో గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలని అదనపు జిల్లాధికారి దురుగేశ్ పేర్కొన్నారు. ఆదివారం మహత్మ గాంధీ క్రీడా మైదానంలో హైస్కూలు స్థాయి దసరా క్రీడోత్సవాలను ప్రారంభించి మాట్లాడారు. చదువుతో పాటు క్రీడలపై కూడా విద్యార్థులు దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి సురేశ్, హైస్కూలు ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు మోయిన్ ఉల్ హక్, యంకప్ప, ఈరేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్లను గౌరవించాలి


సీనియర్ సిటిజన్లను సన్మానించిన దృశ్యం

కోలారు: ప్రభుత్వం సీనియర్ సిటిజన్లకు వివిధ సౌలభ్యాలు కల్పిస్తోందని, వాటిని సక్రమంగా అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అక్రం పాషా తెలిపారు. ఆదివారం నగరంలోని పాత్రికేయుల భవనంలో ప్రపంచ సీనియర్ సిటిజన్ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సీనియర్ సిటిజన్‌లను గౌరవించడం మన కర్తవ్యమని, వారి అనుభవం, మార్గదర్శనం ఎంతో అవసరమన్నారు. కలెక్టరేట్‌లో వారి కోసం లిఫ్ట్ సౌకర్యం కల్పించినట్లు చెప్పారు. సీనియర్ సిటిజన్లు ఎలాంటి సమస్యలనైనా జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకు వచ్చినట్లయితే వెంటనే పరిష్కరిస్తామన్నారు. ముఖ్య అతిథిగా వచ్చిన జిల్లా న్యాయ సేవల ప్రాధికార కార్యదర్శి న్యాయమూర్తి సునీల్ ఎస్ హొసమని మాట్లాడుతూ... పోషకుల క్షేమ, పాలనా చట్టం ప్రకారం సీనియర్ సిటిజన్‌లకు అన్ని సౌలభ్యాలను అందించాలన్నారు. ఈ సందర్భంగా వివిధ రంగాలలో సేవలందించిన సీనియర్ సిటిజన్లను సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

అమృతోత్సవాల వేళా వివక్ష

మాలూరు: స్వాతంత్య్ర అమృతోత్సవాల వేళ కూడా అంటరానితనం సజీవంగా ఉండడం విచారించదగిన విషయమని సాహితీవేత్త కోటిగానహళ్లి రామయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం తాలూకాలోని సొసగెరె గ్రామ పంచాయతీ పరిధిలోని బ్యాలహళ్లి గ్రామంలో సహపంక్తి భోజనం, గ్రామరత్న ప్రశస్తి ప్రదాన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. జిల్లాలో అంటరానితనాన్ని రూపుమాపడానికి అరివు శివప్ప చేస్తున్న ప్రయత్నాలు శ్లాఘనీయమన్నారు. దళితుల గృహప్రవేశ కార్యక్రమం, సహపంక్తి భోజనం వంటి కార్యక్రమాలను నిర్వహిస్తుండడం సంతోషించదగిన విషయమన్నారు. అరివు భారత సంస్థకు చెందిన అరివు శివప్ప, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు సి లక్ష్మీనారాయణ, ఆంధ్రప్రదేశ్ అంబేడ్కర్ సేన అధ్యక్షుడు పీటీఎం శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.